
జనవరి 2014

₹ 5

ఆంధ్రప్రదేశ్

అందరికీ నచ్చే మాసపత్రిక



సంక్రాంతి శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ పర్యటనలో రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ





హైదరాబాద్‌లో గవర్నర్ దంపతులు, ముఖ్యమంత్రి స్వాగతం



పుట్టపర్తిలో సత్యసాయిబాబా సమాధి వద్ద...





అనంతపురంలో నీలం సంజీవరెడ్డి శతజయంతి ముగింపు ఉత్సవంలో...

ఈ సంచికలో . . .







శాలివాహన శకం 1935
పౌష్ 11 - మాఘ్ 11

సంపుటి : 57 సంచిక : 7

ఆంధ్రప్రదేశ్

(తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రచురితం)

కమీషనర్ & పబ్లిషర్
ఎం. దానకిశోర్, ఐ.ఎ.ఎస్.

ప్రధాన సంపాదకులు
జి. వల్లీశ్వర్

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
కె.ఎస్. శాస్త్రి

సహ సంపాదకులు
చెన్నూరి గణేశ్, రాజఫణి వి.
ప్రసాద్ గోసాల, ఎ. మధుసూదన రెడ్డి

ముఖచిత్రం
సంక్రాంతి శోభ
(ఆర్టిస్ట్ : బాపు)

రెండవ కవర్
రాష్ట్రంలో రాష్ట్రపతి విడిది

మూడవ కవర్
'నల్ల సూర్యుడి' కీర్తి అస్తమించనిది
(చిత్రకారుడు : శంకర్)

నాల్గవ కవర్
సుపరిపాలనకు గుర్తింపు

ప్రతి :రూ. 5/- ఏడాది చందా :రూ. 50/-

ప్రచురణ
సమాచార, పౌర సంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి. గార్డ్స్
హైదరాబాద్ - 500 028
ఫోన్ : 040-23300258

ముద్రణ
కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

పాఠకుల స్పందన

భాషామృతం

'ఆంధ్రప్రదేశ్' నవంబర్ సంచికలో అందించిన భాషా సంపద ప్రశంసనీయం. అచ్చు తప్పులు, భాషాదోషాలు లేకపోవడమేగాక తీయనైన తెలుగును మాకు భాషామృతంగా అందిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు.

– కాటేపల్లి లక్ష్మీ నరసింహమూర్తి,
మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా.

సహజ హాస్యం లేదు

'ఆంధ్రప్రదేశ్' నవంబరు సంచికలో స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్ పెంచడాన్ని సమర్థిస్తూ రాసిన సంపాదకీయం సముచితంగానే ఉంది. కానీ, ఈ వ్యవహారంలో కూడా అవకతవకలు, బోగస్సులు ఉన్నాయి. దీపావళి హాస్యకథల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలలో సహజమైన హాస్యం కనిపించలేదు. అయినా, సాహిత్యానికి 'ఆంధ్రప్రదేశ్' పత్రికలో ఇస్తున్న స్థానం ప్రశంసనీయం.

– ఈదుపల్లి వెంకటేశ్వర రావు,
ఏలూరు, ప.గో. జిల్లా.

ముఖచిత్రం బాగుంది

'ఆంధ్రప్రదేశ్' డిసెంబరు సంచిక ముఖచిత్రం బాగుంది. నాల్గవ కవరులో 'నీ భవిష్యత్ ఇక భద్రం 'బంగారు తల్లి' చిత్రం నాకెంతగానో నచ్చింది. మిగిలిన కవరు పేజీల చిత్రాలు కూడా సందర్భానుసారంగా ఉన్నాయి. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవంపై సమీక్ష బాగుంది.

– డా॥ ఎస్. విజయభాస్కర్,
మలక్‌పేట, హైదరాబాద్.

లోయర్ బెర్త్ ఇచ్చేస్తా

'ఆంధ్రప్రదేశ్' డిసెంబరు సంచికలో ప్రచురించిన 'నో రిక్వెస్ట్.. ప్లీజ్!' కథ అద్యంతం నవ్వించింది. అయితే నేను మాత్రం నా లోయర్ బెర్త్ ఎవరయినా అడిగితే వెంటనే ఇచ్చేస్తా. 'జిజ్ఞాస' మకుటంతో రాసిన 'ముందుమాట' చాలా బాగుంది. చాలామంది తల్లిదండ్రులు పిల్లలను విసుక్కుంటున్నారు. వారు 'జిజ్ఞాస' లాంటి విషయాలు చదవరేమో! 'మూడు ఉత్తరాలు' కథ మనస్సును నమిలేసింది. చివరి పేరాలు వచ్చేటప్పటికి కళ్ళు చెమర్చాయి.

– డా॥ ఆరవీటి రామయోగయ్య,
ఎల్.బి. నగర్, హైదరాబాద్.

వ్యాసాలు బాగున్నాయి

'ఆంధ్రప్రదేశ్' నవంబరు సంచికలో ప్రచురించిన 'ఉద్యోగం ఇద్దరికి, జీతం ఒక్కరికి' వ్యాసం, అలుపెరుగని సంపాదకులు, అభినయ పరిణామం వ్యాసాలు నాకు బాగా నచ్చాయి. దుర్గాబాయమ్మగారు మహిళాలోకానికి చేసిన సేవలు మరువరానివి. శ్రీ పి.వి. చలపతి రావు, శ్రీ వామనరావు గారల పత్రికా సేవ గురించి శ్రీ రాజేశ్వరరావు రాసిన వ్యాసం బాగుంది.

– శైవ నాగరాజు,
ప్రకాశ్‌రోడ్, అనంతపురం

అన్నీ బాగుంటున్నాయి

'ఆంధ్రప్రదేశ్' డిసెంబర్ సంచిక బాగుంది. సర్దార్ గౌతు లచ్చన్నగారిని గురించిన ఇంకో మంచి విషయం కూడా ఉంది. 1975లోని ఎమర్జెన్సీని వ్యతిరేకించిన ప్రజాస్వామిక శక్తులకు లచ్చన్నగారు పరోక్షంగా సహకరించారు. కవితల్లో 'ఉద్యమం', 'క్రీస్తుబాట'లు బాగున్నాయి. వ్యాసాల్లో 'మంగళయాన్', 'కలంకారీ' లు విజ్ఞానాత్మకంగా ఉన్నాయి. 'ఉద్యోగులకు హెల్త్‌కార్డులు' సమాచారం ఇచ్చిన చెన్నూరి గణేశ్ గారికి కృతజ్ఞతలు.

చాన్నాళ్ళకి దేవుడి మీద ఇంతమంచి కార్టూన్ రావటం ఆనందంగా ఉంది (పేజీ29). వెకిలితనం లేని సహజహాస్యాన్ని అందించాయి 'సాధారణ' ఎన్నికయిన రెండు హాస్య కథలున్నూ. 'సంతానబల్లి'లో అయితే కాలమ్ కాలమ్‌కు హాస్యం పండింది. ('మూఢనమ్మకం' అన్నచోట తప్పు). దీనికి ఏదో ఒక బహుమతి వచ్చి ఉండవలసింది. సరే... 'సంతానబల్లి' మాట తప్పు. 'సంతానం బల్లి' అనిగాని, 'సంతానపు బల్లి' అనిగాని ఉండి ఉండవలసింది. 'తెలుగు పలుకుబడు'లలో 'గర్భాధానం' తప్పు కాదు. గర్భ + ఆధానం = గర్భమును కలిగించుట లేక ఉత్పత్తి చేయుట. 'సమిధాధానం' 'అగ్న్యాధానం' – వగైరాలు ప్రయోగాలు. అసలు కాళిదాసు ప్రయోగమే ఉంది: 'గర్భాధాన క్షణ పరిచయాత్ (గర్భము కలిగించుట అనే ఉత్సవంలో అలవాటు ఉండటం చేత). అట్ట వెనక చిత్రం అద్భుతంగా ఉంది. చెయ్యిచాచి 'నీ భవిష్యత్తు' అంటోంది ఆ తల్లి! ముఖచిత్రం కూడా బాగుంది.

– గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు,
ప్రిన్సిపల్ & రచయిత, ఏలూరు-2

'మా రవి' కల్పితమే

అన్ని హంగులతో ముస్తాబై వచ్చిన 'ఆంధ్రప్రదేశ్' డిసెంబర్ సంచిక మా అంతరంగాలను అలరించింది. 'శ్రీరమణీయం' శీర్షికలో 'మా రవి'ని భాస్కర శతకకర్తగాను, 108 తాళ్ళ ఉట్టి, సూర్యుని స్మరించడం, ఇవన్నీ వాస్తవాలు కాదు. మయూరుడు (సూర్యశతకం) సంస్కృతంలో రాసిన అంశాలు భాస్కర శతక కర్తకు అంటగట్టారు. అసలు భాస్కర శతక కర్త మారద వెంకయ్య. 'మా రవి' కల్పితమే. మయూరుడు తన కుష్టు రోగాన్ని దూరం చేసుకోవడం కోసం నూట ఎనిమిది తాళ్ళ ఉట్టి కట్టుకొని ఒక్కొక్క శ్లోకం చెప్పి, ఒక్కొక్క తాడును (క్రింద మంట పెట్టుకొని) ఖండించుకుంటూ ఉంటాడు. చివరి తాడును నరుక్కోబోయే సమయంలో సూర్యుడు ప్రత్యక్షమై, అతనికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు.

– కల్లూలపల్లి బాల సుబ్రహ్మణ్యం,
తెలుగు పండిట్, విజయవాడ.

రచయిత స్పందన

దీక్షితులు గారి నవరణతో ఏకీభవిస్తున్నాను. ధన్యవాదాలు. 'మా రవి' కల్పితమే అయినా అది ప్రచారంలో వున్నమాట నిజం. దేనికీ సాక్ష్యాలు లేవు కదా. ఏమైనా కల్లూలపల్లి గారి మాటకు తగిన ఆధారాలుంటే నాకెలాంటి అభ్యంతరం లేదు.

– శ్రీరమణ

ముందుమాట

భిన్నాభిప్రాయం వుండదు

నన్ను కొంతమంది అడిగారు.

గత మూడేళ్ళలోనూ రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతీయ ఉద్యమం జరుగుతుంటే, పాలనలో బాగా పనిచేసే రాష్ట్రంగా 'ఆంధ్రప్రదేశ్' కి 'ఇండియా టుడే' అవార్డు రావడం విచిత్రంగా వుంది కదా - అని అడిగారు.

ఈ అడిగిన వాళ్ళు పాలనలో భాగమూ కాదు, పాలన లోతుపాతుల్ని దగ్గర్నుంచి నిశితంగా పరిశీలిస్తున్న వాళ్ళూ కాదు. ఆ మాటకొస్తే ప్రభుత్వ పనితీరుని చాలా దగ్గర్నుంచి చూస్తున్నామనుకుంటున్న కొందరు పాత్రికేయ మిత్రులు కూడా సుపరిపాలన ఎలా జరుగుతోందో క్షుణ్ణంగా అధ్యయనం చేయటం లేదేమోననిపిస్తుంది.

వివిధ రంగాలలో విశేషమైన ప్రగతి సాధించినందుకు, లేదా ఇతర రాష్ట్రాలతో పోల్చిచూసినప్పుడు మెరుగైన పనితీరుని ప్రదర్శించినందుకు వాస్తవిక గణాంకాలు ఆధారంగా ఆయా రాష్ట్రాలను తమ అవార్డులకు ఎంపిక చేయటం 'ఇండియా టుడే' ఏటా చేస్తున్న ఒక మంచి ప్రక్రియ.

అలా అవార్డులకు ఎంపికవుతున్న రాష్ట్రాలలో 'ఆంధ్రప్రదేశ్' ఒకటి. కాని ఈ సారి (2013) 'ఆంధ్రప్రదేశ్' ని వరించిన అవార్డుకి ఒక విశిష్టత వుంది.

ఎన్నో రకాల ఆందోళనలు, అవరోధాలు ఎదురైనప్పటికీ సుపరిపాలన విషయంలో ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ప్రదర్శించిన 'సృజనాత్మకత, చొరవ, పట్టుదల' ఈ అవార్డును సాధించి పెట్టాయని - అవార్డు ఎంపిక తీరుని విశ్లేషిస్తే స్పష్టమవుతుంది.

మూడేళ్ళక్రితం వరకూ, 'ఇ-సేవ' కేంద్రాలని కేవలం బిల్లుల చెల్లింపులకే వినియోగించేవాళ్ళం. ఇదే వ్యవస్థలో మరిన్ని మార్పులు చేసి - అంటే, వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలలోని డేటానెట్‌వర్క్‌తో ఈ కేంద్రాలని అనుసంధానం చేస్తే, వినియోగదారులకు అవసరమైన అనేక రకాల సర్టిఫికెట్లను సులభంగా జారీ చేయవచ్చనీ, అలా చేసినప్పుడు రెవెన్యూ, మునిసిపల్, రిజిస్ట్రేషన్ వగైరా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అవకాశాన్ని తగ్గించవచ్చనీ 'మీ సేవ' కేంద్రాల రూపకల్పన ద్వారా ముఖ్యమంత్రి నిరూపించారు. దాదాపు 225 సేవల్ని ప్రవేశపెట్టారు.

ఇప్పుడు అనేక సర్టిఫికెట్లు- రోజుకి కొన్ని వేలు ఇలా 'మీ సేవ' కేంద్రాల ద్వారా జారీ అవుతున్నాయి.

గతంలో ప్రభుత్వం ఏ చెల్లింపులు చేసినా చెక్కుల రూపంలో జరిగేవి. ఇప్పుడు ముఖ్యమంత్రి పట్టుదల వల్ల స్కాలర్‌షిప్‌ల నుంచి ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బిల్లుల దాకా అన్ని రకాల చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే (ఆయా లబ్ధిదారుల అక్కవుంట్లలోకే నేరుగా జమ పడేలా) జరుగుతున్నాయి. అంటే, చెక్కు ద్వారా జరిగే చెల్లింపులలో చోటు చేసుకునే అవినీతికి ఆస్కారం లేకుండా పోయింది. పైగా, చెల్లింపుల్లో వేగం పెరిగింది.

మున్సిపాలిటీల్లో సిటిజన్స్ ఛార్టర్ ప్రవేశపెట్టారు. సకాలంలో పౌర సేవలను అందించడంలో విఫలమైన ఉద్యోగుల మీద క్రమశిక్షణా చర్యలు తీసుకునే విధానం కూడా అమల్లోకి తీసుకురావడంతో పాలనలో అవినీతిని తగ్గించడంతో పాటు, జవాబుదారీతనం సాధించే పరిస్థితి ఏర్పడింది.

మూడేళ్ళక్రితం రూ. 9,000 కోట్లు అప్పుల్లో వున్నా పొదుపు చర్యలు పాటించడం ద్వారా మహిళలకు, రైతులకు వడ్డీ లేని రుణాలను కూడా ప్రవేశపెట్టగలిగాం. 'ఇది చాలా సాహసోపేతమైన చర్య' అంటూ అప్పట్లో చాలా విమర్శలు వచ్చాయి. కాని ఈ పథకం ఎంత విజయవంతమయిందో, మన స్వయంసహాయక బృందాల మహిళల్లో, రైతుల్లో ఎంతటి ఆర్థిక క్రమశిక్షణని తీసుకు వచ్చిందో స్పష్టంగా కనుపిస్తోంది.

'రచ్చబండ, ఇందిరమ్మ బాట' వంటి కార్యక్రమాలైతే పాలనా యంత్రాంగాన్ని ప్రజల ముంగిట్లోకి తీసుకు వెళ్ళడానికి ఎంతగానో దోహదపడ్డాయి.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జవాబుదారీతనం తెచ్చే చర్యలు తదితర చర్యల (జిఓల) ద్వారా సుపరిపాలన బాటలో ప్రభుత్వం సాధించిన అంశాలన్నింటినీ కలిపి విశ్లేషిస్తే, 'ఇండియా టుడే' అవార్డుకి మన రాష్ట్రం, రాష్ట్ర ముఖ్యమంత్రి అర్హులు అన్న విషయంలో ఎవరికీ భిన్నాభిప్రాయం కలగదు.



కమీషనర్

'లోక్‌పాల్' – ఆలోచించండి

'లోక్‌పాల్' బిల్లుని డిశెంబరు 17,18 తేదీలలో రాజ్యసభ, లోక్‌సభలు ఆమోదించడం ఒక చారిత్రాత్మక సుపరిణామంగా అభివర్ణించవచ్చు.

భావ ప్రకటనా స్వేచ్ఛ అపరిమితంగా వుండే ప్రజస్వామ్య వ్యవస్థలో పౌరులు తమ కోసం ప్రభుత్వం ఎన్ని మంచిపనులు చేసినా వాటిల్లో లోపాలు ఎంచటానికీ, చేయలేకపోయిన వాటి గురించి విమర్శించడానికీ, ఇంకా చేయాల్సిన వాటిమీద సలహాలు గుప్పించటానికీ తమ హక్కుని ఉపయోగించుకోవటంలో చాలా ఉత్సాహం చూపిస్తుంటారు.

కానీ, బాధ్యతకల ఏ పౌరుడైనా ఏ విషయాన్నయినా ఉన్నది ఉన్నట్టుగా (ఎలాంటి రాజకీయ, సామాజిక అభిమాన, దురభిమానాలు లేకుండా) విశ్లేషించడం మాత్రం అరుదుగా చూస్తుంటాం.

లోక్‌పాల్ బిల్లు విషయంలో కూడా – నాలుగు దశాబ్దాలకు పైగా ఈ బిల్లు రకరకాల దశల్లో నలుగుతూ వచ్చిందన్న కారణంగా– ఈ బిల్లు యొక్క స్ఫూర్తిని గుర్తించటానికి కొన్ని రాజకీయ పక్షాలు, పత్రికలు విముఖత చూపిస్తున్నాయి.

నిజానికి, 'లోక్‌పాల్' అనేది అవినీతి ఫిర్యాదులపై విచారణ జరిపే అత్యున్నత స్థాయి కలిగిన సర్వ స్వతంత్ర సంస్థగా అవతరిస్తోంది. ఈ సంస్థ చేపట్టే అవినీతి కేసుల పరిధిలోకి కేంద్ర మంత్రులు, ప్రస్తుత – మాజీ పార్లమెంటు సభ్యులు మాత్రమే కాక, ప్రధాన మంత్రి కూడా వస్తారు.

ఇలా ప్రధాన మంత్రిని కూడా – మినహాయించకుండా అవినీతి కేసులో విచారణని జరపగల సర్వశక్తిమంతమైనది 'లోక్‌పాల్' వ్యవస్థ. ఇంకా, ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల ఉద్యోగులు, విదేశీ విరాళాలతో నడిచే సంస్థలు వగైరాలు కూడా 'లోక్‌పాల్' పరిధిలోకి వస్తాయి.

'లోక్‌పాల్' విచారణలు దీర్ఘకాలం పాటు జిడ్డుగా సాగటానికి వీల్లేకుండా, విచారణని కాలపరిమితిని రెండేళ్ళుగా ఈ బిల్లు నిర్దేశించింది. కేసు విచారణ 60 రోజుల్లో పూర్తి కావాలనీ, దర్యాప్తు అయితే ఆరుమాసాలలో పూర్తి కావాలనీ కూడా 'లోక్‌పాల్' బిల్లు నిర్దేశిస్తోంది.

ప్రధానమంత్రిపై అవినీతి ఫిర్యాదు విషయంలో మాత్రమే విచారణ నాలుగుగోడల మధ్య (in-camera) చేయాలనీ, 'లోక్‌పాల్' సభ్యులలో మూడింట రెండు వంతుల ఆమోదంతో ఈ విచారణను 'లోక్‌పాల్' చేపట్టవచ్చుననీ ఈ బిల్లు పేర్కొంటోంది.

అవినీతి ఋజువయిన కేసుల్లో 10 సంవత్సరాల దాకా కారాగార శిక్ష విధించే అధికారం 'లోక్‌పాల్'కి వుంటుంది. అదే సమయంలో, ఎవరి మీదైనా ఎవరైనా తప్పుగా ఫిర్యాదు చేసినట్లు ఋజువయితే అలాంటి వారికి లక్ష రూపాయలదాకా జరిమానా, ఏడాదిపాటు జైలు శిక్ష విధించవచ్చు. ఇలాంటి బోగస్ ఫిర్యాదులు చేసిన వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆ వ్యక్తికి ఏడేళ్ళదాకా జైలు శిక్ష విధించవచ్చు.

ఇంతటి వాడి కలిగిన చర్యలకు అవకాశమిస్తున్న 'లోక్‌పాల్' నిర్మాణం కూడా చాలా పకడ్బందీగా జరగాల్సి వుందని బిల్లు నిర్దేశిస్తోంది. ఒక ఛైర్మన్, 8 మంది సభ్యులతో 'లోక్‌పాల్' ఏర్పడుతుంది. ఛైర్మన్‌గా నియమింపబడదగిన వ్యక్తిని, సభ్యుల్ని ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక ప్రముఖ న్యాయ వేత్తతో కూడిన కమిటీ ఎంపిక చేస్తుంది. సభ్యుల్లో సగం మంది న్యాయవేత్తలు వుండేలా, మిగతా సగం మంది ఎస్.సి., ఎస్.టి., మైనార్టీ, మహిళా ప్రతినిధులయి వుండేలా కూడా ఈ బిల్లు నిబంధనల్ని విధించింది. ఒక ఆసక్తికరమైన విషయమేమంటే ఏ రాజకీయ పార్టీతోనయినా అనుబంధం వున్న వాళ్ళు సభ్యులుగా ఎంపికవటానికి అనర్హులు. సొంతదర్యాప్తు విభాగం, సొంత ప్రాసిక్యూషన్ విభాగాన్ని కలిగి వుండే 'లోక్‌పాల్'లో సభ్యత్వానికి కాలపరిమితి అయిదేళ్ళు.

అవినీతి విస్తరణని, అవినీతి పరుల విశృంఖలతని నియంత్రించడంలో 'లోక్‌పాల్'కి వుండే శక్తి మహత్తరమైనదని ఈ బిల్లు స్వరూపం చెబుతోంది. రాష్ట్రస్థాయిలో లోకాయుక్తలు, జాతీయ స్థాయిలో 'లోక్‌పాల్' ఒక ఏడాదిలోగా ఏర్పాటు కావాలని బిల్లు పేర్కొంటోంది.



విమర్శించడం కోసం విమర్శించడం కాక ఇప్పటి మన దేశ అవసరాలకు తగిన ఇలాంటి పాలనా ప్రక్రియలను గుర్తించి, ప్రోత్సహించడం దేశభక్తిగల పౌరుల కర్తవ్యం.

బేగంగారి అంత:పురమే ఆమెకి జైలు

న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ఒకసారి గవర్నర్ల శీతాకాల సమావేశం జరుగుతోంది. ఈ సదస్సుకు అప్పటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కూడా పాల్గొన్నారు.

ప్రధాని నెహ్రూకు ఒక ప్రక్కన జమ్మూ-కాశ్మీర్ 'సదర్ రియాసత్' (గవర్నర్) డా॥కరణ్‌సింగ్, మరో ప్రక్కన పశ్చిమబెంగాల్ గవర్నరు కుమారి పద్మజానాయుడు కూర్చున్నారు. ఉపన్యాసాలు వింటూ తరువాత నెహ్రూ తరచుగా కునుకు తీస్తూ ఉండేవారు.



కుమారి పద్మజానాయుడు

ఆ సమావేశంలో ఒక సందర్భంలో నెహ్రూతో, పద్మజ "జవహర్‌జీ, ఇలాంటి సమావేశాలు మీరు తరచు ఏర్పాటు చేయాలి" అని తన సహజమైన శైలిలో చమత్కరించారు.

"అంటే, నీ ఉద్దేశం ఏమిటి? ఇలాంటివి ఏడాదికొకసారి సరిపోవా?" అని నెహ్రూ కాస్త కోపం నటిస్తూ అన్నారు.

"సరిపోతాయి. కానీ యిలాంటి సమావేశాలు ఏడాదికి కనీసం రెండు సార్లు జరిగితేనే కదా మీకు మంచి విశ్రాంతి దొరికేది" అని ఆమె నవ్వుతూ అన్నారు.

పద్మజా నాయుడుకి యీ సంభాషణా చాతుర్యం ఆమె తల్లి సరోజిని నాయుడు నుంచి వచ్చింది. స్వాతంత్ర్యోద్యమంలో తల్లి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని దేశం కోసం పోరాడారు పద్మజానాయుడు. 1900 నవంబర్ 17 న ఆమె హైదరాబాద్‌లో జన్మించింది. తండ్రి డాక్టర్ ఎం.జి. నాయుడు.

సరోజినీ నాయుడు హైదరాబాద్ రాష్ట్ర రాజకీయాలలో పాల్గొన లేదు. రాష్ట్రంలో ఆమె కవయిత్రి మాత్రమే. నిజాం అభిమానురాలు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా, రాష్ట్రంలో విద్య, రాజకీయ రంగాలకు శ్రీకారం చుట్టిన డా॥ అఘోరనాథ్ ఛట్టోపాధ్యాయ కుమార్తెగానే ఆమె ప్రసిద్ధురాలు. కానీ పద్మజానాయుడు 1930 నుంచి రాష్ట్ర రాజకీయాలలో పాల్గొన్నది. ఆమె వివాహం చేసుకోలేదు.

పోలీసు చర్యకు పూర్వం హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి మీర్‌లాయక్ అలీ తన మంత్రివర్గంలో చేరమని పద్మజాను ఆహ్వానించి, విద్య, ఆరోగ్య శాఖలలో ఏది కోరితే అది ఇస్తానన్నాడు.

దీనిని ఆమె తిరస్కరిస్తూ, "మైడియర్ లాయక్ అలీ సాహెబ్, విద్య, ఆరోగ్యం నాకెప్పుడూ దూరంగానే ఉన్నాయి వాటిని నేనిప్పుడు ఎలా పట్టుకోగలను" అని అన్నారు.

పద్మజానాయుడు ఎక్కువగా చదువుకోలేదు. చిన్న నాడు చేరిన మహబూబియా గర్ల్స్ హైస్కూల్లో నాలుగేళ్ళు మాత్రమే చదివింది. బాల్యంలో తరచుగా అనారోగ్యంతో బాధపడేది. తల్లిగారి రాజకీయాలతో ఆమెకు పోషణ కరువైంది. సుశిక్షణ లేని బిడ్డగా పెరిగింది. నేర్చుకున్న విద్య, పొందిన సంస్కారం అంతా 'గోల్డెన్ థ్రెషోల్డ్'కు వచ్చి పోయేవారి మధ్యే.

ఆ రోజుల్లో హైదరాబాద్‌లో జాగీర్దార్లదే రాజ్యం. జాగీర్దారీ కుటుంబాల మహిళలు గాజులు వేసుకోవడానికైనా వరదాలను తొలగించలేక బిడియపడేవారు. అటువంటి రోజుల్లో పద్మజానాయుడు హైదరాబాద్‌లో 'ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ వర్క్స్' శాఖను పెట్టి ఫ్లెగ్ రిలీఫ్ కమిటీని ఏర్పరచి, అందులో ఎందరో ముస్లిం మహిళలను సభ్యురాళ్లుగా చేర్పించిందంటే చిన్న విషయం కాదు.

నిజాం నవాబు నిర్దాక్షిణ్యంగా పౌర స్వేచ్ఛలను అణగదొక్కినా, బ్రిటీష్ ఇండియా రాజకీయ ప్రభావం హైదరాబాద్ ప్రజల మీద పడకుండా ఎన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నా, జాగీర్దారీ విధానాన్ని ఎదిరించే యువక వర్గం తయారవుతున్న సంగతిని గుర్తించలేక పోయాడు. అభ్యుదయ కాముకులైన కొందరు యువకులు 'స్వదేశీ లీగ్' అనే సంస్థను స్థాపించారు. దీనికి పద్మజానాయుడు అధ్యక్షురాలు. ఆమె సంపాదకత్వంలో యీ సంస్థ 'వన్ వరల్డ్' అనే పత్రికను ప్రచురించింది.

వివిధ దేశాలలో తలెత్తుతున్న రాజకీయ మార్పులను అకళింపు చేసుకొని మార్పు తథ్యం అనే ధోరణిని యువతలో కలిగించడం యీ పత్రిక లక్ష్యం. విదేశాలలో చదువు ముగించుకొని కొందరు యువకులు అభివృద్ధి వాదులుగా మారి, హైదరాబాద్ అభివృద్ధి సంస్థను స్థాపించారు. దీనికి పద్మజానాయుడు దీవెనలు లభించాయి. ఏతా వాతా అభ్యుదయం పట్ల పద్మజానాయుడు రాష్ట్రంలో పెక్కు ఉద్యమాలు చేపట్టారు. అవి ఎక్కువగా సాంఘిక రంగానికే పరిమితమైనా, అంతర్లీనంగా అందులో రాజకీయాలు లేకపోలేదు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని చేబూని హైదరాబాద్ నగరంలో ఇంటింటికి తిరిగి ఖద్దరు వస్త్రాలు అమ్మి ఖద్దరు ప్రచారం చేయటం జరిగింది. అస్పృశ్యతా నివారణకు, మత సమైక్యతకు ఆమె కృషి చేశారు. రాజకీయాలు లేనప్పుడు అభ్యుదయమే పోరాట ఆయుధం.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ (తరువాత కమ్యూనిస్టు పార్టీ) స్థాపించారు. ఆ సంస్థకు పద్మజానాయుడు తన సహకారం అందించారు. ఆ పార్టీ జరిపిన అనేక సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు.

1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. పంటల ధరలు బాగా పడిపోయాయి. ఆ దుర్భరమైన పరిస్థితులని ప్రభుత్వ దృష్టికి తేవడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి పద్మజానాయుడు అధ్యక్షురాలు. దుర్భిక్షానికి గురైన ప్రాంతాలను పర్యటించి బాధితులకు తక్షణ సహాయం లభించే ఏర్పాట్లు ఆమె చేశారు.

తెలుగు వెలుగులు

– జి. వెంకట రామారావు

పల్లెటూరు



ఒకప్పుడు
పల్లెటూరు కేవలం టుగాగమ సంధికాదు!
'ఆ'దరణ
'ఈ'వి
'ఏ'కము గల త్రికసంధి.
అప్పుడు పల్లెటూరు తులసికోట దగ్గర ప్రమిద దివ్వెవంటిది
గ్రామ దేవతకు కొంగు బంగారం వంటిది
పల్లెటూరు ప్రకృతి పురుషుడికి భావకవి ప్రేయసి వంటిది
తాత, బాబాయి, పిన్ని, అత్తమ్మ, మావా....
ఈ పల్లెటూరు బంధుత్వానికి
అచ్చ తెలుగు పదకోశం !
పండగలైనా జాతరలైనా సంబరాలైనా,
జానపద కళల తళతళలే!
అంతా ఒక కుదురై తలమునకలు వేసే వారు
పల్లెటూరుకు వెళ్లడమంటే
అమ్మఒడిలో జోలపాటలు వినడమే!
తన మూలాలకి ఏటి కోళ్ళు చెయ్యడమే!
పరిశుద్ధమైన గాలితో
ఎదను వినిర్మల కాసారం చేసుకోవడమే
ఎవరన్నారు పల్లెటూరు ఏకసమాసమని?
అది బహుపద ద్వంద్వం!
రోట్లో పచ్చడి.... రాచిప్పపులుసు... గడ్డపెరుగు....
కుంపటిపై కాచిన పాల మీది జిడ్డు మీగడ... ముంగిట రంగవల్లులు
కవ్వపు వన్నె చిన్నెల వెన్న... తాటాకు పందిళ్ళు
ఇవన్నీ పల్లెటూరు కన్యకి ఏడువారాల నగలే!

ఎత్తరగుల ఇళ్ళూ...... మండువా లోగిలి ఇళ్లూ
వాకిటి చావిడీలూ... అన్నీ బాపు చిత్రాలే!
సమస్తవృత్తులకూ పల్లెటూరు ఒక అపురూప సందుక!
పల్లెటూరుకి వెళ్తూ ఉంటే 'సూపర్ స్పెషాలిటీ' ఆసుపత్రికి వెళ్ళగలమా?
దేవుడు లేని గుడి – ఇల్లాలు లేని ఇల్లు
చిగురాకు లేని చెట్టు – పల్లెటూరులేని దేశాన్ని ఊహించగలమా?
పల్లెటూరు ... పల్లెటూరు పల్లెటూరువంటిదే!
గ్రామ కచేరీలూ
పురాణప్రవచనాలూ
దసరా పద్యాలూ
కొండొకచో పంతాలూ
పట్టింపులూ
ఇవన్నీ పల్లెటూరుకి మారుపేర్లే.

– ద్వా.నా.శాస్త్రి

స్టేట్ కాంగ్రెస్ కార్యక్రమాలలోనూ ఆంధ్ర మహాసభల కార్యక్రమాలలోనూ పద్మజా నాయుడుది ప్రత్యేకమైన పాత్రలేదు. కానీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యక్రమాలలో ఆమె పాల్గొనేది.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె అరెస్టయ్యారు. ఆమె అరెస్టు ఎంతో ఉత్కంఠ భరితంగా సాగింది. సరోజినీ నాయుడు కుటుంబానికి, నిజాం నవాబుతో సత్సంబంధాలు ఉండేవి. అంతేకాదు, ఆనాడు రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేక జైళ్లు లేవు. పద్మజానాయుడును అరెస్టు చేసి ఎక్కడ ఉంచాలనే సమస్య ఎదురైంది. ఆమె ఒంటి రెక్క మనిషి. తరచుగా అనారోగ్యంతో బాధపడేది. నిర్బంధం రోజులలో ఆమెకేమైనా అయితే రాష్ట్ర ప్రభుత్వానికెంతో అప్రతిష్ఠ. హయత్‌నగర్ సమీపంలో ఒక బేగమ్‌గారి దేవిడీలో డిఫెన్స్ కాలనీలో పద్మజా నాయుడును ఒంటరిగా ఉంచారు. సకల సౌకర్యాలు గల ఆ రాజభవనం ఆమెకు చికాకు కలిగించింది. అంతేకాదు, తనతో పాటు అరెస్టయిన మహిళలకు ఇలాంటి సౌకర్యాలే ఎందుకు కలిగించలేదని ఎదురు ప్రశ్నించింది.

పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జాగీర్దారీ వర్గం ఆర్థికంగా బాగా దెబ్బతింది. జాగీర్లు రద్దు గావడంతో వారికి ఆదాయం లేకుండా పోయింది. ఆ సమయంలో కేంద్రంలో తనకున్న పలుకుబడిని పద్మజానాయుడు ఉపయోగించుకొని బాధితులకు కొంత ఆర్థిక సహాయం అందేటట్లు చేశారు.

1950లో పద్మజానాయుడు భారత రాజ్యాంగ సభకు ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో ఉన్నారు. ఆ తరువాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 1956లో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులై ఆ పదవిలో పదేళ్లు ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడిన అస్థిరప్రభుత్వాలకు, వామ పక్ష ప్రభుత్వాలకు ఆమె సుదీర్ఘ రాజకీయానుభవం బాగా ఉపయోగపడింది. బంగ్లాదేశ్ పోరాట సమయంలో భారత దేశానికి వచ్చిన శరణార్థులకు ఆమె ఎంతో సేవ చేశారు. పునరావాస కార్యక్రమాలలో ఆమె ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకునేవారు. ఆమెకు 'పద్మ విభూషణ్' బిరుదు లభించింది. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న బంగారు ఆభరణాలను ఎన్.డి.ఎఫ్.కు సమర్పించింది.

గవర్నరు పదవి నుంచి రిటైరైన తరువాత కుమారి పద్మజానాయుడు తీన్‌మూర్తి భవన్‌లోనే తన శేష జీవితం గడిపి 1979 మే 25 న మరణించారు. హైదరాబాద్ నగరంలోనికోట్లాది రూపాయల తన ఆస్తిని విద్యా సంస్థలకు విరాళంగా యిచ్చిన త్యాగశీలి. తన కవితను 'ది ఫెదర్ ఆఫ్ డాన్' అనే పేరిట ప్రచురించారు. ☆

కథ

స్నేహితుడు

— డా॥ పేరం ఇందిరాదేవి

అత్త గారి ఆరోగ్యం చాలా బాగాలేదని, ఆడపడుచు సుమ ఫోన్ చేస్తే ఏమీ తోచలేదు. రఘుకు ఫోన్ చేస్తే కంగారు పడి వెంటనే బయలుదేరతాడని చెప్పలేదు.

మూడేళ్ళుగా రఘు ముంబైలో అవుట్ అఫ్ స్టేట్ సర్వీస్ చేస్తున్నారు స్టేట్ బ్యాంకులో ఆఫీసర్‌గా. జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా నా వుద్యోగం కర్నూల్లో. పిల్లల చదువులు, ఆడపడుచు పెళ్ళి లాంటి మధ్యతరగతి కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేసినా, ఇంకా వెంటపడే కొన్ని బాధ్యతల్లో తరచు జబ్బు పడే అత్తగార్ని చూసుకోవడం ఒకటి

ఆవిడ అన్నమా పేషంటు.... డాక్టర్ దగ్గరికి తరచు తీసుకుపోవాల్సి వుంటుంది. ఒక్కోసారి హాస్పిటల్‌లో చేర్పించి చూసుకోవాల్సి వస్తుంది. కాలేజ్‌కు ఒక రోజు సెలవు పెట్టి, మరో రోజు పర్మిషన్ పెట్టి, పిల్లల సాయంతో ఎలాగో నెట్టుకొస్తున్నా.

ఈసారి అత్తగారు ఆడపడుచు సుమ దగ్గరకు వెళ్లి జబ్బుపడ్డారు. తిరుపతి పరిగెత్తక తప్పలేదు. నాల్గురోజుల అనంతరం ఆవిడని తీసుకుని కర్నూల్ వెళ్లిపోదామంటే ఉద్యమం కారణంగా బస్సులు లేవు. రైలు రిజర్వేషన్ దొరక లేదు. అప్పటికే తడిసి మోపెడైన ఖర్చుల్లో ఆకాశాన్ని అంటివున్న టాక్సీధరల్ని అందుకోలేక, సెలవు లేని కారణంగా కోలుకుంటున్న అత్తగార్ని అక్కడే వదిలి వెంకటాద్రికి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను. సాయంత్రం అత్తగార్ని చూసి అటే రైల్వేస్టేషన్‌కు బయలుదేరాను.

సమ్మెలో వున్న ఆర్టీసి పుణ్యమా అని హాస్పిటల్ నుంచి రైల్వేస్టేషన్ కు వంద తీసుకున్న ఆటో వాడిపై కోపాన్ని చూపలేక, నాలోనే దిగమింగుకున్నాను. ఒక చేతిలో సూట్కేస్, మరో చేతిలో అత్తగారి బట్టలున్న బ్యాగ్ వున్నాయి. జారిపోతున్న చీరెను సర్దుకోలేక, ముఖం మీద నుండి కారుతున్న చెమటను తుడుచుకోలేక అవస్థ పడుతుంటే, ఇసకేస్తే రాలని జనసాగరంలో, వెంకటాద్రి మూడవ ప్లాట్ ఫార్మ్‌లో ఉందన్న విషయం గుండె జారేట్టు చేసింది. కనీసం పోర్టర్‌ను మాట్లాడుకుందామంటే ఒక్కడూ లేడు.

వారం రోజులుగా హాస్పిటల్లో నిద్రలేని రాత్రులు, పిల్లలిద్దరిని వదిలి వచ్చాననే దిగులు, కాలేజ్ నడవకపోయినా పోవాల్సిన బాధ్యత, రఘు లేకుండా ఒంటరిగా చేస్తున్న జీవన పోరాటంలో ఎన్నడూ బేల కాని నాకు, దు:ఖం తన్నుకు వచ్చింది. 'సంసారం సాగరం దు:ఖం' అని ఎందుకన్నారో అర్థమైంది. చేతులు నొప్పి పెడుతుంటే సూట్కేస్, బ్యాగ్ క్రిందపెట్టి ఫ్యాన్ కింద నుంచున్నా....!

"హలో సంధ్యా.... " ప్రక్కనే వినపడడంతో ఉలిక్కిపడి చూశా...

చిరునవ్వుతో అన్వర్....! సంవత్సరం క్రిందట మా కాలేజ్‌లో పనిచేసి ట్రాన్సఫర్ అయి తిరుపతికి వెళ్ళారు.

"హలో అన్వర్ ఎలా వున్నారు?"

"బాగున్నాను, మీరేంటి ఇలా ఇక్కడ....! ఎప్పుడూ ఫ్రెష్‌గా వుండేవారు, అలా డల్‌గా వాడిపోయారు, ఏమైంది?"

"ఏమీ లేదు అన్వర్.. మా అత్తగారికి బాగాలేదు. హాస్పిటల్‌లో చేర్చాం... వారం రోజులుగా ఒకటే టెన్షన్. రఘు కేమో హాఫ్ ఇయర్లీ క్లోజింగ్... పైగా అతనికి సెలవులు లేవు. నాకు సుమకు తప్పలేదు. వెంకటాద్రికి కర్నూల్ వెళ్ళాలి అని వచ్చా. రిజర్వేషన్ లేదు. జనరల్‌లో వెళ్ళాలి, బస్సులు కూడా లేవు కదా! బాగా రద్దీగా వుంటాయి. ఎలా?"

"వెంకటాద్రి గంట లేట్.... ఇందాకే కనుక్కున్నా. వేరే ఫ్రెండ్ చెన్నై పోతుంటే వీడ్కోలు ఇవ్వడానికి వచ్చా... దిగులు పడకండి... మిమ్మల్ని ట్రయిన్ ఎక్కించి వెళతాను... కరీమాతో చెబుతా..." భార్యకి ఫోన్ చేసి అన్వర్ మాట్లాడి నాకిచ్చాడు.

కరీమ ఇంటికి రమ్మని చాలా అడిగింది... ఇప్పుడు వచ్చే వీలు లేదని ఈ సారి వస్తానని సర్ది చెప్పా.

ముందుగా నా సూట్కేస్, బ్యాగ్ రెండు చేతుల్లోకి తీసుకుని "పదండి... ముందు వెయిటింగ్ రూంలో ఫ్రెష్ అవండి" అంటూ అన్వర్ దారి తీశాడు.



లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో ఫ్రెష్ అయ్యేప్పటికి చాలా బాగా అనిపించింది.

"ఇంకా గంట వుంది సమయం, లగేజ్ క్లోక్ రూంలో పెట్టి వచ్చా... పదండి... బయటికి వెళ్లి టిఫిన్ చేసి వద్దాం."

"వద్దు అన్వర్.. ట్రైన్‌లో ఏదో ఒకటి తింటాలే. అవునూ, నీ కిప్పుడు వేరేపని ఏమీ లేదా!"

"ఒక మీటింగ్ వుంది. నేనే జరపాలి. ఇప్పుడే ఫోన్ చేసి, వాయిదా వేశాను. మిమ్మల్నిలా వదిలేసి ఎలా వెళ్తాను! ఈ వారం రోజులు మీరు అసలు తిండి తిన్నారో లేదో! మొహం అంతా వాడిపోయింది. కాస్త టిఫిన్ తిందురు పదండి, ఇంకేం చెప్పకండి."

ఇంకేం చెప్పలేక కదిలాను. నేను ఏమీ చెప్పకుండానే దోశ, ఇడ్లీ చెప్పాడు.

ఆనందమయం

సమయపాలనకు సాక్షి సంక్రాంతి పండుగ
జనుల మనసు నెరిగి జనవరి పదమూడు
భోగిగా వస్తుంది మారదు తన 'మూడు'



అర్రులను చాచి ఆంధ్రులంతా తనను
స్వాగతిస్తుంటారు సంక్రాంతి లక్ష్మిగా
గాదెల నిండుగా ధాన్యరాశిని నింపి
మధురమైన పిండివంట లెల్లను చేసి
కొత్త బట్టలు పూని సంక్రాంతిలక్ష్మిని
ప్రేమ మీరంగ ఇళ్ళకు పిలుచుకొస్తుంటారు
దానాలు ధర్మాలు దండిగా ఒనరించి
పౌష్యలక్ష్మిని సంతృప్తి పరుస్తుంటారు
అఖిల రాష్ట్రాలలో ఆంధ్ర సంస్కృతి యొక్క
ప్రత్యేకతను చాటి పరవశిస్తుంటారు
వరసైన వారల సరసాల తోడను
చిన్నిపాపల నవ్వుల చిందుల తోడను
సంక్రాంతి సంబరాల్ సమకొన్న ఆ వేళ
ఆంధ్రలో ఇళ్ళన్ని ఆనందమయ మౌను

- దిట్టకవి శ్రీనివాసాచార్య

మారు మాట్లాడకుండా తినేశాను. కూల్ డ్రింక్ త్రాగాక, బుక్ షాప్‌లో ఇండియా టుడే, వీక్, నవ్య మాగజైన్లు కొన్నాడు. నేను డబ్బులివ్వబోతుంటే...

"మగవాళ్ళు వుండగా ఆడవాళ్ళు పర్స్ తీస్తే అది పెద్ద అవమానంగా భావిస్తారు మగవాళ్ళు.. నో.... వద్దు"

నవ్వి ఊర్కున్నా. మళ్ళీ స్టేషన్‌లోకి వచ్చాం.

"అక్కడ ఒక ఫ్రెండ్ వున్నాడు, రిజర్వేషన్‌లో ఖాళీ ఉందేమో కనుక్కుంటా.... ప్రయత్నం చేద్దాం" అని అన్వర్ వెళ్ళిపోయాడు. ఆకలి తీరడంతో పాటు, ఫ్రెష్‌గా ముఖం కడుక్కోవడం, బరువు మోత తప్పడంతో మనసు తేలికైంది. అయిదు నిమిషాల పాటు రెప్పవాల్చాను. అన్వర్ వచ్చాడు.

"సంధ్యా... టీసీతో మాట్లాడి ప్రయత్నం చేస్తా అన్నాడు నా ఫ్రెండ్.. టికెట్ తీసుకొస్తా... రిజర్వేషన్ ఛార్జెస్ అక్కడ కట్టచ్చు... ఏసీ దొరికినా ఫర్లేదు అని చెప్పాను అతనికి. ప్రయత్నం చేద్దాం, ప్రయాణం సుఖంగా వుండాలి, మళ్ళీ మీరు మరుసటి రోజంతా పని చేయాలి కదా!"

"టికెట్‌కు డబ్బులు.. ప్లీజ్ అన్వర్" అంటున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. పదినిమిషాల తర్వాత వచ్చాడు.

"సేఫ్ సైడ్ జనరల్ టికెట్ తీసుకున్నా.. స్లీపర్ లేకుంటే, ఏసీ అయినా చూడమన్నా, కాసేపట్లో నాకు ఫోన్ చేస్తాడు. మనం కొంచెం ప్రశాంతంగా వుండే చోటుకు వెళదాం."

కొంచెం దూరంగా రద్దీ లేని చోట ఒక బెంచ్ పై కూర్చున్నాం. రఘు గురించి, నా పిల్లల గురించి, తన పిల్లల గురించి కరీమా ఆదుర్దా గురించి, సినిమాల గురించి, పుస్తకాల గురించి, మా కాలేజ్ లో తనున్నప్పుడు వున్న కొలీగ్స్ గురించి, సరదా సరదాగా అన్వర్ మాట్లాడుతుంటే కాలం హాయిగా గడిచి పోయింది. బాధ్యతల పట్ల నా కమిట్మెంట్‌ను, లెక్చరర్‌గా నా ప్రతిభను, కొలిగ్స్‌తో నా అనుబంధాన్ని, ఎప్పుడూ నవ్వుతూ వుండే నా నైజాన్ని మెచ్చుకున్నాడు. నా గురించి మిగతా కొలిగ్స్ ఎలా అభినందించేవారో, కొంతమంది ఎలా అసూయ పడేవారో చెప్పి నవ్వించాడు. నాలో అంతకు ముందున్న విచారం స్థానంలో ఉత్సాహం, ఆనందం చేరింది. చిన్ని చిన్ని ప్రశంసలు ఎంత రీఛార్జ్ చేస్తాయి.! ఇంతలో అన్వర్ ఫ్రెండ్ ఫోన్ చేయడంతో థర్డ్ ఏసీలో నాకు బెర్త్ దొరుకుతుందని తెలిశాక ఇంకా హాయిగా అనిపించింది.

ఒక్క బ్యాగ్ కూడా నా చేతికివ్వకుండా అన్వరే రెండూ మోసుకొచ్చి ట్రైన్లో పెట్టారు. నీళ్ళ బాటిల్, పండ్లు తెచ్చిచ్చాడు. టీసీ దగ్గరకు వెళ్ళి ఏమి మాట్లాడాడో ఏమో అతను నాకేసి చూసి తలవూపారు. అన్వర్ డబ్బు కట్టి రసీదు నాకు తెచ్చిచ్చాడు. కట్టిన డబ్బు మొత్తం ఇవ్వబోతే......

"ఫర్లేదు సంధ్యా, దాంట్లో ఏముంది? స్నేహంలో అలాంటివి పట్టించుకోరాదు... ప్లీజ్ డోంట్ మైండ్... ఓపికున్నంతసేపు చదువుకోండి... తర్వాత హాయిగా నిద్రపోండి. రెండు పదికి వెళుతుంది కర్నూల్... అలారం పెట్టుకోండి సెల్ లో. బాబు వస్తాడు కదా స్టేషన్‌కు.... వెళ్ళగానే మెసేజ్ పెట్టండి ... ఇదిగోండి నా నంబర్" విజిటింగ్ కార్డ్ అందించాడు.

"థాంక్స్ అన్వర్.. నా కోసం ఎంత సమయం.... డబ్బు ఖర్చు చేశారు. చాలా శ్రమ పడ్డారు. నేను మీకు రుణ పడ్డాను" సంతోషం ఒక ప్రక్క వున్నా, అతను నా కోసం సమయాన్ని, డబ్బుని ఖర్చుపెట్టడం అనేది ఇబ్బందిగా అనిపించింది.

"రుణమా! భలేవారే మా చిన్న బాబు పుట్టినప్పుడు, మాకెవరూ లేకపోతే, మీరే వారం రోజులు క్యారియర్ పంపారు.. మా పెద్ద బాబును చూసుకున్నారు.. మళ్ళీ ఇంటికొచ్చాక కూడా మీ ఇంటి నుండి క్యారియర్లు వస్తూనే ఉండేవి... మీ ఇంటికి మా ఇల్లు చాలా దూరం, కానీ మీరు ఒకే చోట పని చేసేవారమని, మా ఇబ్బందుల్లో ఎంతో సహాయం చేశారు. ఆ రోజు కరీమా మీతో ఇలాగే 'చాలా శ్రమ తీసుకుంటున్నారు!' అంటే, 'ఇష్టమైన వాళ్ళ కోసం చేసే ఏ పనీ శ్రమ అనిపించదమ్మా' అన్నారు. స్నేహం అంటే ఏమిటో మాకు తెలిసేలా చేశారు. అప్పుడు మీరన్న మాటే ఇప్పుడు నేను అంటాను.... స్నేహం అనే నిఘంటువులో 'రుణం' అనే పదానికి అర్థం లేదండి..."

నేనేమీ మాట్లాడలేకపోయాను - అతని ఆత్మీయతకు ఆనందించడం తప్ప.

ట్రయిన్ కదలడంతో అన్వర్ దిగాడు. కనిపించే వరకు అతను చేయి ఊపుతూనే వున్నాడు. అన్వర్ ఇవాళ కనపడకుండా వుంటే జనరల్ కంపార్ట్ మెంట్‌లో సీట్ కూడా దొరక్క, రాత్రంతా నిద్రలేక, ఎంత ఇబ్బంది పడేదాన్నో...!

ఊహించుకుంటే భయం వేసింది. మళ్ళీ అన్వర్ చిరునవ్వు ముఖం గుర్తొచ్చి, తేలికైన హృదయంతో నవ్వుకున్నా.

... స్నేహ బంధం... ఎంత మధురం! ☆



కొన్ని దశాబ్దాలుగా కృష్ణా డెల్టా ఆయకట్టు కింద రైతులు కన్న కలలు ఎట్టకేలకు నిజమయ్యాయి. గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం పులిచింతల గ్రామంలో రూ.1831 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మకమైన 'పులిచింతల ప్రాజెక్టు (కె.ఎల్. రావు సాగర్)ను ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి డిసెంబర్ 7వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు.

వచ్చేసింది పులిచింతల ప్రాజెక్టు

ప్రాజెక్టు పక్కన ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం డ్యామ్‌పైకి ముఖ్యమంత్రి కాలి నడకన వెళ్ళి ప్రాజెక్టును పరిశీలించి, స్విచ్ ఆన్ చేసి మూడు క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.

2004 లో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చాక చేపట్టిన జలయజ్ఞంలో తొలి ప్రాజెక్టుగా పులిచింతల ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు. అలా ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై తొమ్మిదేళ్లకు ప్రారంభానికి నోచుకుంది. ఈ ప్రాజెక్టుకు వాస్తవంగా 24 రేడియల్ క్రస్టుగేట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అంత వరకు 19 గేట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందుతుంది.

కృష్ణా, గుంటూరు, ప్రకాశంలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డెల్టా ప్రాంత రైతులు ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో పంటలు వేసుకొనేందుకు ఆ ప్రాజెక్టు ఉపకరిస్తుంది. ఎన్నో అవాంతరాల మధ్య ప్రారంభమైన పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి అంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 1308 కోట్లు ఖర్చు చేసింది.

నాగార్జున సాగర్ డ్యామ్‌కు 115 కిలో మీటర్ల దిగువన, విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి 85 కిలోమీటర్ల ఎగువన నిర్మించిన ఈ జలాశయం 45.77 టి.ఎం.సి.ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉంది.

ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "ఎంతో మంది మహానుభావులు కలలు కన్న పులిచింతల ప్రాజెక్టును నా చేతుల మీదుగా ప్రారంభించడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. వందేళ్ల కల ఇప్పటికి నెరవేరింది. దీని వల్ల వచ్చే జూన్‌లోనే నాలుగు జిల్లాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తాం. ఫలితంగా నవంబర్‌కు ముందే రైతులకు వరిపంట చేతికి వస్తుంది. తుపాన్ల వల్ల నష్టం జగరదు. పులిచింతల ప్రాజెక్టును పూర్తిగా సద్వినియోగ పరచుకుంటే కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలకు నీటి సమస్య ఉండదు. ఇక ఈ విధంగా పోలవరం ప్రాజెక్టునూ, దమ్ముగూడెం టేల్‌పాండ్‌నూ పూర్తి చేసుకుంటే మరిన్ని ఎకరాలు సాగులోకి వస్తాయి" అని సూచించారు.

ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించి, అంకితం చేసిన కార్యక్రమంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ సుదర్శన్ రెడ్డి, మంత్రులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, శ్రీ కాసు వెంకటకృష్ణారెడ్డి, శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద్, శ్రీ పార్థసారధి, అధికారభాషా సంఘం అధ్యక్షుడు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్. సురేష్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా హాజరైన (దివంగత శ్రీ కె.ఎల్. రావు కుమార్తె) మాజీ ఐ.ఎ.ఎస్. అధికారిణి శ్రీమతి సుజాతారావు మాట్లాడుతూ... "ఈ ప్రాజెక్టు నిర్మాణం వెనుక ముగ్గురు ముఖ్యమంత్రుల కృషి దాగుంది. దివంగత సి.ఎం.లు శ్రీ ఎన్టీ రామారావు, శ్రీ వై.యస్. రాజశేఖర రెడ్డి, ప్రస్తుత సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డిలు చేసిన కృషితోనే ప్రాజెక్టు రూపుదిద్దుకొంది. దీనితో డెల్టా రైతుల కలలు నిజం చేయాలన్న మా తండ్రి కె.ఎల్ రావు గారి ఆశయం నెరవేరింది" అని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రాజెక్టు నేపథ్య కథనమిది....!

మొట్టమొదటగా బ్రిటీషు ప్రభుత్వ హయాంలో 1911లో అప్పటి బ్రిటీషు ఇంజనీర్ కాల్ ఎల్లిస్ పులిచింతల ప్రాజెక్టు నిర్మిస్తున్న స్థలంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించేందుకు పథక రచన చేశారు. అలా అనాడే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించాలన్న ఆలోచనకు బీజాలు పడ్డాయి.

ఈ ప్రాంతాన్ని ఎందుకు ఎంపిక చేశారంటే...

పడమర నుంచి తూర్పునకు ప్రవహిస్తున్న కృష్ణానది ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు నిర్మించిన చోట దిశను మార్చుకుని ఉత్తరంవైపునకు కొంత దూరం ప్రవహించి మళ్లీ తిరిగి తూర్పు వైపుకు ప్రవహిస్తుంది. ఈ ప్రవాహతీరును 'కృష్ణా అంతర వాహిని' అంటారు. ఇక్కడి నది ప్రవాహ విస్తీర్ణం విశాలంగా విస్తరించి ఉన్నందుకే ఇది రిజర్వాయర్ నిర్మాణానికి సరైన స్థలంగా ఎంపిక చేశారు.

స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిన ఎనిమిదేళ్ల తర్వాత 1964లో శాసనసభా కమిటీ పులిచింతల ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించినా 1988 వరకూ అది ఫలించక చర్చలకే పరిమితమైంది.

1988 నవంబర్ 18 న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్టీ రామారావు ఆధ్వర్యంలో రూ.269 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన అనుమతులు లభించక, ముంపు గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో పులిచింతల

ప్రాజెక్టు పనులు ప్రారంభించలేదు.

తర్వాత 2004 అక్టోబర్ 15న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వై.యస్.రాజశేఖర రెడ్డి జలయజ్ఞం లో తొలి ప్రాజెక్టుగా పులిచింతల ప్రాజెక్టును రూ.680 కోట్ల అంచనా ఖర్చుతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు.

కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అనుమతుల నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు ప్రకారం 2004 నవంబర్ 22 నుంచి 2005 జూన్ 11 వ తేదీ వరకూ ప్రాజెక్టు నిర్మాణం పనులు దశలవారీగా ప్రారంభమయ్యాయి,

2009 లో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు అంచనాలను పునఃసమీక్షించి రూ.1830 కోట్ల 97 లక్షలుగా నిర్ణయిస్తూ అదే ఏదాది ఆగస్టు 4న ఉత్తర్వులు జారీ చేసింది.

అసోసియేషన్‌కు. 1958-60 సంవత్సరాల మధ్య ఆయన అధ్యక్షుడుగా ఉన్నారు. 1963 లో 'పద్మ భూషణ్' అవార్డు పొందిన ఆయన 1961 నుంచి వరుసగా మూడు సార్లు విజయవాడ లోక్ సభస్థానం నుంచి ఎం.పి.గా గెలుపొందారు.

మన ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహద్దూర్ శాస్త్రి, ఇందిరా గాంధీల క్యాబినెట్‌లలో నీటివనరులు, విద్యుత్తు శాఖ మంత్రిగా పనిచేశారు. నాగార్జునసాగర్ డ్యామ్ రూపశిల్పిగా చిరస్మరణీయులయ్యారు. అంతటి ఘనమైన చరిత్రగల శ్రీ కె.ఎల్.రావు పేరుతో కృష్ణానదిపై ఒకనీటి పారుదల ప్రాజెక్టును నిర్మించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన చేసిన కృషికి నిజమైన నివాళులర్పించినట్లవుతుంది.



ఈ పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్వరూపాన్ని సంతరించుకుంటే కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాలకు సాగు నీరు అంది, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. అలాగే ఆయా జిల్లాల ప్రజలకు తాగునీరు కూడా అందుతుంది.

నిజానికి పులిచింతల ప్రాజెక్టు పేరు వినగానే డాక్టర్ కె.ఎల్.రావును స్మరించక తప్పదు. 1902 జులై 15 న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన శ్రీ కె.ఎల్.రావు రంగూన్, బ్రిటన్‌లలో ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్‌గా పని చేశారు. లండన్ నుంచి తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్‌గా పని చేశారు. ఆల్ ఇండియా ఇంజనీర్స్

ప్రాజెక్టు వివరాలు...

వాస్తవానికి పులిచింతల ప్రాజెక్టు సీమాంధ్ర, తెలంగాణా ప్రాంతాలతో కలిసి ఉంది. ప్రాజెక్టు స్థలానికి కుడి వైపున గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం, ఎడమ వైపున నల్గొండ జిల్లా మేళ్ల చెరువు మండలాలున్నాయి. 45.77 టి.ఎం.సి.ల నీటిని నిల్వ చేసేందుకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది.

నల్గొండ జిల్లా పరిధిలో 13915.79 ఎకరాలు, గుంటూరు జిల్లా పరిధిలో 14,530.60 ఎకరాలు మొత్తం 28,446.39 ఎకరాలను ప్రాజెక్టు పరిధిలోకి తేవాల్సి ఉండగా ఇప్పటికి 27424.76 ఎకరాలను సేకరించడమైంది. మిగిలిన 1021.63 ఎకరాల సేకరణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద నిరాశ్రయులైన 5,699 మంది నల్గొండ జిల్లా వాసులకు , 3969 మంది గుంటూరు జిల్లా వాసులకు ఇళ్ల పట్టాలు జారీ చేయడమైంది. గుంటూరు జిల్లాలో 28 గ్రామాలు, నల్గొండ జిల్లాలో 13 గ్రామాల వారికి, వాటిశివారు గ్రామాల వారికి పునరావాసం, మౌలిక వసతులు కల్పించారు.

రెవెన్యూ, నీటి పారుదల, ఆర్.అండ్ బి. పంచాయతీరాజ్, ఎ.పి.ట్రాన్స్‌కో, తదితర శాఖల సమన్వయంతో ప్రాజెక్టు పరిధిలో పునర్ నిర్మాణ పనులను ప్రభుత్వం శీఘ్రంగా నిర్వహిస్తోంది. అంతేకాక ఆయా శాఖల సమన్వయంతో రోడ్లు, విద్యుదీకరణ, స్కూళ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఆస్పత్రులు, పంచాయతీ ఆఫీసులు తదితర వాటి నిర్మాణం జోరుగా సాగుతోంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 7.36 లక్షల ఎకరాలు, గుంటూరు ప్రకాశం జిల్లాల్లోని 5.72 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. రైతులు సకాలంలో పంటలు వేసి, అధిక దిగుబడులు సాధించేందుకు వీలవుతుంది. పైగా ప్రాజెక్టు నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరిగి తాగునీటి సమస్య తీరుతుంది. నీటిలో ఫ్లోరైడ్ శాతం తగ్గి చేపలు, కొబ్బరి చెట్ల పెంపకానికి అనువుగా ఉంటుంది.

మరో ప్రక్క 120 మెగా వాట్ల లక్ష్యంతో 4 యూనిట్లుగా ఒక్కో యూనిట్‌కు 30 మెగావాట్ల చొప్పున విద్యుదుత్పత్తికి రూపకల్పన చేస్తూ ఎ.పి. జెన్‌కో చేపట్టిన విద్యుదుత్పాదక కేంద్రం నల్గొండ జిల్లాలో నిర్మాణంలో ఉంది.

- ఎం. లక్ష్మణాచార్యులు, టి. నాగేశ్వర్
విజయవాడ

ఆనంద సంక్రాంతి

క్రొత్త యల్లుడు వచ్చె కూతురుతో గూడి
క్రొత్త యాసల నిచ్చె కూర్మిపేర్మి
చలిమంట కాగుచు సరదాకబుర్లతో
మరదళ్ళు బావలు మాటకలుప
అత్తమామల యెదలానంద పదములై
కమ్మదనమ్మును క్రుమ్మరింప
రంగవల్లులతోడ ముంగిళ్ళు రంజిల్ల
మామిడాకులమర మంగళముగ

పసుపు కుంకుమ కాంతులు పరిఢవిల్ల
బంతి, చేమంతి సొగసులు వంతుకలియ
హెచ్చ లోగిళ్ళ సందళ్ళు, ముచ్చటులును
వచ్చె సంక్రాంతి శ్రీలక్ష్మి వరము లొసగ ॥

- కె.ఎస్.ఆచార్యులు



మంత్రివర్గ నిర్ణయాలు

తీవ్రవాద బాధితులకు పరిహారం పెంపు

తీవ్రవాదుల దాడుల్లో మృతి చెందే వారి కుటుంబాలతో పాటు తీవ్రంగా గాయపడిన వారికి నష్ట పరిహారాన్ని మూడింతలు పెంచుతూ తీసుకున్న కీలక నిర్ణయానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనితో పాటు పలు విధాన నిర్ణయాలకు డిసెంబర్ 3న ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర పడింది. మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులకు అనుగుణంగా నష్టపరిహారం పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది.

తీవ్రవాదుల దాడుల్లో చనిపోయే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ ఛైర్‌పర్సన్ల కుటుంబ సభ్యులకు ప్రస్తుతం రూ. 15 లక్షల నగదును పరిహారంగా చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని 35 లక్షలకు పెంచారు. అలాగే శాశ్వత వైకల్యం పొందిన వారికి ఇస్తున్న పరిహారాన్ని రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడిన వారికి ఇస్తున్న లక్ష రూపాయలను రూ. 3 లక్షలకు పెంచారు.

ఎంపిపి అధ్యక్షులు, జెడ్పీటీసి సభ్యులు, జిల్లా సహకార బ్యాంక్, మార్కెటింగ్ ఛైర్మన్లు, పుర పాలక సంఘాలు, వివిధ కమిటీల ఛైర్మన్లకు మృతి చెందిన సందర్భాలలో ఇస్తున్న పరిహారాన్ని రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలకు, శాశ్వత వైకల్యం పొందినప్పుడు రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడినప్పుడు ఇచ్చేదాన్ని లక్ష రూపాయల నుంచి రూ. 2 లక్షలకు పెంచారు.

సర్పంచులు, ఎంపిటీసి సభ్యులు, ప్రాథమిక సహకార సంఘాల ఛైర్మన్లు, పురపాలక సంఘాలతో పాటు వివిధ ప్రభుత్వ కమిటీల సభ్యులకు మృతి చెందిన సందర్భాలలో ఇస్తున్న రూ. 7.50 లక్షలను, రూ. 25 లక్షలకు, శాశ్వత వైకల్యం చెందినప్పుడు ఇస్తున్న రూ. 3 లక్షలకు, రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడినప్పుడు ఇస్తున్న లక్ష రూపాయలను రూ. 2 లక్షలకు పెంచారు.

సాధారణ పౌరులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు ప్రస్తుతమిస్తున్న రూ. 5 లక్షలను రూ. 10 లక్షలకు, శాశ్వత వైకల్యం చెందినప్పుడు ఇస్తున్న రూ. 3 లక్షలను రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడినప్పుడు ఇస్తున్న లక్ష రూపాయలను రూ. 2 లక్షలకు పెంచారు.

పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐ వరకు, అదే స్థాయిలోని ప్రభుత్వ ఉద్యోగులకు మృతి చెందిన సందర్భాలలో ఇస్తున్న పరిహారాన్ని రూ. 9 లక్షలను రూ. 25 లక్షలకు, శాశ్వత వైకల్యం పొందినప్పుడు ఇస్తున్న రూ. 3.60 లక్షలను రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడినప్పుడు ఇస్తున్న రూ. 2.40 లక్షలను రూ. 3 లక్షలకు పెంచారు. ఇన్స్‌పెక్టర్ల అంతకన్నా ఉన్నత స్థాయి పోలీసు అధికారులు, అదే హోదాలోని ప్రభుత్వ అధికారులకు మృతి చెందిన సందర్భాలలో ఇస్తున్న రూ. 12 లక్షలను రూ. 30 లక్షల రూపాయలకు, శాశ్వత వైకల్యం చెందిన వారికి ఇస్తున్న రూ. 3.60 లక్షలను రూ. 10 లక్షలకు, తీవ్రంగా గాయపడినప్పుడు ఇస్తున్న రూ. 2.40 లక్షలను 3 లక్షలకు పెంచారు.

నిర్మాణాల వ్యాజ్యాలకు ట్రిబ్యునల్

వివిధ నగర పాలక సంస్థలతో పాటు పురపాలక సంఘాలలో సమస్యగా మారిన అక్రమ నిర్మాణాల నిరోధానికి బిల్డింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ చట్ట సవరణ తీసుకు రావాలనే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనివల్ల అక్రమ నిర్మాణదారులు వివిధ న్యాయస్థానాల నుంచి 'స్టే' ఉత్తర్వులు తీసుకువచ్చే అవకాశాలను నిరోధించడంతో పాటు, అక్రమ నిర్మాణాలపై వ్యాజ్యాలను వేగంగా పరిష్కరింప చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం తీసుకువచ్చే సవరణల ప్రకారం మొదట అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి సంజాయిషీ కోరుతారు. సంతృప్తి చెందకపోతే వాటిని కూల్చివేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది.

- ☆ సాధారణ పౌరులకిచ్చే ఉపశమన భృతి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు
- ☆ హైద్రాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల పై శీఘ్రచర్యలకు అనువుగా ట్రిబ్యునల్
- ☆ కార్టూన్‌లు, వీడియోగేమ్‌లు వగైరాల నిర్మాణాల ప్రోత్సాహానికి కొత్త విధానం.
- ☆ బీసిలలో సంపన్న పరిమితి నిర్ధారణకు ఆదాయ పరిమితి పెంపు
- ☆ 20 నుంచి 30 శాతం వైకల్యం వున్నా పింఛన్ వర్తింపు
- ☆ చిత్తూరు, మెదక్, ప్రకాశం జిల్లాలలో జాతీయ తయారీ పరిశ్రమల మండలాలు



డి.కె. అరుణ
సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి

కార్టూన్లు, వీడియోగేమ్‌ల తయారీ విధానం

రాష్ట్రంలో యానిమేషన్, గేమింగ్, మీడియా, ఎంటర్‌టైన్ మెంట్ రంగాలలో విస్తృతంగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉండటం వల్ల వచ్చే అయిదేళ్ళలో ఈ రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు రూపొందించిన విధానాన్ని కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ను ఏర్పాటు చేసి దాని ద్వారా యువతీ, యువకులకు శిక్షణ ఇప్పిస్తారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా బిసిలలో సంపన్న పరిమితి (క్రీమీ లేయర్) నిర్ధారణకు వార్షిక ఆదాయాన్ని రూ. 4.50 లక్షల నుంచి 6 లక్షల రూపాయలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కూడా మంత్రివర్గం ఆమోదం వ్యక్తం చేసింది.

సామాజిక పింఛన్ల విస్తరణ

సామాజిక భద్రత పెన్షన్లలో భాగంగా 20 నుంచి 39 శాతం వైకల్యం ఉన్నవారికి కూడా 200 రూపాయల చొప్పున పెన్షన్లు ఇవ్వాలనే ప్రతిపాదనకు కూడా అంగీకారం తెలపడం జరిగింది.

వచ్చే పదేళ్ళలో స్థూల జాతీయోత్పత్తిని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలనే కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా మన రాష్ట్రంలోని చిత్తూరు, మెదక్, ప్రకాశం జిల్లాలలో జాతీయ పెట్టుబడులు, తయారీ రంగ మండలాలు (National Investments Manufaturing Zones) ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం వ్యక్తం చేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ చేపట్టిన వివిధ పథకాల అమలు కోసం కొత్తగా 8 వేల పోస్టుల భర్తీకి కూడా మంత్రివర్గం అనుమతినిచ్చింది. ☆



తుపాను బాధితుల జాబితాల్లో తప్పులుంటే కఠిన చర్యలు : సి.ఎం.

"ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టులు సంభవించాయి వాటి వల్ల కలిగిన నష్టం వివరాలను పూర్తిగా జాగ్రత్తగా సేకరించి ప్రభుత్వానికి పంపితే అవసరమైన మేరకు నిధులు విడుదల చేసే వీలుంటుంది. పశు సంపదకు జరిగిన నష్టానికి కూడా పరిహారం చెల్లిస్తున్నాం. నష్టం వివరాల సేకరణలో జాగ్రత్తలు పాటించకపోతే.. ఎక్కడయినా తప్పులు జరిగితే... అందుకు బాధ్యులు ఎవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను హెచ్చరించారు.

తుపాన్లు, వరద సహాయక చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నవంబర్ 30 వ తేదీన జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "లోగడ వచ్చిన 'నీలం' తుపానుతో పాటు నిరుడు కరువు వల్ల వాటిల్లిన పంట నష్టాలకు సంబంధించి ఇంత వరకు రూ.1.662 కోట్లు విడుదల చేశాం. మరో రూ.437 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను త్వరలో రైతుల కోసం విడుదల చేస్తాం" అని హామీ ఇచ్చారు.

"నష్టపోయిన రైతులందరి పేర్లూ జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ ఒక్క రైతూ ఇబ్బందులు పడకుండా చూడాలి. రైతుల అవసరాన్ని బట్టీ పశుగ్రాసం విత్తనాలు విడుదల చేయాలి. అంతేకాక, మత్స్యకారులకు కూడా పరిహారం చెల్లిస్తాం. పశువులు కోల్పోయిన వారికి పరిమితి లేకుండా సహాయం అందించాలి. ఒకసారి నష్టం వివరాల జాబితాను సిద్ధం చేశాక ఆ జాబితాలో మళ్లీ మార్పులూ చేర్పులూ వంటివి చేయకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉన్నతాధికారులు కూడా ఆ జాబితాలను కనీసం పదిశాతం వరకు పరిశీలించాలి. జాబితాలను సిద్ధం చేసిన వారి పేర్లనూ, తనిఖీ చేసిన వారి పేర్లనూ జాబితాతో పాటు రాయాలి. అలా చేస్తే ఎవరు తప్పు చేశారో త్వరగా తెలిసి తదుపరి చర్యలు సత్వరం గైకొనే వీలవుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తుపాన్లు, భారీ వర్షాల వల్ల కలిగిన నష్టాల మదింపును త్వరగా ముగించి, రైతులకు కావాల్సిన విత్తనాల కోసం నివేదికలు త్వరగా సమర్పిస్తే తగిన కార్యాచరణను రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రులు శ్రీయుతులు రఘువీరారెడ్డి ఎం.మహీధర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె.మహంతి, విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ శ్రీ పార్థసారధి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ☆

'గురజాడపై తపాలా బిళ్ల'

మహాకవి గురజాడ సాహితీ లోకానికి అడుగుజాడ. సాంఘిక దురాచారాలపై తన సాహిత్యం ద్వారా కొరడా ఝుళిపించి, సమాజాన్ని చైతన్యం చేసేందుకు ఎనలేని కృషి చేశారు. సమాజ హితాన్ని కోరుకునే ఆయన రచనలు సాహితీ ప్రియుల గుండెల్లో పదిలంగా నిలిచివున్నాయి.

మహాకవి సాహితీ సేవకు గుర్తింపుగా జనహృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా గురజాడ వర్ధంతి రోజున కేంద్ర ప్రభుత్వం 'గురజాడ స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది.



నవంబరు 30న గురజాడ వర్ధంతి సందర్భంగా విజయనగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సహకార, సాంకేతిక శాఖామంత్రి డా॥ కిల్లి కృపారాణి గురజాడ తపాలా బిళ్లను విడుదల చేశారు. తపాలా బిళ్లతోపాటు ఆయన బొమ్మతో కూడిన పోస్టర్‌ను కుడా ఆవిష్కరించారు.

అనంతరం శ్రీమతి కృపారాణి మాట్లాడుతూ, విజయనగరానికి చెందిన హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు పేరిట కూడా తపాళా బిళ్లను విడుదల చేయడానికి, కలియుగ భీముడుగా పేరుగాంచిన కోడి రామమూర్తి పేరిట శిక్షణా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

ఆ సందర్భంగా బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ మొదలి నాగభూషణ శర్మకు గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందజేశారు.

కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ రచయిత, నటుడు గొల్లపూడి మారుతీరావు మట్లాడుతూ, గురుజాడ పేరిట స్టాంపు విడుదల శుభ పరిణామమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టరు శ్రీ కాంతిలాల్ దండే, అధికార భాషా సంఘం సభ్యులు శ్రీ ఎ.గోపాల రావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె.ప్రకాష్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

- ఎస్. జానకమ్మ, విజయనగరం



''మన దేశం గర్వించదగిన మహనీయులలో మాజీ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ఒకరు. ఆయన దేశానికి అందించిన సేవలు అమోఘం. ముఖ్యంగా స్వతంత్ర భారతావనిని అత్యున్నత అధునిక దేశంగా మలిచేందుకు భారతీయులంతా ఐకమత్యంతో కృషి చేయాలని నీలం సంజీవరెడ్డి ఇచ్చిన సందేశం నేటికీ అనుసరణీయం. ప్రస్తుతం అనేక సవాళ్లతో సతమతమవుతున్నందున ఆయన ఇచ్చిన సందేశాన్ని అందరూ తు.చ. తప్పక పాటించాలి" అని భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నారు.

అందరికీ 'నీలం' బాట అనుసరణీయం: ప్రణబ్

నీలం సంజీవరెడ్డి శత జయంత్యుత్సవాల ముగింపును పురస్కరించుకుని డిసెంబర్ 23న అనంతపురంలో ఆయన పేరిట నిర్మితమైన స్టేడియంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ మాట్లాడుతూ.... "నిజానికి స్వర్గీయ నీలం సంజీవరెడ్డి రాజకీయంగా ఎన్నో మైలురాళ్లు అధిగమించారు. అనంతపురం జిల్లాలోని ఓ కుగ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన ఆయన రాజకీయ దురంధరుడుగా ఖ్యాతి గడించారు. అనంతపురం జిల్లాకు ఎంతో మంచి పేరు రావటానికి ఆయన ఈ జిల్లా వాసి కావడమే కాదు, మరో మాజీ రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ కూడా అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో పనిచేయడం కూడా అత్యంత కీలకమైనదే. పైగా చిన్న వయస్సులో రెండుసార్లు ముఖ్యమంత్రిగా, రెండుసార్లు లోక్ సభ స్పీకర్‌గా, ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడుగా పని చేసిన ఘనత నీలం సంజీవరెడ్డికి ఉంది. ముఖ్యంగా లోక్‌సభ స్పీకర్‌గా ప్రజాస్వామ్యాన్నీ, ప్రజల సంప్రదాయాలనూ గౌరవించిన చిత్తశుద్ధిగల మహోన్నత నేత ఆయన" అని ప్రశంసించారు.

"నీలం సంజీవరెడ్డి చిన్న వయస్సు నుంచే మహాత్మాగాంధీ స్ఫూర్తితో నడిచే వారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారాయన. అంతే కాదు,1940 నుంచి 1945 వరకు టంగుటూరి ప్రకాశం పంతులు వి.వి. గిరి, సత్యమూర్తి, కామరాజు నాడార్‌ల వంటి ప్రముఖులతో కలిసి జైలు శిక్ష అనుభవించారాయన. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి నీలం చేసిన కృషి మరువలేం. పార్లమెంటేరియన్‌గా, పరిపాలనాదక్షుడుగా, ఒక నాయకుడుగా ఎనలేని కీర్తి గడించారు.

ఇక నాగార్జున సాగర్, శ్రీ శైలం, శ్రీరాం సాగర్, వంశధార వంటి నీటి ప్రాజెక్టులు నీలం సంజీవరెడ్డి కృషి వల్లే నిర్మితమయ్యాయి. అందుకే ప్రతీ ఒక్కరూ ఆయన బాటలో నడవాలి" అని రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ వివరించారు.

ఈ తరం నేతలకు స్ఫూర్తిప్రదాత : సి.ఎం.

ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నీలం సంజీవ రెడ్డి మన రాష్ట్రానికి మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, లోక్ సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత పదవులు చేపట్టి ఆయా పదవులకు వన్నె తెచ్చారు. ప్రధాని పండిట్ నెహ్రూను ఒప్పించి మన ప్రధాన నీటి పారుదల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయించా రాయన. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటు ఆయన చలవే. ఈ తరం నాయకులకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం" అని ప్రశంసించారు.

రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ శ్రీ ఎ.చక్రపాణి, మంత్రులు శ్రీ ఎన్.రఘువీరా రెడ్డి, శ్రీ శైలజానాథ్, ఎం.పి. శ్రీ అనంత వెంకట రామిరెడ్డి తదితరులు సభలో పాల్గొన్నారు.

– రాజఫణి. పద్మమూడి





పెప్సీ కో-ప్లాంటుకు భూమి పూజ

బహుళ జాతి సంస్థ అయిన పెప్సీకో ఇండియా కంపెనీ చిత్తురులోని శ్రీ సిటీసెజ్‌లో నిర్మించనున్న భారీ ప్లాంటు నిర్మాణానికి హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో డిసెంబర్ 21న జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శీతల పానీయాల ఉత్పత్తి కోసం రూ.1,230 కోట్లతో మూడు దశల్లో ప్లాంటు నిర్మిస్తోంది. తొలిదశ ప్లాంటు నిర్మాణానికి రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వచ్చే ఏడాదికి ఇది పూర్తవుతుంది.

దీన్ని పురస్కరించుకు సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనువైన వాతావరణం కల్పిస్తున్నందుకే మన రాష్ట్రం పారిశ్రామిక కేంద్రంగా మారుతోంది. పెప్సీకో హోల్డింగ్స్ వంటి పెద్ద కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం హర్షణీయం. ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఒక మోటర్ సైకిళ్ల ఫ్యాక్టరీ కూడా ఏర్పాటవ్వాలన్నది నా ఆకాంక్ష" అని చెప్పారు.

"శ్రీ సిటీ ప్లాంటులో పండ్ల రసాల ఉత్పత్తికి కావాల్సిన మామిడి పండ్ల గుజ్జును స్థానికంగా సేకరించనున్నాం. అది రైతులకు లాభదాయకం. ఈ ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 8 వేల మందికి ఉపాధి లభిస్తుంది" అని సి.ఎం. వివరించారు.

పెప్సీ ఇండియా సి.ఇ.వో. శ్రీ శివ కుమార్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే భారత్‌లో పెప్సీకి ఏకైక అతి పెద్ద పానీయాల ఉత్పత్తి కేంద్ర మవుతుందన్నారు. ప్రాజెక్టు మొదటి, రెండు దశల కోసం రూ. 450 కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నామనీ, మూడవ దశ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.380 కోట్లు వెచ్చిస్తామనీ ఆయన వివరించారు.

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీమతి జె. గీతారెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ప్రదీప్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. ☆

రూ.50 వేల పెట్టుబడితో నెలకు రూ.40 వేల ఆదాయం!

మహిళల ఆర్థిక సాధికారతకు మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద మహిళను లక్షాధికారుల ను చేయాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను అన్ని విధాల ఆదుకొంటోంది. సంఘం అంటే అభివృద్ధికి మూలం అంటూ ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాళ్ళు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని పొంది ఏదో ఒక ఆదాయ మార్గాన్ని ఎంచుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారు.

విజయలక్ష్మి మహిళా సంఘంతో అభివృద్ధి చెందిన శ్రీమతి ముంగా శాంతమ్మ మాటల్లో....

"నా పేరు ముంగా శాంతమ్మ. నేను చిత్తూరు జిల్లా, బి. కొత్తకోట మండలం, దేగానుపల్లె ఎస్.టి.కాలనీ నివాసిని. మేము యానాది కులానికి చెందిన వాళ్ళం. విజయలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా చేరి 10 సంవత్సరాలు పైగా అయింది. నేను, నా భర్త కూలీ పనులకు వెళ్ళి జీవనం సాగించేవాళ్ళం. మాకు ఒక్కగాను ఒక్క కొడుకు ముంగా హరీష్. 10 వ తరగతి వరకు చదివించాం. ఆర్థిక స్తోమత లేక నా కొడుకును కూలీ పనులకు పంపేవాళ్ళం. మా అబ్బాయికి ఇప్పుడు 21 సంవత్సరాల వయస్సు. కూలీ పనులకు వెళ్ళేటప్పుడు ట్రాక్టరు, పాల వ్యాను లాంటి వాహనాలు నడపడం నేర్చుకున్నాడు. తర్వాత డ్రైవింగ్ లైసెన్సు పొందాడు.

2012 నవంబరులో ప్రభుత్వం మా విజయ లక్ష్మి సంఘానికి అయిదు లక్షల రూపాయల రుణం మంజూరు చేసింది. అందరు సభ్యులతో పాటు నాకు కూడా రూ.50,000 రుణం అందింది. మా అబ్బాయి ఆ సొమ్ముతో టాటా ఏస్ వాహనం కొని సరకులు రవాణా చేసుకుంటే లోను డబ్బులు వాయిదాలు చెల్లించడం సులభమని అన్నాడు. రూ.50,000 లను టాటా కంపెనీ వారికి చెల్లించి, మిగిలిన రూ.3,10,000 కంతుల (వాయిదాల) రూపంలో చెల్లించే విధంగా తీసుకొన్నాం. ఇప్పుడు మా అబ్బాయి హరీష్ స్వంతంగా దగ్గరలోని కర్ణాటక రాష్ట్రం వెళ్ళి చిక్కబళ్ళాపురం నుండి ద్రాక్ష పండ్లను తోటల వద్దే సొంతంగా కొని తన టాటా ఏస్ వాహనంలో మన రాష్ట్రంలోని మదనపల్లె, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో జరిగే సంతల్లో అమ్మకం చేస్తున్నాడు. ఖర్చులు పోనూ రోజుకు దాదాపు రూ.2000 వరకు మిగులుతోంది" అని శాంతమ్మ తెలిపింది.



జిల్లాల నుంచి...

ఇలా సగటున ప్రతి నెలా రూ.40,000 సంపాదిస్తూ సంఘానికి రూ.2000, టాటా కంపెనీ వారికి రూ. 10,000 వంతున క్రమం తప్పకుండా రుణం చెల్లిస్తున్నారు.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు 2013-14 ఆర్థిక సంవత్సరానికి గానూ డిసెంబరు వరకు 9,688 గ్రూపులకు రూ. 369.89 కోట్ల రూపాయలను వడ్డీలేని రుణాలుగా అందించి రాష్ట్రంలో చిత్తూరు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో కూడా 22,183 సంఘాలకు రూ.789.05 కోట్లు వడ్డీలేని రుణాలు బ్యాంకులు ద్వారా ఇప్పించి రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వడ్డీలేని రుణాలతో ఆర్థిక సాధికారత దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు.

- అబ్దుల్ రఫీక్, చిత్తూరు

'ఇండియా టుడే' అవార్డు

దేశ వ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమ రంగాల్లో పురోగతిలో పయనిస్తున్న పెద్దరాష్ట్రాల్లో అత్యుత్తమ పరిపాలన అందిస్తున్న రాష్ట్రంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 'ఇండియా టుడే' అవార్డుకు ఎంపికైంది. ఉత్తమ సుపరిపాలనా రాష్ట్రంగా 'ఇండియా టుడే' అవార్డును ఢిల్లీలో డిసెంబర్ 20 వ తేదీన జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీ జైరాం రమేష్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అందుకున్నారు.



2011 నవంబర్ 24న ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి గత నవంబర్ 24వ తేదీతో మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసినట్లయ్యింది. ఈ మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో చేపట్టిన కొత్త పథకాలతో పాటు, అప్పటికే అమలులో ఉన్న వివిధ అభివృద్ధి పథకాల తీరుపై సర్వే జరిపినట్లు 'ఇండియా టుడే' న్యాయ నిర్ణేతల బృందం తెలిపింది.

ఈ సందర్భంగా 'హౌవిల్ విన్ ఇన్ 2014-ది ప్రామిస్ ఆఫ్ గ్రోత్ వర్సెస్ రియాలిటీ ఆఫ్ పాపులరిజమ్' అనే అంశంపై చర్చా వేదికలో ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రి శ్రీ జైరాం రమేష్, గోవా సి.ఎం. శ్రీ మనోహర్ పారికర్, హర్యానా సి.ఎం. శ్రీ భూపేందర్ సింగ్ హుడా పాల్గొన్నారు.

ఇందులో సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి

ఉద్యమాలు వచ్చినా సుపరిపాలన పెరిగింది

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నా సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి తట్టుకుని నిలబడ్డారనీ, ఉద్యమాలు అభివృద్ధి ఆపలేవని నిరూపించారనీ ఆ న్యాయ నిర్ణేతల బృందం తమ నివేదికలో ప్రశంసించింది. నిరంతరం ఆందోళనలు జరుగుతున్నా ఉత్తమ పాలన అందించే దిశగా రాష్ట్ర పయనించిందనీ న్యాయ నిర్ణేతలు అభిప్రాయపడ్డారు.

అన్ని రాష్ట్రాల్లో కెల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే పెండింగు కేసులు బాగా తగ్గాయి. జాతీయ స్థాయిలో 4 శాతం పెరిగితే రాష్ట్ర స్థాయిలో పెండింగు కేసులు 3 శాతం తగ్గాయి. ఇక అత్యాచారం కేసుల్లో 7 శాతం, కిడ్నాపుల్లో 13 శాతం, హత్యల్లో 3 శాతం తగ్గుదల నమోదైందని న్యాయ నిపుణుల నివేదిక వివరించింది.

మాట్లాడుతూ "పథకాల ఉద్దేశం మంచిదైనా వాటి అమలులో సమస్య ఎదురవుతుంది. రకరకాల ఆందోళనలతో ఆంధ్రప్రదేశ్ అట్టుడికినా సమష్టి కృషితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రభుత్వ బాధ్యత. అయితే కేవలం వ్యాపారం కోసం పన్నుల వసూలు కోసం మాత్రమే ప్రభుత్వాలు పని చేయలేవు. ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి బాగోగులను రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలి.

"వ్యాపారస్తులు పేదల సంక్షేమం గురించి ఆలోచించలేరు. ఉన్న వనరులను వినియోగించుకుని వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా పథకాలు ఉండాలి. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, శిక్షణ ఇలా ఏ రంగాలకు ప్రాధాన్యతనివ్వాలో ముందుగా నిర్ణయించుకోవాలి" అని అభిప్రాయపడ్డారు.

"చేపట్టిన పథకాల అమలులో నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి. దీనికి ప్రజల భాగస్వామ్యం కూడా అత్యవసరం. అంకిత భావం, చిత్తశుద్ధి ఉన్న అధికారులు, సిబ్బంది పనితీరు, కష్టించి పని చేసే ఉద్యోగులు ఉండడమే మా ఆంధ్రప్రదేశ్ విజయ రహస్యం. నేను ముఖ్యమంత్రి అయ్యాక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి సాధారణ స్థితికి తెచ్చేందుకు కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఉన్న పథకాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను చేపట్టాం కూడా" అని ముఖ్యమంత్రి వివరించారు.

"ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 28 లక్ష మంది పిల్లలకు ఉపకార వేతనాలు ఇస్తున్నాం. కోటీ 40 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ సంవత్సరం రూ.16 వేల కోట్లు రుణాల రూపేణా ఇవ్వబోతున్నాం. దీని కోసం వడ్డీ రాయితీ కింద రూ.1400 కోట్లు చెల్లించాం. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇచ్చిన రుణమొత్తాన్ని కలిపినా ఇంత మొత్తం ఉండదు. విభజన ఉద్యమాల సమస్య ఉన్నా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాం. పురపాలక ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది" అని శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు.

కేంద్రమంత్రి శ్రీ జైరాం రమేష్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వడ్డీలేని రుణాల పథకం మహిళల స్వావలంబనతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతోంది. చిత్తూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో అమలులో ఉన్న నేరుగా లబ్ధి బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పథకం బాగా అమలవుతోంది. నేరుగా లబ్ధిదారుని ఖాతాకే డబ్బు జమ అవుతోంది" అని ప్రశంసించారు.

– రాజఫణి పద్దమూడి







బాబోయ్ ముగ్గులు...






హ్యాపీ న్యూ ఇయర్








బామ్మగారూ-సెక్యులరిజమూ

-సి.హెచ్.వి. బృందావనరావు

ఎయిర్‌పోర్టు అరైవల్ బ్లాక్ బయట ఎదురు చూస్తూ నిల్చున్నాం శ్యామలా, నేను. చెన్నై నుంచి ఢిల్లీ వచ్చే విమానం ల్యాండ్ అయినట్లే వుంది. ఎవరైనా తెలిసిన వాళ్ళు ఢిల్లీ వస్తుంటే తోడిచ్చి బామ్మను పంపమని బాబాయితో చెప్పాను. ఇన్నాళ్ళకు ఆ అవకాశం కుదిరినట్లుంది. బాబాయి ఫ్రెండెవరో ఢిల్లీ వస్తుంటే ఆయనతో తోడిచ్చి బామ్మను పంపాడు బాబాయి.

అదుగో బామ్మ. ఒక ట్రాలీ బండి మీద తన సంచీలు రెండిట్నీ ఉంచి దాన్ని తోసుకుంటూ చకచకా ముందుకొచ్చేస్తున్నది. ఆమె వెనకాల నలభై ఐదేండ్ల పెద్దమనిషొకాయన, బామ్మ స్పీడందుకోలేక, నెమ్మదిగా తన ట్రాలీని నెట్టుకుంటూ వస్తున్నాడు.



నేను బామ్మ ట్రాలీని పట్టుకుని 'ఎలా ఉన్నావే బామ్మా' అని అడగబోతుంటే, వినిపించుకోకుండా ముందు శ్యామల దగ్గరికి పోయి కౌగిలించుకుని "బాగున్నావా తల్లీ" అని అడుగుతున్నది.

శ్యామల ఆ ఆప్యాయతకు కరిగి పోతుండగా- "మనమడి కన్నా ముందు మనమరాలే కావల్సొచ్చిందా" అన్నాను నవ్వును దాచుకుంటూ, కోపాన్ని నటిస్తూ.

"లేడీస్ ఫస్టు గదట్రా భడవకాన. ఆ మాత్రం అర్థం చేసుకోలేవు, పైగా పచ్చడి చేశానంటావు" అంది బామ్మ.

ఆమె ఇంగ్లీషుకు అదిరిపోవడమే గాక, పైగా పచ్చడేమిటో బామ్మతో వచ్చినాయనకు అర్థంగాక తలగోక్కుంటుంటే నేనే చెప్పాను "నేను పి.హెచ్.డీ. చేశాన్లెండి. దాన్ని పచ్చడి చేసి మా బామ్మ ఎగతాళి చేస్తుంటుంది" అని.

ఆయన ముసి ముసిగా నవ్వాడు.

"చాలా థాంక్సండీ, మా బామ్మను జాగ్రత్తగా తీసుకొచ్చారు" అన్నాన్నేను.

"నన్నొకరు తీసుకొచ్చేదేమిట్రా భడవా. నేనే ఇంకా ఆ అబ్బాయి తప్పిపోతాడేమోనని కనిపెట్టుకుని ఉన్నాను" అన్నది బామ్మ.

మేమందరం నవ్వుకున్నాం.

"మీ బామ్మగారు ఇంట్లో మడి కట్టుకుని, స్వయంగా చేసుకున్నవి తప్ప మరేమీ తినరని మీ బాబాయి గారు చెప్పారు. విమానంలో ఎయిర్ హోస్టెస్ శాండ్‌విచ్ చేతికిస్తే 'ఇదుగో విమాన సుందరీ, ఎయిర్‌హోస్టెస్‌ని రొట్టెముక్క మడిగట్టుకుని తగలెట్టావా లేదా' అని ఎయిర్‌హోస్టెస్ అడిగింది" అన్నాడు నవ్వుతూ.

'దీపావళి హాస్యకథల పోటీ-2013'లో సాధారణ బహుమతి పొందిన కథ

నేనూ, శ్యామలా నవ్వు ఆపుకోలేకపోయాం.

"అప్పుడు ఏర్‌హోస్టెస్ ఏమంది?" అని శ్యామల అడిగింది.

"దానికి తెలుగొచ్చి ఛస్తేగా. తిక్క మొహం వేసుకొని, దిక్కులు చూస్తూ పక్కకెళ్ళిపోయింది" అంది బామ్మ కూడా నవ్వుతూ.

"ఇంతకూ శాండ్‌విచ్ తిన్నావా లేదా?" అని అడిగాను.

"తిన్నాన్లేరా. రోముకు పోయినప్పుడు రోమన్లా ఉండాలని నాకు తెలుసు లేరా సన్నాసీ" అంది బామ్మ.

ఆమె ఇంగ్లీషు పరిజ్ఞానానికి ఆయన దిమ్మెరపోయాడు. మాకు బామ్మ సంగతి కొంచెం తెలుసుగాబట్టి చిరునవ్వుతో ముగించాం.

ఆమె మోడరన్ విశ్వరూపం -అంతకుముందు నేనెరగనిది- ఆ తర్వాత మా ఇంట్లో నాకు బాగానే దర్శనమైంది. బామ్మతో వచ్చినాయనకు నమస్కారం చెప్పి మేము మా కార్లో బయల్దేరాం.

ఇంట్లో ఎవరన్నా ఒక పెద్ద దిక్కు ఉంటే బాగుండునని అనుకునే వాళ్ళం - నేను, శ్యామలా. మా ముచ్చట ఇలా తీరింది బామ్మరాకతో.

"ఒసేయి శ్యామలా, ఇవ్వాల్టినుంచీ నువ్వు వంటింట్లోకి పోబాకు. ఇక ఆ డిపార్టుమెంటంతా నాది. సరేనా?" అంది బామ్మ.

"ఇక్కడ కూడా నీకు శ్రమెందుకు. దర్జాగా కాలు మీద కాలు వేసుకొని కూర్చో. నీక్కావలసిన రీతిగా నేను వండిపెడతాను" అంది శ్యామల మనస్ఫూర్తిగా.

"నీ బొంద. నాకు శ్రమేంటి. ఈ పట్నం తిండ్లతో మీకు నోరు చవి చచ్చిపోయుంటుంది. నా వంటతో ఇక మీ నాలికలు తుప్పొదల గొట్టనూ" అంది బామ్మ.

"వద్దులే అమ్మమ్మా! నేను కూడా మడి కట్టుకునే చేస్తాను వంట" అంది శ్యామల. బహుశా బామ్మ అభ్యంతరానికి అదే కారణమేమోననుకుని.

"మడీ పాడూను. నన్ను మరీ అంత చాదస్తపు పీనుగగా కట్టెయ్యకండ్రా. సాగినంతకాలం సాగించు కోవడం- వీలుకాకపోతే సర్దుకుపోవడం ఉండాల్రా మనిషన్నాక. నేనెక్కడైనా, ఎలాగైనా అడ్జస్టవ

ఓ నరేంద్ర...
ఓ యతీంద్ర......



ఓ స్ఫురద్రూపీ.... తేజోదీప్తి.....
నీ రూపం మనోఫలకంపై మెదలగానే
చేవచచ్చిన శరీరమైనా చైతన్యాన్ని స్రవిస్తుంది.
నీ నామం పెదవులపై కదలాడగానే
తలపంతా తేజోమయమై దివ్యకాంతి ప్రసరిస్తుంది.
విశ్వమతవేదికపై నీవు పూరించిన హైందవ శంఖారావం
నేటికీ ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తూనే ఉంది.
లెండి! మేల్కొండి! లక్ష్యం చేరేవరకు విశ్రమించకండంటూ
నీవు చేసిన గర్జారావం గుండె గుండెను తట్టిలేపి
నూతన గమ్యాన్ని నిర్దేశిస్తుంది....
నీవు నింపిన స్ఫూర్తిగా స్వామీ.....
భారతీయుల్ని దాస్యవిముక్తి దిశగా పయనింపచేసింది.
నీవు నడిచిన బాటేగా స్వామీ...
నవతరాన్ని నేడు జ్ఞానపథంవైపు నడిపిస్తోంది....

సనాతనత్వమే ఈ దేశ సౌభాగ్యమ్మని,
మనోనిగ్రహానికే విగ్రహారాధనని,
దీనులసేవయే దైవారాధనని.....
ఎలుగెత్తిన ఓ నరేంద్ర.... నినదించిన ఓ యతీంద్ర....
పురివిప్పిన వివేకమై మది, మదిలో వికసించి,
ప్రజ్ఞవైపు, ప్రగతివైపు,
మమ్మూ, మా దేశాన్ని
నడిపింపగ, పడిపించగ మరోమారు రావయ్యా....
స్వామీ వివేకానందా...

– గొడవర్తి శ్రీనివాసు

గలనే పిల్లా" అంది బామ్మ. బామ్మ నోట్లోంచి ఇంగ్లీషు ముక్క వచ్చినప్పుడల్లా శ్యామలకు భలే తమాషా అనిపిస్తుంటుంది.

పిల్లలింకా స్కూళ్ళనించి రాలేదు. బామ్మ తను తెచ్చిన రెండు పెద్ద సంచీలనూ హాల్లోకి తెచ్చి – వైనంగా కూచుని – మొదటి సంచీ తెరిచింది. ముందు రెండు పెద్ద హార్లిక్స్ సీసాలను బయట పెట్టింది. వాటిలో ఎర్రని ద్రవంలో తేలుతూ పిండి, మామిడి ముక్కలూ, 'ఇది ఆవకాయ' అంది. ఇంకో సీసా బయటికొచ్చింది. 'ఇది మెంతికాయ' అని పరిచయం చేసింది. మరో రెండు సీసాల్ని మెజీషియన్ టోపి లోంచి కుందేలు పిల్లల్ని తీసినట్లు బయటకు తీసి 'ఇవి పెసరావకాయా, మాగాయా' అని కామెంటరీ చెప్పింది.

ఆ తర్వాత మరో రెండు సీసాలను తీసి పక్కన పెట్టి 'ఇవి ఉప్పు చింతకాయ పచ్చడీ, గోంగురా' అంది.

'శభాష్. కరణమూ, మునసబూ కూడా వచ్చేశారన్నమాట' నా చిన్నతనంలో ఆ రెండు పచ్చళ్ళనూ కరణమూ మునసబూ అని ముద్దుగా పిల్చుకునే వాళ్ళం. ఆ సీసాలన్నిట్నీ చూసేసరికి నాకు లాలాజలం ధారాపాతంగా ఊరి నాగార్జున సాగర్ కెనాల్లా తన్నుకొచ్చే ఉపద్రవం వచ్చేసింది. ఇక మా ఆవిడైతే ఫస్టు ట్రిప్పు మూర్ఛలోకి పోయి తిరిగొచ్చేసింది.

ఆ తర్వాత రెండు పాలిథిన్ కవర్లు తీసింది బామ్మ. "ఇవిగో, ఇవి బూడిద గుమ్మడి వడియాలు, ఇవి సగ్గు బియ్యం వడియాలు. ఇక ఈ డబ్బా చిట్టిపొడి అదేనే, అన్నంలో వేసుకునే పొడి. ఇక ఇదేమో సున్నిపిండి డబ్బా– ఈ రెండోది శీకాయపొడి. అదేంటిరా అట్లా చూస్తావు దేభ్యం మొహమేసుకుని. వారం వారం ఒక చటాకుడు ఆముదంతో తలంతా మర్దన చేసుకుని, వంటినిండా ఆముదం రాచుకుని – సున్నిపిండిని నీళ్ళతో జారుగా కలిపి వళ్ళంతా నలుగు పట్టించి – ఒక గంటసేపు ఎండలో నిల్చుని ఎండి –ఆ తర్వాత వళ్ళంతా నలుచుకొని – తలంటి పోసుకోవాల్రా" అంది బామ్మ.

నాకైతే మింగాలేక కక్కాలేక గొంతు సెంటర్లో ఏదో గోలీ అడ్డం పడ్డట్టనిపించింది. నా అవస్థ గమనించి నవ్వుకుంటూ, శ్యామల ఆనందంగా బామ్మదగ్గరికి వచ్చి కూచుని "అమ్మమ్మా, నువ్వెంత మంచిదానివే. ఎన్నడో మరచిపోయిన ఆ చిన్ననాటి రోజుల్నూ, ఆ ఆపేక్షల్నూ మళ్ళీ ఇక్కడికి తీసుకొచ్చావు" అంది ఎంతో అభిమానంగా.

"మరీ ఒడియాలు గూడా తేవాలట్నే? అక్కడ నాల్రూపాయలు పడేస్తే దొరికే వాటికి" అన్నాను.

"నోర్మూయ్యరా కుంకాయా. నా చేత్తో పెట్టిన వొడియాల్తో బజారు వడియాల్ని పోలుస్తావా! మీ తాత బతికున్న రోజుల్లో అయితే – బూడిద గుమ్మడికాయ –మన పెరట్లోదేలే, ఆయనే తరిగేవాడు. ముక్కల్ని నేను రోట్లో వేసి రుబ్బుతుంటే పక్కన కూచుని ఎగసిన దోస్తుండే వాడు. ఇక వడియాలు ఏ గుడ్డ మీదంటే ఆ గుడ్డ మీద ఎండబెట్టనిచ్చేవాడనుకున్నావా! భోషాణంలోంచి మా శోభనం నాటి చీరా, ఆయన మధుపర్కమూ బయటికి తీయించి వాటి మీదనే వడియాలు ఎండబెట్టాలనేవాడు. నీ చీర తగిల్తే గాని పిండికి టేస్ట్ రాదే అనేవాడు మీ తాత" అని మా బామ్మా కొంచెం సిగ్గు పడింది.

బామ్మ నోట్లోంచి మళ్ళీ ఓ ఇంగ్లీషు ముక్కా తాతయ్య బతికున్న నాటి ముచ్చటా, మోతాదు మించని

అమె సిగ్గు వీటన్నిట్నీ చూసి శ్యామల మాత్రం ఒక పారవశ్యపు ట్రాన్సులోకి వెళ్ళిపోయింది. ఒక సుదీర్ఘ జీవితానుభవంతో పండిపోయిన ఆ వృద్ధ ప్రేమ మూర్తి ముఖంలో వెలిగిన గడచిన దినాల తలపోతా, ఆ సిగ్గూ నాకు మాత్రం పరమ మనోహరంగా కనిపించింది.

బామ్మ రెండో సంచి తెరిచింది. ముందుగా ఒక చిన్న ప్లాస్టిక్ డబ్బా తీసింది. అందులో ఏదో చందనం రంగుపొడి ఉంది.

"ఇది నాగుల స్వామి ఉరుసు గంధం" అంది బామ్మ.

"నాగుల స్వామి! ఇప్పుడు నాగుల చవితి గానీ, నాగపంచమి గానీ లేవుగదే. ఐనా నాగుల స్వామికి ఉరుసేంటి" అన్నాను నిర్భాంతపోతూ.

"నాగుల స్వామంటే నాగుల మీరా స్వామిరా పిచ్చివాడా" అంది బామ్మ.

"'ఓహో, నాగూర్ మీరా స్వామా" అన్నాను.

మా వూళ్ళ దగ్గర నాగూర్ మీరా సాహెబ్ అనే ఒక ముస్లిం మహనీయుని దర్గా వుంది. ఏటేటా అక్కడ ఉర్సు జరుగుతుంది. ఆ ఉర్సులో గంధప్పొడి చల్లుకుంటారు. ఆ గంధాన్ని భక్తితో కొంచెం ఇంటికి తెచ్చుకుంటారు. అన్ని మతాల వాళ్ళూ ఆ ఉర్సు ఉత్సవంలో పాల్గొంటారు.

"అయితే ఇప్పుడా గంధమేం చేస్తావు" అంది శ్యామల.

"దాన్ని కృష్ణమూర్తి విగ్రహానికి ఒంటినిండా పట్టిస్తాను" అంది బామ్మ.

మాకు ఏమీ అర్థం కాక నిలువు గుడ్లేశాం.

"అట్లా చూస్తారేమిట్రా. నాగుల మీరా స్వామంటే నాగదేవతన్న మాట. ఆయన మీదే గదా విష్ణు మూర్తి పడుకునేది. అంతేకాదు కృష్ణమూర్తిని 'చందన చర్చిత నీలకళేబర' అన్నారా లేదా. అంటే ఆయన వొంటినిండా గంధం పూత పూసుకుంటాడనే కదా. అందుకని ఈ గంధం ఆయన వొంటికి పట్టించాలన్న మాట" అంది బామ్మ.

ఈ లాజిక్‌కు మాకు తల తిరిగి, గుడ్లెళ్ళుకొచ్చిన మాట నిజమే కాని రెండు మతాల మీదా అమెకుండే విశ్వాసానికి మాత్రం ముగ్ధుణ్ణయిపోయాను.

తరువాత సంచీలోంచి ఒక ఫొటో తీసింది. దాన్ని చూసిం తర్వాత గూడ కొంచెం ఆశ్చర్యం అనిపించింది. కానీ అడుగడుక్కూ ఆశ్చర్యం కలుగుతూ వుండడం చేత - ప్రతి ఆశ్చర్యమున్నూ మామూలుగానే తోచసాగింది. నాకు బామ్మ పరమ వైదికాచార పరాయణురాలిగానే తెలుసు.

తీసిన ఫొటోను చూపిస్తూ 'ఇది బాల ఏసు నెత్తుకున్న మేరీ మాత ఫొటో. అది పోయిన్నెలలో బాబాయీ, పిన్నీ, నేనూ బెజవాడ గుణదల మాత గుడికి పొయ్యొచ్చాం. అమ్మవారి విగ్రహం ముందు నిల్చుని చూస్తుంటే నాకు కన్నీళ్ళు ఆగలేదనుకో. మేరీమాత కళ్ళనిండా ఎంత దయరా! తల్లి ఎంత పవిత్రంగా ఉందిరా. బాల ఏసును ఎత్తుకున్న ఆ తల్లిని చూస్తుంటే కుమారస్వామిని ఎత్తుకుని నిల్చున్న పార్వతీదేవి ప్రత్యక్షమైనట్లే అనిపించిందిరా" అని తృప్తిగా నిట్టూర్చి ఫొటోను పక్కన పెట్టింది.

బామ్మ మేరీ మాతకు పార్వతీ దేవికీ అభేదం చూసిన తీరుకు నాకు ఒళ్ళంతా పుల కరించినట్లయింది. ఏ గొప్ప చదువులూ చదవని ఈ ముసలావిడ తనకు తెలియకుండానే ఎంత పరమార్థాన్ని వెల్లడిస్తున్నది అనిపించింది.

"వచ్చే క్రిష్ణమస్‌కు మళ్ళీ పోయి రావాల్రా" అంది.

"అది క్రిష్ణమస్ కాదే, క్రిస్టమస్, క్రిస్మస్" అన్నాను.

"నీ బొంద, అది క్రిష్ణమస్సే. అసలు క్రీస్తంటేనే కృష్ణుడు. కృష్ణుడంటేనే క్రీస్తు అందామే"

"అదెట్లా ?" అని అడిగాను నేను.

"క్రీస్తు పుట్టిందెక్కడ్రా" అడిగింది బామ్మ

"పశువులశాలలో" అంది శ్యామల.

"కృష్ణుడు పెరిగిందెక్కడ?" ప్రశ్నించింది బామ్మ.

"పశువుల మందలో" అన్నాం మాకు తెలియకుండానే నేనూ శ్యామలా.

"మరిక తేడా ఏముందిరా భడవల్లారా. మీకన్నీ తెలుసురా. ఐనా నన్ను ఆట పట్టిస్తున్నారు" అని సంచీలోంచి ఒక అరటిపండు తీసింది.

బామ్మ చెప్పే ఒక్కో ముక్కకూ మాకు గింగిరాలు తిరుగుతున్నాయి. అవి అలా ఉండగానే, అరటిపండు తొక్కతీసి - కొంచెం తుంచి కళ్ళకద్దుకుని నోట్లో వేసుకుని, మిగతాది మాకు చెరికాస్త ఇచ్చి "కళ్ళ కద్దుకొని నోట్లో వేసుకోండి. ఏసుక్రీస్తు ప్రసాదం" అన్నది.

"ఏసుక్రీస్తు ప్రసాదమా. క్రైస్తవులకు ప్రసాదాలూ అవీ ఉండవే. ఒక కొవ్వొత్తి వెలిగించి తలవంచి ప్రార్థన చేసుకుంటారు" అన్నాన్నేను.

"క్రీస్తంటే దేవుడ్రా, దేవుడికి పూజ చేశాక నైవేద్యం పెట్టకుండా ఉండగూడదురా. అందుకని దీపారాధన చేసి, మంత్రపుష్పం చదివి, అరటిపండు మీద కాసిని మణ్ణీళ్ళు చిలకరించి 'సత్యం త్వర్తైన పర్షించామి' అని కాసిన్నీళ్ళు పండుచుట్టూ తిప్పి - ప్రాణాయ స్వాహా, వ్యానాయస్వాహా -అంటూ పంచప్రాణాహుతులు సమర్పించి దణ్ణం పెట్టుకొని - ప్రసాదం తింటాను. ఏం అలా చేయగూడదా" అన్నది.

"ఎందుకు చెయ్యగూడదు. బ్రహ్మాండంగా చెయ్యొచ్చు" అన్నాను అరటిపండు చప్పరిస్తూ - మరేమనాలో ఏమీ తోచి చావక.


"దీపారాధన చేయగూడదే. క్రీస్తు ప్రభువు దగ్గర కొవ్వొత్తి వెలిగించాలి" అన్నాను. నా పచ్చిడి - అదే పి హెచ్.డి.-పరిజ్ఞానంతో.

"రెండూ వెలుగును పంచేవే అయినప్పుడు తేడా ఏముందిరా" అని-

"అసలు మశీదులో ఏసుక్రీస్తు బొమ్మపెట్టి అష్టోత్తరం చేసే రోజూ - చర్చిలో వెంకటేశ్వరస్వామి బొమ్మపెట్టి నమాజు చేసే రోజూ, మందిరంలో కాబా ఫొటో పెట్టి కొవ్వొత్తి వెలిగించే రోజూ రావాల్రా. ఏదో ముసలి ముండను, చదువు రాని దాన్ని చెపుతున్నాను గాని దేవుడికి ఎవరిష్టం వచ్చిన పేరు వాళ్ళు పెట్టుకుంటారు. తప్పులేదు. అల్లా - యొహోవా, ఈశ్వరుడూ వేరు వేరని ఎవడన్నా అనుకుంటే వాడు, వాడి సొంత దేవుణ్ణి అవమానం చేసినట్లేరా నా ఒపీనియాన్లోనూ " అని అగ్ని హోత్రావధానుల్లా 'తాంబులాలిచ్చేశాం తన్నుకు చావండి' అని చెప్పినంత కరాఖండీగా చెప్పి -

"బాత్‌రూం ఎటువైపే శ్యామలా" అంటూ లేచింది మా గం-భా-స బామ్మ. శ్యామలకు నాకు తెరచుకున్న నోళ్ళు మూతపడ్డానికి చాలా టైం పట్టింది.

☆



తీరం వెంబడి శాశ్వత తుఫాను షెల్టర్లు

రాష్ట్రంలో తుపాను ప్రభావిత జిల్లాల్లో సహాయ కార్యక్రమాలపై ప్రపంచ బ్యాంకు అధికారులు, కేంద్ర ప్రభుత్వాధికారులతో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సచివాలయంలో డిసెంబర్ 12 న ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు గైకొన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో మల్టీపర్పస్ తుఫాను షెల్టర్లు, రోడ్లు బ్రిడ్జీలు తదితర వాటిని నిర్మించాలని నిర్ణయించాం. వీటి నిర్మాణానికి ఆర్థిక సహాయం కావాలి. కోస్తా తీరాన ఉన్న తొమ్మిది జిల్లాల్లో 135 తుపాను షెల్టర్ల నిర్వహణ, సంక్షేమ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఏర్పాటైన 22 కమిటీల్లో సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని చెప్పారు. వెంటనే ప్రపంచ బ్యాంకు అధికారులు స్పందించి ఆర్థిక సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సి.ఎం.కి తెలిపారు.



సి.ఎం సమీక్షలు

ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులు ఆపరేషన్స్ అడ్వయిజర్ మిచెల్ హెనీ, సివిల్ ఇంజనీర్ శ్రీ దీపక్‌సింగ్, వరల్డ్ బ్యాంకు నిపుణుడు సర్ డి.ఆర్.ఎం. శ్రీ రాజా హసన్, శ్రీ నరహరిరావు. కేంద్ర హోమ్ శాఖలోని ఉన్నాతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బందరు పోర్టు పనులు వేగంగా జరగాలి

"కృష్ణా జిల్లా మచిలీపట్నం ఓడరేవు ప్రాజెక్టు అభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

పెట్టుబడులు, మౌలికాభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాజెక్టులపై రాష్ట్ర సచివాలయంలో నవంబర్ 27 న జరిగిన సమీక్ష సమావేశంలో సి.ఎం. మాట్లాడుతూ "బందరు పోర్టుకు సంబంధించి భూసేకరణ సమస్యలను రాబోయే భూసేకరణ పాలసీలో భాగంగా పరిష్కరించాలి. అలాగే ప్రధానంగా కాకినాడ ఓడరేవు వద్ద అభివృద్ధి చేయనున్న ఫ్లోటింగ్ స్టోరేజ్ అండ్ రీ-గ్యాసి ఫికేషన్ (ఎఫ్.ఎస్.ఆర్.యు) యూనిట్ పనులతో పాటు విశాఖలోని గంగవరం పోర్టులో పెట్రోనెట్ ఎల్.ఎన్.జి. కోసం అభివృద్ధి చేయదలచిన టెర్మినల్ ప్రాజెక్టు పనులను వేగంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టులన్నీ సజావుగా సాగేందుకు ఒక సమావేశం నిర్వహించాలి" అని సూచించారు.

మౌలిక వసతుల శాఖ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు, ఆ శాఖ కార్యదర్శి శ్రీ ఎం.టి.కృష్ణ బాబు, రెవెన్యూ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

డి.ఎస్సీ నిర్వహణపై సమీక్ష

డి.ఎస్సీ-2012ల నిర్వహణపై ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాల అధికారులతో డిసెంబర్ 2 న ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో గత సంవత్సరం నిర్వహించిన డి.ఎస్సీలో అర్హులైన తొలిజాబితా అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడంలో ఎదురవుతున్న న్యాయపరమైన అంశాలను ఉన్నతాధికారులు ప్రస్తావించిన వెంటనే ముఖ్యమంత్రి మాట్లాడ్తూ "ప్రస్తుత తరుణంలో డి.ఎస్సీ నోటిఫికేషన్ జారీ నియామక ప్రక్రియలను పూర్తి చేయడం ఎంత వరకూ సాధ్యమో అధ్యయనం చేయాలి" అని అధికారులను ఆదేశించారు.

"అంతకు ముందు జరిగిన రెండు డి.ఎస్సీల నియామకాల సమయంలో కలిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ చేయడంలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా డి.ఇ.డి., బి.ఇ.డి. వివాదాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని వ్యవహరించాలి" అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మాధ్యమిక విద్యాశాఖ మంత్రి శ్రీ పార్థసారధి, ముఖ్య కార్యదర్శి శ్రీ పూనం మాలకొండయ్య, ఇతర సీనియర్ అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

చెరువులకు, కరకట్టలకు గండ్లు పడకుండా చర్యలు

"తుఫానుల ప్రభావానికి కోస్తా జిల్లాల్లోని గ్రామాల్లో చెరువులకు గండ్లు పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. కరకట్టలను కూడా పటిష్టంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఈ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలి. యుద్ధ ప్రాతిపదికన సహాయ పునరావాస చర్యలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కోస్తా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

హెలెన్ తుఫాను నష్టాలు, లెహెర్ తుపాను పరిస్థితిపై హైదరాబాద్‌లోని సి.ఎం. క్యాంపు కార్యాలయంలో నవంబర్ 28న జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. అధికారులు స్పందించి మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాల నుంచి 42 వేల మందిని సురక్షితంగా తరలించామని సి.ఎం. కి చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ శ్రీ పార్థసారధి, డి.జి.పి. శ్రీ ప్రసాదరావు, ఆర్.అండ్.బి. శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ శ్యామ్ బాబు, ట్రాన్స్‌కో సి.ఎం.డి. శ్రీ సురేష్ చందా తదితరులు పాల్గొన్నారు.

కొత్తనీటి కనెక్షన్లు సరళీకృతం : సి.ఎం.

అక్రమ నీటి కనెక్షన్ల క్రమబద్ధీకరణ, 15 ఎం.ఎం. సైజు గల కొత్త నీటి కనెక్షన్ల విధానాన్ని సరళీకృతం చేసేందుకు ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన డిసెంబర్ 4 న జరిగిన హైదబాద్ జల మండలి (మెట్రో పాలిటన్ వాటర్ సప్లయి అండ్ స్యూవర్‌జి బోర్డు) సమావేశం అంగీకరించింది.

జల మండలికి సంబంధించిన వివిధ అంశాలు, ఆర్థిక స్థితిగతులు, ప్రాజెక్టుల గురించి కూడా కూలంకషంగా చర్చించి పలు నిర్ణయాలు గైకొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "జలమండలి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు జి.హెచ్.ఎం.సి., జలమండలి, ఇతర శాఖలతో సంయుక్త సమావేశం నిర్వహించాలి" అని అధికారులను ఆదేశించారు. అంతేకాక, జల మండలి చేపడుతున్న వివిధ ప్రాజెక్టులను సి.ఎం. ఆమోదించారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శ్రీ ఎం. మహీధర్ రెడ్డి, జౌళిశాఖ మంత్రి శ్రీ జి. ప్రసాద్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతి, జి.హెచ్.ఎం.సి. కమిషనర్ శ్రీ సోమేష్ కుమార్ ముఖ్య కార్యదర్శిలు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

☆

సాహితీ విన్యాసాలు- 16

'సంక్రాంతి పండుగ వచ్చినది
సరదాలెన్నో తెచ్చినది
కొత్త బట్టలు కట్టాము
బహుమతులెన్నో పొందాము'

అంటూ ఒక నాడు పండగల్ని జీవితంలో పండగలా గొప్ప మానవ సంబంధాలతో జరుపుకునేవాళ్ళం. అప్పట్లో పండగ అంటే ఊరంతటికీ పండగే. అందర్నీ ఒకే కుదురుకుతెచ్చేవి పండగలు. వీటిలో పెద్ద పండగగా 'సంక్రాంతి'ని పేర్కొంటారు.

ఎందుకంటే అది భోగి – సంక్రాంతి – కనుమ అనే మూడు రోజుల పండుగ. కాదు, కొందరు 'ముక్కనుమ' పేరుతో నాలుగో రోజూ చేసుకుంటారు. మకర సంక్రాంతి అనీ అంటారు. సంక్రమణం అంటే ప్రవేశం, మార్పు. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించే సమయం అది. అందుకే ధనుర్మాసం అంటారు. దీంతో ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశిస్తుందన్న మాట!

సంక్రాంతి పండగను బొమ్మల పండగ అనవచ్చు–ముగ్గుల పండగ అనవచ్చు. గొబ్బిళ్ళపండగ, పంటల పండుగ – పశువుల వాహనాల పండగ అనవచ్చు.

ఆ సాహిత్యాన్ని నిలబెట్టింది ఈ పండగలే

బంతిపూలు కనువిందు చేసే కాలమిది. ఎడ్లపందాలు, కోడి పందాలు.. చెప్పనలవి కాదు. కోడిపందాలపై కవులు కవిత్వం రాశారు. శ్రీనాథుడంతటి మహాకవి కోడిపందాలను వివరంగా వర్ణించాడు. కొఱవి గోపరాజు తన 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యంలో తెలుగువారి పండగల ఆటల్ని 'రికార్డ్' చేశాడు. రంగవల్లికలు (ముగ్గులు) అంటే భూదేవికి పూజగా, కృతజ్ఞతగా అని

తెలుగుపద్యం ఆధ్యాత్మికమయం

రమణ నయనం

ఏ పండుగకైనా మూలం పరాశక్తిగా చెప్తారు. అమ్మవారు అంటే సరస్వతి, పార్వతి, లక్ష్మి, అలివేలు మంగ, త్రిపుర సుందరి, లలిత, భారతి, గోదాదేవి... ఇలా ఎన్ని విధాలుగా చెప్పిన అమ్మలగన్నయమ్మ ఒక పరాశక్తి మాత్రమే.

డా॥కె.వి. రమణాచారి పద్యకవిత్వంలో ఈ అమ్మవారు ఎన్ని రకాలుగా, ఎన్ని విశేష భావాలుగా విశ్వరూపం ప్రదర్శించారో తమ అంతర్నేత్రంతో దర్శించి, వ్యాఖ్యానించారు. తెలుగు పద్యం ఆధ్యాత్మికమయం అనిపిస్తుంది. ఎన్నో కావ్యాలు, ఎన్నో శతకాలు అమ్మవారిని మనకి చూపించిన పద్ధతిని రమణగారు చూపించారు.

డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్ గారు దేవీ ఉపాసకులు. సృష్టిలోని పదార్థ జాలమంతా అమ్మవారి స్వరూపమేనని ఆయన భావించారు.

'అఖిలము, నేకదిక్షమము ననంతమునై నిరపేక్షమై సదా
ముకుళిత విశ్వ ఖట్మల సమూహ వికాసపు సాక్షి మాత్రమై
కకుభము లేక సాగెడి యెుకానొక విశ్వవిశాల దీప్తమా
సుఖమయ 'కాల'మై త్రిపుర సుందరి మాకు ప్రసన్నమయ్యెడిన్'

ఈ పద్యంలో అధునికమైన సాపేక్ష సిద్ధాంతం వ్యక్తమవుతుంది. కాలము ఏక దేశము, అనంతము, సాపేక్షము, నిరపేక్షము, సాక్షిమాత్రము, సాగేది... ఇందులో టైమ్, స్పేస్ కంటిన్యూయమ్ ప్రస్తావించబడ్డాయి.

ఖమ్మం పట్టణానికి చెందిన లక్ష్మీ ప్రసాద్‌బాబు గారు...



సింహమె నీ వాహనము నృ
సింహుండె సోదరుడు, దైత్యసేనల కిల్లన్
సింహస్వప్నము! హృదయపు
సింహాసన మధివసింపు, శ్రీకరి లలితా'

అని శతకాన్ని తాదాత్మ్యంతో రాశారు.

పశ్చిమగోదావరి జిల్లా మారుమూల గ్రామం వంగూరులో వరిగొండ శ్రీ రామారావు రాసిన 32 పుటల భారతీశతకాన్ని సేకరించి తమ సిద్ధాంత వ్యాసంలో వివరించడం రమణగారి పరిశోధన నయనం ఎంత లోతైనదో తెలుస్తుంది. ఈ సిద్ధాంత వ్యాసం ఆధ్యాత్మిక భావుకులకు వరప్రసాదం.

☆

కవులు వెల్లడించారు.

సంక్రాంతి నాడు బుడబుక్కల వాడు వచ్చే సంప్రదాయం వుంది. శివుని ఢమరుకం వంటిది పట్టుకొని శుభాకాంక్షలు తెలుపుతూ పలికేపాట అత్యంత సహజమైనది.

'అంబపలుకు జగదంబా పలుకు
కంబుకంఠి! ఓ కాళీ పలుకు
కంచిలోని కామాక్షీ పలుకు
కాశిలోని అన్నపూర్ణా పలుకు
డుబుడుక్ డుబుడుక్ డుబుడుక్'

అంటూ అతను పాడే పాట అబ్బురం కలిగిస్తుంది.

'హరిలో రంగ హరీ' అంటూ హరిదాసులు శ్రవణపేయంగా పాడుతూ వుంటారు. అప్పట్లో వాళ్ళకి చదువు అంతంత మాత్రమే. కానీ ఆ పాటలన్నీ కంఠోపాఠం! ఇటువంటి వాళ్ళ వల్లనే మన భాషా సాహిత్యాలు, మన సంస్కృతి తరతరాలుగా కాపాడబడింది.

'శశిముఖులారా రారే
మా పసిబాలునకు భోగిపళ్ళు పోయుదము'

అంటూ స్త్రీలు పాడుతూ భోగిపళ్ళు పోసే సన్నివేశానికి హద్దులు లేవు.

సంక్రాంతి వేళలో గంగిరెద్దుల వాళ్ళు వస్తారు. ఎద్దును చక్కగా సింగారిస్తారు. సన్నాయి వాద్యంతో పాటపాడతాడు.

'డుడూ బసవన్న - దొడ్డ దొరండీ బసవన్న
అయ్యగారికీ దణ్ణం పెట్టు - అమ్మగారికీ దణ్ణం పెట్టు
కోటి లాభములు కలగాలండి
కోటి వేల్పుల దయ కలగాలండి
డుడూ డుడూ వెంకన్న'

అందరూ బాగుండాలని కోరుకోనే భావన ఎంత గొప్పది.

ఈనాడు స్వార్థం తప్ప ఆ విశాల హృదయమేది?

భోగి మంటలు పాతను వదలి కొత్తకి స్వాగతం పలకటంగా అర్థం చేసుకోవాలి

జానపదులు ఎంత హాయిగా కవిత్వంలో పాడుకుంటారో చూడండి.

'ఊగు ఊగు గంగెద్దా - ఉగ్గు పాలెం గంగెద్దా
సోలో ఊగే గెంగెద్దా - సోలెడు పాలె గంగెద్దా
మారే ఊగే గంగెద్దా - మానెడు పాలె గంగెద్దా'





తెలంగాణలో సంక్రాంతికి గాలిపటాల పండగ ఎక్కువ. గాలిపటాన్ని 'పతంగ్' అంటారు. ఈ ఉర్దూ (హిందీ) పదానికి గాలిపటం (పక్షి) అని అర్థం. పక్షి ఎలా స్వేచ్ఛగా ఎగురుతుందో గాలి పటమూ అలాగే ఎగురుతుంది. పతంగ్ అనేది సంస్కృతంలో 'పతంగం' నుంచి వచ్చిందే.

'ఎగిరింది ఎగిరింది నా గాలిపటం
గాలిలో ఎగిరింది నా గాలిపటం
పైపైకి ఎగిరింది నా గాలిపటం
పల్టీలు కొట్టింది - రాజ్యాలు దాటింది
మబ్బుల్ని తాకింది -నా గాలి పటం'

అని పాడుతూ వుండే అమందానందాన్ని ఎలా కొలవగలం? దేనితో కొలవగలం?

'తెలుగునాడు' అనే కావ్యంలో గొప్పకవి దాసు శ్రీరాములు సంక్రాంతిపై ఇలా పద్యమల్లారు.

'నిరుపమలీల బాలికలు నిశ్చల భక్తినియుక్తి సంకురా
తిరినెల వేద గొబ్బిలులు దీర్తురు వాకిళులందు ముగ్గులన్
బొరి పొరి బొమ్మలన్నిలిపి పూజలు సేతురు బొమ్మరిండ్లలో
బరువడి నారగించెదరు పప్పుడి బెల్లము పుల్లమిప్పులన్'

తలంటు పోసుకోవటం, కొత్తబట్టలు కట్టుకోవడం ఒక సంబరం. ఒక కొత్తదనం.

'దసరా పండగ వచ్చినది-దర్జాలెన్నో తెచ్చినది
దండిగ డబ్బులు వచ్చినవి - కోరికలన్నీ తీరినవి'


అనేకాదు -


'ఉగాది పండుగ వచ్చింది
జగాన వెలుగు నిండింది
వేదు వగరు తీపి గుర్తులతో
జీవితమంత సాగింది...'


అంటూ ఎన్నో పాటలు వెలువడ్డాయి.

మానవ జీవితంలో పండుగ అనేది గొప్ప అనుభూతి. బాధ మరిచి మానసిక ప్రశాంతతను, వికాసాన్ని ఇచ్చేవి పండగలని తమ సాహితీ విన్యాసాలలో కవులు, జానపదులు చాటి చెప్పారు.

– డా॥ ద్వా.నా. శాస్త్రి











ముగ్గులు... బాబోయ్ ముగ్గులు...









వచ్చే ఏడాది నుంచి పౌల్ట్రీకి విద్యుత్తు రాయితీ : సి.ఎం.

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నవంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగిన జాతీయ పౌల్ట్రీ ఎక్స్ పో - 2013 ప్రదర్శన, సదస్సును ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సదుస్సులో సుమారు 13 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు వచ్చి హాజరవగా... ప్రదర్శనలో 250 స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగింది.

వివిధ కంపెనీల ప్రతినిధులకు జ్ఞాపికలు బహూకరించిన ఈ సదస్సులో మొత్తం సుమారు ఇరవై వేల మంది రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ముఖ్య ఘట్టాలు

ఈ సదస్సు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సి.ఎం. శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటున్నాయనీ, రైతులు బీమా పాలసీల వైపు దృష్టి సారించాలనీ ఆయన సూచించారు. పౌల్ట్రీ రంగానికి సరఫరా చేసే విద్యుత్తు పై వచ్చే ఏడాది నుంచి యాభై శాతం సబ్సిడీ ఇస్తామనీ, ఈ సంవత్సరం యూనిట్ విద్యుత్‌ని రూ. 2.65 పైసలకే సరఫరా చేస్తామనీ సి.ఎం. ప్రకటించారు.

ఎన్.ఇ.సి.సి. ఆధ్వర్యంలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవంలో ఐ.టి.శాఖ మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య, మరో మంత్రి శ్రీకాసు వెంకట కృష్ణారెడ్డి, ముఖ్య కార్యదర్శి శ్రీమన్ మన్మోహన్‌సింగ్, నెక్ ఛైర్మన్ శ్రీ ఎం.జి. దేశాయ్ తదితరులు ప్రసంగించారు.

ఇక వేగంగా సౌర విద్యుత్తు విధానం

హైదరాబాద్‌లో ఉన్న సి.ఎం. క్యాంపు కార్యాలయానికి ఎన్ రెడ్ క్యాప్ సోలార్ ఫోటో వోల్టాయిక్ సిస్టంలో ఎన్ రెడ్ క్యాప్ ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు వ్యవస్థను ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నవంబర్ 26 న ప్రారంభించారు.

ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు వల్ల క్యాంప్ ఆఫీసుకు అయ్యే విద్యుత్తు వినియోగంలో యాభైశాతం ఆదా అవుతుంది. అంతేకాక ఈ సిస్టంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కాలంలో సుమారు నలభై కిలోవాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది.

5 రకాల క్రిమిసంహారకాల నిషేధం

రాష్ట్రంలో అయిదు రకాల క్రిమిసంహారక మందుల వాడకం నిల్వచేయడం, విక్రయించడం వంటి వాటిపై నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డిసెంబర్ 11న వెల్లడించింది. గుంటూరు, విశాఖ, వరంగల్, కర్నూలుల్లో ఉన్న క్రిమిసంహారకాల పరీక్షాకేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో వీటిని నాసిరకమైనవిగా నిర్ధారణ జరిగినట్లు పేర్కొంది.


కె.పి.ఆర్. ఫర్టిలైజర్స్ వారి 'మోనోక్రోటో ఫాస్ 36 శాతం ఎస్.ఎల్.' బ్యాచ్ నం. కె.ఎం.జి.-08 క్రిమిసంహారక మందును, అను ప్రోడక్ట్సు వారి (సాంబ, జమ్ము) 'ప్రోఫినో ఫాస్ 50 శాతం ఇ.సి. బ్యాచ్ నం. 680' ని, పిక్సెల్ క్రాప్ కేర్ వారి 'ఇమిడాక్లోప్రిడ్ - ఎస్- 29 నీ, మేఘమణి ఆర్గానిక్స్ వారి 'క్లోరి పైరిపాస్ 20 శాతం ఇ.సి. బ్యాచ్ నం. కె.పి.పి.ఐ.- 04 నీ, కె.పి.ఆర్. ఫెర్టిలైజర్స్ వారి 'ప్రొఫెనో పాస్ 50 శాతం ఇ.సి. 'బ్యాచ్ నం.కె.పి.పి.ఐ - 40 పురుగుల మందును నిషేధించినట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. రైతులంతా గమనించి పురుగు మందుల కొనుగోళ్ల సమయంలో మెలకువ పాటించాలని ఆ శాఖ విజ్ఞప్తి చేసింది.

ఆయిల్ పామ్ టన్ను మద్దతు ధర రూ. 7.516

రాష్ట్రంలోని ఆయిల్ పామ్ రైతులకు ఇది శుభవార్త! అయిల్ పామ్ టన్నుకు ఇస్తున్న కనీస మద్దతు ధరను రూ.6.907 నుంచి రూ.7.516 కు పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మద్దతు ధర పెంపు ఫలితంగా అయిల్ పామ్ రైతులు ఇక నుంచి టన్నుకు అదనంగా రూ.609 పొందే అవకాశాలున్నాయి. ఈ కొత్త ధర గత నవంబర్ నుంచి వచ్చే సంవత్సరం అక్టోబర్ వరకు అమలులో ఉంటుంది.

కాగా పామాయిల్ పూర్తి స్థాయి నివేదికలను రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎస్.కిరణ్ కుమార్ రెడ్డి డిసెంబర్ 11 న అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించేందుకు ఏటా రూ. 2 వేల కోట్లు చొప్పున పదేళ్లపాటు మొత్తం రూ. 20 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వాన్ని కోరేలా ప్రతిపాదనలు తయారు చేయాలని సి.ఎం. అధికారులకు సూచించారు. అలాగే కొత్త ఫార్ములా ప్రకారం నూనె రికవరీ, క్రూడ్ పామాయిల్, పామాయిల్ గింజల రికవరీ, అమ్మకాల ధరల్లో రైతులకు నిర్ణీత శాతం మేరకు వాటిని చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

☆







ఘల్లు ఘల్లున కాలి గజ్జెలు మ్రోగంగ...

బెంగుళూరులోని శివగంగ అనే ప్రదేశంలో మకర సంక్రాంతి రోజునే గంగ పుడుతుంది.

ఈ రోజున మాత్రమే సముద్ర మట్టానికి మూడువేల అడుగుల ఎత్తువున్న ఈ 'శివగంగ' అనే కొండ మీద 40 బెన్సుల నీరు ఊరుతుంది. మిగతా రోజుల్లో అక్కడ ఒక్కచుక్క నీరు కూడా దొరకదు. అదీ ప్రకృతి విచిత్రం !

భక్తులు మాత్రం ఇది దేవుడి మహాత్మ్యం అనే నమ్ముతారు.

* * *

మనకి సూర్యుడు కాలమూర్తి. మన వాళ్ళకి కాలం మన్వంతరాలు, కల్పాలు, యుగాలు, సంవత్సరాలు, మాసాలు, పక్షాలు, రేయింబగళ్ళుగా వ్యక్తమవుతోంది. అమావాస్య, పౌర్ణమి, నక్షత్రాలు కాలాన్ని కొలిచే కొలబద్దలు. ఋతువులను బట్టీ వాతావరణానుకూలంగా మనం తినే తిండి, మనం పాటించవలసిన నియమాలూ, చేయవలసిన పనులు, ఆచరించవలసిన ధర్మాలు, ఆచారాలై పండుగల రూపంలో పలుకరిస్తున్నాయ్.

'సంక్రాంతి'ని పెద్దపండుగ అని కూడా అంటారు. సంక్రాంతి అంటే 'సంక్రమించడం' అన్నమాట. అంటే ప్రవేశించడం, చేరడం. ద్వాదశ మూర్తి అయిన సూర్యుడు పన్నెండు నెలల్లోనూ పన్నెండు రాశుల్లోనూ ఉంటాడు. సూర్యుడొక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఆ రాశి సంక్రాంతి అవుతోంది. సూర్యుడు చేస్తున్న యాత్రలో నాలుగు ప్రధాన మజిలీలు వున్నాయి. అవి మేష, కర్క (కర్కాటక), తుల, మకర సంక్రాంతులు. సూర్యుడి స్పర్శతో ప్రకృతి పులకించి విలాసంగా నర్తిస్తుంది. సూర్యుడు మకరరాశిలో విడిది చేసినప్పుడు 'మకర సంక్రమణం' మొదలవుతోంది. ఇది మార్గశీర్ష, పుష్యమాసాలలో జరుగుతుంది.

సూర్యుడి ప్రయాణంలో రెండో మజిలీ కర్క సంక్రమణం నుంచీ నాల్గో మజిలీ మకర సంక్రమణం వరకు 'దక్షిణాయనం' అంటారు ఇది. Tropic of Capricorn అన్నమాట అప్పుడు సూర్యుడు దక్షిణం వైపు మళ్ళుతాడు. మకర సంక్రణం నుంచి కర్క సంక్రమణం వరకూ వున్న ఆరు నెలలనీ 'ఉత్తరాయనం' అంటారు. ఇది Tropic of Cancer అన్నమాట. అప్పుడు సూర్యుడు ఉత్తరం వైపు తిరుగుతాడు. ఈ ఉత్తరాయణం దేవతలది. ఇందులో మరణిస్తే పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని పెద్దల నమ్మకం.

దక్షిణాయనం పితృదేవతలది. అందుకే భీష్ముడు దక్షిణాయానంలో నేలకూలినా, బాణాల పడకమీద ఉత్తరాయణం వచ్చే వరకూ ఎదురు చూసి అప్పుడే ప్రాణాలు వదులుతాడు. పుణ్యలోకాలు పొందుతాడు. దక్షిణాయనంలో వానలూ, ఎప్పుడూ పొడవైన చీకటి రాత్రులూ, బురదలూ ఎక్కువగా ఉండి అనేక వ్యాధులకు మనుషులు గురి అవుతారు.

ఉత్తరాయనంలో చేనులు వికసించి మురిపిస్తే, పంటలతో గాదెలూ, గరిసెలూ నిండిన ధాన్యాలతో, నులి వెచ్చని సూరీడుతో శోభించే కాలం. ధాన్యలక్ష్మీ, ఆరోగ్యలక్ష్మీ, ఐశ్వర్యలక్ష్మీ శోభించే కాలం.

చేతికందిన పంటలని భోగంగా, భాగ్యంగా అనుభవించే పండుగ ఇది. కడుపు నిండా తిని నలుగురితో ఆనందించే యోగం కలుగజేస్తుంది భోగి. విల్లిపుత్తూరు (తమిళనాడు)లో విష్ణుచిత్తుడనే విష్ణుభక్తుడి కూతురు ఆండాళ్ (గోదాదేవి) 'ధనుర్మాస వ్రతం' చేస్తుంది. దీన్ని తమిళులు 'మార్గళి' మాసం అంటారు.

ఆండాళ్ వ్రతం చేసిన నెలరోజులలోని తన అనుభూతులని తన కవితలో రోజూ ఒక్కొక్క 'పాశురం' (అది మన సీసపద్యం లాంటిది) చొప్పున 30 పాశురాలలో 30 రోజుల్లో వివరిస్తుంది. ఆ పాశురాలని శ్రీ రంగనాథుడికి అంకితం ఇస్తుంది. ఆ కవిత్వమే 'తిరుప్పావై'.

తిరుప్పావై రాశాక స్వామి ఆమెను అందరి సమక్షంలోనూ పెళ్లి చేసుకుంటాడు. తర్వాత గోదాదేవి శ్రీరంగనాథుడిలో ఐక్యమవుతుంది. గోదాదేవితో శ్రీరంగనాథుడికి పెళ్ళి చేసి సమస్త భోగాలు పండే రోజు భోగిపండుగ. నిఘంటువు 'భోగి' శబ్దానికి 'తొలి పండుగ' అని అర్థం చెబుతోంది.

భోగి పండుగ నాడు ఇంద్రపూజ చేసేవారట. కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలు మీద ఎత్తి, ఇంద్రుడు కురిపించే ప్రచండమైన వర్షాన్ని అడ్డుకుంటాడు. ఇంద్రుడి పొగరణిచి, ఇంద్రుడి వేడికోలు మన్నించి, మళ్ళీ భోగి నాడు ఇంద్రపూజ జరిగేటట్లు అనుమతిస్తాడు కృష్ణుడు. భోగినాడే వామనుడు బలిచక్రవర్తిని పాతాళానికణిచేశాడు. ఇప్పటికీ కేరళలో బలిని కీర్తిస్తూ ఈ రోజున పండుగ జరుపుకుంటారు. తెలుగునాట ఇళ్ళకి సున్నంతో వెల్ల వేసి, పేర్చి వుంచిన పాత వస్తువులతో భోగిమంట వేస్తారు.

ధనుర్మాసం రాకని 'నెలపట్టడం' అంటారు. పాత వస్తువులు మంటల్లో వేయడం వల్ల దుమ్ము, చెత్తా దూరమై ఇల్లు శుభ్రంగా కళకళలాడుతుంటుంది. పైగా హాని కలిగించే క్రిమికీటకాలు మంటల్లో మాడిపోతాయి. చలి వణుకుని మంట వెచ్చదనం తరిమేస్తోంది. కళకళలాడుతూ, కిలకిల నవ్వులతో ఆడపిల్లలు ఇళ్ళముందు కళ్ళాపి (కలయంపి) జల్లి, అందమైన ముగ్గులు వేసి వాటిలో ఆవుపేడ ముద్దలుంచి, వాటిపైన బంతి, చామంతి, బీర, పొట్ల, గుమ్మడి పూలని పెడతారు. వీటిని 'గొబ్బెమ్మలు, గొబ్బి, గొబ్బిమళ్ళు' అనే పేర్లతో పిలుస్తారు. లేత వయసులోని సొగసు కత్తెలు నూనెతో తలారా స్నానంచేసి, కొత్తబట్టలు కట్టుకుని, చేతులు తడుతూ, గొబ్బెమ్మలు చుట్టూ గిరగిర తిరుగుతూ పాటలు పాడతారు.

'గొబ్బి గొబ్బెమ్మా! సుబ్బిణ్ణీయ్యవే!
తామర పువ్వంటి తమ్ముణ్ణీయ్యవే!



సంక్రాంతి క్రాంతి



సంక్రాంతి వచ్చేనా ఇంటింట క్రాంతి తెచ్చేనా
పసిపిల్లలు దండ కూరిన చిట్టి పేడపిడకలు
భోగి మంటల్లో వేసి చలి కాచుకున్నారా
ముంగిట గొబ్బెమ్మలకు బంతిపూలు
పొంగలి పాయసాలు పూజా నైవేద్యాలు దక్కేనా
పనసాకు కుడుము ఆరగింపు జరిగే
పిల్లా పాప కొత్త బట్టలతో కేరింతలు కొట్టేరా
పిండివంట పొయ్యి మీంచి పెనం దిగేనా
గుమ్మం కాడ గంగిరెద్దు తలలూచే
వాకిట డుబుడక్కలు మోగేనా
దివి పెద్దలకు విస్తళ్ళ నిండ పుష్ప అన్నాలు అందేనా
గంగిగోవులకు తీపి సుగాళ్ళ పిండి వంట
పూల దండలు దండాలు
ముత్తయిదువులు కన్నెల సింగారం
కల్లాపులు రంగవల్లులకు ఆమోదమంగీకారమా
చినుకు లేకపోతే ఎండి మాడిన చేను
చినుకు పడితే వరద ముంపుకి
నవ ధాన్యాల కంకెలకు ఊపిరాడకుండేనా
ఎంతగానో ఎదురు చూచిన పండుగ పూట
అకాలం మండుతూ పిడకలు కట్టెలు నడుమ
అశాశ్వత ప్రాణికోటి చూస్తుండగ
పేద రైతుకి అల్ప విశ్రాంతి శాశ్వతమయ్యేనా
నింగినేల భగ్న సాక్షిగ అమంగళం శమించు గాక.

– శింగిసెట్టి సంజీవరావు

చామంతి పువ్వుంటి చెల్లెల్నియ్యావే!
మొగలి పువ్వంటి మొగుణ్ణియ్యావే!'
మరో గొబ్బెమ్మ పాటవుంది. గొబ్బితట్టుతూ –
'అటవీ స్థలముల తిరుగుదమా
వట పత్రమ్ములు కోయుదమా
మంచీ గంధము తీయుదమా
సుందరి మెడకూ పూయుదమా'

చిన్న పిల్లలకి రేగి పళ్ళూ, చెరుకు ముక్కలూ, పైసలూ, గుమ్మడి, బంతిపూలని తలమీద పోస్తారు. ఈ విధంగా భోగిపళ్ళు పోస్తే పిల్లలు ఆయుష్మంతులవుతారని మన పెద్దల నమ్మకం.



మకర సంక్రాంతిని శ్రీనాథుడు 'పెనుబంధువు' అన్నాడు. మకరరాశికి అధిపతి శని. శని వాతాన్ని కలగజేస్తాడట! అందుకని వాతాన్ని తగ్గించే తెలగపిండితో ఒళ్ళు రుద్దుకొని నువ్వులూ, బెల్లం, కూష్మాండం (గుమ్మడికాయ) దానం చేస్తారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ఈ సంక్రాంతిని 'తిల సంక్రాంతి' అంటారు. ఈ రోజు నువ్వులూ, నెయ్యి, గొంగళ్ళూ దానం చెయ్యాలని చెప్తారు. ఆరోగ్య రీత్యా ఇవి మూడు ఉష్ణాన్ని కలిగించేవి కదా! అదీ ఇందులోని సైన్సు!

బళ్ళు లాగడంలోనూ, మడక దున్నడంలోనూ ముఖ్య పాత్ర పశువులది. అందుకని పశువుల పండుగనాడు ఎద్దులకీ, ఆవులకీ, దూడల కొమ్ములకీ పసుపు, కుంకుమా అలంకరించి, పూలదండలు, కుత్తుక పట్టెడలూ, లేగదూడల కాళ్ళకి చిరు గంటలని అలంకరిస్తారు. కొన్నిచోట్ల కుప్పనూర్పిళ్ళలో రైతులు వరి వెన్ను తీసుకొని వాటిని గుత్తులుగా చేసి పిచ్చుకలకీ, మిగతా పక్షులకీ తినటానికి అనువుగా ఇళ్ళముంగిళ్ళలో కడతారు. ఈ వడ్లకు కుచ్చులు కట్టడం ఓ విధంగా పక్షులను పూజించటమే!

తొలకరిలో మొలకెత్తిన జొన్న, అరికా, సజ్జ, చామ, కొఱ్ఱ, నూవు, పెసర, కంది, సెనగ మొదలైన మెట్ట పంటలూ, రాగి, వరి, కూరగాయల వంటి మాగాణి పంటలూ, కార్తీక, మార్గశిర మాసాలకి కోతకొస్తాయి. ఎటు చూసినా పంట పొలాలు లక్ష్మీ కళతో కళకళలాడుతూ వుంటాయి. బంతి, చామంతి తోటల్లో విరగబడి నవ్వుతాయి.

కాలానుధర్మంగా సంక్రాంతికి ముందే ఈనిన పశువులు బాగా పాడినిస్తాయి. పాడి, పంటలతో నిండుగా, మురిపించే సంక్రాంతిలక్ష్మిని చూసే కృష్ణుడు 'మాసానాం మార్గశీర్షోహమ్' అన్నాడు.

ఆడవాళ్ళకి ముగ్గులూ, బొమ్మల కొలువులూ, భోగి పళ్ళ పేరంటాలూ ఉంటే, మగవాళ్ళకు బోలెడన్ని సరదాలున్నాయి. అవి కోడి పందాలూ, పొట్టేళ్ళ పందాలు, ఎడ్లబండ పరుగు పందాలు, మరెన్నో ప్రాంతీయ పందాలూ ఉన్నాయి కదా !

సంక్రాంతి రోజున అనేక జానపద కళారూపాలు వెలుగులు చిమ్ముతాయి. సాతాని జియ్యరు 'హరిలో రంగహరి' అని తంబూరాతో, నామాలతో, నెత్తిన కట్టిన చెంబుతోనూ, గంగిరెద్దుల వాళ్ళు 'ప్రభువు గారికి దండం పెట్టూ, పాదంవంటీ భక్తిని పెట్టు' అంటూ ముస్తాబు చేసిన గంగిరెద్దులతోనూ, 'అంబ పలుకు, జగదంబ పల్కు' అంటూ దమరుక్కు వాయిస్తూ అనేక దుస్తులూ, తలపాగా ధరించిన బుడబుక్కలవాళ్ళూ, ఇంటింటికీ వచ్చి రామాయణం గానం చేసే తప్పెట గుళ్ళవాళ్ళూ, 'శుభం శుభం శుభం శుభం' అంటూ శంఖం పూరించే జంగర దేవరలూ సంక్రాంతి శోభలో భాగం. కాని ఈనాడు తగ్గిపోతున్నారు. ముఖ్యంగా పట్టణాలలో, ఈ కళాఖండాల గురించి, అవి కనుమరుగవటం గురించే విశ్వనాథ సత్యనారాయణ గారు తమ 'వేయి పడగలు'లో చక్కగా రాశారు. ఈ జానపద కళలన్నీ పుస్తకాలకే పరిమితం అయిపోవటం ఎంతైనా విచారించదగ్గ విషయం.

సంక్రాంతి పురుషుణ్ణి పల్లెటూళ్ళలో 'సంకురమయ్య' లని పిలుస్తారు ఆ సంకురమయ్య వినోదాలకి అద్దెక్కడ ? హద్దెక్కడ?

కొత్త అల్లుళ్ళ రాకలతో, బావమరదళ్ళ అల్లర్లతో, భోగి పళ్ళు పోసుకునే పిల్లల కేరింతలతో, సంక్రాంతిలక్ష్మి 'ఘల్లు ఘల్లున గజ్జెలందియలూ మ్రోగంగ కలిహంస నడకల కలికి వచ్చేస్తోంది.'

నిరుపమలీల బాలికలు నిత్యల భక్తిని ముక్తి సంపదా
తిరినెల జేడ గొబ్బిలలు దీర్తురు వాకిలులందు ముగ్గులన్
బొరిపొరి బొమ్మలన్ని లిపి పూజలు సేతురు బొమ్మలిండ్లలో
బిరుపడి రగించెదరు పచ్చడి బిల్లిము పుల్లి పువ్వులన్

('తెలుగు నాడు' దాసు శ్రీరాములు)

సంక్రాంతిలక్ష్మి నవ్వుల జల్లులు తెలుగుదనాన్ని కురిపిస్తూ తెలుగు ఆచారాలని వర్షిస్తున్నాయి. ఈ సంప్రదాయాన్ని మనం క్రమం తప్పక కొనసాగిద్దాం.

– డా॥ కె. అరుణా వ్యాస్

వికలాంగుల్లో వివాహానికి రూ. 1 లక్ష



వికలాంగుల పెన్షన్ రూ.వెయ్యికి పెంపు : సి.ఎం.

"ఇక వికలాంగులు ఎవరి మీదో ఆధారపడి జీవించనవసరం లేదు. నూరు శాతం వైకల్యం కల వారికి ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ రూ.500 ను రూ.వెయ్యికి పెంచి, చెల్లించాలని నిర్ణయించాం. ఈ పెంచిన మొత్తాన్ని వచ్చే (2014) సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తాం. 20 నుంచి 40 శాతం వైకల్యం కలవారికి నెలకు రూ.200 చొప్పున పెన్షన్ ఇస్తాం. అలాగే అంత్యోదయ అన్న యోజన కార్డులను అర్హులైన వికలాంగులకు అందజేయనున్నాం" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో డిసెంబర్ 3న జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రస్తావించిన అంశాలు శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాటల్లో...."పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివే వికలాంగ విద్యార్థులకు 3 జి మొబైల్ ఫోన్లు అందజేస్తాం. స్వయం ఉపాధి కల్పనకు వికలాంగులకు రూ.4.5 వేల కోట్లతో కొత్త పథకం ప్రవేశపెడతాం. దీనితో పాటు డిగ్రీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై పి.జి. కోర్సులు చదివే వికలాంగ విద్యార్థులకు మోటార్ బైక్‌లు లేదా స్కూటర్లు పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనికి సంబంధించి ప్రతీ ఏటా ఎంత మంది వికలాంగ విద్యార్థులు పి.జి. కోర్సుల్లో చేరతారో, వారికిచ్చే వాహనాలకు ఎంత ఖర్చు అవుతుందో పూర్తి వివరాలు ఇవ్వాలి" అని అధికారులను ఆదేశించారు.

"రాష్ట్రంలో 13 నుంచి 14 లక్షల మంది వికలాంగుల కోసం ప్రత్యేక సబ్‌ప్లాన్ ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. వడ్డీలేని రుణాల కింద రూ.600 కోట్లు స్వయం సహాయక సంఘాల ద్వారా వికలాంగులకు అందజేయనున్నాం. ఇదేకాక వికలాంగులకు భద్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, వసతి, ఆస్తుల సంరక్షణ, రవాణా సదుపాయం, అనుకూల వాతావరణం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది" అని ముఖ్యమంత్రి తెలిపారు.


"వికలాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న వికలాంగుల ఆత్మాభిమానం దెబ్బతినకుండా, వారు ఎలాంటి ఆందోళనలకూ గురవకుండా ప్రశాంతంగా జీవించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలి. వికలాంగ యువతకు ఆత్మ విశ్వాసం కలిగించినప్పుడే విద్య, ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాల్లో రాణించ గలుగుతారు" అని సి.ఎం. సూచించారు.

"వికలాంగులు వికలాంగులనే వివాహం చేసుకుంటే ఇక నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం అందచేస్తాం, వికలాంగులు ఇతరులను వివాహం చేసుకుంటే రూ.50 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి ఇస్తున్నాం. వికలాంగులు గృహనిర్మాణం చేసుకుంటే వారికి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రీతిగా రూ. లక్ష జాతీయ బ్యాంకుల నుంచి రుణం రూపేణా ఇప్పిస్తాం. నేను హైదరాబాద్, సౌత్ జోన్ క్రికెట్ జట్లకు కెప్టెన్‌గా ఉన్న రోజుల్లో నాకు ఎందరో వికలాంగులు స్నేహితులుగా ఉండేవారు" అని సి.ఎం. గుర్తు చేసుకున్నారు.

సభకు అధ్యక్షత వహించిన స్త్రీ శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "బస్సుల్లో వికలాంగులకు రాయితీ ఇస్తున్న విధంగానే మెట్రో రైలులో కూడా ప్రత్యేక పాసుల సౌకర్యం కల్పించాలి" అని విజ్ఞప్తి చేశారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నీలం సహాని, కమిషనర్ శ్రీ చిరంజీవి చౌదరి తదితర్లు సభలో పాల్గొన్నారు.

- రాజఫణి వి.



ప్రవాసాంధ్రులకై రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్

విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారి వివరాల నమోదు ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది! ఇందుకు సంబంధించిన ప్రత్యేకమైన వెబ్‌పోర్టల్ (www.apnri.ap.gov.in) ను రాష్ట్ర సచివాలయంలో ప్రవాస తెలుగు విభాగం శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు నవంబర్ 23న లాంఛనంగా ప్రారంభించారు.




ఇక నుంచి విదేశాలకు వెళ్ళాలనుకునే వారు విధిగా తమ తమ పూర్తి వివరాలను ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాక ధ్రువీకరణ పత్రాలపై అధికారిక ముద్రకోసం కూడా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించింది.

ఇంతవరకు ఓ అధికారిక వెబ్ పోర్టల్ అనేది లేనందున విదేశాల్లో ఉంటున్న మన తెలుగు వారి వివరాలేవీ అందుబాటులో లేవు. పైగా అక్కడ వారు ఏదైనా ఇబ్బందుల్లో ఉన్నా, దాడులకు, ప్రమాదాలకు గురైనా, మరణించినా, వీసావంటి ఇతర సమస్యలు ఎదురైనా వారి ఆచూకీ గుర్తించడం కష్టంగా ఉండేది. ఇబ్బందుల్లో ఉన్న వారిని రక్షించేందుకు మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా విషయాలు తెలుస్తుండేవి. అప్పుడు కొత్తగా వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించడంతో ఆ ఇబ్బందులు తీరనున్నాయి.

ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా పోర్టల్‌లో ప్రవాస ఆంధ్రుల వివరాలు నమోదు చేసే కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి, కడప, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల్లో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత దీన్ని ఇతర జిల్లాలలోనూ విస్తరించనున్నారు.

"విదేశాలకు వెళ్లాలనుకునే వారు ముందుగా ఏ దేశం వెళ్తున్నారు? ఏ ఉద్యోగం చేయబోతున్నారు? ఎక్కడ ఉంటారు అన్న పూర్తి వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి నట్లయితే వారికి ఇబ్బందులు ఎదురైనప్పుడు మనరాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయం అందించడం తేలిగ్గా ఉంటుంది. విద్యార్జన కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ పోర్టల్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేయాలి" అని మంత్రి శ్రీ శ్రీధర్‌బాబు సూచించారు.

"ఈ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ ఇమ్మిగ్రేషన్ అథెంటికేషన్, అటెస్టేడ్‌ను కూడా చేపట్టనున్నారు. అలాంటి కేంద్రాలు ప్రస్తుతం చెన్నై, కోల్‌కత్తాల్లో ఉన్నాయి. ☆





ముందు 'లైలా'...! ఆ తర్వాత 'ఫైలిన్', మధ్యలో 'హెలెన్'.... వెనువెంటనే 'లెహర్'!

ఇలా ఒకదాని వెనుక మరొకటిగా తుఫానులు మన రాష్ట్రంపై 'దాడులు' జరిపాయి. అక్టోబర్, నవంబర్ మాసాలలో బంగాళాఖాతంలో తుఫాన్లు సంభవించి పంట నష్టం, ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగడం మనకు కొత్తేమీ కాదు.

అయితే, ప్రకృతి వైపరీత్యాలను నిలవరించగలిగే యంత్రాంగం మొదట్లో మనకు లేదు.

ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జరగడానికి అవకాశం ఉందని అనుకుంటున్న నష్టాన్ని ముందుగానే పసిగట్టి, ఆ నష్టాన్ని తగ్గించు కోవడం మీద మన ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఆ పనిని మరింత వేగంగా, నిపుణతతో నిర్వహించడం పై శ్రద్ధ పెంచింది.

'హెలెన్' తుఫాను కోస్తాతీరాన్ని తాకి, గత నవంబరు 22 మధ్యాహ్నం ఒకటిన్నర గంటల ప్రాంతంలో మచిలీపట్నం వద్ద తీరాన్ని దాటింది.

ఆ మర్నాడు పత్రికలలో వచ్చిన చిత్రాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. తుఫాను తీరం దాటే సమయంలో వీచిన పెను గాలులకు రహదారులపై కుప్పకూలిన చెట్లను అప్పటికప్పుడే అధునిత పరికరాలతో కోసి, తొలగిస్తున్న యూనిఫారంలో ఉన్న సిబ్బంది చిత్రాలు (ది హిందూ) పాఠకులకు ఆసక్తిని కల్గించాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 'ఫైలిన్' తుఫాను నష్టం అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం పంపిన బృందం రాష్ట్రంలో పర్యటిస్తున్న సమయానికి కొత్తగా 'హెలెన్' తుఫాను హెచ్చరికలు మొదలయ్యాయి. అంతలోనే 'లెహర్' తుఫాను వస్తూ ఉంది. అయితే సరిగ్గా అదే సమయానికి, అంటే నవంబర్ 22న భారత పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి జయంతి నటరాజన్ పోలెండ్‌లోని వార్సా నగరంలో ఉన్నారు. భూతాపాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన ఉమ్మడి చర్యలపై ఆమె అక్కడ - 'ఐక్యరాజ్య సమితి పర్యావరణ సదస్సు' కు హాజరయ్యారు. ఈ సదస్సులో భారత్‌తో సహా 190 దేశాల పర్యావరణ శాఖ మంత్రులు పాల్గొని సుదీర్ఘ చర్చలు జరిపారు.

ఇందులో "మా పౌరుల క్షేమం కోరి పర్యావరణ పరిరక్షణకు మేము కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా నడుం బిగించాలి" అని భారత్ గట్టిగా కోరింది.

'భూతాప నియంత్రణ -పర్యావరణ పరిరక్షణ' దిశలో ప్రపంచ దేశాలు తీసుకోవలసిన చొరవ మీద దృష్టి పెట్టడం ఒక అంశమైతే, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన వెంటనే తీసుకోవలసిన సహాయ పునరావాస కార్యక్రమాలు, ముందస్తు నష్ట నివారణ చర్యలు, అందుకు అవసరమైన సిబ్బంది, సాధనసంపత్తి సమకూర్చుకోవడం మరొక ప్రధానమైన అంశం అవుతుంది.

అయితే ఇందుకు దారితీసిన పరిస్థితులు, నేపథ్యంలో జరిగిన గత 9 ఏళ్ళ కసరత్తు ఎంతో ఉంది. 2004 మే నెలలో యూపిఎ ప్రభుత్వం కేంద్రంలో అధికారాన్ని చేపట్టాక, అదే ఏడాది డిసెంబర్ 26న బంగాళాఖాతంలో థాయ్‌లాండ్ సమీపంలో సంభవించిన 'సునామీ' మన దేశ దక్షిణ తీరాన్ని తాకి, వెలకట్ట లేనంత ప్రాణ నష్టాన్ని - ఆస్తి నష్టాన్ని మిగిల్చింది.



ఇది జరిగిన ఐదు రోజుల తర్వాత డిసెంబర్ 31న ప్రధాని డా. మన్మోహన్ సింగ్ సునామీ ఉత్పాతానికి గురైన - తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సందర్శించి తిరిగి న్యూఢిల్లీ వెళ్ళే ముందు విజయవాడ విమానాశ్రయంలో ఆగారు. అప్పటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రధానికి రాష్ట్రంలో సునామీ నష్టాన్ని వివరించారు.

ఈ సందర్భంగా ప్రధాని పాత్రికేయులతో మాట్లాడుతూ 'I assure adequate and effective relief measures' అవసరమైనంత మేర సహాయ చర్యలు పటిష్టమైన రీతిలో అందించడం జరుగుతుందని హామీ ఇస్తున్నాను' అన్నారు.

అయితే ఆ మాటల భావం ఏమిటో మనకు స్పష్టం కావడానికి మరొక మూడు వారాల సమయం పట్టింది. 'సునామీ' ఉత్పాతం సంభవించి అప్పటికి ఐదు రోజులే అయింది. విదేశీ సహాయాన్ని మనం నిరాకరిస్తున్నామనే సంగతి అప్పటికి ఇంకా మనకూ తెలియదు. కానీ ఆ తర్వాత ఒక్కటొక్కటిగా వెల్లడి అవుతూ వచ్చిన విషయాలు 60 ఏళ్ళకు చేరువ అవుతున్న మనదేశ స్వావలంబన పటిమను ప్రపంచ దేశాలకు స్పష్టం చేశాయి.

ఉపద్రవం వచ్చిన ప్రతిసారీ ప్రపంచ దేశాల ముందు దోసిలిపట్టి నిలబడే దేశంగా - ఇన్నాళ్ళు ఇతరులు మనల్ని అలాగే చూశారు. మనం కూడా మనల్ని చూసుకున్నాం. పదాన్వయాలు - వితరణ - విదేశీ సహాయం - ఎయిడ్ వంటి పదాలను మన మనోభావాలను బాధించేవిగా గాని, అమర్యాదకరమైనవిగా గాని గతంలో మనం అనుకోవడం కూడా అంతగా ఉండేది కాదు.

కాని ఒక్కసారి విదేశీ సహాయం అక్కర్లేదు అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాక ఇతర దేశాలతోపాటు మొదట మనకు కూడా కనుబొమ్మలు ముడిపడ్డాయి.

ఆ ప్రకటన అక్కడితో ఆగలేదు. 'శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా, థాయిలాండ్‌లకు మేము సహాయ సహకారాలు అందిస్తున్నాం' అంటూనే వెనువెంటనే రంగంలోకి కూడా దిగింది మనదేశం. ఎటువంటి ప్రచార పటాటోపం లేకుండా ఈ మొత్తం వ్యవహారం పక్కా 'ఎగ్జిక్యూటివ్' శైలిలో జరిగిపోయింది.

మన దేశ నిర్ణయాన్ని విదేశీ పత్రికలు తమకు తోచినరీతిలో వ్యాఖ్యానించాయి. కాని ఆ వ్యాఖ్యలను విజ్ఞతగల కొద్దిమంది మాత్రమే సవ్య దృక్పథంతో చూడగలిగారు. అప్పట్లో ఫ్రెంచ్ 'మీడియా' వ్యాఖ్యలను ఆ దేశ రక్షణ మంత్రి మైఖేల్ ఎలియట్ మారి యా చూసింది ఆ దృష్టితోనే. "ఇండియా గురించి సరియైన అవగాహన లేనివారు చేస్తున్న వ్యాఖ్యలవి, ఆర్థికంగా, సాంకేతికంగా ఇండియా ఎంత పురోగతి సాధించిందో తెలిసి ఉంటే పాశ్చాత్య మీడియా ఇటువంటి వ్యాఖ్యానాలు చేయదు" అన్నారాయన.

సునామీ బాధితులకు తక్షణ సాయం

మన స్వదేశీ శాస్త్ర సాంకేతిక పరిశోధనాలయాలు ఈ ఉత్పాతం సృష్టించిన అసాధారణ పరిస్థితుల్ని ఎదుర్కోవడంలో పోషించిన క్రియాశీల పాత్ర గురించి మనం ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. సంఘటన సంభవించిన రోజు నుండే ఈ పరిశోధనాలయాలు

జాన్‌సన్ చోరగుడి
జాయింట్ డైరెక్టర్, సమాచార శాఖ, విజయవాడ

కార్యాచరణలోకి దూకాయి. సునామీ బాధితులకు తక్షణమే కావలసింది ఆహారం, నీరు ఆశ్రయం, వైద్య సహకారం, మానసిక తోడ్పాటు. ఇందుకోసం మనదేశం నలుమూలలా ఉన్న సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబరేటరీలు, డిఫెన్స్ లాబ్స్ తమ తమ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.

మైసూర్‌లోని ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ), డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రెండూ కూడా సకాలంలో తమ సేవలు అందించాయి. ఈ రెండు సంస్థలకు చెందిన 982 మంది ఒక బృందంగా ఏర్పడి - వెంటనే తినడానికి (రెడీ టూ ఈట్), వెంటనే వండుకోవడానికి వీలైన పౌష్టికాహారాన్ని తయారు చేసి దానిని మైసూర్ నుండి తమిళనాడు తీర ప్రాంతానికి చేర్చింది. అంతేకాకుండా దానిని సక్రమంగా వినియోగించడానికి అవసరమైన సర్వీసుల్ని కూడా అందించింది. మారుమూల ప్రాంతాల్లో ఉంటూ, దెబ్బతిన్న ప్రాంతాల వారికి అక్కడికి అక్కడే అందించే విధంగా 55 టన్నుల ఆహారం, 14 టన్నుల త్రాగునీరు అందించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి దృష్టిలో ఉంచుకుని పోషక విలువల సమతుల్యతతో వ్యత్యాసాలకు తావులేని విధంగా మొత్తం ఒక లక్ష 85 వేల భోజనాలను వీరు అందించారు.

ఉపద్రవం వచ్చిన ప్రతిసారీ ప్రపంచ దేశాల ముందు దోసిలిపట్టి నిలబడే దేశంగా - ఇన్నాళ్ళు ఇతరులు మనల్ని చూశారు. మనం కూడా మనల్ని అలాగే చూసుకున్నాం. కాని, ఇప్పుడు 'విదేశీ సహాయం అఖ్ఖర్లేదు' అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచింది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ.) వారు తమ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది బృందాలను పంపింది. వీరిలోని ఇద్దరు సైంటిస్టులు ఒక బ్రీఫ్‌కేసులో ఉంచి వెంట తీసుకువెళ్ళే విధంగా ఉండే ఎస్-బాండ్ శాట్‌కామ్ టెర్మినల్స్‌ను తమతో తీసుకుని వెళ్ళారు. దీనితో ఎక్కుణ్ణించి అయినా కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌లోకి రావడానికి వీలుకలుగుతుంది. ఈ సంస్థ నుంచే 24 మంది బృందం గ్యాస్ కట్టర్లు, ఇతర సామగ్రితో శిథిలాల క్రింద చిక్కినవారిని రక్షించేందుకు వెళ్ళారు. ఈ సంస్థ నుండే వెళ్ళిన సైకాలజిస్టులు, సునామీ తర్వాత ఆ షాక్‌కు గురైన బాధితులకు కౌన్సెలింగ్ సర్వీసులను అందించారు. ఇది కాకుండా డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి 3.5 టన్నుల ఆహారం, ఒక ట్రక్కు నిండుగా ఆర్ఓ ఉపకరణాలు తీసుకుని వెళ్ళారు. వీటితో ఎక్కడ కావలిస్తే అక్కడ త్రాగునీటిని అందించారు.

నీరు..... నీరు..... ఎటుచూసినా నీరే కాని గొంతు తడుపుకోవడానికి చుక్క మంచి నీరు లేని పరిస్థితి. దీన్ని అధిగమించడానికి భావనగర్ సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ముందుకొచ్చి ఆ పరిస్థితిని అవలీలగా అధిగమించింది. సముద్రపు ఉప్పునీటిని త్రాగునీరుగా మార్చడంలో అప్పటికే తమకున్న విస్తృతమైన అనుభవాన్ని వారు మరొక్కసారి నిరూపించారు. ఎవరైనా తేలికగా ఉపయోగించగల్గిన ఆర్.ఓ. ఉపకరణాలను ఈ సంస్థ అందించింది. ఈ సంస్థకు చెందిన 20 మంది బృందం తమిళనాడు, అండమాన్స్‌లో కూడా తమ ప్లాంట్‌లను ప్రారంభించింది. కడలూరు వద్ద అయ్యాంపెట్టైలో గంటకు 400 లీటర్ల మంచినీటిని అందించగల్గిన ఒక యూనిట్‌ను, 2500 లీటర్ల కెపాసిటీ గల యూనిట్‌ను అక్కరాయపెట్టైలో, కార్‌నికోబార్‌లో 800 లీటర్ల కెపాసిటీతో, క్యాంప్‌బెల్ బేలో 1800 లీటర్ల కెపాసిటీగల యూనిట్‌లు ఈ సంస్థ నెలకొల్పింది.

బాధితులకు గృహాలు

బాధితులకు ఆవాసాలు కల్పించడం మరొక బృహత్తర కార్యక్రమం. చెన్నైలోని స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ ఈ బాధ్యతల్ని భుజాన వేసుకుంది. ఈ ప్రాంతంలో తిరిగి చేపట్టాల్సిన నిర్మాణాలు సునామీల తాకిడికి నిలిచేవిగా డిజైన్ చేసే పనిని శరవేగంతో వీరు చేపట్టారు. కల్పకం న్యూక్లియర్ సెంటర్ వద్ద ఇంకా కోస్తా తీరంలోని పాండిచేరి, కడలూరు, నాగపట్నం, వేళాంకణ్ణి ప్రాంతాల్లో నిర్మించాల్సిన గృహాల డిజైన్లు ఆయా ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని వీరు రూపొందించారు. ఈ గృహ నిర్మాణం దీర్ఘకాలంపాటు జరిగే కార్యక్రమం. గతంలో భుజ్ (గుజరాత్) భూకంప ప్రాంతంలో పనిచేసిన అనుభవంతో, రూర్కీ సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ కూడా ఈ నిర్మాణపు పనుల్లో భాగస్వామి అయింది.

బాధితుల్ని గుర్తించడం ఇటువంటి ఘోరకలి సంభవించినపుడు ఒక తీవ్ర సంక్లిష్టమైన వ్యవహారం, దాన్ని ఏంతమాత్రం విస్మరించడానికి వీలులేదు. ఇందుకోసం క్షతగాత్రుల్ని గుర్తించడానికి ఒక ప్రత్యేకమైన కేంద్రాన్ని నెలకొల్పవలసి వచ్చింది.

హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ డిఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ డయాగ్నస్టిక్స్‌కు ఈ రంగంలో అపారమైన అనుభవం ఉంది. దాంతో ఈ సంస్థ ఆ బాధ్యతలు తీసుకుంది. ఈ సంస్థ చేసే నిర్ధారణలకు సాధికారికత ఉంది. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పైన దాడి జరిగిన సందర్భంలో కూడా ఈ తరహా టెక్నాలజీ ద్వారానే క్షతగాత్రుల్ని గుర్తించడం జరిగింది.



సునామీ తర్వాత అండమాన్ దీవుల భౌగోళిక స్థితిగతుల్లో ఏమైనా మార్పులు సంభవించాయా? అనేది ఈ దీవుల భవిష్యత్తు కార్యకలాపాలు అన్నింటికీ కూడా అవసరమైన అత్యంత విలువైన సమాచారం. దీనిని సేకరించి నిర్ధారించే బాధ్యతల్ని - ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, గోవాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లు చేపట్టాయి. ఎన్‌జిఆర్ఐ వెంటనే ఒక బృందాన్ని అండమాన్‌కు పంపింది. ఈ బృందం జియోగ్రాఫిక్ పొజిషనింగ్ మెజర్‌మెంట్స్ తెలుసుకోవడానికి పోర్ట్‌బ్లెయిర్, కార్ నికోబార్‌లలో ఎనిమిది బ్రాడ్ బ్యాండ్ సెస్మిక్ గ్రావిటీ స్టేషన్లు నెలకొల్పింది. ఇవి ముందుగా వాతావరణాన్ని తెలుసుకోవడానికే కాక, అక్కడ దిగే విమానాలకు ల్యాండింగ్ ప్రొటోకాల్స్ అందించడానికి కూడా ఉపకరించాయి.

*****

ఇదంతా ఒక మహా విపత్తును ఎదుర్కోవడానికి మన స్వదేశీ పరిజ్ఞానంతో మనం చేసిన కసరత్తు. అయితే ఇటువంటివి సంభవించిన ప్రతిసారీ వీటిని సమర్థంగా ఎదుర్కోవడానికి ఒక శాశ్వతమైన ఏర్పాటు దిశలో కేంద్రం దృష్టి పెట్టింది. 2005 లో 'Disaster Management Act-2005' పేరుతో ఒక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ద్వారా 2009 లో ఉనికిలోకి వచ్చిందే National Disaster Management Authority. ఇది కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్న అంశం.

దీని కార్యాచరణ కోసం క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నదే National Disaster Response Force (NDRF). ప్రారంభమైన కొద్ది కాలంలోనే ఇది బహుముఖ రంగాల్లో నైపుణ్యాన్ని సంతరించుకుంది.

మనకు ఇవి అప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒరిస్సా, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్‌లలో ఉండగా క్రొత్తగా పదవది ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు కేంద్రంగా పనిచేయడం మొదలయింది.

ఈ ఏడాది వరుసగా వస్తున్న తుఫాన్ల తాకిడికి ఈ ఎన్.డి.ఆర్.ఎఫ్. గుంటూరు శాఖ మొత్తం కోస్తాంధ్ర జిల్లాలు అన్నింటికీ సకాలంలో సేవలు అందిస్తూ ఉంది.

☆

మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌ల ప్రక్రియకు శ్రీకారం!

మన దేశంలోని ఏ ఇతర రాష్ట్రాల్లోనూ లేని విధంగా తొలిసారిగా అన్ని మండలాఫీసులతో రాష్ట్ర సచివాలయం నుంచి నేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లు జరిపే అనుసంధాన ప్రక్రియకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంతవరకూ జిల్లా కేంద్రాలకే పరిమితమై ఉన్న ఈ వీడియో కాన్ఫరెన్స్‌ల ప్రక్రియ ఇక నుంచి మండల స్థాయికి విస్తరించి, పరిపాలన మరింత సరళతరమైంది. దీనితో ఇ-పరిపాలనలో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరో మైలు రాయిని దాటినట్లయ్యింది!



మండల స్థాయిలో పనితీరును సమీక్షించేందుకు ఉద్దేశించిన 'మండల కేంద్రాలకు వీడియో కాన్ఫరెన్స్' సౌకర్యాన్ని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో డిసెంబర్ 9న లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా తన సొంత మండలమైన చిత్తూరు జిల్లా కలికిరి తహశీల్దారుతో, వరంగల్ జిల్లా జనగామ ఆర్.డి.వో.తో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అభివృద్ధి పనులపై సి.ఎం. మాట్లాడారు. ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు? అన్న ప్రశ్నలతో సి.ఎం. ఆరా తీశారు.

సమున్నత స్థాయి ప్రమాణాలతో హైడెఫినిషన్ (హెచ్‌డి) క్వాలిటీ వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 జిల్లా కలెక్టరేట్లు, ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు కార్యాలయాలు, డి.జి.పి. ఆఫీసు, 1,126 మండల కార్యాలయాలతో అనుసంధానించడమైంది. ఎ.పి. స్వాన్‌నెట్ వర్క్ గా పిలిచే ఈ అనుసంధాన ప్రక్రియలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పారదర్శకంగా దళారుల ప్రమేయం లేకుండా వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల సమాచారాన్నే కాక.... ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రాష్ట్రస్థాయి నుంచి నేరుగా మండల స్థాయి అధికారులకు, సిబ్బందికి ఏక కాలంలో వేగంగా ఆ దేశాలు జారీ చేసే వీలు కలుగుతుంది.


దీన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "వివిధ ప్రభుత్వ పథకాల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు ఈ కొత్త సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విధానంలో ఒకేసారి వంద వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించవచ్చు. తుపాన్లు, వరదలు ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రాష్ట్ర రాజధాని నుంచే ఆయా జిల్లాలు లేదా మండల స్థాయి సిబ్బందికి నేరుగా వేగంగా ఆదేశాలు, సలహాలు, సూచనలు అందజేసే వీలు కలుగుతుంది" అని వివరించారు.

"వచ్చే ఏడాది మార్చి నాటికి 'మీ - సేవ' పరిధిలోకి అదనంగా మారో 165 సేవలు అందుబాటులోకి వస్తాయి. నిజానికి రాష్ట్రంలో 2011లో ప్రారంభమైన 'మీ-సేవ' కార్యక్రమాలు దఫదఫాలుగా అన్ని జిల్లాలకూ విస్తరించడమైంది. ప్రస్తుతం 'మీ - సేవ' ద్వారా 225 సేవలు అందజేస్తున్నాం. 'మీ - సేవ' విధానంలో మూడు కోట్లకు పైగా లావాదేవీలు పూర్తి చేసిన ఐ.టి. శాఖ కృషి అభినందనీయం" అని సి.ఎం. పేర్కొన్నారు.

వేదికపై 'మీ - సేవ' లావాదేవీలపై రూపొందించిన ఓ పోర్టల్‌ను సి.ఎం. ఆవిష్కరించారు.

ఐ.టి. శాఖ మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య, ఆ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

- రాజఫణి.వి



ఏ చదువులు చదవాలి ?

భారతదేశం అనాదిగా విద్యకి ప్రాధాన్యాన్నిచ్చిన దేశం.

చిత్రం - ఇలాంటి దేశంలో విద్యావంతుల శాతం తగ్గడం!

అక్షరాస్యతను పెంచడానికి ఉద్యమాలు చేయవలసి రావడం !!

మన ప్రాచీన ధార్మిక గ్రంథాల్లో విద్యా ప్రాధాన్యాన్ని పలు రకాలుగా పేర్కొన్నారు. వృత్తి విద్యలు, కళా విద్యలు, శాస్త్ర విద్యలు - అని మూడు రకాలుగా విద్యలు ఉండేవి. నేటి ప్రాధాన్యం, ప్రావీణ్యం వాటివే.

పరాయిదాడుల పాలనలో అనేక విద్యలు అంతరించాయి. కొన్ని ఆదరణ తగ్గాయి. క్రమంగా 'విశ్వ గురుపీఠం'గా భాసించిన ఆర్షభూమి విద్యా ప్రాధాన్యం లేని దేశంగా దిగజారుతూ వచ్చింది.

మన సమస్యలు - మహా పరిష్కారాలు



సామవేదం షణ్ముఖ శర్మ

ఈ పరిస్థితుల్లో ప్రాచీన విద్యావైభవాన్ని, యుగాల నాడే అద్భుతజ్ఞానాన్ని అందించిన ఋషుల మేధస్సును శోధించి సాధించి, వెలికి తీసి ప్రకటించి - 'ఇదీ ఈ దేశ వైభవం' అని చాటి చెప్పిన యోగి స్వామి వివేకానంద.

అనాటి విద్యా దీప్తినీ, విజ్ఞాన స్ఫూర్తినీ తిరిగి సంపాదించి ఈ దేశం ప్రపంచానికి గురువై ఎలా భాసిల్లాలో భావించి, ప్రణాళికని ఏర్పరచారు ఆ మనీషి.

దానిని నేటి యువత గ్రహించి గొప్ప వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోవాలని ప్రబోధించారు.

విద్యకు, విచక్షణకు, ధర్మానికీ, తత్త్వజ్ఞానానికీ యుగాల నాడే ఈ దేశం ఒక మహాపీఠంగా ప్రకాశించింది.

చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగున్
చదువగ వలయును జనులకు
చదివించెదనార్యులొద్ద చదువుము తండ్రీ !

(భాగవతం - పోతన)

ఇందులో 'చదువగ వలయును జనులకు' అనే మాట ఒక నినాదంలా ప్రచారం చేయవచ్చు.

గురువుల వద్ద అన్ని రకాల విద్యనీ తెలివిగా అధ్యయనం చేశాడు ప్రహ్లాదుడు. అన్నీ పరిశీలించిన మీదట తేల్చి చెప్పిన పద్యం.

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు, నే
చదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ !

సర్వశాస్త్రములు చదివానని చెప్పాడు ప్రహ్లాదుడు. వాటితో పాటు చదువులసారాన్ని గ్రహించానని తేట పరచాడు.

ఈ సందర్భంలో మన చదువుల గురించి పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ప్రాచీన సంస్కృత వాఙ్మయంలోనే అపారమైన వేదవాఙ్మయం, దానికి తోడుగా శిక్ష, వ్యాకరణ, ఛంద, నిరుక్త, జ్యోతిషాలనే షడంగాలు-వాటికితోడు న్యాయ శాస్త్ర, ధర్మశాస్త్ర, మీమాంసాశాస్త్రాలు, యోగ విద్యలు! ఇవి ఎంత ప్రాచీనమైనవో అంత శాశ్వతమైనవి. నేటికీ ప్రపంచ మానవాళికి ఆయురారోగ్యాలకు, నైతిక సువ్యవస్థనీ అందించగలిగే జ్ఞాన నిధులుగా ప్రపంచమంతా నేడు గుర్తిస్తోంది.

ఆయుర్వేదం, అర్థశాస్త్రం, వేదాంత శాస్త్రం, గణితం, నాదవిద్య... ఇలాంటి నిత్యోపయోగకర విద్యలను ఏనాడో అభివృద్ధి చేసుకున్న అద్భుత నాగరిక దేశం మనది.

అన్వీక్షకీ, దండనీతి, త్రయీ, వార్త - అనే నాలుగు భాగాలుగా విస్తరించిన రాజనీతి శాస్త్రం ఒక క్షేమంకర సువ్యవస్థతో కూడిన అభ్యుదయ సమాజాన్ని దర్శించింది.

అయితే మనకి స్వాతంత్ర్యం వచ్చిన తరువాతనైనా వీటిని శాస్త్రాలుగా అధ్యయనం చేయలేదు. ఈ దేశ ప్రాచీన విజ్ఞానాన్నంతటినీ కేవలం 'మత' దృష్టితో చూస్తూ వెనక్కి నెట్టివేశాం.

అస్త్ర శస్త్ర విద్యను వివరించిన ధనుర్వేదం, భరద్వాజ వైమానిక శాస్త్రం, భోజుని 'సమరాంగణ సూత్రధార', వరాహమిహిరుని వంటి వారి భూగోళ విజ్ఞానం, ఆర్యభట్టు విజ్ఞానధార, అనేక బౌద్ధ గ్రంథాలలోని మెలకువలు..... ఇవన్నీ విజ్ఞానాంశాలుగా అంగీకరించడంగానీ, అవగాహన చేసి వాటి నిగ్గు తేల్చి ప్రపంచానికి పనికి వచ్చే అంశాలను ఆవిష్కరించడం గానీ చేయడం లేదు.

భౌతిక విజ్ఞానంతో పాటు, వ్యక్తిత్వాన్ని వికసింపజేసి నైతికతతో దృఢమైన చరిత్రను నిర్మించే విజ్ఞానాన్ని విద్యా బోధనగా అందించాలనీ, దానికి మన ఆర్ష గ్రంథాలే మూలాలనీ నాడు చెప్పిన వివేకానంద మాటలను మనం స్వీకరించలేదు.

ఇప్పుడు అవినీతి, నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలోనైనా, అనాటి విలువల్ని బోధించి ఒక చక్కని ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పరచవచ్చనే బోధనని తెచ్చుకోలేకపోతున్నాం.

ప్రహ్లాదుడు అన్ని విద్యల కంటే అధ్యాత్మ విద్యయే శ్రేష్ఠమని బోధించాడు. ఇది ఏదో నమ్మకాల విషయం కాదు. దీనిలో ఏదో సత్యముంది.

ధార్మిక ఆధ్యాత్మిక ప్రవృత్తి మానవుని బలహీనతల్ని పోగొడుతుంది. మనస్సునీ, ఆలోచనల్నీ నియంత్రిస్తుంది. సహనాన్నీ, సర్దుబాటు ధోరణినీ, మనోనిబ్బరాన్నీ, శాంతినీ ప్రసాదిస్తుంది.

తాత్కాలిక సుఖాల కోసం బలహీనతలకు, అవినీతులకీ లోను కాకుండా శాసిస్తుంది.

అందుకే ఆధ్యాత్మిక జ్ఞానం లేని చదువులన్నిటినీ "తానన్నియు రూపించిన మిథ్యలని నిరూఢ మనీషన్" ప్రహ్లాదుడు నిరసించాడని భాగవతోక్తి.

ఆ ఆధ్యాత్మిక ధార్మిక సంస్కారాలను కలిగించే విద్యయే ప్రధానమనీ, స్వార్థపరుడిని నిర్మూలించడానికి తగిన సంస్కారం దాని నుండే కలిగించవచ్చనీ మన ఋషులు అనేక ఉదాహరణలతో వివరించారు.

మనవైన శాస్త్రాలను సముద్ధరిస్తూ, ఈ ధార్మిక జ్ఞానాన్ని కలబోసి, ఆధునిక విజ్ఞానాన్ని సమన్వయిస్తే గొప్ప మానవ సమాజాన్ని సాక్షాత్కరించుకోగలం.

☆

ఒకసారి ఓ హరికథా భాగవతార్ విశ్వనాథ వారి వద్దకు వచ్చి నమస్కరిస్తూ -

"అయ్యా ! మీ ఊరిలో హరికథ చెప్తానండీ" అన్నాడు.

"మీ ఊరిలో చెప్పరా?" అని అడిగారు విశ్వనాథ.

"లేదండి" ఆయన సమాధానం.

"ఏం ? ఎందుకని చెప్పలేదు?" మరల ప్రశ్నించారు విశ్వనాథ.

"మా వాళ్ళు చెప్పించుకోరండి" అన్నాడా భాగవతార్.

"నిజమా ! మరి మా ఊరివాళ్ళు చెప్పిచ్చుకుంటారే" అన్నారు విశ్వనాథ నవ్వుతూ !

- ఎ. రాంబాబు

స్థిరాస్తి రిజిస్ట్రేషన్లపై తగ్గిన స్టాంపు డ్యూటీ

కొన్ని రకాల స్థిరాస్తుల లావాదేవీల విషయంలో స్టాంపు డ్యూటీ మొత్తాన్ని తగ్గించి వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అందుకు రెవెన్యూ శాఖ ద్వారా నవంబర్ 30 వ తేదీన ఉత్తర్వు (జీ.వో. ఎం.ఎస్. నం.585) విడుదల చేస్తూ భారతీయ స్టాంపు చట్టం-1899 లోని షెడ్యూలు 1-ఎ కింద స్టాంపు డ్యూటీ రుసుమును తగ్గించినట్లు స్పష్టం చేసింది.

వారసత్వపు ఆస్తి గలవారు తమ కుటుంబంలోని వారికి ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిన సందర్భంలో ఇలాంటి సెటిల్‌మెంట్‌కు ప్రస్తుత మార్కెట్ విలువలో 3 శాతం విధిస్తున్న స్టాంపు డ్యూటీని ఒక శాతానికి తగ్గించినట్లు జీవోలో తెలిపింది. అదే ఆస్తిని తన కుటుంబేతర వ్యక్తులకు సెటిల్‌మెంట్ చేసే సందర్భంలో మార్కెట్ విలువలో 6 శాతం విధిస్తున్న స్టాంపు డ్యూటీని 3 శాతానికి తగ్గించినట్లు జీవోలో వివరించింది.

ఎవరైనా తన ఆస్తిని దగ్గర బంధువులకు లేదా / రక్త సంబంధీకులకు బహుమతిగా రిజిస్ట్రేషన్ చేసేప్పుడు ఆ ఆస్తి తాలూకు మార్కెట్ విలువలో ప్రస్తుతం వసూలు చేస్తున్న 5 శాతం స్టాంపు డ్యూటీని ఒక శాతానికి తగ్గించినట్లు జీవోలో తెలిపింది. ఇతరులకు బహుమతిగా తన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేప్పుడు ప్రస్తుతం వసూలు చేస్తున్న 5 శాతం స్టాంపు డ్యూటీని 4 శాతానికి తగ్గించినట్లు జీవోలో సూచించింది.

ఒక కుటుంబ సభ్యుల మధ్య భాగస్వామ్య ఒప్పందాల రిజిస్ట్రేషన్లకు, ఆస్తి బదలాయింపు లేదా తనఖా వంటి ఇతరత్రా రిజిస్ట్రేషన్లకు కూడా స్టాంపుడ్యూటీని తగ్గించినట్లు పట్టిక రూపంలో జీవోలో విపులీకరించింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

REVENUE (REGISTRATION-I) DEPARTMENT

G.O.Ms.No. 585 **Dated: 30th November 2013**

ORDER:

1. **In the reference** 1st read above, orders were issued reducing the stamp duty payable on sale deeds from 5% to 4% in all the areas of A.P. State under Article 47-A of Schedule I-A of the Indian Stamp Act, 1899 with effect from 01.04.2013.

2. Consequent on reduction of stamp duty payable on sale deeds, Government, after careful examination rationalize the rates of stamp duty by bringing down the duty payable in respect of certain documents under Schedule I-A of the Indian Stamp Act, 1899.

3. Accordingly, the following notification will be published in the extraordinary issue of A.P. Gazette dated: 02.12.2013.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

234 మోడల్ స్కూళ్ల స్థాపనకు ఉత్తర్వు జారీ

రాష్ట్ర వ్యాప్తంగా రెండవ విడతగా మరో 234 మోడల్ పాఠశాలల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇందుకుగాను రాష్ట్ర విద్యాశాఖ నుంచి డిసెంబర్ 2వ తేదీన ఉత్తర్వులు (జీవో. ఎం.ఎస్.నం.70) జారీ చేస్తూ బ్లాకు స్థాయిలో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు పాలనా పరమైన అనుమతి ఇచ్చినట్లు పేర్కొంది.

ఈ మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు రూ. 904 కోట్ల 23 లక్షలు ఖర్చవుతాయనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చును భరిస్తాయనీ జీవోలో తెలిపింది.

అదే విధంగా ఈ స్కూళ్ల నిర్వహణకు ఎపి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సూచించిన మేరకు 4680 టీచర్ల పోస్టులను నేరుగా భర్తీ చేసే విధంగా మంజూరు చేసినట్లు జీవోలో తెలిపింది. 3236 నాన్ టీచింగ్ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయాలని జీవోలో సూచించింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

EDUCATION (SE-PROG.I) DEPARTMENT

G.O.Ms.No.70 **Dated: 2nd December 2013**

ORDER:

In the reference 1st read above, Government have accorded administrative approval for setting up 355 Model Schools in the Educationally Backward Blocks as Bench-mark of Excellence and prescribed the guidelines for establishment of Model Schools duly following the norms of GoI.

2. In the reference 2nd read above, under phase-II of the Scheme, the Government of India have sanctioned total 234 Model Schools for the State of Andhra Pradesh with the total project cost of Rs.904.23 crores (Rupees Nine Hundred and Four Crores and Twenty Three lakhs only). As per the norms of the scheme, sharing pattern of expenditure is 50:50 between the Government of India and the State Government.

3. The Commissioner & Director of School Education, A.P., Hyderabad vide reference 3rd read above has requested the State Government to accord administrative approval for setting up of 234 Model Schools under Phase-II scheme. The Commissioner & Director of School Education, A.P., Hyderabad has also requested to

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

GOVERNMENT OF ANDHRA PRADESH

MUNICIPAL ADMINISTRATION & URBAN DEPARTMENT (UBS) DEPT.

G.O.Ms.No. 481 **Dated: 2nd December 2013**

ORDER:

A Street Vendor/Hawker is a person who offers goods for sale to the public at large without having a permanent structure /place for his activities. Some of the Street Vendors /Hawkers are stationery in the sense that they occupy in the space on payment on other public /private places while others are mobile in the sense that they move from place to place carrying their wares on push carts are in baskets on their pets.

2. Taking into consideration the above facts and to make the Street Vendors /Hawkers for their honest living in the society, the Government of India revised the National Policy on Urban Street Vendors in 2009. This National Policy aims at ensuring that Urban Street Vendors are given due recognization at National, State and Local Levels to pursue economic activity without harassment and at the same time locations on which activities to be pursued are earmarked in zoning places. The revised policy

వీధివ్యాపారుల రక్షణకు మార్గదర్శకాలు జారీ

వీధి వ్యాపారులు గౌరవంగా జీవనోపాధి చేసుకునేందుకు, ఎవరి నుంచీ ఎలాంటి వేధింపులు ఎదురవకుండా రక్షణ, భద్రత కల్పించేందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గ దర్శకాలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా డిసెంబర్ 2వ తేదీన ఉత్తర్వులు (జీవో.ఎంఎస్.నం. 481) వెలువరిస్తూ పట్టణ వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకించి మార్గదర్శకాలను రూపొందించినట్లు స్పష్టం చేసింది.

నగర లేదా పట్టణస్థాయిల్లో వీధి వ్యాపారుల కమిటీలను ఈ ఉత్తర్వులు వెలువడిన తేదీ నుంచి రెండు నెలల్లోగా నియమించాలనీ, పెద్ద మున్సిపాలిటీలున్న నగరాలు, పట్టణాల్లో ఒకటికన్నా ఎక్కువ కమిటీలను నియమించాలని జీవోలో సూచించింది.

వీధి వ్యాపారాల కమిటీలో వేర్వేరు సంస్థలకు చెందిన వీధి వ్యాపారులు వారిలో 30 శాతం మహిళా వీధి వ్యాపారులు ప్రతినిధులుగా ఉండాలని జీవోలో స్పష్టం చేసింది. ఈ వీధి వ్యాపారుల కమిటీల పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను నాలుగు నెలల్లో ముగించాలని జీవోలో మున్సిపల్ అధికారులను ఆదేశించింది.

శాశ్వతంగా ఒక చోట కూర్చుని సరుకులు విక్రయించని వారు, నిత్యం సంచరిస్తూ సరుకు విక్రయించేవారు, తోపుడు బండ్లు, బుట్టలలో సరుకులు పెట్టుకుని వీధుల్లో తిరుగుతూ అమ్ముకుని జీవనం గడిపే వారికి మాత్రమే ఈ మార్గ దర్శకాలు రక్షణ భద్రత కల్పిస్తాయని జీవోలో క్షుణ్ణంగా వివరించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

GOVERNMENT OF ANDHRA PRADESH

INFRASTRUCTURE & INVESTMENT (AIRPORTS) DEPARTMENT

G.O.Rt.No.269 **Dated: 2nd December 2013**

ORDER:

In the reference 1st read above the Honorary Secretary and CEO, A. P. Aviation Academy (APAA) has informed that on 17.12.2012 there was a fire accident in A. P. Aviation Academy Hangar and all their six aircrafts and Hangar were gutted in the fire accident. An emergency Managing Committee Meeting under the Chairmanship the Chief Secretary to Government and President of A. P. Aviation Academy was held on 28.12.2012 and it was resolved vide Resolution No.1952 that Govt. of A. P. will be requested to sanction grant in aid of Rs.5.00 crores to revive the A. P. Aviation Academy flying activities so that trainee pilots will not suffer. He has indicated the break-up for Rs.5.00 crores as mentioned below:

- To purchase one new Diamond DA40 aircraft runs on ATF / two Cessna-172R aircrafts. : Rs.2.4 crores

ఏవియేషన్ అకాడమీకి రూ. 5 కోట్లు మంజూరు

రాష్ట్ర వైమానిక విద్యా సంస్థ (ఎ.పి.ఏవియేషన్ అకాడమి) సామర్థ్యాన్ని మెరుగు పరచేందుకు రూ.5 కోట్లు మంజూరయ్యేలా పాలనాపరమైన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ద్వారా డిసెంబర్ 2 వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఆర్.టి. నం. 269) జారీ చేస్తూ విమానాల తయారీకి అవసరమయ్యే పరికరాల కొనుగోళ్ళకు ఆ మొత్తాన్ని వెచ్చించాలని సూచించింది.

కొత్త డైమండ్ డి.ఎ.40 ఎయిర్ క్రాఫ్ట్ కొనుగోలుకు రూ.2 కోట్ల 40 లక్షలు, పరికరాల కోసం రూ. కోటీ 40 లక్షలు, ఎ.ఎం.ఇ. కాలేజీ కోసం లార్‌జెట్ ఎయిర్ క్రాఫ్టు కొనేందుకు రూ. కోటీ.20 లక్షల కేటాయించినట్లు జీవోలో వివరించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

రాయితీలిచ్చే విధానంలో సవరణలు

రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రాయితీలు, ఇతర ప్రోత్సాహకాల చెల్లింపుల విధానాన్ని సరళతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ నుంచి డిసెంబర్ 4 వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం.162) జారీ చేస్తూ పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాల విధానం (ఐఐపిపి) 2010-15 లో అందుకు సంబంధించి సవరణలు చేసినట్లు పేర్కొంది.

కొత్తగా సవరించిన విధానం ప్రకారం వివిధ కంపెనీలు, సంస్థలకు చెల్లించే ప్రోత్సాహకాలను ఇక నుంచి రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్.టి.ఎస్) కింద మంజూరు చేస్తారని జీవోలో వివరించింది. ఎస్.బి.హెచ్. ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిగే ఈ విధానం అమలుకు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఒక కమిటీని నియమించినట్లు జీవోలో తెలిపింది. కమిటీ సభ్యులుగా ఎ.పి.స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఫ్యాప్సీ అధ్యక్షుడు, ఎ.పి.ఎస్.ఎఫ్.సి. జనరల్ మేనేజర్, ఎస్.ఎల్.బి.సి. కన్వీనర్, ఐ.ఐ.పి.సి. జాయింట్ డైరెక్టర్‌ను నియమించినట్లు జీవోలో పేర్కొంది.

ఈ కమిటీలో సిఫారసు చేసిన కంపెనీలకు, సంస్థలకు మాత్రమే రాయితీ చెల్లింపులు జరుగుతాయనీ, బ్యాంకులే యూనిట్ దారులకు నాన్ - ఆపరేటివ్ సేవింగ్ ఖాతాలు తెరవాలనీ జీవోలో సూచించింది. పరిశ్రమల శాఖ కమిషన్ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జోవోలో ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

GOVERNMENT OF ANDHRA PRADESH

INDUSTRIES & COMMERCE (IP) DEPARTMENT

G.O.Ms.No. 162 **Dated: 4th December 2013**

ORDER:

In the G.O 1st read above, Government have issued orders on the operational guidelines for implementing the Industrial Investment Promotion Policy (IIPP) 2010-15.

2. In the reference 2nd read above, the Commissioner of Industries, Hyderabad has stated that Government vide Memo No.351/81/DCM.II/2012, Finance (DCM-I) Department, dt:04-07-2012 have issued instructions on drawal of funds from deposit accounts – PD Account, wherein the PD Administrators are advised to furnish the information to State Bank of Hyderabad for transfer of amounts through ECS / NEFT/ RTGS in the

---

వివిధ ప్రభుత్వ శాఖల్లో మరో 7,173 పోస్టుల భర్తీ

వివిధ ప్రభుత్వ శాఖల్లో మరో 7,173 పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ద్వారా డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 323) జారీ చేస్తూ రాష్ట్ర సచివాలయం నుంచి మరిన్ని పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు వచ్చిన దృష్ట్యా అదనంగా పోస్టులను మంజూరు చేసినట్లు స్పష్టం చేసింది.

నియామక సంస్థలైన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఎ.పి.పి.ఎస్.సి.), డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ (డి.ఎస్.సి.) ద్వారా కేటగిరీల వారీగా వివిధ శాఖల్లో అర్హులైన అభ్యర్థులను నేరుగా నియమించనున్నట్లు జీవోలో పేర్కొంది.

ఈ పోస్టుల్లో 172 పోస్టులు ఎ.పి.పి.ఎస్.సి. ద్వారా నేరుగా భర్తీ అవుతాయి. డి.ఎస్.సి. ద్వారా 7,001 పోస్టులు భర్తీ కానున్నాయని జీవోలో క్షుణ్ణంగా పట్టికల రూపంలో వివరించింది.

మొత్తం పోస్టుల్లో 5,962 ఉద్యోగాలు కేవలం రెవెన్యూ శాఖలోనే ఉండగా, వాటిలో గ్రామ రెవెన్యూ సహాయకుల పోస్టులు 4,305, గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులు 1,657 ఉన్నాయి. ఈ ఉద్యోగాల భర్తీకి వివిధ శాఖల ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో ఆదేశించారు.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

GOVERNMENT OF ANDHRA PRADESH

FINANCE (SMPC-I) DEPARTMENT

G.O.Ms.No.323 **Dated: 4th December 2013**

ORDER:

1. In the G.O. first read above the General Administration (Services-A) Department issued orders adopting an annual calendar for recruitments and prescribed a schedule for estimation and notification of vacancies for recruitment. It was ordered that all departments should follow this schedule. In the G.Os. second to fourth read above orders were issued according permission to fill certain vacancies in different categories including the categories that are classified as Group-I, Group-II and Group-IV Services, other gazetted, non-gazetted and technical categories in various departments through direct recruitment by the relevant recruiting agencies. Several secretariat departments have sent further proposals for filling vacancies in various categories meant for direct recruitment in the departments and institutions

హిందూ ధర్మంతో కూడిన పాశ్చాత్య సమాజాన్ని నిర్మిద్దాం, ఎందుకంటే...

ఒకటిన్నర శతాబ్దం క్రితమే సర్వమతాలు కొలువుదీరిన ప్రపంచ వేదిక మీద హైందవ మత ఔన్నత్యానికి హారతులు పట్టించి ప్రపంచ పౌరుడిగా పాశ్చాత్యులచే ప్రశంసలనందుకున్న యువకుడు - వివేకానందుడు.

ఉత్తుంగ తరంగంలాంటి యువశక్తికి ప్రతీక ఆయన. జనవరి 12 న ఆయన జన్మదినం. ఆరోజును జాతీయ యువ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం 1984లో ప్రకటించింది. నాలుగేళ్ళపాటు జరుగుతున్న 150వ జన్మదినోత్సవ వేడుకలకు ప్రధాని మన్మోహన్ సింగ్ 2011జనవరి 12 న తెరదీశారు.

వివేకానందుడిది ఏ కులం ? ఏ మతం ? ఏ ఊరివాడు ? ..... ఇలాంటి ప్రశ్నలను మనం ఎన్ని అడిగితే అంతగా మన సంకుచితత్వాన్ని బయటపెట్టుకున్న వాళ్ళమవుతాం. ఆయన ప్రాక్పశ్చిమ సంస్కృతులకు వారధి. ఈ వేళ ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న గ్లోబల్ విలేజ్, గ్లోబల్ సిటిజన్ అనే మాటలను 110 ఏళ్ళ క్రితమే ఆచరణలో నిరూపించిన ప్రపంచ పౌరుడాయన.

ఏ రోజున 'మ్లేచ్ఛులు' అనే శబ్దాన్ని సృష్టించి మనవారు ఇతరులతో రాకపోకలు వదులుకున్నారో ఆనాడే హిందూ దేశానికి దౌర్భాగ్యం దాపురించింది. ప్రపంచంలోని ఇతర జాతులతో సంబంధాలు లేక, ఒంటరిగా ఉండటమే తరతరాల మన క్షీణదశకు కారణం.

పరమత హింసకు కాదా వెనుకాడని కొందరు హిందూ మత దురభిమానులు, కొన్ని మత ఛాందస సంస్థలు ఆయనకు హిందూమతం ముద్ర వేసి, వారి ప్రచార కార్యక్రమాల్లో వాడు కోవడం ఆయననే కాదు, సనాతన ధర్మాన్ని, హైందవ సంస్కృతి స్థాయిని కూడా దిగజార్చటమే.

జన్మదినం సందర్భంగా–జగమెరిగిన ఓ యుగపురుషుడి జీవితవిశేషాలను ఏకరువు పెట్టడం కంటే ఆయన అంతరంగాన్ని మననం చేసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో విజ్ఞతవుతుంది. యువతరాన్ని, యువశక్తినీ చివరివరకూ ఆయన శ్వాసించిన తీరు ఇప్పటివరకూ లేదనిపిస్తుంది, ఆయనలా వారిని శ్లాఘించిన వారూ ఇప్పటివరకూ లేరనిపిస్తుంది,

"ఈశ్వరా ! ఈశ్వరా !!!" అని అరిచేవారు కాదు, ఈశ్వరాజ్ఞను పాలించే వారే ఉత్తమ భక్తులని చెప్పిన ఆయన మనసు లోతుల్లోకి ఓసారి తొంగిచూద్దాం.

"ఆత్మకు జాతి భేదంలేదు. లింగ భేదం లేదు. ఏవిధమైన కళంకంలేదు. అటువంటప్పుడు మత తత్వాలకు సంఘ సంస్కారాలతో ఏం పని! సమాజానికి నియమాలను విధించి వ్యక్తుల నడుమ భేదాలను పాటించాలని చెప్పడం మత తత్వానికి తగదు. తమకేం హక్కుందని కోట్లాది జనుల జీవితాలతో ఆటలాడుతూ ప్రతి సాంఘిక విషయంలో పురోహితులు, మతాచార్యులు కలగ చేసుకుంటున్నారు ??? ".......

అంత నిష్కర్షగా హిందూ మతాన్ని అల్ట్రాస్కానింగ్ చేసి, కుండబద్దలు కొట్టినట్టు తన అభిప్రాయాన్ని చెప్పిన హైందవ మతనాయకులు అంతకుముందు లేరనిపిస్తుంది. పలు స్వమత శాఖలు, పర మతాల దాడితో..అంటే చెంప దెబ్బ, గోడ దెబ్బలతో విపరీతంగా గాయపడి, చావు బతుకుల మధ్య పడిఉన్న సనాతన ధర్మానికి కాయకల్ప చికిత్సచేసి, కొత్త ఊపిరులూదినవాడు



శంకరాచార్యుడయితే, రోగగ్రస్థంగా ఉండి సమాజంతో కనెక్ట్ కాలేకపోతున్న, ఆ పని చేయగలిగిన అధికారం ఉండీ ముఖం చాటేస్తున్న హిందూ మతాధిపతులకు సయితం జ్ఞానోదయం కలిగేలా శ్రమించిన ఘనత వివేకానందుడిది.

"ఇక పాశ్చాత్యుల గురించి నీ అభిప్రాయాలతో నేను ఏకీభవించను. నేను సన్యాసిని. నేను అమెరికాలో కాలు మోపే నాటికి నాకు ఇక్కడ పేరు ప్రతిష్ఠలు లేవు. చేతిలో చిల్లిగవ్వ లేదు. కేవలం ఫకీరును. అయినా నాకు వారు...ముఖ్యంగా శుద్ధ సనాతనులయిన క్రైస్తవులు సయితం అన్నపానీయాలిచ్చారు. ఆశ్రయమిచ్చారు. స్నేహమిచ్చారు, సంరక్షణ ఇచ్చారు. కానీ వారి మతాచార్యులలో ఎవ్వరైనా మన దేశానికి వస్తే మనవారేం చేస్తారు? వారిని తాకనయినా తాకరు. కారణం–వారు 'మ్లేచ్ఛులు'. ఏ రోజున ఈ శబ్దాన్ని సృష్టించి మనవారు ఇతరులతో రాకపోకలు వదులుకున్నారో ఆనాడే హిందూ దేశానికి దౌర్భాగ్యం దాపురించింది. ప్రపంచంలోని ఇతర జాతులతో సంబంధాలు లేక, ఒంటరిగా ఉండటమే తరతరాల మన క్షీణదశకు కారణం.

జనవరి 12- స్వామి వివేకానంద జన్మదినం
జాతీయ యువజన దినోత్సవం

సంచలనమే ప్రాణ లక్షణం. మెట్ట వేదాంతం చెప్పడం సులభమేగానీ, వెంట్రుకవాసిఅయినా వేదాంతాన్ని అనుష్ఠించి చూపడం మాత్రం మహా కష్ట సాధ్యం. ఏ మానవుడుగానీ, ఏ జాతిగానీ పరులను ద్వేషించి బతకలేదు సుమా!" అంటూ వివేకానందుడు విమర్శించి ఊర్కోలేదు, అద్భుతమైన, శాశ్వతమైన, ఆచరణయోగ్యమైన, సులభసాధ్యమైన పరిష్కారం ఎంత చక్కగా చూపాడో చూడండి........

"స్వాతంత్ర్యంలేనిదే వికాసం కలగదు. మన పూర్వులు మతవిషయాలలో స్వాతంత్ర్యం ఇచ్చారు. దాని వల్ల అద్భుతమైన మతం మనకు లభించింది. కానీ సమాజ శరీరాన్ని మాత్రం సంకెళ్లతో బంధించారు. దానితో మన సమాజం రాక్షస సమాజమయింది. అదే పాశ్చాత్య దేశాల్లో సమాజం ఎప్పుడూ స్వాతంత్ర్యం అనుభవిస్తూనే ఉంది.అందువల్లే అదెలా వికాసవంతంగా ఉందో చూడండి. కానీ మతంలో వారికి స్వేచ్ఛదొరకకపోవడంతో వారి మతాలెలా సంకుచితమయిపోయినాయో చూడండి. అందువల్ల (భారత్‌లో) మన సమాజ జీవనంలో మతాచార్యుల ప్రాభవాన్ని తగ్గించి, ధర్మావశ్యకతను చూపుతూ ఈ మార్పును క్రమంగా తీసుకురావలసి ఉంది. హిందూ ధర్మంతో కూడిన పాశ్చాత్య సంఘాన్ని నిర్మించండి. ఇది సాధ్యమే. జరిగితీరుతుందని నా నమ్మకం."

"మనదేశం అనుభవిస్తున్న సర్వ దుస్థితులకు, దురవస్థలకు కారణం మన పేదల స్థితిగతులే. పశ్చిమఖండంలోని పేదలు కేవలం రాక్షసులు. వారితో పోలిస్తే మన పేదలు దేవతలని చెప్పవచ్చును. వారికి విద్యాబుద్ధులు చెప్పించడం, వారు కోల్పోయిన వ్యక్తిత్వాన్ని తిరిగి వారు పొందేలా చేయడం..ఇవే మనం పేదలకు చేయాల్సిన సాయం. దీనికి ఉచిత పాఠశాలల వల్ల కలిగే లాభం శూన్యం. పేదల పిల్లలు బడికి వెళ్ళడం కంటే, మడికి(పొలానికి) వెళ్లడానికి ఇష్టపడతారు. వారి జీవనోపాధి వారికి ముఖ్యం. అందువల్ల విద్యాబోధనే వారి వద్దకు వెళ్ళాలి."

నాకు కావాల్సిందొక్కటే. అనాథల కన్నీటిని ఆపలేని, వారి కడుపు చల్లార్చడానికి పట్టెడన్నం పెట్టలేని ధర్మంలో, దేముడిలో నాకు నమ్మకం లేదు... నాకు మాధవునిలో, మానవునిలోకూడా నమ్మకం ఉన్నది. ఇతరులకు మేలుచేసే క్రమంలో నాకు నరకం ప్రాప్తించినా సమ్మతమే!

మానవత్వాన్ని మించిన మతంలేదు. వివేకానందుడు గొప్ప దేశ భక్తుడే కాదు, గొప్ప మానవతావాది కూడా. పేదలు, స్త్రీల విషయంలో ఈ నాటికీ అన్ని మతాలు అవలంబిస్తున్న అణచివేత విధానాలపై నిప్పులు చెరిగాడు. అందుకే సర్వమత వేదికమీద ఆయనకు అపూర్వ సత్కారం లభించింది.

ఆయన తన శిష్యులకు రాసిన ఒక లేఖలో ... "నేను త్యాగిని. నాకు కావాల్సిందొక్కటే. అనాథల కన్నీటిని ఆపలేని, వారి కడుపు చల్లార్చడానికి పట్టెడన్నం పెట్టలేని ధర్మంలో, దేముడిలో నాకు నమ్మకం లేదు. ఎంత బ్రహ్మాండమయిన వేదాంతమైనా, పుస్తకాలు, సిద్ధాంతాలు ఘోషించే ధర్మమయినా– నాకు ధర్మం కింద లెక్కగాదు. కళ్ళు ముఖాన ఉన్నాయి కానీ, వెనుక వీపున లేవు కదా ! ఇది మా మత ధర్మం– అని దేనిని మీరు గర్వంగా చెప్పుకుంటారో దానిని ఆచరణలో చూపండి. నాకు మాధవునిలో, మానవునిలోకూడా నమ్మకం ఉన్నది. ఇతరులకు మేలుచేసే క్రమంలో నాకు నరకం ప్రాప్తించినా సమ్మతమే!" అని ఉద్బోధిస్తూ, గృహస్థులు ఎందుకూ పనికిరాని(మత సంబంధమైన) కర్మ కలాపాల్లో మునిగి ఉంటారు కనుక యువకులు వందలు, వేలల్లో ముందుకురావాలని ఆయన పిలుపిచ్చాడు. తన ఆశయం నెరవేరాలంటే నిస్వార్థపరులైన యువతరం కావాలని తాపత్రయ పడ్డాడు. అప్పటి సమాజం ఆయనకు కనెక్ట్ అయినా, స్పందన ఎంత స్తబ్దుగా ఉందో ఆయన మాటల్లోనే చెప్పాలంటే....



"నేనిక్కడికి(అమెరికా) వచ్చి ఒక సంవత్సరమయింది. నాకిక్కడి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అది చూసి ఓర్వలేక అమెరికాలో మాత్రమే నేనీ కపట సన్యాసి వేషం వేశాననీ, ఒట్టి మాయలమారిననీ, నాకు ఎవ్వరూ ఆతిథ్యమివ్వకూడదనీ క్రైస్తవ మత ప్రచారకులు అమెరికా ప్రజలకు చాడీలు చెబుతున్నారు. అయితే మన హిందువులు మాత్రం తమకు నేను ప్రతినిధిగా వచ్చానని అమెరికా ప్రజలకు చెప్పడానికి వారి పెదవులు సయితం కదలడం లేదు. నన్నింతగా అభిమానిస్తున్నందుకు, ఆదరిస్తున్నందుకు అమెరికా ప్రజలను ఒక్క హిందువు కూడా అభినందించడం లేదు. భారత దేశం నుండి పేరు ప్రతిష్టలున్న ఒక్క వ్యక్తి కూడా నేను వంచకుడిని కాదని ఒక్క ప్రకటన కూడా ఇవ్వడం లేదు. అమెరికా ప్రజలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మకపోయినా వారు నాకు చేసే ధన సహాయంమీద మాత్రం దాని ప్రభావం పడుతున్నది. నా ఉద్యమ నిర్వహణకు అవసరమయిన ధనం సమకూర్చడమే నా అమెరికా యాత్ర అంతర్యం."

మొట్టమొదటిసారి హైందవ మత ఔన్నత్యాన్ని పాశ్చాత్యులకు పరిచయం చేయడమేకాక, అప్పటివరకు హిందూ మతాన్ని చిన్నచూపు చూస్తున్న వారి చేత ఆయన నీరాజనాలిప్పించాడు.

సిస్టర్ నివేదిత లాంటి ఎందరినో శిష్యులుగా చేసుకున్నాడు. అయినా మన దేశంలోని పరిస్థితులపట్ల ఆవేదనతో ఆక్రోశిస్తూ....."భారతదేశంలో నేనెలా ఉన్నానో అక్కడ కూడా అలానే ఉన్నా. కానీ తేడా ఎక్కడుందో తెలుసా! ఉత్తమ సంస్కృతి ఉన్న ఈ దేశంలో (అమెరికా) కొత్తవిషయాల పట్ల ఆసక్తి, సానుభూతి పుష్కలంగా ఉన్నాయి. మా వంటి సన్యాసులకు పిడికెడు అన్నం పెట్టడానికి మన దేశంలో మనవారు సణుక్కుంటారు కదా! మరిక్కడ ఒక చిన్న ఉపన్యాసం వినడానికి వేయి రూపాయలు ఇవ్వడానికి కూడా జంకరు. జంకకపోగా తమకుపయోగపడిన విషయాలు చెప్పినందుకు జీవితాంతం కృతజ్ఞులుగా ఉంటారు. మరి అక్కడో !!! మీరు మన హిందూ పత్రికలలో దేనిలోనయినా నా గురించి నాలుగు మాటలు రాసి కాసింత ప్రశంస చేశారనుకోండి, మరుసటిరోజు నా మీద అందరూ దండెత్తే వాళ్ళే. అది బానిసల మనస్తత్వం. తమలో, తమ సోదరులలో ఎవ్వరైనా కాస్తంత తలెత్తుకుని తిరగడం చూస్తే చాలు, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు. మీలో ఎన్ని లోటుపాట్లున్నా, ఓ నా భారతీయులారా! మీరు నాకు ప్రేమపాత్రులే."

అప్పుడు దేశంలో అన్నాహజారేలకు, కేజ్రీవాల్‌వంటివారిపట్ల యువత స్పందిస్తున్న తీరు చూస్తుంటే.... వివేకానందుడు కోరుకున్న లక్షణాలు, ఆశించిన స్పందన అప్పటి యువతీయువకుల్లోనే ఎక్కువగా ఉన్నట్టు కన్పిస్తున్నది. అయితే వారిలో జాతీయభావాలు, నైతికత, ఆధ్యాత్మికత వంటి ఇంధనాలను మండించే మరో వివేకానందుడి అవసరం ఉంది.

(పలు సందర్భాలలో, పలువురు ఆత్మీయులకు, సహచర స్వాములకు వివేకానంద స్వామి అమెరికా నుండి రాసిన లేఖల సారంలోని కొన్ని బిందువులను మాత్రమే ఇక్కడ ఉటంకించడం జరిగింది. నిజానికి ఈనాటికీ ప్రతిఒక్కరూ, ముఖ్యంగా యువతరం ఆయన అమెరికా యాత్ర విశేషాలను, అక్కడి ప్రసంగ పాఠాలను అక్కడి నుంచి ఆయన రాసిన లేఖలను చదివితీరాలి)

-ములుగు రాజేశ్వర రావు
9866312323

లీజు ఒప్పందాలపై తగ్గిన స్టాంపు డ్యూటీ

భవనాలు, స్థలాలు, ఇతరత్రా దీర్ఘకాలం లీజు ఒప్పందాలు చేసుకొనేప్పుడు రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంపు డ్యూటీని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇకనుంచి లీజు కాల పరిమితి మొత్తంపై కాకుండా వార్షిక సగటు అద్దెపై స్టాంపు డ్యూటీ చెల్లించేలా మార్పు చేస్తూ రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వు (జీ.వో. ఎం.ఎస్. నం.588) వెలువరించింది.

ఏడాదిలోపు గడువు గల లీజు ఒప్పందాల రిజిస్ట్రేషన్ల కోసం వసూలు చేస్తున్న 4 శాతం స్టాంపు డ్యూటీని యథాతథంగానే ఉంచుతున్నట్లు జీవోలో తెలిపింది. ఏడాది నుంచి అయిదేళ్లలోపు ఉన్న లీజు ఒప్పందాల రిజిస్ట్రేషన్లకు నివాస భవనాలకు ఎంత వరకు ఉన్న మొత్తం అద్దెలో 0.4 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉండగా.... ఇక నుంచి వార్షిక సగటు అద్దెలో 0.5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాలని జీవోలో సూచించింది. ఇక నివాసానికి కాకుండా ఇతర అవసరాలకు భవనాన్ని లీజుకు తీసుకుంటే అలాంటి అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్లకు వార్షిక అద్దెలో ఒక శాతం స్టాంపు డ్యూటీ కట్టాలని జీవో స్పష్టం చేసింది.

అలాగే 5 నుంచి పదేళ్ల గడువుతో నివాస భవనాల లీజు ఒప్పదాల రిజిస్ట్రేషన్లకు మొత్తం అద్దెలో 0.4 శాతం స్టాంపు డ్యూటీ కడుతుండగా దాన్ని ఇక నుంచి వార్షిక సగటు అద్దెలో ఒక శాతం మాత్రమే చెల్లించాలని జీవోలో సూచించింది. పది నుంచి ఇరవయ్యేళ్ల లీజు ఒప్పందాల రిజిస్ట్రేషన్ల విషయంలో ఇంత వరకు మొత్తం అద్దెలో 0.6 శాతం స్టాంపు డ్యూటీ వసూలు చేస్తుండగా దానిస్థానే వార్షిక సగటు అద్దెలో 6 శాతం స్టాంపు డ్యూటీ కట్టాల్సి ఉంటుందని జీవోలో తెలిపింది. ఇరవై నుంచి ముప్పయ్యేళ్ల లీజు ఒప్పందాల రిజిస్ట్రేషన్లకు ఇక నుంచి వార్షిక సగటు అద్దెలో 15 శాతం చెల్లించాల్సి ఉందని జీవోలో వివరించింది. ముప్పయ్యేళ్లకు మించిన లీజు ఒప్పందాల రిజిస్ట్రేషన్ చేసే ఆస్తి తాలూకు మార్కెట్ విలువలో ఇక నుంచి కేవలం 3 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాలనీ జీవోలో సూచించింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

REVENUE (REGISTRATION_I) DEPARTMENT

G.O.Ms.No. 588 **Dated: 4th December 2013**

O R D E R :

Government, after careful examination rationalize the rates of stamp dut by bringing down the duty payable in respect of certain documents under Schedul I-A of the Indian Stamp Act, 1899.

3. Accordingly, the following notification will be published in the extraordinar issue of A.P. Gazette dated: 05.12.2013.

NOTIFICATION

In exercise of the powers conferred by clause (a) of sub-section (1) of sectio

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

గనుల లీజులో మార్పులు చేర్పులు

బొగ్గు గనులకు మినహా ఇతర అన్ని పెద్ద పెద్ద గనులను లీజుకిచ్చే వ్యవహారంలో కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర గనుల శాఖ ద్వారా డిసెంబర్ 6న తేదీన ఉత్తర్వులు (జీవో.ఎం.ఎస్.నం. 168) విడుదల చేస్తూ గనుల వాడకానికి సమ్మతించే నిబంధనలు -1960 ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో లీజు తాలూకు సవరణలు చేసినట్లు స్పష్టం చేసింది.

పది హెక్టార్లకు తక్కువగా ఉన్న ఏ గనులనైనా ఒక సంవత్సర కాలపరిమితికి లోబడి లీజుకు ఇవ్వాలనీ, పది నుంచి యాభై హెక్టార్ల లోపు విస్తీర్ణంలో గల ఏ గనులనైనా సగభాగాన్ని ఏడాది పాటు, మిగిలిన సగభాగాన్ని మూడేళ్లపాటు లీజుకు ఇవ్వాలనీ జీవోలో వివరించింది. ఇక యాభై హెక్టార్లకు మించి విస్తీర్ణంలో ఉన్న ఏ గనులనైనా అయిదేళ్ల కాలపరిమితితో లీజుకి ఇవ్వవచ్చని జీవోలో సూచించింది. నూతన లీజు నిబంధనలు ఈ ఉత్తర్వులు వెలువడిన తేదీ నుంచి అమలులోకి వస్తాయని జీవోలో తెలిపింది..

GOVERNMENT OF ANDHRA PRADESH

INDUSTRIES & COMMERCE (MINES-I) DEPARTMENT

G.O.Ms..No.168 **Dated: 6th December 2013**

O R D E R :

The following notification will be published in the Extra ordinary Issue of the Andhra Pradesh Gazette, dated 06th December, 2013.

NOTIFICATION

In exercise of the powers conferred under rule 27(3) of Mineral concession Rules, 1960 framed under Section 13 of the Mines and Minerals (Development and Regulation) Act, 1957, the Governor of Andhra Pradesh hereby impose the following special condition in all the mining leases for major minerals (excluding coal minerals) granted, executed and in force as

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

GOVERNMENT OF ANDHRA PRADESH

REVENUE (DISASTER MANAGEMENT-I) DEPARTMENT

G.O.Ms.No. 6 **Dated: 10th December 2013**

ORDER:

In the reference 1^{st} read above, Government sanctioned a Special relief/ assistance of Rs.150/- (Rupees one hundred and fifty only) per Coconut tree for totally uprooted or broken trees limiting the total number of trees per hectare to 150 (One hundred and fifty only) to the affected farmers in Heavy floods/Cyclones,1996.

2. Due to the "PHAILIN' Cyclone in the month of October, 2013, the Coconut trees severely damaged in Srikakulam District. During the visit of

కొబ్బరి చెట్టుకు రూ.500 ఇన్‌పుట్ సబ్సిడీ

ఇటీవల సంభవించిన ఫైలిన్ తుపాను వల్ల కొబ్బరి చెట్లు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతవరకూ కొబ్బరి రైతులకిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని పెంచి చెల్లించనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ డిసెంబర్ 10 వ తేదీన జారీ అయిన ఉత్తర్వు (జీ.వో. ఎం.ఎస్. నం. 6) ద్వారా తెలిపింది.

గత అక్టోబర్‌లో వచ్చిన ఫైలిన్ తుపాను అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ఆ జిల్లాకు చెందిన కొబ్బరి రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

దాన్ని పురస్కరించుకుని సి.ఎం. ఇచ్చిన హామీ మేరకు ఇంత వరకూ రైతులకు దెబ్బతిన్న ఒక్కో కొబ్బరి చెట్టుకు ఇస్తున్న రూ. 150 ఇన్‌పుట్ సబ్సిడీని రూ.500 చొప్పున పెంచినట్లు జీవోలో వివరించింది.

కాగా, 1996 వచ్చిన తుపాన్లు, వరదల వల్ల కొబ్బరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా 150 కొబ్బరి చెట్లను ఒక హెక్టారుగా నిర్ణయించడమైందని జీవోలో వివరించింది.. ☆

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

GOVERNMENT OF ANDHRA PRADESH

FINANCE (TFR) DEPARTMENT

G.O.Ms.No. 331 **Dated: 11th December 2013**

ORDER:

In the reference first to third read above, orders were issued for implementation of Employees Health Scheme (EHS) by providing Cashless Medical Treatment to the State Government Employees, Pensioners and their dependents.

2. In continuation to the orders read above, the following orders are hereby issued regarding recovery of contribution towards EHS from the salary/pension of employees/pensioners eligible for EHS as indicated below starting from December 2013 payable in January 1^{st} 2014 onwards; the source of finances for implementation of the Employees Health Scheme and creation of Public Account.

ఆరోగ్య పథకంలో ప్రీమియం రికవరీ

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చిన ప్రభుత్వోద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి అర్హులైన వారి 2013 డిసెంబర్ నెల జీతాల నుంచి ప్రీమియం రికవరీని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ద్వారా డిసెంబర్ 11వ తేదీతో ఉత్తర్వు (జీ.వో.ఎం.ఎస్.నెం : 331) జారీ చేస్తూ 2014 సంవత్సరం జనవరిలో చెల్లించే ఉద్యోగుల పెన్షనర్ల డిసెంబర్ నెల మొత్తం నుంచి రికవరీ మొదలవుతుందని స్పష్టం చేసింది.

ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఈ పథకంలో ప్రీమియం రికవరి ఈ విధంగా జరుగుతుంది.

పేగ్రేడ్లు 1 నుంచి 4 వరకు (స్లాబ్ఏ): పేగ్రేడ్లు 5 నుంచి 7 వరకు (స్లాబ్‌బి) ఉద్యోగులకు వారి వారి నెల జీతాల నుంచి రూ. 90 చొప్పున ఈ పథకం కోసం ప్రీమియం మొత్తంగా డిపాజిట్ అవుతుంది.

పేగ్రేడు 18 నుంచి 32 వరకు (స్లాబ్-సి) ఉద్యోగులకు వారి వారి నెల వారీ జీతం నుంచి రూ. 120 చొప్పున ప్రీమియం మొత్తంగా రికవరీ అవుతుంది. అలాగే పెన్షనర్లకు కూడా వారి వారికున్న సర్వీసు ఆధారంగా గ్రేడ్ల ప్రకారం నెల వారీ ఇచ్చే చెల్లింపుల నుంచి ప్రీమియం రికవరీ చేయనున్నట్లు జీవో పేర్కొంది.

సర్వీసు పెన్షనర్లకు లేదా ఫ్యామిలీ ఫెన్షనర్లకు వారు ఎప్పుడు ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యే రోజు ఉన్న పేగ్రేడు ప్రకారం పెన్షన్ మొత్తం నుంచి ప్రీమియం కోత ఉంటుందని జీవోలో తెలిపింది. ఇక భార్య భర్తలిరువురూ ప్రభుత్వోద్యోగులైతే లేదా సర్వీసు పెన్షనర్లయితే ఎవరో ఒకరు తమ ప్రీమియం మొత్తాన్ని నెలనెలా చెల్లించాలని జీవోలో సూచించింది.

ఈ ఆరోగ్య పథకంలో ప్రభుత్వ వాటాగా స్లాబ్- ఎ, స్లాబ్-బి కేటగిరీల ఉద్యోగులకు, పెన్షనర్లకు నెలవారీ రూ. 135 చొప్పున, స్లాబ్-సి కేటగిరీ ఉద్యోగులకు, పెన్షనర్లకు నెలనెలా రూ. 180 చొప్పున ప్రీమియంలో జమ అవుతుందని జీవోలో తెలిపింది.

దీర్ఘ కాలిక సెలవుపై వెళ్లిన ఉద్యోగులకు వారీ లీవ్‌శాలరీ నుంచి ఈ స్కీమ్ కింద ప్రీమియం మొత్తాన్ని వసూలు చేయడం జరుగుతుంది. సస్పెండయిన ఉద్యోగులు ప్రతీ నెలా మొదటి వారంలో చలానా రూపేణా బ్యాంకులో తమ ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని జీవోలో వివరించింది.. ☆

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

మెట్రోపాలిస్ సదస్సుకై 3 కమిటీల ఏర్పాటు

హైదరాబాద్‌లో వచ్చే ఏడాది (2014) 11వ మెట్రో పొలిస్ వరల్డ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహణ కోసం మూడు కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా డిసెంబర్ 12వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఆర్.టి. నం. 1794) జారీ చేస్తూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో జరిగే ఈ మెగా సదస్సును నేరుగా వివిధ శాఖల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు తెలిపింది.

రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీకి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. హోమ్, ఆర్థిక, పర్యాటక, పురపాలక, పెట్టుబడులు, మహిళా శిశు

GOVERNMENT OF ANDHRA PRADESH

MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (UBS) DEPARTMENT

G.O.Rt.No. 1794 **Dated: 12th December 2013**

O R D E R :

In the reference 1st read above, Government have accorded approval to Greater Hyderabad Municipal Corporation in principle to hold 11th Metropolis World Congress at

సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు, అలాగే ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జి.హెచ్. ఎం.సి. గౌరవ మేయర్‌లు సభ్యులుగా ఉంటారు. శాశ్వత సభ్యులుగా కేంద్ర ప్రభుత్వంలోని సెక్రటరీలు ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన మంత్రులు ప్రత్యేక ఆహ్వానితులుగా, జి.హెచ్.ఎం.సి. కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని జీవోలో పేర్కొంది. ఈ కమిటీ నెలకోసారి లేదా అవసరమైన మేరకు సమావేశమవుతూ, వరల్డ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తుందని జీవోలో తెలిపింది.

రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీకి ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. వివిధ శాఖలకు చెందిన 21 మంది ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారని జీవోలో వివరించింది. ఇక నిర్వహణ కమిటీకి ఛైర్మన్‌గా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవహరిస్తారు. మరో 16 మంది వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. జి.హెచ్.ఎం.సి. కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని జీవోలో పేర్కొంది.

సదస్సు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయడంలో ఈ మూడు కమిటీలకూ కార్య నిర్వహాక కమిటీలు తోడ్పడతాయని జీవోలో తెలిపింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే జరిమానా

ఇంతవరకూ రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న ఇసుక విధానంలో కొన్ని మార్పులూ చేర్పులూ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, తాజాగా సవరించిన జీవోను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర గనుల శాఖ ద్వారా డిసెంబర్ 17 తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం.186) జారీ చేస్తూ నిరుడు నవంబర్ 15న జారీ అయిన 154 జీవోను సవరించి కొత్త నిబంధనలతో ఇసుక విధానాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

కొత్త విధానాల ప్రకారం ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారు పెద్దమొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుందనీ, పట్టా భూముల నుంచి ఇసుక తవ్వేందుకూ, తరలించేందుకూ విధిగా ప్రభుత్వ అనుమతి పొందాలనీ జీవోలో హెచ్చరించింది. ఇసుక తవ్వే ప్రాంతాలను జిల్లా స్థాయి కమిటీలు గుర్తిస్తాయనీ, ఆ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గానూ, మరో అర్గురు ప్రభుత్వాధికారులు సభ్యులుగాను, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సభ్య కన్వీనర్‌గాను వ్యవహరిస్తారనీ జీవోలో

GOVERNMENT OF ANDHRA PRADESH

HIGHER EDUCATION (TE.I) DEPARTMENT

G.O.Ms..No.186 **Dated: 17th December 2013**

O R D E R :

వివరించింది. ఇసుక లావాదేవీలన్నీ ఈ కమిటీల నేతృత్వంలో జరుగుతాయనీ, జిల్లా కలెక్టర్ పంపిన నివేదిక ఆధారంగా ఇసుక తవ్వేందుకు పర్మిట్లు జారీ చేస్తుందనీ జీవోలో పేర్కొంది.

ఇసుక ర్యాంపుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం, వేలం పాటలు నిర్వహించడం, ఇసుక ధర నిర్ణయం వంటి ఇతర అంశాలను జిల్లాస్థాయి కమిటీ నిర్ణయిస్తుందని జీవోలో వివరించింది. ఇసుక రీచుల్లో యంత్రాలను వినియోగించవచ్చునీ, అయితే భూగర్భజల మట్టాలకు ఎలాంటి ప్రమాదం జరగని రీతిలో యంత్రాలను వినియోగించాలనీ జీవోలో సూచించింది.

అనుమతి ఉన్న మేరకు ఇసుక లీజు ప్రదేశాలను మించి అనధికార ప్రదేశాల్లో ఇసుక తవ్వితే పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని జీవోలో అధికారులకు సూచించింది. అలాగే అక్రమంగా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేయకుండా జరిమానాలు విధించాలనీ, ట్రాక్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తూ తొలిసారిగా పట్టుబడితే రూ.5 వేలు, రెండో సారి పట్టుబడితే రూ.15 వేలు జరిమానా వసూలు చేయాలనీ జీవోలో పేర్కొంది. పది టన్నుల ఇసుకను దొంగ రవాణా చేసే లారీ పట్టుబడితే తొలిసారి రూ.15 వేలు, రెండోసారి పట్టుబడితే రూ. 25 వేలు జరిమానా విధించాలని జీవోలో తెలిపింది. ఇసుక దొంగ రవాణా చేసే లారీ తొలిసారి పట్టుబడితే రూ. 25 వేలు, రెండో సారైతే రూ.50 వేలు జరిమానా విధించాలని జీవోలో వివరించింది.

ఇక నుంచి చెరువులు, చిన్నతరహా ప్రాజెక్టులో ఇసుక తవ్వకాలకు కలెక్టర్ల నుంచి అనుమతి పొందాలనీ, పెద్దపెద్ద ప్రాజెక్టుల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలనీ జీవోలో సూచించింది. కాంట్రాక్టర్లు రెన్యూవల్ కోరకపోతే వారికి చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని జీవోలో అధికారులను ఆదేశించింది. ఇసుక ర్యాంపుల వేలం విధానంలో ఎలాంటి మార్పులూ లేవని జీవోలో తెలుపుతూ సవరించిన అంశాలను క్షుణ్ణంగా విపులీకరించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

భూమిపై హక్కుతో గుర్తింపు

వ్యవసాయయోగ్యమైన ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలనే లక్ష్యంతో భూపంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డిసెంబరు 6న ఏడవ విడత భూ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ జిల్లాలకు చెందిన పేదలకు భూపంపిణీ చేశారు.

పేదలకు భూమిపై హక్కు కల్పిస్తేనే జీవితంలో స్థిరత్వం, గుర్తింపు లభిస్తాయని, ఈ వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వం కేవలం భూ పంపిణీకే పరిమితం కాకుండా, పంటల సాగుకు కూడా చేయూతనిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో భాగంగా, ఎస్.సి, ఎస్.టిలకు చెందిన భూములకు సాగు నీరందించేందుకు 1800 కోట్ల రూపాయలతో 'ఇందిర జలప్రభ' పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.

తొమ్మిదేళ్ళుగా వ్యవసాయ వినియోగానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దీనికోసం 30 వేల కోట్ల రూపాయలు వ్యయం చేసినట్లు, ఈ ఏడాది మరో 4 వేల కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

'జలయజ్ఞం' ప్రాజెక్టుల ద్వారా మరో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నామని, ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు నీరందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పరంగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర లభించడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వివిధ శాఖల సమన్వయంతో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రెవెన్యూ శాఖా మంత్రి శ్రీ ఎన్. రఘువీరారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటి వరకూ రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు 77 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేశామన్నారు. 90 లక్షల మందికి ఇళ్ళపట్టాలు అందజేసినట్లు కూడా తెలిపారు. దాదాపు 18 వేల కోట్ల రూపాయల విలువైన 16 వేల ఎకరాల భూమి సులభంగా ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించి, వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

రాష్ట్రంలో 2.5 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని గుర్తించి, వాటిలో రెండు లక్షల ఎకరాల భూమిని వెనక్కి తీసుకొని పేదలకు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీ ముఖేష్ గౌడ్, ప్రసాద్ కుమార్, పలువురు శాసనసభ్యులు, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ కె. ఆర్. మీనా, భూపరిపాలన ప్రధాన కమిషనర్, శ్రీ వై.వై.ఆర్. కృష్ణారావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు శ్రీ ముఖేష్‌కుమార్ మీనా, శ్రీ శ్రీధర్ పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

రాష్ట్రంలో రెవెన్యూ సర్వీసులకు సంబంధించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేలా మరింత కృషి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల ప్రధాన భూపరిపాలనా కార్యాలయంలో 4 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన భవనాన్ని డిసెంబరు 6న ఆయన ప్రారంభించారు.

ఇక పై రాష్ట్రంలో ప్రభుత్వ భూముల స్థితిగతుల గురించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'సర్కారు భూమి' అనే వెబ్‌సైట్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీనికి సంబంధించిన బ్రోచరును కూడా ఆవిష్కరించారు.

- ఎం. రమాదేవి, రంగారెడ్డి జిల్లా






సమాజంలో ఆదపిల్ల అన్నింటా వివక్షకు గురవుతోంది. ఈ వివక్ష తల్లికడుపులో వద్దప్పటి నుంచే మొదలవుతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఆదపిల్ల అన్ని తెలుసుకుని, గర్భస్థదశ లోనే కర్కశంగా నలిపేస్తున్నారు. భ్రూణహత్యలకు పాల్పడుతూ బంగారు తల్లుల జీవితాలకు చరమగీతం పాడుతున్నారు.

ఆడపిల్లలకు కల్పతరువు 'బంగారుతల్లి'

అందువల్లనే 0 నుండి 6 ఏళ్లలోపు మగ, ఆడ శిశువుల నిష్పత్తిలో గణనీయమైన తేడా వుంటోంది. రాష్ట్రంలో ఈ నిష్పత్తి 1000 : 936 వుండగా, వైఎస్సార్ కడప జిల్లాలో ఈ తేడా మరింత ఎక్కువగా వుంది. వెయ్యి మంది మగ శిశువులకు 919 మంది మాత్రమే ఆడశిశువులు వుంటున్నారు. ఆడ పిల్లల పట్ల గర్భస్థదశ నుంచి మొదలవుతున్న ఈ వివక్ష పుట్టిన తర్వాత కూడా కొనసాగుతోంది. ఆరోగ్యం, విద్య, వివాహం... ఇలా అన్నింటా వివక్షకు గురవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరీ ఎక్కువగా వుంటోంది.

ఇలా ఆడపిల్లల పట్ల చూపిస్తున్న వివక్షను నిర్మూలించి, వారికి మంచి జీవితాన్ని అందించా లన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి 'బంగారు తల్లి' పథకానికి శ్రీకారం చుట్టారు. పథకం పటిష్ఠంగా అమలు కావాలన్న ఉద్దేశ్యంతో చట్టబద్ధతను కూడా కల్పించారు. 2013 మే ఒకటవ తేదీ నుండి జన్మించిన ఆడ పిల్లలకు ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

తెల్లరేషను కార్డు కలిగి వుంటూ, ఇద్దరు ఆడ పిల్లల వరకు అర్హులుగా నిర్ణయించి పథకాన్ని అమలు చేస్తోంది. పుట్టగానే, జనన నమోదు సమయంలో రూ.2500 లు అంద చేస్తారు. 1 నుండి 2 (రెండు) సంవత్సరాల వరకు టీకాల నిమిత్తం ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున (అంగన్‌వాడీ), 1 నుండి 5వ తరగతి వరకు ఏడాదికి రూ. 2 వేలు, 6 నుండి 8వ తరగతి వరకు ఏడాదికి రూ.2,500 లు, 9 నుండి 10 వ తరగతి వరకు ఏడాదికి రూ.3 వేలు, 11 నుండి 12 వ తరగతి వరకు ఏడాదికి రూ.3500 లు, గ్రాడ్యుయేషన్‌లో 1 నుండి 4 ఏళ్ల వరకు ఏడాదికి నాలుగు వేల రూపాయల చొప్పున అందచేస్తారు. 21 ఏళ్లు వచ్చిన తర్వాత ఇంటర్మీడియట్ పాస్ అయితే రూ.50 వేలు, గ్రాడ్యుయేషన్ పాస్ అయితే లక్ష రూపాయలు అందచేస్తారు.



వైఎస్సార్ జిల్లాలో 'బంగారు తల్లి' పథకం కింద డిసెంబర్ తొమ్మిది నాటికి 4222 మంది ఆడశిశువులు నమోదు కాగా, 3464 మంది అర్హత పొందారు. ఇందులో 2258 మంది బంగారు తల్లులకు పుట్టగానే అందచేసే రూ.2500 ల ప్రోత్సాహకాన్ని పంపిణీ చేశారు.

ఆడపిల్లల పాలిట కల్పతరువు 'బంగారు తల్లి' పథకం అని ఆడపిల్లల తల్లులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తనకు 9 ఏళ్లకు పాప పుట్టిందని, నన అని పేరు పెట్టానని, మే ఐదవ తేదీన పుట్టినందున, 'బంగారు తల్లి' పథకం కింద అర్హురాల యిందని చక్రాయపేట మండలానికి చెందిన హసీనా ఆనందంతో చెప్పింది

తన భర్త లారీ డ్రైవరని, అంతంతమాత్రం జీవనం సాగిస్తున్న తమకు 'బంగారుతల్లి' పథకం వల్ల తమ బిడ్డను చదివించడం కష్టం కాదంటోంది హసీనా. మే రెండవ తేదీన జన్మించిన తన కూతురు గురు బ్రాహ్మిణికి బంగారు తల్లితో బంగారు భవిష్యత్తు అందిస్తామని చెప్తోంది చెన్నూరు మండలానికి చెందిన జయశ్రీ. ఇలాగే పాలగిరి వెంకట సుబ్బలక్ష్మి, సంచేపల్లి మండలానికి చెందిన సునీత తదితరులు 'బంగారు తల్లి' తో తమ చిన్నారులకు అందమైన, సుఖవంతమైన జీవితం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తూ, పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెపుతున్నారు.

– కె. జయమ్మ, కడప

అవినీతిపై 'లోక్‌పాల్' అస్త్రం!

ఇది అవినీతి రహిత పాలన అందించే కృషిలో మరో ముందడుగు.

సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న లోక్‌పాల్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. అత్యున్నత స్థాయిలో అవినీతిని ఎదుర్కొనే లక్ష్యంతో రూపొందించిన ఈ బిల్లుకు డిసెంబరు 17న రాజ్యసభ ఆమోదం తెలపగా, ఆ మరునాడే డిసెంబరు 18 న లోక్ సభ ఆమోదించింది.

'లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు-2011' పేరుతో పార్లమెంటు ఆమోదం పొందిన ఈ బిల్లు పరిధిలోకి ప్రభుత్వ ఉద్యోగులు, పార్లమెంటు సభ్యులు, కేంద్రమంత్రులతో పాటు ప్రధాన మంత్రి కూడా వస్తారు. ప్రభుత్వం నుండి నిధులు పొందే సంస్థలు, ట్రస్టులు, అసోసియేషన్లు కూడా దీని పరిధిలోకి వస్తాయి.

లోక్‌పాల్ బిల్లు రూపొందిన 44 ఏళ్ళలో, 8 సార్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. బిల్లులో అనేక మార్పులు, చేర్పులు, సవరణల అనంతరం ఇప్పుడు ఉభయ సభల ఆమోదం పొందింది.



వాస్తవానికి ఆ బిల్లును 2011 లోనే లోక్ సభ ఆమోదించింది. కానీ, రాజ్యసభలో వివిధ పక్షాల సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అప్పట్లో బిల్లు నిలిచిపోయింది. దీంతో ఈ బిల్లులో చేయవలసిన మార్పులు, చేర్పులపై శ్రీ సత్యవ్రత్ చతుర్వేది నేతృత్వంలో ఏర్పాటైన సెలక్ట్ కమిటీకి బిల్లును నివేదించారు. ఈ కమిటీ చేసిన సిఫార్సులు, ప్రతిపక్ష సభ్యుల సూచనల మేరకు అవసరమైన మార్పుల అనంతరం బిల్లు పార్లమెంటు ఆమోదం పొందింది.

లోక్‌పాల్, లోకాయుక్త చట్టం అమలులోకి వచ్చిన రోజు నుంచి సంవత్సర కాలంలో ఆయా రాష్ట్రాలు తమ తమ రాష్ట్ర శాసన సభలలో చట్టం చేయడం ద్వారా, రాష్ట్ర స్థాయిలో 'లోకాయుక్త'ను ఏర్పాటు చేసుకోవాలి. కేంద్ర స్థాయిలో అవినీతిని ఎదుర్కొనేందుకు 'లోక్‌పాల్' ఎలా ఉపయోగపడుతుందో, రాష్ట్రస్థాయిలో అవినీతిని ఎదుర్కొనేందుకు 'లోకాయుక్త' దోహదం చేస్తుంది.

చైర్మన్, 8 మంది సభ్యులు

అవినీతిని ఎదుర్కొనే మహత్తర లక్ష్యంతో ఏర్పాటు అవుతున్న ఈ లోక్‌పాల్‌లో ఒక చైర్మన్, గరిష్టంగా 8 మంది సభ్యులు ఉంటారు. సభ్యుల్లో సగం మంది ఎస్.సి., ఎస్.టి., మైనార్టీలు, మహిళలు ఉంటారు. మహిళలకు ప్రాతినిధ్యం తప్పనిసరి అని ఈ బిల్లు పేర్కొంటోంది.

లోక్‌పాల్‌కు సొంత దర్యాప్తు విభాగంతో పాటు సొంతంగా ప్రాసిక్యూషన్ విభాగం కూడా ఉంటుంది. లోక్‌పాల్ నిర్వహణా వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.

లోక్‌పాల్ చైర్మన్, సభ్యులను ప్రధాని, లోక్‌సభ స్పీకరు, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి, ఒక ప్రముఖ న్యాయవేత్తతో కూడిన అయిదుగురు సభ్యుల కమిటీ ఎంపిక చేస్తుంది.

లోక్‌పాల్ సభ్యులు ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధాన్ని కలిగి ఉండకూడదు. లోక్‌పాల్ పదవీ కాల పరిమితి ఐదు సంవత్సరాలు. చైర్మన్ కానీ, సభ్యులు కానీ తమకు 75 ఏళ్ళ వయసు నిండే వరకూ పదవిలో కొనసాగుతారు.

ఎవరైనా లోక్‌పాల్ సభ్యుని పై కనీసం వందమంది పార్లమెంటు సభ్యుల సంతకాలతో పిటీషన్ సమర్పించినట్లయితే, ఆ సభ్యునిపై రాష్ట్రపతి సూచన మేరకు సుప్రీం కోర్టు విచారణ చేపట్టవచ్చు. సుప్రీం కోర్టు విచారణ జరిపి చేసే సిఫార్సులు, లేదా మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఆ సభ్యుని రాష్ట్రపతి తొలగించవచ్చు.

– కె.యస్. శాస్త్రి

లోక్‌పాల్ పరిధిలో ఎవరెవరు....

- దేశ ప్రధాని కూడా లోక్‌పాల్ పరిధిలో ఉంటారు. అయితే ప్రధానికి కొన్ని రక్షణలు ఉంటాయి.
- ప్రధానిపై దర్యాప్తు చేపట్టేందుకు లోక్‌పాల్‌కు అధికారం ఉంటుంది. అయితే, ప్రధాని పై దర్యాప్తు జరిపేందుకు లోక్‌పాల్‌లోని సభ్యులంతా కానీ, సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది కానీ ఆమోదం తెలపవలసి ఉంటుంది.
- కేంద్ర మంత్రులు, ప్రస్తుత, మాజీ పార్లమెంటు సభ్యులు.
- అన్ని తరగతుల ప్రభుత్వోద్యోగులు
- ప్రభుత్వం నిధులు అందించే సొసైటీలు, ట్రస్టులు
- విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్.సి.ఆర్.ఏ) క్రింద విదేశాల నుంచి ఏటా 10 లక్షల రూపాయలకు మించి నిధులు అందుకొనే అన్ని సంస్థలు
- అవినీతి పరులపై విచారణ జరపడమేగాక, నిజాయితీ, నిబద్ధత గల ప్రభుత్వ ఉద్యోగులకు తగినంత భద్రత కూడా కల్పిస్తుంది.
- ఈ చట్టం క్రింద దోషులుగా నిర్ధారించబడిన వారికి గరిష్టంగా 10 సంవత్సరాల కారాగార శిక్ష విధించవచ్చు.
- అయితే, ఎవరైనా, ఎవరిపైన అయినా, తప్పుడు ఫిర్యాదు చేసిన పక్షంలో ఆ వ్యక్తికి ఏడాది వరకూ కారాగార శిక్ష, లక్ష రూపాయల వరకూ జరిమానా విధిస్తారు.
- సి.బి.ఐ.లో ఇక నుంచి విచారణ విభాగానికి ప్రత్యేకంగా ఒక డైరెక్టర్ ఉంటారు. ఈ అధికారిని కేంద్ర విజిలెన్స్ కమిషనర్ సిఫార్సుల మేరకు నియమిస్తారు.
- కేసులో ప్రాథమిక విచారణకు, దర్యాప్తునకు, కోర్టు విచారణకు స్పష్టమైన కాల పరిమితిని ఈ బిల్లులో పొందుపరిచారు.
- ప్రాథమిక విచారణను 60 రోజుల్లో పూర్తి చేయాలి.
- దర్యాప్తును ఆరు మాసాలలో పూర్తి చేయాలి.
- విచారణను రెండు సంవత్సరాలలో ముగించాలి. అందుకోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.
- సీ.బీ.ఐ. తో సహా ఏ దర్యాప్తు సంస్థకైనా తాను అప్పగించిన కేసుల దర్యాప్తుపై స్వయంగా పర్యవేక్షణ, దిశానిర్దేశం చేసే అధికారం లోక్‌పాల్‌కు ఉంటుంది.
- ఒక కేసులో దర్యాప్తు చేస్తున్న సి.బి.ఐ. అధికారిని బదిలీ చేయాలంటే లోక్‌పాల్ అనుమతి తప్పని సరి.

సమాచార శాఖకు కొత్త శక్తి

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖను పటిష్టం చేసే దిశగా ఆ శాఖ మంత్రి శ్రీమతి డి.కె. అరుణ తీసుకున్న చొరవ సత్ఫలితాలనిస్తోంది.

ఈ శాఖకు అవసరమైన వాహనాలు, పోస్టులు సమకూర్చుకొని పాతికేళ్ళు కావస్తున్న నేపథ్యంలో ఈ శాఖను బలోపేతం చేసే విషయమై మంత్రి శ్రీమతి డి.కె. అరుణ చొరవ తీసుకున్నారు. ఈ దిశగా కమీషనర్ శ్రీ దాన కిశోర్ తయారు చేసిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డితో ఆమె దఫదఫాలుగా చర్చించడం జరిగింది.

ఈ ప్రయత్నాలు ఇప్పుడు కార్యరూపం దాల్చాయి. సమాచార శాఖ సిబ్బంది కొత్త సంవత్సరంలో నూతన జవసత్వాలతో మరింత ఉత్సాహంగా, వేగవంతంగా తమ విధులను నిర్వర్తించేలా ప్రభుత్వం అవసరమైన సకల చర్యలు గైకొంటోంది.

ఎప్పుడో 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం జిల్లా పౌర సంబంధాల అధికారులకు సమకూర్చిన వాహనాలు పాతబడిపోయి కదల లేక మొరాయిస్తున్నాయి. అలాగే, జిల్లాల నుంచి ప్రధాన కార్యాలయానికి, మీడియా కేంద్రాలకి సమాచారం ఎప్పటికప్పుడు పంపేందుకు కూడా తగిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదు.

ప్రభుత్వం ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని సమాచార, పౌరసంబంధాల శాఖను మొదటి దశలో ఆధునీకరించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయి అధికారులకు కొత్త వాహనాలతో పాటు కంప్యూటర్లు, డిజిటల్ కేమేరాలు, టాబ్లెట్ పి.సి.లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది.

అంతేకాదు, సిబ్బందిని మరింతగా ప్రోత్సహించే విధంగా ప్రమోషన్లు ఇవ్వడం, ఖాళీలను భర్తీ చేయడం వంటి ప్రక్రియకు కూడా శ్రీకారం చుట్టింది. సమాచార, పౌర సంబంధాల శాఖ కమీషనర్ నియమించిన అధికారుల కమిటీ సిఫార్సుల మేరకు జిల్లా కార్యాలయాలను పునర్ వ్యవస్థీకరించడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది.

అలాగే, సమాచార, పౌర సంబంధాల శాఖను మరింత పటిష్ట పరిచేందుకు అవసరమైన అదనపు పోస్టులను మంజూరు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కొత్తగా 12 డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు, 11 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు మంజూరు చేసింది.



జిల్లా కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 'జిల్లా ప్రజా సంబంధాల అధికారి' పోస్టును 'ప్రజా సంబంధాల అధికారిగా', 'డివిజినల్ ప్రజా సంబంధాల అధికారి' పోస్టును 'అదనపు ప్రజా సంబంధాల అధికారి'గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జోన్లలో పని చేస్తున్న 'ప్రాంతీయ సంయుక్త సంచాలకుల'ను కమీషనరేట్‌కు తరలించి, ఇతర శాఖలతో సమన్వయం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయ వలసిందిగా కూడా ప్రభుత్వం ఆదేశించింది.

12 జిల్లాలలోని జిల్లా ప్రజా సంబంధాల అధికారుల హోదాను డిప్యూటీ డైరెక్టర్లుగాను, మరో 11 జిల్లాలలోని జిల్లా ప్రజా సంబంధాల అధికారులను అసిస్టెంట్ డైరెక్టర్లుగానూ పదోన్నతి కల్పిస్తోంది.

జిల్లాలకు కొత్త వాహనాలు

సమాచార, పౌర సంబంధాల శాఖ అవసరాల కోసం 25 కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు కమీషనర్‌కు అనుమతిస్తూ, ప్రభుత్వం అందు కోసం కోటి 75 లక్షల రూపాయల అదనపు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో 25 మహేంద్రా బొలెరో వాహనాలను కొనుగోలు చేశారు. వీటిలో 23 వాహనాలను 23 జిల్లాలలోని డి.పి.ఆర్.ఓ.లకు, రెండు వాహనాలను కమీషనరేట్ అవసరాలకు కేటాయించారు.

డిసెంబరు 23న హైదరాబాద్‌లోని సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి శ్రీమతి డి.కె. అరుణ లాంఛనంగా జెండా ఊపి ఈ కొత్త వాహనాలను జిల్లాలకు పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీమతి డి.కె. అరుణ మాట్లాడుతూ, సమాచార శాఖను మరింత బలోపేతం చేసేందుకు, సేకరించిన సమాచారాన్ని అన్ని మాధ్యమాలకు సత్వరం వేగవంతంగా అందించేందుకు ఈ కొత్త వాహనాలను సమకూర్చినట్లు చెప్పారు.

రాష్ట్రంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మరింత చురుకైన పాత్ర పోషించగలదన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ కమీషనర్ శ్రీ ఎం. దానకిషోర్, డైరెక్టర్ శ్రీ సుభాష్ గౌడ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

– కె.యస్. శాస్త్రి

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు

అఖిల పక్ష బృందానికి ప్రధాని హామీ

కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు విషయాన్ని కేంద్ర జల సంఘంతో అధ్యయనం చేయిస్తామనీ, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా చూస్తామనీ డిసెంబర్ 20న ముఖ్యమంత్రి అధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లిన అఖిల పక్ష బృందానికి ప్రధాన మంత్రి శ్రీ మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారు.

ట్రిబ్యునల్ తీర్పుతో కృష్ణనీటి పంపిణీలో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోతుందనీ, ఆ తీర్పును పునసమీక్షించాలనీ సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డితో పాటు అఖిలపక్ష బృందం విజ్ఞప్తి చేసింది.



బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులో అప్పుడు మార్పులూ చేర్పులూ చేయడం తమ చేతుల్లో లేదనీ, అసాధ్యమనీ, అయితే ఆ తీర్పుపై లేవనెత్తిన అంశాలన్నిటినీ పరిశీలిస్తామనీ ప్రధాని శ్రీ మన్మోహన్ అఖిలపక్ష బృందానికి వివరించారు. ప్రస్తుతం ఈ విషయం సుప్రీం కోర్టులో ఉన్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలనీ, ఒకసారి స్టే ఎత్తి వేస్తే పరిస్థితి మరింత జటిలమై తమ చేతుల్లో ఉండకపోవచ్చనీ ప్రధాని అఖిల పక్ష బృందానికి సూచించారు.

ట్రిబ్యునల్ తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేస్తున్నందున కేంద్ర ప్రభుత్వం కూడా అందులో భాగస్వామి కావాలని కోరుతూ సి.ఎం.శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డితో పాటు, మంత్రులు శ్రీ జానారెడ్డి, శ్రీ సుదర్శన్ రెడ్డి, శ్రీ పార్థ సారథి, తెలుగుదేశం పార్టీ పక్షాన శ్రీ కోడెల శివ ప్రసాద్, శ్రీ రావుల చంద్ర శేఖర్ రెడ్డి (టి.డి.పి.) శ్రీ బి.వి. రాఘవులు, శ్రీ జూలకంటి రంగారెడ్డి (సి.పి.ఎం.), శ్రీ కె.నారాయణ (సి.పి.ఐ), శ్రీ బి. వినోద్ కుమార్, శ్రీ విద్యాసాగరరావు (తె.రా.స) శ్రీ అసదుద్దీన్ ఒవైసీ (ఎం.ఐ.ఎం.) శ్రీ డి. రామారావు (లోక్ సత్తా), శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (వైకాపా), శ్రీ నాగం జనార్ధన్ రెడ్డి (బి.జె.పి.) లు ప్రధానితో అరగంట పాటు భేటీ అయి 11 పేజీల వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ భేటీలో సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "ట్రిబ్యునల్ తీర్పు వల్ల ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వతంగా నష్టం కలుగుతుంది. వ్యవసాయ, ఆర్థిక రంగాలపై దుష్ప్రభావం చూపుతుంది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం 2011 మార్చిలో సుప్రీం కోర్టులో ఎస్.ఎల్.పి.ని దాఖలు చేయగా అదే ఏడాది జులై 11న మరో పిటిషన్ దాఖలు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు ఆ తీర్పును రాజపత్రంలో నమోదు చేయకుండా స్టే ఇస్తూ అదే ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోస్తా జిల్లాలు తుపాన్లు, వరదల తాకిడితో దారుణంగా దెబ్బతిని పంటలు కోల్పోయాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో ట్రిబ్యునల్ తీర్పు రావడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలి" అని ప్రధానికి ముఖ్యమంత్రి వివరించారు.

ప్రధాని శ్రీ మన్మోహన్ స్పందిస్తూ, తీర్పుపై సి.డబ్ల్యు.సి తో అధ్యయనం చేయిస్తామనీ, సుప్రీం కోర్టు స్టేను తొలగిస్తే తీర్పును నోటిఫై చేయాల్సి వస్తుందనీ, మీరే న్యాయపరమైన చర్యలు కొనసాగించాలనీ సి.ఎం.కు, అఖిల పక్ష బృందానికి సూచించారు.

కలిసికట్టుగా కృషి చేద్దాం

"రకరకాల వాదాలు, ఆందోళనలతో మన రాష్ట్రం అట్టుడుకుతున్న దశలో మన రాష్ట్రానికి సంబంధించిన అత్యంత కీలకమైన కృష్ణా జలాల వినియోగంపై ఇటీవల బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఎవరెవరు ఎలా స్పందిస్తారు. మనమంతా కలిసి ఏం చేస్తే సమస్య తీరుతుంది?" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అఖిల పక్షనేతలను ప్రశ్నించారు.

ఢిల్లీ వెళ్ళి ప్రధానిని కలవడానికి ముందు రాష్ట్ర సచివాలయంలో ట్రిబ్యునల్ తీర్పుపై డిసెంబర్ 10 న జరిగిన అఖిల పక్ష సమావేశానికి అధ్యక్షత వహిస్తూ చెప్పిన అంశాలు శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాటల్లో.... "రాష్ట్ర విభజన తర్వాత విడివిడిగా ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకంగా కృష్ణాజలాల కోసం పోరాటం చేయటం కంటే ముందుగా అందరం కలిసికట్టుగా పోరాడాల్సి ఉంది. అంటే రాష్ట్ర విభజన అంశాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టాల్సి ఉంది. కృష్ణ నీటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కాపాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. తీర్పు వల్ల మన ప్రయోజనాలు దెబ్బతినకుండా అందరం కృషి చేయాలి. తీర్పులోని అంశాలు మార్చాలని విజ్ఞప్తి చేసేందుకు నిపుణులతో చర్చించాల్సి ఉంది. స్పష్టమైన నిర్ణయం తీసుకునేందుకు త్వరలో మరో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తాం. ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యే వారికి న్యాయపరమైన మద్దతు ఇస్తాం" అని హామీ ఇచ్చారు.

కాగా ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసే ముందు సీనియర్ న్యాయవాది శ్రీ పరాశరన్‌తో ప్రత్యేకంగా సమావేశమవ్వాలని అఖిల పక్షం నిర్ణయించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రైతుల తరపున కూడా ప్రత్యేక లీవ్ పిటిషన్ దాఖలు చేయాలన్న కాంగ్రెస్ ప్రతినిధి శ్రీ కోదండ రెడ్డి సూచనను అమలు చేయాలని అఖిలపక్షం నిర్ణయించింది.

వెంటనే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని "అందుకయ్యే లీగల్ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది" అని హామీ ఇచ్చారు.

సి.ఎం. నేతృత్వంలో అఖిల పక్షం ఢిల్లీ వెళ్లి ప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్‌ను కలవాలని సి.పి.ఐ. కార్యదర్శి శ్రీ నారాయణ ఇచ్చిన సూచనను అఖిల పక్షం ఆమోదించింది.

- రాజఫణి పద్మమూడి

'క్యాడ్‌బరీ ఇండియా' చాక్లేట్ల ఫ్యాక్టరీకి శ్రీకారం!!

చాక్లేట్ల తయారీ సంస్థ 'క్యాడ్‌బరీ ఇండియా, (బహుళజాతి సంస్థ మాండలీజ్ ఇంటర్నేషనల్ గ్రూపు కంపెనీ) పేరుతో ఒక భారీ చాక్లేట్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 27న అవగాహనా ఒప్పందం (ఎం.ఓ.యు) కుదుర్చుకుంది.



చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో 134 ఎకరాల విస్తీర్ణంలో క్యాడ్‌బరీ చాక్లేట్ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఎం.ఓ.యు జరిగింది. ఈ మేరకు ఒప్పంద పత్రాలపై పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కె. ప్రదీప్ చంద్ర, క్యాడ్‌బరీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మను ఆనంద్‌లు సంతకాలు చేసి, పరస్పరం ఆ పత్రాలను మార్చుకున్నారు.

దీన్ని పురస్కరించుకుని క్యాడ్‌బరీ ఇండియా యూనిట్‌కు గుర్తుగా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసి, ఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అతిపెద్ద దైన ఈ కాడ్‌బరీ ఇండియా కంపెనీ నాలుగు దశల్లో రూపుదిద్దుకోనుంది.

ఈ సందర్భంగా సి.ఎం. శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, "నా సొంత రాష్ట్రం, నా సొంత జిల్లాలో క్యాడ్‌బరీ చాక్లేట్ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకం. దీని వల్ల 4 లక్షల 50 వేల మంది పాల రైతులకు, చెరకు రైతులకు చక్కెర మిల్లులకు మేలు కలుగుతుంది. క్యాడ్‌బరీ కేంద్రానికి తొలిదశలోనే రోజుకు కనీసం 5 లక్షల లీటర్లపాలు, 100 టన్నుల చక్కెర కావాలి. ఫలితంగా పాలు, చక్కెర ధరల్లో స్థిరత్వం ఏర్పడుతుంది" అని సూచించారు.

"రాష్ట్ర ప్రభుత్వంతో 115 సంస్థలు, కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటికోసం ఇప్పటికే లక్షా 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు అనుమతులిచ్చాం" అని సి.ఎం. చెప్పారు.

రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీమతి జె. గీతారెడ్డి మాట్లాడుతూ, మెదక్‌లో మరో చాక్లేట్‌ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది. ముఖ్యంగా మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతీ జిల్లాలో ప్రత్యేక పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని పేర్కొన్నారు.

క్యాడ్‌బరీ ఇండియా కంపెనీ ఎం.డి శ్రీ మను ఆనంద్ మాట్లాడుతూ కంపెనీ తొలిదశ నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు వెచ్చిస్తున్నామనీ, ఇది 2015 సంవత్సరం నాటికి పూర్తవుతుందనీ చెప్పారు. 2020 సంవత్సరానికి నాలుగు దశలూ పూర్తయి క్యాడ్‌బరీ ఇండియా ఉత్పత్తి సామర్థ్యం 2 లక్షల 50 వేల టన్నులకు చేరుతుందనీ, 1600 మందికి ఉపాధి అవకాశం లభిస్తుందనీ ఆయన వివరించారు.

తొలుత చాక్లేట్ల ఉత్పత్తి తర్వాత ఇతర ఉత్పత్తులూ ప్రవేశ పెడతామనీ, బిస్కట్లు, స్నాక్ ఐటమ్స్, కాండీలు, బేవరేజ్‌లు మొత్తం అయిదు విభాగాల్లో ఉత్పత్తులు చేయనున్నామనీ ఆయన పేర్కొన్నారు. ఇందుకు కావాల్సిన ముడి పదార్థాలను స్థానికంగానే సేకరిస్తామనీ, అనుబంధంగా చిన్న పరిశ్రమలకు కూడా అవకాశాలు కల్పిస్తామనీ ఆయన చెప్పారు.

మంత్రులు శ్రీ పితాని సత్యనారాయణ, శ్రీ కొండ్రు మురళి, శ్రీ సిటీ ప్రమోటర్లు శ్రీ శ్రీనిరాజు, శ్రీరవీంద్ర సన్నారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ☆

మా పల్లె సంక్రాంతి

సంకురాతిరి లక్ష్మివచ్చె – సౌభాగ్యమిచ్చి దీవించె
బొమ్మల కొలువు పెట్టారు – భోగి పండ్లు పోశారు
పశువుల పండుగ చేశారు – పాలపొంగళ్ళు పండారు
రైతన్నల కళ్ళల్లో కాంతులు విరబూశాయి



ఊరి పెద్దలంతా చేరి రాముడుకి వైభోగం చేశారు
ముత్యాల ముగ్గుల్లో – రత్నాల గొబ్బిళ్ళు
సంక్రాంతి సంబరాలు ఇంటింట అంబరాలు
అందరం కలిసి మెలిసి హాయిగా జరుపుకొందాం
మా పల్లె సంక్రాంతి – మా తల్లి సంక్రాంతి

– *తాటికోల పద్మావతి*

సినిమా(యు)

చివరి రోజుల్లో...

రంగస్థలమే ఆమె జన్మస్థలం!

ఎవరైనా ఈ భూమ్మీద పుడుతూనే ధనార్జన చెయ్యగలరా? సంభవమా?.... 'సంభవం' అని నిరూపించింది 'తెలుగు సినిమా తొలితార' కమలా బాయి.

వాళ్లు పేరెన్నికగన్న సురభి నాటక సంస్థ వాళ్లు. 1903 వ సంవత్సరం ఏప్రిల్ 4 న హైదరాబాద్‌లో జరిగిన ఒక నాటక ప్రదర్శనలో-రంగస్థలం మీద జరిగిన గొప్ప సంఘటన.

కమలాబాయి తల్లి గారు వెంకుబాయి సురభి సంస్థలో నటి. నాటకం సాగుతోంది. ఆమె అప్పుడు గర్భవతి. నటిస్తూ వుండగానే పురిటినొప్పులు ఆరంభమైనాయి. వెంటనే తెరవేసి, ప్రేక్షకులకి 'కొద్ది సేపు విరామం' ప్రకటించారు.

వెంకుబాయి రంగులు వేసుకునే గదికి వెళ్ళి, అనాయసంగా బిడ్డను కన్నది. ఏం మాయో! అంతా దైవలీల. వెంకుబాయి అప్పుడే పుట్టిన ఆ ఆడపిల్లను చేతుల్లోకి తీసుకుని – రంగస్థలం ప్రవేశించింది. నిర్వాహకులు –వెంకుబాయి అమ్మాయిని ప్రసవించినట్టుగా ప్రకటన చేశారు.

ప్రేక్షకులు ఉద్వేగంతో, హర్షధ్వానాలు చేశారు. జేబుల్లో వున్న డబ్బును ఎంత అంది వస్తే అంత తీసి, రంగస్థలం పైకి విసిరారు. అలా పుడుతూనే ధనార్జన చేసిన ఆ పసిపాప – 'సురభి' కమలాబాయిగా ప్రసిద్ధి చెందిన కమల.

సురభి నాటక కంపెనీ గొప్పదనం, విశిష్టతా అదే! నాటకం పట్ల వారికి వున్న శ్రద్ధ, నిబద్ధత, చిత్తశుద్ధి – అలాంటిది. కమలాబాయి తండ్రి వనారస పెద కృష్ణాజీరావు. వెంకుబాయిది 'జంఝూటి రాగం' ఆలపించడంలో అందెవేసిన 'కంఠం'. ఆమెను జంఝూటి వెంకుబాయి అని పిలిచేవారట! ఆ రాగంలో రంగస్థలం మీద పద్యం చదువుతూ వుండగానే, కమలకు జన్మనివ్వడంతో – కమలబాయికీ ఆ రాగం పట్టుబడినట్టుంది, పుడుతూనే ఏడ్వటానికి బదులు, రాగాలాపన చేసి వుంటుందేమో!

సురభి నాటక బృందంలో అందరూ అన్ని పనులూ చేస్తారు. వాళ్లే తెరలు పెయింట్ చేస్తారు. తెరలు కట్టుకుంటారు, మేకప్‌లు వేసుకుంటారు, నటిస్తారు. కమలాబాయికి మూడో ఏడు వచ్చిన దగ్గర్నుంచి 'శ్రుతి'లో పలకడం, ఆలపించడం నేర్పించారట. ఐదారు ఏళ్ల వయసు వచ్చేసరికే కమలాబాయి నాటకాల్లో బాలకృష్ణుడు, ప్రహ్లాదుడు, లోహితుడు లాంటి వేషాలు వెయ్యడం ఆరంభించింది. ఒక పక్క నాట్యాభ్యాసం, ఇంకో పక్క సంగీత సాధన. బృందం మొత్తంలో ఆమె 'అందగత్తె' అని చెప్పుకునే వారు. యవ్వనంలోకి అడుగు పెడుతూనే, కమలాబాయి నాయిక పాత్రలు ధరించసాగింది. తండ్రి గారి మరణానంతరం, తానే సంస్థను నిర్వహించింది.

హిందూస్థానీ సంగీతాన్ని కూడా అభ్యసిస్తూ – రెండు బాణీలనూ మేళవించి పద్యాలు చదివేది. సురభి సంస్థ ఎన్నో పౌరాణిక నాటకాలు ప్రదర్శించింది. వాటిలో 'భక్త ప్రహ్లాద' కూడా ఒకటి. ప్రహ్లాదలో కమలాబాయి లీలావతిగానూ, సుబ్బయ్య అనే ఆయన హిరణ్యకశిపుడిగానూ నటించేవారు.



హెచ్.ఎమ్. రెడ్డి గారు తొలిసారిగా టాకీ తీయాలని ఆలోచించినప్పుడు – సురభివారు ప్రదర్శించే ప్రహ్లాద నాటకాన్నే తీసుకున్నారు. దాదాపు ఆ నటులనే సినిమాకీ తీసుకున్నారు.

1932 ఫిబ్రవరి 6వ తేదీన విడుదలైన తొలి తెలుగు సినిమా 'భక్త ప్రహ్లాద'లో లీలావతిగా నటించిన కమలాబాయి ఆ విధంగా 'తెలుగు చిత్రాల తొలితార' గా ముద్రవేసుకుంది.

ఒక పక్క నాటకాలు వేస్తూనే, సినిమాల్లోనూ నటించేది ఆమె. 'ప్రహ్లాద' తర్వాత వచ్చిన 'పాదుకా పట్టాభిషేకం', 'శకుంతల' సినిమాల్లో ఆమెదే ప్రధాన పాత్ర. ఆ విధంగా మొదటి మూడు తెలుగు సినిమాల్లోనూ ఆమె పాత్రధారణ చేయడం విశేషం.

ఒక పక్క సినిమాల్లోనూ, నాటకాల్లోనూ నటిస్తున్నా వాద్య సంగీతం కూడా అభ్యసించింది కమలాబాయి. వయోలిన్, హార్మోని వాద్యాలు చక్కగా వాయించేది.

1968లో అనుకుంటాను-నేను సురభి కమలా బాయి గారిని ఒక సినిమా షూటింగ్‌లో కలుసుకున్నాను. ఆమెతో కూర్చుని ముచ్చటించడంతో ఆమె నాటి విశేషాలు చాలా చెప్పారు.

నాటి షూటింగులకీ, నేటి షూటింగులకీ ఏ మాత్రం పోలిక లేదన్నారు. "ఆ రోజుల్లో నాటకం వేసినట్టు వేస్తే ఎదురుగా కెమెరా పెట్టి తీసేవారు. అక్కడే పద్యాలు, పాటలూ అన్నీనూ, ఇవాళా? చాలా మార్పు చెందింది సినిమా. ఎంతో అభివృద్ధి, ఎన్నో సౌకర్యాలు" అని చెప్పారామె.

బొంబాయిలో తీసిన కొన్ని హిందీ సినిమాల్లోనూ మద్రాసులో తీసిన తమిళ సినిమాల్లోనూ నటించారు కమలాబాయి.


తనకి వందల కొద్దీ సత్కారాలు జరిగాయని, చాలా అవార్డులు వచ్చాయనీ చెప్పారు. ద్రౌపది మాన సంరక్షణం, విజయదశమి, తుకారామ్, భక్తజయదేవ్. మొదలైన నాటి సినిమాల్లో నటించినా, మనకి గుర్తున్న సినిమాలు వాహిని వారి 'మల్లీశ్వరి' (1951), విజయావారి 'పాతాళభైరవి' (1951). 'మల్లీశ్వరి' లో తోటరాముడి (ఎన్.టి.ఆర్) తల్లిగానూ కమలాబాయి– నాటకీ లక్షణాలు ఏ మాత్రం కనిపించనీయకుండా, ఎంతో సహజంగా నటించారు.


నేను చూసినప్పుడు ఎంతో చలాకీగా, చమత్కారాలు గుప్పిస్తూ మాట్లాడిన కమలాబాయి 1969-70 నాటికి అస్వస్థతకి గురవుతూ వచ్చారు. తాను సినిమా పరిశ్రమలో తొలినాటి నుంచి వుంటున్నా-అనారోగ్యంగా వున్న సమయంలో పలకరించడానికే సినిమావారు కరువైపోయారని, ఏలూరు వెళ్లిపోయారు.


ఏలూరులో ఆమెకు సొంత ఇల్లుండేది. దగ్గర బంధువులు ఆమెను ఆదుకున్నా-1971న ఫిబ్రవరి 13న కమలాబాయి కళా ప్రపంచం నుంచి నిష్క్రమించారు.


150 చిత్రాలకు పైగా నటించి, 'తెలుగు చిత్రాల తొలితార' గా ప్రసిద్ధి చెందిన కమలాబాయి మరణిస్తే సినిమా పరిశ్రమ 'నివాళి' ఘటించలేదు. ఒకటి రెండు నాటక సంస్థలు సంతాపసభలు నిర్వహించాయిగాని, సినిమా మాత్రం స్పందించలేదు!

– రావి కొండలరావు *98480 71175*











నేను నీ మొగుణ్ణే..! పదేళ్ళ కింద.. సంక్రాంతి ముగ్గేసుకుంటూ.. తోడుగా నన్ను తీసుకెళ్లావ్! నువ్ బానే తిరిగొచ్చావ్.. నేను దారి తెల్సుకుని వచ్చే
సరికి.. ఈ టైమ్ అయ్యింది!

ముగ్గులో ... ముగ్గులు...


కొత్త అల్లుడినని కూడా చూడకుండా....
ముగ్గులెవరూ తొక్కకుండా... రోజంతా
నన్నే కాపలాగా పెడతారని
తెలిస్తే వచ్చే వాడిని గాదు!!
ఖర్మ... ఖర్మ...


నా సంక్రాంతి ముగ్గుకు కాపలా కాయడానికి.. నాకిలా పులివేషం వేయించి.. చలిలో ఉండమనడం.. ఏం బాలేదే.. పంకజం!
వాc .....

మా ఇంట్లో ఆవకాయ

- గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

మే నెల.

ఎండలు మండిపోతున్నాయి.

మా ఇంట్లో అవకాయ పెట్టే సన్నాహం మొదలైంది.

మా ఆవిడ లీల నాతో అంది, "కూరల అప్పారావు నిన్న నాతో- ఇవ్వాళ మంచి ఆవకాయ మామిడికాయ తెచ్చిస్తానన్నాడు. మీరు కాస్సేపు మన గేట్లో నుంచుని ఎదురు చూడండి. అతగాడు గాని ఎప్పటికీ రాకపోతే అప్పుడు మార్కెట్ కెళ్ళి కాయలు తెద్దురు గాని".

నేను మా వాకిలి గేట్లో గంటసేపు కంచిగరుడసేవ చేశాను. ఉదయం పదయ్యింది. ఇంక నేను మార్కెట్‌కు బయల్దేరదామనుకుంటూండగా మోపెడ్ మీద అప్పారావు ఊడిపడ్డాడు. ఆ మోపెడ్‌కు ముందూ వెనకా రెండు వైపులా చెరొక మామిడి కాయల బస్తా వేలాడుతోంది.

అతను కాళ్లతో బ్ర్రెర్ర్‌ర్రమని మోపెడ్‌ను అపుకున్నాడు. నాతో, "సార్, ఒక్కొక్క బస్తా లోంచీ పదేసి చొప్పున నలభై కాయలు తీసుకోండి సార్" అన్నాడు.

నేను "అదేంటయ్యా, నువ్వు తెచ్చి ఇంట్లో పెట్టలేవూ?" అన్నాను.

"కష్టం సార్ .. . ఈ బరువుతో నేను దిగితే మళ్ళీ ఎక్కలేను. అసలు దీనికి స్టాండ్ లేద్సార్. ప్లీజ్, తీసుకోండి సార్."

నేను తికమకపడ్డాను. నా చేతుల్లో ఉన్న గోనె సంచిలోకి నలభై మామిడి కాయలూ వేశాను. అప్పారావుకి డబ్బిచ్చి పంపించేశాను.

ఆ సంచిని మెట్లు ఎక్కించి, మా గేట్లోంచి, ఆపైన కటకటాల్లోంచి, సింహ ద్వారంలోంచి ఇంట్లోకి తెచ్చేప్పటికి నాకు గూడల్లో నెప్పి మొదలైంది !

లీల తుళ్లుకుంటూ ఎదురొచ్చింది. "అబ్బ, అయిదు రూపాయలకి ఎంత పెద్ద కాయో ! అందుకనే ఇంటికి తెచ్చిస్తానంటే, 'సరే' అన్నాను..... సరే, అట్లాగే వీటిని మార్కెట్‌కి తీసికెళ్లి ముక్కలు కొట్టించి తీసుకు రారూ !"

తప్పదు గదా, ఆ మూటని మళ్లీ వెనక్కి, బయటికి తెచ్చి ఆటోలో మార్కెట్‌కు తీసికెళ్లాను.

ముక్కలు కొట్టే మేదరవాళ్లంతా వెళ్ళిపోయారు, ఒక్కడు తప్పించి. ఆ ఒక్కడి దగ్గరకి వెళ్లాను. అతను, "బాబుగారూ, ఈ కాయల్ని ఈ బకెట్ నీళ్లల్లో కడగండి, అదుగో ఆ గుడ్డతో తుడిచి నాకు ఇస్తావుండండి. చకచకా ముక్కలు కొట్టేసిత్తాను" అన్నాడు.

నేను, "అదేంటయ్యా, ఇవన్నీ నేను చేస్తే నువ్వు చేసేదేమిటి ? నీ మనుషులేరి ?" అన్నాను.

"మా యమ్మాయి ఇనుకూలు కెళ్లింది. మా యావిడ 'పెతి ఆడదానికీ ఉజ్జోగం' పతకంలో ఉజ్జోగాని కెళ్లింది...పోనీ రేవు తెల్లారే పాటికి తీసుకొత్తారా ?"

నా గూడలు కలుక్కుమన్న ఫీలింగొచ్చింది. మాటాడకుండా ఆ కాయల్ని అట్లాగే బకెట్‌లో వేసి, కడిగి, తుడిచి... ఎట్లాగైతేనేం ముక్కలు కొట్టించాను.

ఆ బస్తా తెచ్చి ఇంట్లో పడేశాను.

లీలతో అన్నాను, "మార్కెట్‌లోనే కాయలు ఏరుకొని, కొని, ముక్కలు కొట్టించి తెచ్చి ఉంటే నాకు సగం శ్రమ తప్పేది గదా ?"

లీల నోరు నొక్కుకుంది. "హవ్వ ! మీకేం తెలునని మీరు ఏరగలరు ! అక్కడంతా కలగలుపు కాయలు. నమ్మకంగా అప్పారావు తెచ్చినవేమో ఏకచెట్టు కాయలు. తెల్సా !.... సరే, భోంచేసి వెళ్లి నూజివీడు కారమూ, గుంటూరు కారమూ, పెద్ద ఆవపిండి, సన్న ఆవపిండి, నువ్వుల నూనె, మెంతులూ, శనగలూ ఇప్పుడు తెచ్చేయండి".

ఏం చేస్తాం. అన్ని పనుల్లా వేమిద్దరమే చేసుకోవాలి... మా ముగ్గురు కొడుకులూ, ఒక్కడు కలకత్తా, ఒక్కడు కొల్హాపూర్, ఒకడు కన్యాకుమారి లలో ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. అవకాయ మేం పెట్టి వాళ్లందరికీ మేమే పంపించాలి.

పచారీకొట్టుకు పురమాయిద్దామంటే అక్కడి ఫోను పని చెయ్యటం లేదు. అందుకని మండు టెండలో కాళ్లీడ్చుకుంటూ బయల్దేరాను.

పచారీకొట్టు బయట బోర్డు వేలాడుతోంది: "మీరు ఎన్నుకున్న కారం పాకెట్టులో కారం మీరనుకున్నంత ఘాటుగా లేకపోతే, కారం తెచ్చిస్తే డబ్బు వాపసిస్తాం !"



'దీపావళి హాస్యకథల పోటీ-2013'లో సాధారణ బహుమతి పొందిన కథ

ఆ షావుకారుతో నేనన్నాను, "మేం ఎన్నుకోవటమేమిటి? ఊరగాయలో కలిపేసిన కారం తెచ్చివ్వటమేమిటి !.... మాక్కావలసిన గుంటూరు వగైరాల కారం ఎంచి మీరివ్వరా !"

షావుకారన్నాడు. "నేను ఒక్కణ్ణే ఎన్ని పన్లని చెయ్యనండి. పనిపిల్ల ఎమ్సెట్ పరీక్ష రాయటానికెళ్లింది. కుర్రాడు బ్యాంకు టెస్టు రాయటానికెళ్లాడు. అందుకని బేరాలు పోకుండా ఈ బోర్డు పెట్టాను."

నేను లోపలికి – చెమటలు కక్కిస్తూన్న ఈ కొట్టు వెనక వైపున్న చీకటి గుహలోకి వెళ్లాను. అక్కడ మిరపకాయల బస్తాలూ, కుంకుళ్ల బస్తాలూ, ఇంగువ పాకెట్లూ కలగాపులగంగా పడున్నాయి. వాటి కింద ఉన్న మూడు రకాల కారం పాకెట్లను ఇవతలికి లాగి వాటిని వాసన చూసి, ఎన్నుకొని ఇవతలకి తెచ్చాను. టపటపా పాతిక తుమ్ములొచ్చినయ్యి. అప్పులెవ్వరో హఠాత్తుగా 'హరీ'మన్నట్టు బొటబొటా కన్నీళ్లు కారినయ్యి.

లీలకు ఆ పాకెట్లు నచ్చినయ్యి.

ఎండ తాపం తట్టుకోటానికి 'నేత్రం మూర్ రెండొందలు' ఒకడోసు మింగాను.

ఆవపిండి తాజాది దొరుకుతుందనే ప్రచారం ఉన్న సేవల శీనయ్య కొట్టుకు వెళ్లాను. అక్కడా కొనుగోలు జనం క్యూలో ఉన్నారు.

నేను తిన్నగా వెళ్ళి శీనయ్యతో, "రెండు రకాల ఆవపిండులు కావాలి" అన్నాను.

సేవల శీనయ్య అన్నాడు, "పిండులు అయిపోయాయి సార్. పట్టించాలి. ఆవాలున్నాయి.... ఇదుగో ఈ గిన్నెలోకి ఆ బస్తాలోని పెద్ద ఆవాలూ, ఈ గిన్నెలోకి ఈ బస్తాలోని చిన్న ఆవాలూ తెచ్చుకోండి సార్ !"

"నేను తెచ్చుకోవటమేంటి, మీ పనిమనిషిని తెమ్మనమనండి".

శీనయ్య ఘొల్లున నవ్వాడు. "పని మనిషా, ఆ జాతి అంతరించిపోతోంది సార్ ! అపరాలు బాగు చెయ్యటానికి రెండు వేలిస్తానంటే ఒక పూటే వస్తానంది. వాళ్లకి ఎదురౌతూన్న ఉచితాలూ, చవకలూ, రేషన్లూ, పెన్షన్లూ వగైరాలు అందుకోటానికే వాళ్లకి తీరిక లేదు. మన దగ్గరి కెప్పుడొస్తారు ?.... పైగా ఆమె కూతురుకు ఉద్యోగం వచ్చిందట కూడా!.... సార్, ఆ పొట్లాలు కడుతూన్న మా కుర్రాడే మీకు తెచ్చివ్వాలంటే వెళ్లి క్యూలో నుంచోండి. లేదా? నేను చెప్పినట్లు చెయ్యండి".

నేను తిన్నగా వెళ్లి రెండు గిన్నెలతోనూ ఆవాలు తెచ్చుకున్నాను.

సేవల శీనయ్య అన్నాడు, "అయ్యా, మీరు ఏ చదువులో లెక్చరరండి ?"

"జియాలజిలో – అదే, భూగర్భశాస్త్రంలో".


"అంటే, మీకు రాయికీ, రాయి కానట్టి విత్తనానికీ తేడా తెలిసిపోద్ది గదా !"

"ఆ, మేం చదువు మొదలు పెట్టేదే ఆ అంశంతో!"

శీనయ్య మోహం వికసించింది అన్నాడు,

"అయితే ఇంకేంటి సార్, ఈ గిన్నెల్లోంచి రాళ్లు ఏరేసెయ్యండి సార్. లేకపోతే మీరు ఆవకాయ తినేటప్పుడు మీ పళ్లు – కొంచెం – కదల బారొచ్చు. లేదా అవి మీ మూత్రపిండాల్లో దాక్కోవచ్చు !" ఇలా అంటూ శీనయ్య తన సెల్‌ఫోను తీసుకొని బయట కెళ్లాడు.

నేను నోరు మూసుకుని ఆ ఆవాల్లోంచి రాళ్లు ఏరాను. అరగంట అయ్యింది. శీనయ్య వచ్చాడు.



అన్నాడు, "సార్, ఇంకా మిల్లు దగ్గర కెళ్లలేదా !.... అరయితే కరెంటు పోద్ది మరి !"

చటుక్కున నేను లేచాను. ఆ ఆవాల్ని క్యారీ బాగుల్లో తీసుకుని, అక్కడికి అరకిలో మీటరు దూరంలో ఉన్న మిల్లు దగ్గరకు వెళ్లాను. అక్కడ – రంభా రాగమయ్యా, ఘాటు గంధమయ్యా, చమ్కీ చిద్రూపం, నాచం నాకస్వామి, సోకుల సూరప్పడు – వగైరా షావుకార్ల షాపులనించి వచ్చి క్యూలో నిల్చున్న నాలాంటి అర్భకులు ఓ పదిహేను మందిని చూసేటప్పటికి నాకు నవనాడులూ కుంగిపోయాయి.

మిల్లు పాటు ఎటూలేదు, పాటయినా విందామని నా సెల్ లోని పాట ఆన్ చేశాను. బిస్మిల్లా ఖాన్ షెహనాయీ వాద్యం ఠంగుమని కుప్పించి ఎగిసింది. వెంటనే ఆ క్యూలో ముందు నుంచున్న యువకుడు, నాతో, "మీరు నా ముందుకు రండి మాస్టారూ, నేనూ వింటాను" అన్నాడు. మిగతా జనాలు కూడా నా వైపు ప్రసన్నంగా చూశారు.

ఇంకేం, తత్‌క్షణం నేను ఆ క్యూలో మొదటి వాడినయ్యాను.

ఇంతలో మిల్లువాడు నాతో, "రండి సార్, పైన పోసి, పక్కకి వంగి, కింద పట్టండి" అన్నాడు.

"నేను పట్టటమేంటి, మీ పనివాణ్ణి పిలవండి !" అన్నాను.

"వాడికి గవర్మెంటు ఉద్యోగం వచ్చిందంట – అదే, ఆధార్ కార్డు కోసం దరఖాస్తు నింపే విధానం బోధిస్తాట్ట !.... అంతే సార్, పని వాళ్లతో మా బాధలు మావి !".

రెండు పిండులూ పట్టుకొన్నాను. సెల్ ఆపేశాను.

ఆ యువకుడికి థ్యాంక్స్ చెప్పి ఇవతలకు వచ్చేశాను.

నూనె వగైరా మిగిలిన సరుకులు తేవటం దగ్గర కూడా నాకు ఇట్లాంటి అనుభవాలే ఎదురయ్యాయి.

ఆ రాత్రి నాకు ఆలోచన్లు వచ్చాయి. ఎంతమంది పని మనుషుల పన్లు నేను చేస్తే అన్ని పన్లూ చకచకా అవ్వాళే అయిపోయాయి ! నేను ఎన్ని నైపుణ్యాలు ఉపయోగించాను !..... భుజబలం, నాసికా నైపుణ్యం, భూగర్భ శాస్త్రం, సంగీతాభిరుచి, ఎండదెబ్బ తగలకుండా నేత్రం మూర్ అనే హోమియో మందువాడాలనే విజ్ఞానం కలిగి ఉండటం – ఇన్ని! వెంటనే జగత్ సత్యం ఒకటి నాకు ఆవిష్కృతమైపోయింది. ఏ ఆసామీ అయినా ఆవకాయ పెట్టుకోవాలంటే బహు నైపుణ్యాలు కలిగి ఉండక తప్పదు – ఇవ్వాళ !

.... ముందమోపి ఆవకాయ కోసం ఇన్ని నైపుణ్యాలు అవసరమా?

ఈ మాటే నేను లీలతో అన్నాను.

చటుక్కున ఆమె "చాల్లెండి, తాటికాయంత మామిడి కాయను ఐదురూపాయలకు కొనగల నా నైపుణ్యం ముందు మీ నైపుణ్యమెంత. ఊ, ఊ' అంటూ మూతిని మూడు వంకర్లు తిప్పింది.

*****

మూడో రోజున కొత్త ఆవకాయ తిరగ కలిపి, అన్నంలోకి వడ్డించింది నా అనుంగు అర్ధాంగి లీల. ఆ ముక్కను ముందర తనే కొరికింది. ఆమె ముఖంలో రంగులు మారాయి. నొసలు ముడిపడింది. ముక్కు పైకి లేచింది.

"ఇదేంటండీ, ముక్క తియ్యగా ఉంది ! థు థు థూ, బంగినపల్లి కాయండీ !" అంటూ ఉమ్మేసింది.

నేను నవ్వబోయి, ఆ రాత్రికి పుష్టి ఉండదేమోనని భయపడి, మొహం తిప్పుకున్నాను.

☆

'భారతరత్న' వెనుక . . .

"ది నేచర్ ఆఫ్ కెమికల్ బాండ్' పుస్తకం చదివినపుడే నా జీవితం మారిపోయింది. అలాంటి కృషి చేయాలని నిశ్చయించుకున్నాను" ఇది పదహారేళ్ల చింతామణి నాగేశ రామచంద్ర రావుకు కలిగిన అభిప్రాయం. ఆయన చదివిన పుస్తకాన్ని రాసింది లైనస్ పాలింగ్ మహాశయుడు. వారికి రసాయన శాస్త్రంలో ఒకసారి, శాంతికి సంబంధించి మరోసారి నోబెల్ బహుమతులు వచ్చాయి.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పదహారేళ్లకే ఎంఎస్సీ చదువుతున్న రామచంద్ర రావుకి ఆ తర్వాత లైనస్ పాలింగ్ విద్యార్థితో కలసి పరిశోధన చేసే అవకాశం కల్గింది. ఈ యువకుడే నేడు 79 వ ఏట ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా ఈ నెలలో 'భారతరత్న' అందుకోబోతున్నాడు.

1500 దాకా పరిశోధనా పత్రాలు రాసినా, 50 దాకా గ్రంథాలు రాసినా, 44000 పరిశోధనా పత్రాలలో ఇతని పరిశోధనలను పేర్కొన్నా, 150 విశ్వవిద్యాలయాలు డాక్టరేట్లు ఇచ్చినా 150 పిహెచ్‌డిలకు నాయకత్వం వహించినా – ఈ సి.ఎన్.ఆర్. రావు నేటికీ శాస్త్ర పరిశోధన అంటే చిన్న పిల్లాడిగా మారిపోతాడు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించి ప్రధాన మంత్రి సలహా మండలిలో ఉన్నా, లేదా ఆ మండలి నాయకులుగా నలుగురు ప్రధానులకు దిశా నిర్దేశనం చేస్తున్నా – ఆయన మాత్రం కొంగొత్త పరిశోధనాంశాలలో ప్రవేశించడం తగ్గించలేదు. ఆయనకు సూపర్ కండక్టర్లు అయినా, నానోసైన్స్ అయినా ఆసక్తే!

గత నవంబర్ నెలలో క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్‌తోపాటు డా॥ సి.ఎన్.ఆర్ రావుకి 'భారతరత్న' ప్రకటించారు. అంతకు ముందు సి.వి.రామన్ (1954), మోక్షగుండం విశ్వేశ్వరయ్య (1955), బి.సి.రాయ్ (1961), ఏపిజె అబ్దుల్ కలాం (1997) వంటి శాస్త్రవేత్తలకు మాత్రమే 'భారతరత్న' ఇచ్చారు.

రావు చాలా పద్ధతి గల మనిషి. ఉదయం నాలుగున్నరకే లేచి ధ్యానం, యోగా చేసి నడకకు వెడతారు. ఈయనతో కలసి మార్నింగ్ వాక్ చేయాలని ఇతని విద్యార్థులు ఉవ్విళ్ళూరుతారు.

ఇంజనీరు విశ్వేశ్వరయ్య, డాక్టర్ అయిన బిసిరాయ్ తర్వాత మిగిలిన ముగ్గురు సైన్స్ రత్నాలలో సి.ఎన్.ఆర్.రావు ఒకరు. రావుగారికి 'పద్మవిభూషణ్' ఇది వరకే వచ్చింది. బెంగుళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థకు 1984 నుంచి 1994 దాకా డైరెక్టర్‌గా విజయాలు సాధించారు. మొహమాటం లేకుండా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడం ఆయన నైజం. సెన్సెక్స్‌లు, క్రికెట్‌మాచ్‌లు, అందాల పోటీలు – కొలమానాలు కావని చాలా స్పష్టంగా చెబుతారు. రాజకీయ నాయకులనే కాదు, పారిశ్రామికవేత్తలను కూడా అవసరమనుకుంటే కడిగివేస్తారు.



చింతామణి నాగేశ రామచంద్ర రావు

కర్ణాటక–ఆంధ్ర సరిహద్దులో ఉండే చిక్కబళ్ళపూరులో సి.ఎన్.ఆర్ రావు 1934 జూన్ 30న జన్మించారు. హనుమంత నాగేశ్వరరావు, నాగమ్మల ఏకైక సంతానం రామచంద్రరావు. ఆయన బాల్యం బెంగుళూరులోనే ఎక్కువ సాగింది. తండ్రి విద్యాశాఖలో ఉద్యోగి. అమ్మ కొంత చదువుకుని, అమితమైన లోకజ్ఞానం గల మహిళ. రామాయణ, భారత కథలతో పాటు పురందర దాస కీర్తనలు చిన్నప్పుడే నేర్పింది తల్లి. తండ్రికి ఇంగ్లీషు అంటే మోజు. సమయం దొరికితే తండ్రి ఆంగ్లం నేర్పేవారు.

రామచంద్రరావుకు వయస్సు వచ్చే కొద్దీ స్వాతంత్ర్యసమరం ఊపందుకొంటోంది. ఈయనకు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆరాధ్య స్ఫూర్తి. ఖద్దరు కట్టారు, గాంధీ టోపి ధరించాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, మైసూరు సంస్థానం మహారాజు ఏలుబడిలో ఉంది. దీనికి వ్యతిరేకంగా కృషి సాగించాడు యువ రామచంద్ర రావు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి 15 సంవత్సరాలకే బి.ఎస్సీ పట్టా సాధించి రికార్డు నెలకొల్పాడు. ఎం.ఎస్సీతో పాటు పరిశోధన చేయగలిగే సదుపాయం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఉందని కాశీ వెళ్ళారు.

పిహెచ్‌డి కాకముందే 23 ఏళ్ళ లోపే 20 దాకా పరిశోధనా పత్రాలు ప్రచురించారు కూడా!

ఇతని వాలకం చూసి ఒక ప్రొఫెసర్ అమెరికా వెళ్ళమని సలహా ఇచ్చారు. చాలా విశ్వవిద్యాలయాలలో అవకాశం వచ్చినా తను మాత్రం పుర్డ్యు విశ్వవిద్యాలయంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. కారణం తన ఆరాధ్య స్ఫూర్తి లైనస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాడు. కారణం తన ఆరాధ్యస్ఫూర్తి లైనస్ పౌలింగ్ అక్కడ ఉండటం. 1958కి పి.హెచ్.డి. పూర్తి అయ్యింది. తర్వాత నెలకు 500 రూపాయల జీతంతో ఐ.ఐ.ఎస్.సి.లో లెక్చరర్‌గా చేరారు. బెంగుళూరులో కుమారుడున్నాడని తల్లిదండ్రులు ఆనందపడ్డారు. అక్కడ భౌతిక రసాయనశాల లేదు, భౌతిక శాస్త్రంలో అవకాశం ఉన్నా అంతర్గత రాజకీయాల వల్ల అనుమతి లభించలేదు.

1961లో మైసూరు విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. బెంగుళూరులో పరిస్థితులు అనుకూలించకపోయినా చిన్న ప్రయోగశాల ప్రారంభించి టైటానియం డయాక్సైడ్ సంబంధించి ఆరు పిహెచ్‌డి పరిశోధనలు చేయించారు. ఈ పరిశోధనా అనుభవాలతో పుస్తకం రాస్తే లండన్ సంస్థ ప్రచురించింది. మంచి గుర్తింపు వచ్చింది.

1963లో ఐఐటి కాన్పూర్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. మూడు పదుల వయసులోపు ప్రొఫెసర్ కావడం గమనార్హం. అవసరమైన పరిశోధనా సదుపాయాలను ఐఐటి కాన్పూర్ కల్పించింది.

టాటాలు, అంబానీలు వంటి వారు పరిశోధనకు కొంత ఖర్చు పెట్టాలంటారు సి.ఎన్.రావు. రాజకీయాలు సైన్స్ పరిశోధనకు అవరోధం కాకూడదంటారు.

ఐఐటిలో పదేళ్ళు చేసిన పరిశోధనలు గణనీయమైనవి.

1970లో సిఎన్ ఆర్ రావుకు సాలిడ్‌స్టేట్, మెటీరియల్ సైన్సెస్ మీద ఆసక్తి కల్గింది. దాంతో పరిశోధన మెటల్ ఆక్సైడ్ సమ్మేళనాల మీద దృష్టి మళ్ళింది. ఈ సమ్మేళనలు చాలా సంఖ్యలో ఉంటాయి. వీటిలో ఉండే ధర్మాలలో సూపర్ కండక్టివిటి ఒకటి. ఇలా రావుగారు సూపర్ కండక్టర్స్ పరిశోధనలో పడ్డాడు. ఇందులో ఆయన చేసిన పరిశోధన చాలా పేరు తెచ్చింది. మరోవైపు వింటర్ స్కూల్ పేరుతో దేశంలోని రసాయన శాస్త్ర అధ్యాపకులకు అంతర్జాతీయ నిపుణులతో అవగాహన పెంచారు. అంతేకాక రసాయన

ఎందరో సైన్స్ మహానుభావులు

సంక్రాంతి సౌరభం



ముద్దులొలికే పొదరిళ్ళు
కళాపిచిమ్మిన వాకిళ్ళు
గొబ్బెమ్మల సందళ్ళు
ముద్ద బంతుల మురిపాలు
కమ్మని సన్నాయి రాగాలు
ఇంటింట పిండి వంటలు
నిండుగ భాండాగారాలు
తీయటి మనసుల్లా చెరుకుగడలు
పట్టుచీరల రెపరెపలు

పట్టు పరికిణీల పరుగులు
పసుపు పచ్చని గుమ్మాలు
మామిడి తోరణాల సొగసులు
కళకళలాడుతూ రైతన్నలు
అద్దంలా ప్రతిఫలించే పల్లెటూరి అందాలు
సంక్రాంతి సౌరభమంటే ఇదేగా !

- యలమర్తి అనూరాధ

శాస్త్రం పట్ల అవగాహన పెంచడానికి ఒక న్యూస్ లెటర్ ప్రచురించడమే కాక, కెమిస్ట్రీ టుడే, అండర్ స్టాండింగ్ కెమిస్ట్రీ వంటి పుస్తకాలు రాశారు. తర్వాత కొంత కాలం విదేశాలకు వెళ్ళారు.

1976లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ సతీష్‌ధావన్‌గారు సి.ఎస్.ఆర్ రావును తిరిగి తమ సంస్థకు రప్పించి, కావాల్సిన పరిశోధనా సదుపాయాలు కల్పించారు. ఐఐఎస్‌సిలో సాలిడ్‌స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగం, మెటీరియల్స్ రీసర్చ్ విభాగం ప్రారంభించారు సి.ఎస్.ఆర్ రావు. తర్వాత 1984-94 మధ్య కాలంలో ఆ సంస్థ డైరెక్టర్‌గా ఉన్నారు. సూపర్ కండక్టర్స్ గురించి పరిశోధనలు చేస్తునే నానోసైన్స్ వైపు కూడా దృష్టి పెట్టాడు. అయన రాసిన 'నానో వరల్డ్' పుస్తకం స్వీడన్ భాషలోకి వెళ్ళింది.

తన జీవిత లక్ష్యాలు రెండు - మంచి పరిశోధన చేయడం, భార్యను ఆనంద పరచడం అని అంటారు సి.ఎస్.ఆర్.రావు. 1960లో సి.ఎస్. ఆర్.రావు ఇందుమతిని వివాహం చేసుకున్నాడు. రావుగారు నల్లగా, పొట్టిగా, లావుగా ఉండగా, ఆయన భార్య చాలా అందంగా ఉంటారనీ, ఈ దంపతులను ఒథెల్లో, డిస్డిమోనా అని పిలుస్తారని రావు బంధువు, భరతనాట్యం కళా కారిణి ప్రతిభా ప్రహ్లాద్ ఇటీవల పేర్కొన్నారు. భార్యాభర్తలు చాలా అన్యోన్యంగా ఉంటారని కూడా రాశారు. అంగ్లం చదివి భార్య ఆసక్తిని ఎడ్యుకేషన్ వైపు మళ్ళించారు రావుగారు. ఇందుమతి స్వచ్ఛంద విరాళాలతో అపర్చునిటి స్కూల్ నిర్వహించారు. వివిధ పురస్కారాలలో లభించిన సొమ్ముతో ఒక ఫౌండేషన్ ప్రారంభించారు. ఇప్పుడు పలు రాష్ట్రాలలో పిల్లలకు సైన్స్ క్యాంప్‌లు నిర్వహిస్తారు ఈ దంపతులు. ఇంతవరకు యాభై వేల మంది పిల్లలు లబ్ధిపొందారు.

రావు చాలా పద్ధతి గల మనిషి. ఉదయం నాలుగున్నరకే లేచి ధ్యానం, యోగా చేసి నడకకు వెడతారు. ఈయనతో కలసి మార్నింగ్ వాక్ చేయాలని అతని విద్యార్థులు ఉవ్విళ్ళూరుతారు. భగవంతుడు ఉన్నాడనే రావు గారు మూఢనమ్మకాలు లేవంటాడు. ఇస్రో శాస్త్రవేత్తలు ఉపగ్రహం నమూనాను పూజకు పెట్టడం మూఢనమ్మకం అని ప్రకటించి, ఆలోచనాపరులకు ఆనందం కల్గించారు.


సి.ఎస్.ఆర్.రావు స్వీయచరిత్ర పేరు 'క్లైంబింగ్ ఏ లిమిట్ లెస్ ల్యాడర్'.

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో శాస్త్ర సాంకేతిక విషయాల సలహామండలిలో సభ్యులయిన రావు తర్వాత రాజీవ్‌గాంధీ, దేవ్‌గౌడ, ఐకె గుజ్రాయిల్ గార్లకు ఈ మండలి అధ్యక్షులుగా ఉండి, ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఒక దశలో ఈయన ఒక పదవిని తిరస్కరిస్తే ప్రధాని ఇందిరాగాంధీ ఆశ్చర్యపోయారట. చాలా కాలంగా సైన్స్ సంబంధించిన ప్రణాళికలకు వ్యూహకర్త ఈయనే. కస్తూరి రంగన్ ఈయన తమ ప్రతినిధి అంటారు. మంచి పరిశోధకులను తయారు చేయాలని ఐదు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థలు రావడానికి కారణం ఈయనే. సి.డాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్స్) సంస్థ ఈయన సలహామండలి ఆలోచనా ఫలితమే!

పదవీ విరమణ చేసిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసర్చ్ సంస్థను బెంగుళూరులో స్థాపించారు. టాటాలు, అంబానీలు వంటి వారు పరిశోధనకు కొంత ఖర్చు పెట్టాలంటారు. రాజకీయాలు సైన్స్ పరిశోధనకు అవరోధం కాకూడదంటారు. బాగా జీతాలు పొందే శాస్త్రవేత్తలు మరింత బాగా పని చేయాలంటారు. కన్నడిగుడైన రావు తన పరిశోధక విద్యార్థులు ఎవరూ కర్నాటక వారు కాదని చింతిస్తారు. తన 150 పిహెచ్‌డి శిష్యుల్లో ఎక్కువ భాగం బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కేరళకు చెందిన వారని కూడా అంటారు.

చింతామణి నాగేశ రామచంద్రరావు నిజంగా వర్తమాన భారతీయ సైన్స్ రంగానికి నిరంతర స్ఫూర్తి!

- డా॥ నాగసూరి వేణుగోపాల్



తెలుగు పలుకుబడులు-18

తరచుగా కనబడే అపభ్రంశాలు

- ***ఇటీవల ఒక దిన పత్రికలో శీర్షిక*** – 'వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గుర్తు తెలియని శవాలు లభ్యం'. అక్కడ ఇద్దరు కాదు వుండాల్సింది రెండు అని. ప్రాణం పోయాక మనిషి కూడా ఒక వస్తువుతో సమానం.
- ***కొందరు సాధారణంగా కీ॥శే॥ అని అసందర్భంగా పెడుతుంటారు***– నాటక రచయిత కీ॥శే॥ గురజాడ అంటారు. ఆ సందర్భంలో ఆ విశేషణం పొసగదు. నాటకం రాసింది కీర్తి శేషుడు గురజాడ కాదు. వేరే సందర్భంలో వాడచ్చు గాని యిక్కడ కాదు.
- ***కొత్త అంగవికలురలకు పింఛను మంజూరు*** – పింఛను కొత్తగా మంజూరైన సందర్భంలో ఆ విశేషణాన్ని అంగవికలురలకు ఆపాదించకూడదు. 'మరి కొంతమందికి అదనంగా పింఛను మంజూరు' అంటే సరిపోతుంది.
- 'కాలు విరిగిన పక్కింటి పిన్నిగారి కుర్చీ' అనడంలో అక్కడ కాలు విరిగింది పిన్ని గారికని స్ఫురిస్తుంది. పక్కింటి పిన్నిగారి కాలు విరిగిన కుర్చీ అంటే ప్రమాదం వుండదు.
- ***రవీంద్ర భారతిలో ఉదయం సంగీత విభావరి***– విభావరికి ఉదయానికి నప్పదు. విభావరి అంటేనే రాత్రి జరిగేదని.
- వరుస క్రమం, పట్టణ పౌరులు, పెచ్చు పెరిగింది లాంటి పదాలను వాడుతుంటారు. ఒకే పదాన్ని ఒకే అర్థంలో వాడడమే అవుతుంది. పౌరుడు అంటే పురంలో నివసించే వాడని అర్థం. వరుసన్నా, క్రమమన్నా ఒక్కటే కదా !
- 'నల్ల రేగడి నేల' అని అలవాటుగా రాస్తుంటారు. రేగడి అంటే నల్ల నేలని అర్థం. 'నిండు పున్నమ' అని వింటుంటాం. పున్నమ అంటేనే నిండు చంద్రుడు. జాను తెలుగు సంతకం మల్లాది రామకృష్ణ శాస్త్రి తరచు వాడే మాట 'అధిక చక్కని'. ఇది ఆయన కట్టుకున్న సొంత పదం. చాలా చాలా బావుందని చెప్పడానికి వాడేవారు. అదొక సరదా !

☆

భాష అనేది ఆ జాతికి ఒక కొండ గుర్తుగా వుండిపోతుంది. వేష భాషలతో ఫలానా ప్రాంతంగా గుర్తిస్తారు. ఇప్పుడు వేషం ప్రాంతీయ సంస్కృతిని తగ్గించుకుని ఏకతీరున కనిపిస్తోంది. భాష మాత్రం తన మౌలిక పలుకుబడిని మార్చుకోలేదు. ఒక తెలుగు వాడు ఏ భాషలో మాట్లాడినా తెలుగు వాడుగా గుర్తించవచ్చు. అలాంటి మాతృ భాషని విస్మరించడమంటే మన చిరునామాని కోల్పోయినట్లే ! విశాల ప్రపంచం అరచేతిలోకి వచ్చిన తరుణంలో ఎవరి ప్రత్యేకతని వారు కాపాడుకోవలసిన అవసరం మరింతగా వుంది. కనుముక్కు తీరుని బట్టి ఏ దేశీయుడో చెప్పగలుగుతాం. రంగుని బట్టి ప్రాంతాన్ని వూహించగలుగుతాం. కొన్నిసార్లు తలకట్టు గుర్తింపు తెచ్చి ఎక్కడి వారో చెబుతుంది. జాతికి పచ్చబొట్టు లాంటిది ఆ జాతి భాష పుట్టుమచ్చలాంటిది. వాటిని బలవంతంగా చెరిపేసు కోవడం మంచిది కాదు. మన భాషలో మనం మాట్లాడదాం. తర్వాతి తరానికి వారసత్వంగా తెలుగు భాష తీయందనాలను ముడుపు కట్టి అందిద్దాం.

-సంపాదకులు

సర్కారు అనువాదాలివి

"రాజ్యాలు మరియు సంఘ రాజ్యక్షేత్రాల మధ్య రేట్ల విషయంలో జరిగే పోరాటం ముగుస్తుంది. అవసరమైనచో రాజ్యాలు అధ్యాదేశం జారీ చేసి ఒకే రకమైన ఫ్లోర్ రేట్లను అమలులోకి తేవాలని సూచించబడింది" ఇదేదో ప్రాచీన



తాళపత్ర భాషగా భావించకండి. రెండువేల సంవత్సరం ఏప్రిల్ నెలలో మన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఒక బిల్లు సారాంశం మాతృ భాషలో.

అక్కడ రాజ్యాలు అంటే రాష్ట్రాలు, సంఘ రాజ్య క్షేత్రాలంటే కేంద్రపాలిత ప్రాంతాలు, అధ్యాదేశం అంటే ఆర్డినెన్స్, పోరాటం ముగుస్తుందంటే సమస్య పరిష్కారం అవుతుందని అర్థం (ట!). సెక్షన్ అనే మాటని పరిచ్ఛేదం అన్నారు. ఇది నాటి వ్యాకరణ గ్రంథాలలో కనిపిస్తుంది.

సంధి పరిచ్ఛేదం, సంజ్ఞా పరిచ్ఛేదం వగైరాలు. మరొక బిల్లులో "అధివేశనానసౌన మైనందువల్ల" లాంటి కంకర రాళ్ల లాంటి మాటల్ని వాడారు. చేసేది లేక సభ్యులు ఇంగ్లీష్ ప్రతిని చదువుకుని అర్థం చేసుకున్నారు.

తెలుగుని చాదస్తీకరించి భయపెట్టకూడదు. ఒక తరం క్రితం వరకూ ఆంగ్లేయుల పాలనలో వున్న మనకి ఇంగ్లీష్ కొత్త కాదు. నాడు కూడా మన భాషని మనం సంరక్షించుకున్నాం. కలెక్టర్, గవర్నర్ మాటల్ని కలికిటేరు. గవరనేరుగా తెలుగీకరించుకున్నారు మన జాన పదులు. బ్లాక్ గ్రానైట్ స్టోన్‌కి 'నల్లగన్నేరు శిల' అనేది మనవాళ్లు పెట్టిన పేరు. మనసుంటే మాట వుండకపోదు. ఆలోచించండి.

☆

ఆ 'తాయిలాల' రుచి

భాషా పదాలు జ్ఞాపకాలుగా మిగలడం దురదృష్టం.

చిన్నప్పుడు 'ఏనుగు– దర్జీ' అని ఒక కథ వుండేది. దర్జీ అంటే బట్టలు కుట్టే శిల్పి. ఇప్పుడు ఆ మాట మరుగున పడి పోయింది. టైలర్, టైలరింగ్ వచ్చేశాయి. చిత్రమేమంటే వృత్తుల పేరుతో పిలిస్తే తప్పుగా భావించిన తరుణంలో, అదే మాటని ఇంగ్లీష్‌లో అనడం మొదలు పెట్టారు.

మంగలి అంటే తప్పు, బార్బర్ అంటే తప్పుకాదు. చాకలి అంటే తప్పు. ధోబి అంటే సరే. ఇలాగ కొన్నింటిని విధిగా అలవరచుకోవలసి వచ్చింది. 'తలపని' అనే చక్కని తెలుగు మాట హెయిర్‌కటింగ్‌గా మారింది. ఎక్కడ చదువుకున్నావని ఒక విద్యార్థిని అడిగితే, "శాంస్క్రిట్ కాలేజ్‌లో అంకుల్" అన్నాడు. సంస్కృత కళాశాల అనడం పాపం, నామోషి కాబోలు.

ఎన్నో కూరలు పండ్లు రుచులు మార్చుకో పోయినా పేర్లు మార్చుకున్నాయి. పుచ్చకాయ ఎంత మంచి తెలుగు మాట ! ఎన్ని సామెతలున్నాయో ! ఒజ్జల పుచ్చకాయ అని ఒక మాటంటారు. అంటే గురువు గారిదని అర్థం. దీని అంతరార్థం ఏమిటంటే, పూర్వం పుచ్చకాయని శ్రోత్రీయులు తినేవారు కాదు, నిషేధం. అయితే గురువుగారికి యిష్టం. గోప్యంగా తినేవారు. కూడని దానిని ఎవరైనా చేస్తుంటే సమర్థింపు ఒజ్జల పుచ్చకాయ అంటారు. ఇందులో వ్యంగ్యం వుంది. పుచ్చపువ్వులాంటి వెన్నెల !

పుచ్చపాదు విస్తారంగా అల్లుకుంటుంది. పూలు తెల్లగా పెద్దగా వత్తుగా వుంటాయి. పుచ్చ పాదుని పగలు చూసినా వెన్నెలలా కనిపిస్తుంది. వెర్రి పుచ్చ ! పుచ్చతీగె వాతావరణం బాగుంటే ఆకు ఆకునా పిందె వేసి విపరీతంగా కాస్తుంది. అందుకే వెర్రికాపు కాసే పుచ్చని వెర్రి పుచ్చ అంటారు.

తెలుగులో వెర్రి అనేది ఎక్కువ. బాగా వాటికి విశేషణంగా వాడతాం. వాడికదో వెర్రి, వెర్రితిండి, వెర్రి కాపు, వెర్రి నెప్పి, వెర్రి ఖర్చు, వెర్రిగాలి యిలా వాడతాం. దీనికి పర్యాయంగా పిచ్చి కూడా వాడతారు. ఇప్పుడా పుచ్చకాయ పాపం వాటర్‌మిలన్ అయిపోయింది. నైజంగాని రుచి గాని మార లేదనుకోండి. ములగకాడ, ములగ కాయ – డ్రమ్‌స్టిక్‌గా మారింది. దేముడి పేరు పెట్టుకున్న రామ ములక – టమోటా, టొమెటో అయింది. చిరుతిళ్లు స్నాక్స్‌గా మారాయి. చిన్నప్పటి తాయిలాలు అంటే బెల్లం ముక్కలు, జీళ్లు, తేగలు, శనగపప్పు యివన్నీ ఎక్కడికి పోయాయో ? కోడి మాంసం చికెన్ అయింది. వేట మాంసం మటన్‌గా మారింది. 'సంజుళ్ళు' లేవిప్పుడు.

చక్కని చిక్కని తెలుగు కవిత్వం రాసి పేరు తెచ్చుమన్న వారు సైతం పొయిట్రీ పొయిట్రీ బుక్ అంటుంటే ఏమిటోగా అనిపిస్తుంది. పుస్తకాన్ని తోసిరాజని "బొక్కు" వచ్చింది. ఇదొక రకం తెలుగు మాట. గత జలసేతు బంధనం కాబోదు మనమంతా తలుచుకుంటే జీవనది మళ్లీ వెనక్కి వస్తుంది.

☆

పొడుపు

ఒకే అక్షరం ఆకు, ఒకే అక్షరం కాయ.

విడుపు

[illegible]

తిక్కన

మహాభారతాన్ని సింహ భాగం అనువదించిన తిక్కన తెలుగు పదాలపై ఎందరో పరిశోధనలు చేశారు. తమ్మి మొగ్గరం అనే మాటని (పద్మవ్యూహాన్ని) తెలుగులోకి దించి వాడారు. తమ్మిపూలు చక్కని తెలుగు మాట. వ్యూహాన్ని మొగ్గరం అన్నారు. వాడుక భాషలో మొగ్గరాన్ని మొగ్గ (పిల్లి మొగ్గ) అంటారు.

అన్నమయ్య పద కవితలలో చక్కని తెలుగు వినిపిస్తుంది. అనాటి జానపద భాషని సజీవంగా పట్టుకుని తన కీర్తనలలో పొదిగి నిక్షిప్తం చేశారు. వేలాది అన్నమయ్య పదాలలో అచ్చమైన తెలుగు పలుకుబడులు నేటికీ సజీవంగా వున్నాయి.

తర్వాతి ఆధునికులలో గురజాడ అప్పారావు తన రచనల్లో మంచి తెలుగుని వాడారు. గిడుగు రామ్మూర్తి జీవితాన్నే తెలుగు కోసం ధారపోశారు.

నాటు తెలుగుని రుచి చూపించారు అదిభట్ల నారాయణదాసు. మల్లాది రామకృష్ణ శాస్త్రి 'దోదమ్మి' పేరుతో ఒక కథ రాశారు. దోదమ్మి అంటే 'బూమరాంగ్' అనే వేట ఆయుధం. గాలివాటుకి అనువుగా చెక్కిన కొయ్య పరికరం. దీన్ని ముందుకు విసిరితే అది వెళ్లి తిరిగి వెనక్కు తిరుగుతుంది. ఏదైనా వ్యూహం వెనక్కి వస్తే బూమరాంగ్ అయిందంటారు.

పెద్దలు చక్కని మాటల్ని తెలుగులోకి తేవడమే కాదు, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. ఆ కొత్త మాటలు వాడుకకి అనువుగా, సరళంగా వుండాలి. అప్పుడే జనంలోకి వెళ్తాయి.

– శ్రీ

విరామ చిహ్నాలు

ఏ భాషకైనా విరామ చిహ్నాలు చాలా ముఖ్యం. అందునా తెలుగు భాషకి మరీ ప్రాణం. ఒక దీర్ఘం, ఒక పొల్లు అర్థాన్ని తలక్రిందులు చేస్తాయి. కామా, ఫుల్‌స్టాప్ కూడా అంతే. అక్కర్లేని చోట ఎడం వచ్చినా, కావల్సిన చోట రాకున్నా అర్థాలు పెడర్థాలుగా మారతాయి. కొన్ని సరదా వుదాహరణలు –

'ఇచ్చట వేడిశే నీరు లభించును'

వాళ్ల అసలు భావం – 'ఇచ్చట వేడి తేనీరు లభించును'

'మాసిన మా పేజీ'

వాళ్ల వుద్దేశం – 'మా సినిమా పేజీ'

ఒక ధర్మ సత్రం వద్ద కనిపించిన బోర్డు –

'భోజనము మరియువ సతి సౌకర్యము'

'భోజనము మరియు వసతి సౌకర్యము' అని వారి మనోభావం.

అందుకే విరామ చిహ్నాల విషయాలలో చాలా జాగరూకతతో వుండాలి.

☆

మనవి

దాదాపు రెండేళ్లుగా యీ శీర్షిక మీ ముందుకి వస్తోంది. మీ సహకారాన్ని కలుపుకుని యీ శీర్షిక విజయవంతంగా నడుస్తోంది. పాఠకుల నుంచి యింకా ఎక్కువగా సలహాలను సూచనలను ఆశిస్తున్నాం. ఒకే నది ఎన్నో పాయలు. ఒకే భాష ఎన్నో మాండలీకాలు. వాటిని అందరితో పంచుకోండి కొత్తమాటల్ని పరివ్యాప్తం చేయండి పాత మాటల్ని గుర్తు చేయండి. నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, సమాచార భవన్, ఏ.సి. గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500 028

యాది మర్పు

- తెలిదేవర భానుమూర్తి

నాకు ఈ నడ్మ యాది మర్పు ఎక్వ అయ్యింది. ఎందుకు ఎక్వ అయ్యిందో ఎంతగనం సోంచాయించినా సమజైతలేదు. ముసలోనివి అయితున్నందుకు యాది మర్పు ఎక్వైందని కొంత మంది అన్నరు. పండ్లన్ని ఊసిపోయినా యాది మర్పు ఎక్వైతదని ఇంకొంత మంది అన్నరు. నా పండ్లు గట్టిగనే ఉన్నయి. దినాం ఒక్క బాసనే మాట్లాడెటోల్లకు యాది మర్పు ఉంటదని కొందరు జెప్పింద్రు. నేను పట్నంల ఉండె బట్కె దినాం రొండు బాసలు మాట్లాడుతుంట. ఎందుకో ఏమో గీ నడ్మ అన్నియాది మరుస్తున్న.

మొన్న కూరగాయలు గొనెతందుక్క బజార్కు బోయిన. బజార్ల మా దోస్తు సత్నారి గాడు గల్సిండు. ఇద్దరం గల్సి హోటల్కు బోయినం. చాయ్ దాగినం. ముచ్చట బెట్టుకుంట గూసున్నం. నా కొడ్కుతోని అన్కి పని బడ్డట్టున్నది.

"వారీ మీ పెద్దోని సెల్ నంబర్ జెప్పరా" అని అడు అన్నడు.

"నాకు యాదికి లేదు రా"

"జెర యాజ్జేసుకో"

ఎంతగనం కోసిస్ జేసినా మా వోని సెల్ నంబర్ నాకు యాద్కి రాలేదు.

"యాదికొస్త లేదురా"

"వారీ నీ సెల్‌ల మీ వోని నంబర్ ఉంటది గదా" అని సత్నారి అన్నడు.

"ఉంటది" అన్కుంట నా పైంటు కీసల చెయ్యి బెట్టిన. గాని నా సెల్ లేదు. లేసి నిలబడి అన్ని కీసలల్ల చెయ్యి బెట్టి జూసినా పాయిద లేకుంట బోయింది.

"ఏమైందిరా" అని సత్నారి అడిగిండు.

"నా సెల్ ఇంట్లనే యాది మర్సి వొచ్చిన. ఇంటికి బోయినంక నీకు ఫోన్ జేసి మా వోని సెల్ నంబర్ జెప్తరా" అని అంటె -

"వారీ నీ పేరన్న నీకు యాదికున్నదా?" అని అడు అడిగిండు.

"యాడ నా పేరును గూడ యాది మరుస్తనేమోనని నాకు బయమైతున్నది" అని అన్న .

"ఎందుకన్న మంచిది ఒకపారి డాక్టర్ తాన్కి బోయిరారా" అని సత్నారి అన్నడు.

"డాక్టర్ కాడ్కి బోయి. గాయిన తాన్కి ఎందుకు బోయిననో యాది మరుస్తనేమోరా" అని అంటె -

"ఎవరి నన్న నీ యెంట దోల్కబో" అని గాడు అన్నడు.

"నువ్వు జెప్పినట్లే జేస్త"

జెరసేపు ముచ్చటబెట్టి అడు బోయిండు. అడు బోయినాంక కిరాన దుక్నంకు బోయిన. కందిపప్పు, పల్లీలు గొన్న, గవి దీస్కోని ఇంటికి బోయిన.

"కూర గాయలు దెమ్మని జెబ్తె గివెందుకు దెచ్చింద్రు" అని నా పెండ్లాం అడిగింది.

"బజార్కు బోంగనే యాది మర్సిన" అని అంటె-

"బజార్ల ఎవరన్న గల్సింద్రా?" అని నా పెండ్లాం అడిగింది.

"సత్నారి గల్సిండు"

"గాయినతోని ముచ్చట బెట్టుకుంట ఏం దేవాల్నో యాదిమర్సింద్రు గంతేనా"

"అవ్. గంతే. ఇప్పటి సంది బజార్ల కెల్లి ఏమన్న తెచ్చేదుంటె ఒక చిట్టిల రాస్కోని గొంచబోత"

"చిట్టి రాసి ఏం పాయిదా. రాసిన చిట్టిని ఇంట్లనే యాది మర్సి బజార్కు బోతరు. ఇంతకు నేనెవ్వరో మీ యాది కున్నదా"

"ఎందుకు లేదు. నువ్వు నా పెండ్లానివి"

"చెల్లె అని యాదంటరో నని బుగులు బడ్డ"

చెడ్డ దినాలను యాది మర్వాలె. మంచి దినాలను యాదికుంచుకోవాలని అంటరు. గాని నేను అన్ని దినాలను యాది మరుస్తున్న. ఇయ్యాల ఏం తారీకు. ఇయ్యాలే దినం అని ఎవ్వరన్న అడిగితె సెల్ అన్న సూడాలె, కేలండర్ అన్న సూడాలే.

మా ఇంటి ముంగట యాప చెట్టున్నది. మా పక్కింట్ల గూడ గదే చెట్టున్నది. ఒకపారి ఏందో



ముగ్గులతో స్వాగతం



ముగ్గులతో ప్రతి పల్లె
ఆహ్వానం పలుకుతోంది
రంగులద్ది.... గొబ్బెమ్మలు పేర్చి
మరీ మరీ రమ్మంటోంది !
చుట్టం వస్తే ఒక్క పూటకే
ముఖం చూసుకునే సంస్కృతి
పల్లెకి లేదండోయ్ !
గడ్డ కట్టించే చలిని
భోగిమంటతో తరిమెయ్యడం
తెలుసుకోండోయ్ !
పసి తనానికి
ఆశీర్వచనాలతో
భోగిపళ్ళ సరదా తీర్చండి !
తలంటోసుకుని... కొత్త బట్టలేసుకుని
టైములేదనే మాటలేకుండా
కలసి కమ్మని అనుభూతుల్ని
కలబోసుకోండి !
డైటింగులని పక్కకి పెట్టి
రోగాలకి చెక్ చెప్పి
రక రకాల పిండి వంటలు
ఆరారగా తినండి !
గాలిపటాలతో
మీ మనసుని కాసేపు పక్షిని చేసి
ఆకాశంతో మంతనాలాడండి !
కమ్మని దృశ్యాల్ని
కంటితో క్లిక్ చేసి
హృదయపు ఆల్బంలో భద్రపరచుకుని
జీవితకాల మధురోహల్ని
మననం చేసుకుంటా
మళ్ళీ మరమనిషిలా
మనీ మనిషిలా బ్రతకడానికి
పట్నానికి రండి !
వదల్లేక వదల్లేక వస్తున్నారని
మాకూ తెలుసండి
కానీ తప్పదు కదండి !

–ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఆలోచన జేసుకుంట జేసుకుంట మా పక్కింట్లకు బోయిన. గాడున్నామె నన్ను గుర్తుబట్టింది.

"ఏమన్న పని మీదొచ్చిండ్రా?" అని అడిగింది.

"లే. మా ఇల్లను కోని మీ ఇంట్ల కొచ్చిన" అని అంటి–

"మీ లెక్కనే నా మొగడు గూడ అన్ని యాది మరుస్తుంటడు" అని గామె అన్నది.

దినాం నాకు తెల్లారి ఐదుగొట్టంగనే లేసి వాకింగ్‌కు బోవుడు అల్వాటు. వారం దినాల కింద మా కొడ్కు దొరకు బోయిండు. అగ దాంతోని మా కోడలు గూడ తల్లిగారింటికి బోయింది. ఇంట్ల నేను నా పెండ్లామే ఉన్నం. ఎప్పటి లెక్కనే గాదినం గూడ తెల్లారే నిద్ర లేసిన. అర్రల నా పెండ్లాం బడుకున్న సంగతి యాది మర్సి బెడ్ రూం తలుపు బెట్టి గొల్లె మేసిన. బూట్లు దొడుక్కొని ఇంటి తల్పు బెట్టి వాకింగ్‌కు బోయిన.

నేను బోయిన జెరసేపటికి నా పెండ్లాం నిద్ర లేసింది. అర్రల కెల్లి ఇవుతలకు వొచ్చేతందుకు కోషిస్ జేసింది. గని తల్పు గొల్లెం బెట్టి ఉండెబట్కి పాయిద లేకుంట బోయింది. తల్పు దియ్యుండ్రి, తల్పు దియ్యుండ్రి అని నోరు నొచ్చేదాంక గామె లాసిగ వొర్లింది. అటెంకల ధన్ ధన్ మని తల్పు గొట్టింది. సరింగ గప్పుడే మా పక్కింటాయిన పాల పాకిట్ దీస్కోని మా ఇంటి ముంగటి కెల్లి బోతున్నడు. గాయిన మా ఇంట్ల కెల్లి వొస్తున్నప్పుడు ఇన్నడు. గని మా ఇంట్లకు రాలేదు. గాయిన మా ఇంటి ముంగటనే నిలబడ్డడు. నిలబడుడే గాకుంట వొచ్చె పోయె టోల్లను రుకాయించి –

"గీ ఇంట్లకెల్లి శాన సేపటి నుంచి ధన్ ధన్ మని సప్పుడొస్తున్నది. ఏమైందో సమజైత లేదు" అని గాయిన అన్నడు.

"ఇంట్లకు బోయి సూద్దామా?" అని ఒకడు అడిగితే–

"మనం బోతె బాగుండదు" అని గాయిన అన్నడు.

"గామె మొగడు గామెను గొడుతున్నడేమో?" అని ఒకడు అంటె.

"ఒగాల్ల మొగడు గొడుతుంటె గామె వామ్మో, వామ్మో అని మొత్తుకుంటది గదా" అని గాయిన అన్నడు.

"అవ్. గని గామె మొత్తుకుంట లేదు. ధన్ ధన్ మని సప్పుడొస్తున్నది" అని ఇంకొకడన్నడు.

"మనకు తల్కాయ నొప్పి ఎందుకు, పోలీసోల్లను బిలుద్దాం. అంత గాల్లే సూస్కుంటరు" అని మా పక్కింటాయిన అన్నడు.

"గట్లయితె అమీన్ కచేరికి ఫోన్ గొట్టుండ్రి" అని ఒకడన్నడు.

గాయిన అమీన్ కచేరికి ఫోన్ గొట్టిండు. సరింగ గప్పుడే నేను ఇంటి కాడ్కి బోయిన. మా ఇంటి కాడ జెన మెందుకున్నరో నాకు సమజ్ గాలేదు.

"ఏమైంది?" అని అడిగిన.

"మీ ఇంట్ల కెల్లి ధన్ ధన్ మని సప్పుడినొస్తున్నది" అని మా పక్కింటాయిన అన్నడు.

నా పెండ్లాం అర్రల ఉన్నది యాది మర్సి, మా బెడ్ రూం గొల్లెం బెట్టిన సంగతి నాకు యాదికొచ్చింది.

"నా పెండ్లాం బెడ్ రూంలనే ఉండంగ యాదిమర్సి గొల్లెం బెట్టి వాకింగ్ బోయిన" అని అనంగనే –

"నీ యాది మర్పుతోని మమ్ములను పరేశాన్ జేస్తివి గదా" అని మా పక్కింటాయిన అన్నడు.

గొల్లెం దియ్యంగనే అందరి ముంగటనే నా పెండ్లాం తిట్టిన తిట్లు తిట్టకుంట తిట్టిందని ఎట్ల జెప్పాలె.

☆

మూడవ విడత 'రచ్చబండ'



ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 11 నుంచి 26 వరకు నిర్వహించిన మూడవ విడత 'రచ్చబండ' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. తుపాను, భారీ వరదల కారణంగా కొన్ని జిల్లాలలో ఆలస్యమైనప్పటికీ అన్ని జిల్లాలలో 'రచ్చబండ'ను నిర్వహించి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించడమే కాకుండా, వాటి పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేశారు.

వృద్ధాప్య పింఛన్లతో పాటు వితంతువులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులకు సంబంధించి రచ్చబండలో 11.41 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు 7.27 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తూ లేఖలు అందజేశారు. అలాగే 80 వేల మంది వికలాంగులకు కూడా ఇదే కార్యక్రమంలో పింఛన్లు మంజూరు చేశారు.

రేషన్‌కార్డులకు సంబంధించి కూడా మూడవ విడత రచ్చబండలో భారీ సంఖ్యలో దరఖాస్తులు అందాయి. రేషన్ కార్డుల జారీలో సాంకేతిక అవరోధాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి కూడా రేషన్ కూపన్లు అందజేశారు. 15.22 లక్షల మందికి లబ్ధి చేకూరేలా 10.77 లక్షల కూపన్లు పంపిణీ చేశారు. కార్డుల నుంచి వివిధ కారణాల వల్ల పేర్లు తొలగించడంతో ఆ కేటగిరికి చెందిన మరో 3.10 లక్షల మందికి కూడా కూపన్లు అందజేశారు. మొత్తం మీద మూడవ విడత రచ్చబండలో 13.87 లక్షల కూపన్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రేషన్‌కార్డులో వయస్సుకు సంబంధించిన సారి కూడా రచ్చబండలో ఆ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది.

గతంలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి వాటిలో 13.65 లక్షల మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో 8.25 లక్షల మందికి ఇంటి నిర్మాణాలకు సంబంధించిన ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం 'రచ్చబండ'లో కొత్తగా 20.12 లక్షల దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వివరించారు.

7 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు

తప్పులను సరిదిద్దాల్సిందిగా 91 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే కొత్తగా రేషన్‌కార్డుల కోసం 2.14 లక్షల దరఖాస్తులను ఈ 'రచ్చబండ'లో స్వీకరించారు.

బలహీనవర్గాలకు పక్కా ఇళ్ళ నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ



ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన బంగారు తల్లి పథకానికి కూడా రచ్చబండలో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 76 వేల మంది అప్పటికి దరఖాస్తు చేసుకోగా వారిలో 55 వేల మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కుటుంబాలకు ప్రయోజనం కల్పించే నిధికోసం 12,539 మందిని ఈ విడత 'రచ్చబండ'లో ఎంపిక చేశారు.

ఎస్సీల నివాస ప్రాంతాలలో కరెంటు బిల్లుల బకాయిలు ఇబ్బందిగా మారగా, మూడవ విడత 'రచ్చబండ'లో 14.16 లక్షల ఇళ్ళకు సంబంధించిన 131.62 కోట్ల రూపాయల మేర బకాయిలు చెల్లించారు. అలాగే ఎస్టీలకు సంబంధించిన 4.45 లక్షల ఇళ్ళకు సంబంధించి మరో రూ. 43.62 కోట్ల బకాయిలను కూడా చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ఈ సందర్భంగా ప్రకటించింది.

మూడవ విడత 'రచ్చబండ' సందర్భంగా అన్ని జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 1309 ప్రాంతాలలో 457 శంకుస్థాపనలు చేయగా, 181 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

- వెన్నూరి గణేశ్

నవంబర్ 22 : సచివాలయంలో రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు తదితరులు కలుసు కున్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు కలుసుకున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎవరెస్టు అధిరోహణకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ముచ్చటించి అభినందనలు తెలిపారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో ఇండియన్ పవర్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. జెన్‌కో మాజీ జీఎండీ ప్రభాకరరావు, ఏపీ జెన్‌కో ఎండీ కె. విజయానంద్‌లకు అవార్డులు అందజేశారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసన సభ్యులు, తదితరులు కలుసుకున్నారు.

నవంబర్ 23 : హెలెన్ తుపాను కారణంగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రతిపాదికన సహాయ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నవంబర్ 24 : మూడవ విడత 'రచ్చబండ' కార్యక్రమంలో పాల్గొనడానికి అనంతపురం జిల్లాకు బయలుదేరివెళ్ళారు. అనంతపురం జిల్లా నార్పల మండలం చేరుకొని అధికారులు, అనధికారులతో సమావేశమయ్యారు. నార్పల మండలంలోని సభా ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు, శిలా ఫలకాలు ఆవిష్కరించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తెదేపా, సీపీఎం నాయకులు వేరువేరుగా కలుసుకొని తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి పత్రాలు అచ్చారు. అనంతపురం జిల్లా నుండి హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లాకు చేరుకున్నారు. చిత్తూరు జిల్లా ఒలుకూరు గ్రామంలో అధికారులు, స్థానిక నేతలతో సమావేశమయ్యారు. అనంతరం వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలికిరి నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. నియోజక వర్గ సర్పంచులతో సమావేశమయ్యారు. రాత్రికి స్వగ్రామం నగిరిపల్లెలోని తన నివాసంలో బస చేశారు.

నవంబర్ 25 : నగిరిపల్లెలోని తన నివాసంలో పలువురు స్థానిక నేతలు, అధికారులు, స్థానిక ప్రజలు కలుసుకుని ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ పరిధి శీలంవారి పల్లెలో శ్రీకాలభైరవస్వామిని దర్శించుకున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో కడప జిల్లాకు బయలు దేరారు. కడప జిల్లా రాయచోటిలో అధికారులు, స్థానిక నేతలతో సమావేశమయ్యారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసి రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు రోజులా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యమంత్రి పదవి మూడేళ్ళు పూర్తైన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ్యులు అధికారులు, తదితరులు కలుసుకొని శుభకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మూడు సంవత్సరాల పాలనపై మాట్లాడారు. 'లెహర్' తుపానుపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

నవంబర్ 26 : క్యాంపు కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ ఫొటోవాల్టిక్ సిస్టమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏపి ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సౌరవిధానం-2012 అమలుకు చర్యలు వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో అధికారులను



ఆదేశించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'లెహర్' తుఫానుపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

నవంబర్ 27 : హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న పౌల్ట్రీ ఇండియా-2013 ప్రదర్శనను ప్రారంభించారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రముఖ చాక్లెట్ కంపెనీ క్యాడ్‌బరీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా శ్రీసిటీలో నెలకొల్పే ఉత్పాదక పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. 'లెహర్' తుపానుపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు వేగవంతం చేయాలని అధికారుల ను ఆదేశించారు. మౌలిక సదుపాయలు మరియు పెట్టుబడులపై ఆ శాఖ అధికారులు, మంత్రులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

నవంబర్ 28 : ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతికి బయలుదేరి వెళ్ళారు.

నవంబర్ 29 : రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు పంటనష్టంపై, ప్రభుత్వ చర్యలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. సచివాలయంలో మంత్రులు, శాసనసభ్యులు తదితరులు కలుసుకున్నారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీ సుదర్శన్‌రెడ్డి సమావేశమయ్యారు. కృష్ణా జలాల వినియోగంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై చర్చించారు. క్యాంపు కార్యాలయంలో గుజరాత్ మంత్రుల బృందం కలుసుకున్నారు. గుజరాత్‌లో ఏర్పాటు చేస్తున్న సర్దార్‌పటేల్ విగ్రహం నిర్మాణానికి ఉక్కు సేకరణ కోసం రాష్ట్రం వంతుగా సహకారం అందించాలని కోరారు.

నవంబర్ 30 : మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అటవీశాఖ అధికారుల రెండురోజుల సదస్సును ప్రారంభించారు. రాష్ట్రంలో విద్యుత్‌పై సచివాలయంలో ఉన్నతాధికారులతో సంక్షిప్త సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పంటనష్ట తీవ్రతపై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌లతో నేరుగా మాట్లాడి జిల్లాలా వారీగా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో అత్యుత్తమ పరిపాలన అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉన్నట్టు 'ఇండియాటుడే' ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసికి నూతన ఎండీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి జె. పూర్ణ చందర్ రావు క్యాంపు కార్యాలయంలో కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్ 1 : ఒక రోజు రాష్ట్ర పర్యటనకు వచ్చిన గోవా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసనసభ్యులు తదితరులు కలుసుకున్నారు.

డిసెంబర్ 2 : డీఎస్సీ-2012 పై సచివాలయంలో ఆర్థిక, విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో, క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ్యులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 3 : హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 'వికలాంగుల పిలుపు' ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్నారు.

డిసెంబర్ 4 : హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగు నీటి పారుదల మండలిపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు, మంత్రులు తదితరులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 5 : క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర

ప్రాంత మంత్రులు సమావేశమయ్యారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ కల్యాణ్ జ్యోతి సేన్ గుప్తా నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

డిసెంబర్ 6 : హైదరాబాద్ నాంపల్లిలో కొత్తగా నిర్మించిన భూపరిపాలన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ భూముల సమగ్ర వివరాలతో కూడిన 'సర్కారు భూమి' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. రవీంద్ర భారతిలో ఏడో విడత భూ పంపిణీ కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసనసభ్యులు తదితరులు కలుసుకున్నారు.

డిసెంబర్ 7 : హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుండి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి పులిచింతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హెలికాప్టర్‌లో బయలు దేరి వెళ్ళారు. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం జడపల్లి తాండాలో పులిచింతల ప్రాజెక్టును ప్రారంభోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించి జాతికి అంకితం చేశారు. అనంతరం క్రస్ట్ గేట్లను ప్రారంభించారు. కృష్ణా జిల్లా విజయవాడ స్వరాజ్యమైదాన్‌కు చేరుకొని బహిరంగసభలో పాల్గొన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు.

డిసెంబర్ 8 : క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసనసభ సభ్యులు తదితరులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 9 : మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. తన సొంత మండలమైన కలికిరి తహశీల్దార్‌తో తొలిసారి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్యాంపు కార్యాలయంలో, సచివాలయంలో మంత్రులు, శాసనసభ్యులు తదితరులు వేరువేరుగా కలుసు కున్నారు.

డిసెంబర్ 10 : కృష్ణా జలాలకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సచివాలయంలో అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించారు. క్యాంపు కార్యాలయంలో, సచివాల యంలో మంత్రులు, శాసనసభ్యులు, కార్యకర్తలు తదితరులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 11 : రాజ్‌భవన్‌లో గవర్నర్ శ్రీ ఈ ఎస్‌ఎల్ శ్రీ నరసింహన్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత నేతలు తదితరులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 12 : శాసనసభ, శాసనమండలి సమావేశాలలో పాల్గొన్నారు. శాసనసభలో నెల్సన్ మండెలాకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులు శ్రీ దిగ్విజయ్‌సింగ్‌తో హైదరాబాద్ లేక్‌వ్యూ అతిథి గృహంలో సమావేశమయ్యారు. సచివాల యంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందంతో సమావేశమయ్యారు. క్యాంపు కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి శ్రీ సురేష్‌కుమార్ కలిశారు. తెలంగాణ ముసాయిదా బిల్లు ప్రతుల ను ముఖ్యమంత్రికి అందజేశారు. క్యాంపు కార్యాల యంలో సీమాంధ్ర మంత్రులు, శాసనసభ్యులు తదితరులు సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మహంతి సమావేశమయ్యారు.

డిసెంబర్ 13 : శాసనసభ, శాసనమండలి, సమావేశంలో పాల్గొన్నారు. కృష్ణా నదీ జలాల పంపిణీ పై ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై అఖిలపక్షంతో సహా కలిసేందుకు సమయం ఇవ్వాలని ప్రధాన మంత్రి శ్రీ మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత నేతలు వేరువేరుగా సమావేశమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు శ్రీ బొత్స సత్యనారాయణ నివాసంలో శ్రీ దిగ్విజయ్ సింగ్‌తో కల్సి విందుకు హాజరయ్యారు.

డిసెంబర్ 14 : క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు వేరువేరుగా కలుసుకున్నారు.

డిసెంబర్ 15 : క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత నేతలు, తదితరులు కలుసుకున్నారు.

డిసెంబర్ 16 : అనారోగ్య కారణంగా క్యాంపు కార్యాలయంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకున్నారు.

డిసెంబర్ 17 : శాసనసభ, శాసనమండలి సమావేశాలలో పాల్గొన్నారు. శాసనసభ ఆవరణలోని కార్యాలయంలో తెలంగాణ మంత్రులు సమావేశ మయ్యారు. అనంతరం సీమాంధ్ర మంత్రులు సమావేశమయ్యారు. క్యాంపు కార్యాలయంలో సీమాంధ్ర ప్రాంత నేతలు కలుసుకున్నారు. అనంతరం వంశధార నది నుండి 8 టీఎంసీలు నీరు వాడుకునేందుకు ఏపీకి ట్రిబ్యునల్ తీర్పుపై ఆనందం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కె. కేశవరావు సతీమణి వసంతకుమారి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం కేశవరావు నివాసానికి వెళ్ళి ఆమె పార్థ దేహానికి నివాళు లర్పించి శ్రీ కేశవరావును పరామర్శించారు.

డిసెంబర్ 18 : శాసనసభ, శాసనమండలి సమావేశాలలో పాల్గొన్నారు. అనంతరం శాసనసభ ఆవరణలోని తన కార్యాలయంలో మంత్రులు, శాసనసభ్యులు తదితరులు వేరువేరుగా కలుసు కున్నారు. చిత్తూరు జిల్లా శేషాచలం అడవుల్లో జరిగిన సంఘటనపై ఎర్రచందనం విస్తరించి వున్న నాలుగు జిల్లాల్లో అటవీశాఖ అధికారులపై దాడులు మొదలగు అంశాలపై క్యాంపు కార్యాల యంలో అటవీశాఖ అధికారులు, మంత్రి, పోలీసు అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, కఠినచర్యలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబర్ 19 : శాసనసభ, శాసనమండలి సమావేశాలలో పాల్గొన్నారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్నా రాష్ట్రపతి శ్రీ ప్రణబ్‌ముఖర్జీకి హకీంపేట ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో పుష్పగుచ్ఛం అచ్చి స్వాగతం పలికారు. న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. రాత్రికి ఏపీ భవన్‌లో బస చేశారు.

డిసెంబర్ 20 : ఢిల్లీ ఏపీ భవన్‌లో అఖిలపక్ష నేతలతో సమావేశమయ్యారు. అనంతరం అఖిలపక్ష నేతలతో కల్సి ప్రధానమంత్రి శ్రీ మన్మోహన్ సింగ్ నివాసానికి వెళ్ళి కృష్ణా నదీ జలాలపై జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఒక మెమోరాండంను అందజేశారు. ప్రధానితో చర్చించారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పురోగతి దిశలో పయనిస్తున్న రాష్ట్రాలకు 'ఇండియా టుడే' గ్రూపు సంస్థలు అవార్డులు ప్రకటించాయి. పెద్ద రాష్ట్రంలో అత్యుత్తమ పరిపాలన అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. ఈ అవార్డును కేంద్ర మంత్రి శ్రీ జైరాం రమేష్ చేతుల మీదుగా ఢిల్లీలో అందుకున్నారు. అనంతరం 'హు విల్ విన్ ఇన్ 2014-ది ప్రామిస్ ఆఫ్ గ్రోత్ వర్సెస్ రియాలిటీ ఆఫ్ పాపులరిజమ్' అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకొని తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు

డిసెంబర్ 21 : క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీమతి గీతారెడ్డి అధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఇతర విద్యాసంస్థల నుంచి 500 మంది విద్యార్థులు 'ఇండియా టుడే' గ్రూప్ సంస్థల నుంచి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రిని కల్సి అభినందనలు తెలిపారు.



హైదరాబాద్‌లోని హోటల్ గ్రాండ్ కాకతీయలో చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో నిర్మించనున్న పెప్సీ కంపెనీకి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల జాతీయ శిక్షణ సంస్థ నిమ్స్‌మే స్వర్ణోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థ సావనీర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్ జూబ్లీహాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ సంబరాలలో పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

– ఎ.మధుసూదనరెడ్డి

శాసనసభ నివాళి

జాతి వివక్ష నుంచి దక్షిణాఫ్రికా ప్రజలను విముక్తులను చేసిన మహనీయుడు, నల్లజాతి సూరీడు నెల్సన్ మండేలాకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ డిసెంబర్ 12 న ఘనంగా నివాళులు అర్పించింది.

నెల్సన్ మండేలా మృతికి సంతాపంగా సభలో సభ్యులు అందరూ ఒక నిమిషం మౌనం పాటించారు.

అనంతరం ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా మృతికి సంతాపం తెలిపారు. మండేలా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో మండేలా గురించి ఏమన్నారంటే....


"మండేలా జాతి వివక్షపై రాజీలేని పోరాటం చేశారు. నల్ల జాతీయులపై జరిగే వివక్షపై తన జీవితాంతం పోరాటం చేసిన మహాయోధుడు మండేలా. సుమారు 30 ఏళ్ళపాటు జైలు జీవితం గడిపిన మండేలా ప్రపంచ ఆదర్శపురుషుల్లో ఒకరు.

"ప్రపంచ వ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకునేలా మండేలా చేసిన పోరాటం కొన్ని కోట్ల మందిని ఆకర్షించింది. అందువల్లే భారత ప్రభుత్వం 'భారత రత్న' బిరుదు గౌరవించింది. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో 50కు పైగా విశ్వ విద్యాలయాలు మండేలాకు గౌరవ డాక్టరేట్ పట్టాలు ప్రకటించి గౌరవించాయి".

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించేందుకు కేంద్రమంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం మేరకు రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు -2013' పై ప్రతి సభ్యుడి అభిప్రాయాలను కోరుతూ రాష్ట్రపతి పంపిన బిల్లు అందినట్లు శాసన సభ కార్యదర్శి శ్రీ రాజాసదారాం శాసనసభలో ప్రకటించారు. దీనిపై సభలో చర్చించి ప్రతి అంశంపైనా సభ్యుల అభిప్రాయలను వివరిస్తూ 40 రోజుల్లోగా (జనవరి 23 లోగా) బిల్లును రాష్ట్రపతికి పంపించాల్సి ఉంటుందని బిల్లులో పేర్కొన్నట్లు కార్యదర్శి ప్రకటించారు.

డిసెంబర్ 12 న ప్రారంభమైన శీతాకాల సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈ బిల్లుపై చర్చించేందుకు జనవరి 3 నుంచి మళ్ళీ శాసన సభ సమావేశాలు ప్రారంభమవుతాయి.





"మండేలా మన మహాత్ముడు గాంధీ స్ఫూర్తితో అహింస, సహాయ నిరాకరణ వంటి ఉద్యమాలు కొనసాగించారు. అయన మృతికి నేను ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష నేత శ్రీ చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నెల్సన్ మండేలా నల్లజాతికి వెలుగునిచ్చిన సూరీడు వంటి వారని కొనియాడారు. నల్ల జాతీయుల కోసం తన జీవితంలో మూడొంతుల భాగాన్ని జైలులో గడిపిన మహనీయుడు మండేలా అని శ్రీ చంద్రబాబు అభివర్ణించారు. మండేలా జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని పేర్కొంటూ, మండేలా జైలులో ఉన్నప్పుడే తల్లి మరణించిందని, తనయుడు ప్రమాదంలో మరణించారని అయినా తన జాతి కోసం ఆత్మస్థైర్యం కోల్పోకుండా మొక్కవోని దీక్షతో పోరాటం చేశారన్నారు.

మహాయోధుడు మండేలా

టి. ఆర్.ఎస్. తరఫున శ్రీ కె. తారక రామారావు మాట్లాడుతూ, మండేలా తన జాతి కోసం, దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా కొనియాడారు. జాతి వివక్షను ఎదుర్కొనేందుకు మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని ఆయనకు మండేలా ఏకలవ్య శిష్యునిగా అహింసా పద్ధతిలో ఉద్యమాన్ని నడిపారని పేర్కొన్నారు.

శాసన సభలో వైకాపా పక్షనేత శ్రీమతి వై.ఎస్. విజయలక్ష్మి మాట్లాడుతూ, మండేలా ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మండేలాను స్ఫూర్తిగా తీసుకుని ప్రపంచంలోని చాలా దేశాల్లో అహింసా పద్ధతుల్లో ఉద్యమాలు నడిచాయని ఆమె పేర్కొన్నారు.

ఎం.ఐ.ఎం. పార్టీ తరఫున పాషాఖాద్రి మాట్లాడుతూ నెల్సన్ మండేలా జాతి కోసం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సిపిఐ శాసన సభా పక్ష నేత శ్రీ గుండా మల్లేష్ మాట్లాడుతూ, నల్లజాతి కోసం పోరాటం చేసిన మండేలా దక్షిణాఫ్రికాలో తన ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీలను కూడా కలుపుకుని పోరాటం చేశారన్నారు.

సిపిఎం నేత శ్రీ జూలకంటి రంగా రెడ్డి మాట్లాడుతూ, నెల్సన్ మండేలాను ఉక్కు మనిషిగా కొనియాడారు. మండేలా మంచి పోరాటయోధుడే కాకుండా చక్కటి బాక్సర్ అని పేర్కొన్నారు.

లోక్‌సత్తా ఎమ్మెల్యే శ్రీ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, గత వందేళ్ళలో చెప్పుకోదగిన మహా పురుషులు ముగ్గురే ఉన్నారని, అందులో మొదటి వ్యక్తి మహాత్మాగాంధీ అయితే రెండో వ్యక్తి మార్టిన్ లూథర్ కింగ్ అని, మూడో మహాపురుషుడు నెల్సన్ మండేలా అని ప్రశంసించారు.

మండేలా మృతికి సంతాపం తెలిపిన తర్వాత ఈ మధ్య కాలంలో మరణించిన శాసన సభ్యులకు, మాజీ శాసన సభ్యులకు సభ నివాళులు అర్పించింది. స్పీకర్ శ్రీ నాదెండ్ల మనోహర్ సభ్యులందరి తరఫున మరణించిన సభ్యుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

- గోపాల ప్రసాద్

శాసన మండలిలో సి.ఎం.



సత్సంప్రదాయాలతో బిల్లుపై చర్చ జరగాలి

రాష్ట్ర రాజధానిలో డిసెంబర్ 12 నుండి 19వ తేదీ వరకూ ఆరు రోజులపాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు(19వ సమగ్రపు మూడవ విడత) సమావేశాలు విభజనపై విభిన్న నినాదాలతో దద్దరిల్లిపోయాయి. ప్రారంభ, చివరి రోజులు మినహా మిగిలిన అన్ని రోజులూ రాష్ట్ర విభజన అంశంపై సభ్యుల వ్యతిరేక, అనుకూల నినాదాలతో ఎలాంటి చర్చలూ జరగకుండా గలభాల మధ్య సమావేశాలు పూర్తిగా వాయిదా పడ్డాయి.

చివరిరోజు (19న) ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మండలి సమావేశానికి హాజరై మాట్లాడుతూ, "ఢిల్లీ నుంచి వచ్చిన రాష్ట్ర విభజన బిల్లుపై ఏవిధంగా చర్చ జరగాలనే అంశంపై స్పష్టత లేదు. మన రెండు చట్ట సభలకూ ఇలాంటి బిల్లు ఎప్పుడూ రాలేదు. ఇది చాలా సున్నితమైన అంశం. శాసన సభ స్పీకర్, మండలి ఛైర్మన్‌ల నుంచి ఈ అంశంపై స్పష్టత రాలేదు. ఈ బిల్లుపై చర్చించేప్పుడు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా మాట్లాడితే ఇరు ప్రాంతాల వారికీ సబబుగా ఉంటుంది. ఉద్రేకాలకు తావు లేకుండా మన భాష, ప్రవర్తనలను అదుపులో ఉంచుకుని బిల్లుపై సవ్యంగా చక్కగా అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు. సభా సంప్రదాయాలను దిగజార్చకుండా ఎవరూ ఎవర్నీ నొప్పించకుండా మాట్లాడాలన్నదే నా అభిమతం" అని అన్నారు.

"మన రాజ్యాంగానికీ, సత్సంప్రదాయాలకూ లోబడి బిల్లుపై చర్చలు కొనసాగించాలి. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లుపై ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల చట్టసభల్లో చర్చించేందుకు ఎలాంటి విధానాలు అనుసరించారు ? అక్కడేం జరిగిందో అధ్యయనం చేయాల్సి ఉంది. ఆ రెండు రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లులూ మన ముందున్నాయి. ఆ రాష్ట్రాల చట్ట సభల్లో విభజన కోసం ఏం చేశారనే అంశాలను తర్జుమా చేసి కాపీలు అందరికీ పంపుతాను."

"ఇక మధ్యప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు కూడా తెలుగులోకి అనువాదమవుతోంది. అవసరమైతే మరోసారి రాష్ట్ర విభజన అంశంపై శాసన మండలి కార్యనిర్వాహక సమావేశాన్ని (బి.ఏ.సి.) నిర్వహించి చర్చలకు సంబంధించి విధి విధానాలను ఖరారు చేయాలి" అని సభాపతి శ్రీ చక్రపాణికి సి.ఎం. సూచించారు.



సి.ఎం. ప్రసంగానికి ముందు..... ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్సీలు శ్రీ పి.వి. రంగారావు, శ్రీ ఉప్పునూతల పురుషోత్తమ్ రెడ్డిల మృతికి సభాపతి శ్రీ చక్రపాణి సభ తరఫున సంతాప తీర్మానాన్ని ప్రకటించి వారు చేసిన సేవలను శ్లాఘించారు. సభ్యులంతా లేచి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వారిరువురి మృతికి ఘన నివాళులర్పించారు.

ఇంతలో సమైక్యాంధ్ర కోరుతూ టిడిపి, వైయ్యస్సార్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్సీలు పోడియం వద్దకు దూసుకు వచ్చి నినాదాలు చేస్తూ "సభలో సి.ఎం. కూడా ఉన్నారు. సమైక్యాంధ్ర తీర్మానం ప్రవేశపెట్టాలి" అని డిమాండ్ చేశారు. మరో పక్క నుంచి తెలంగాణా వాదులు కూడా వచ్చి నినాదాలు చేస్తూ గందరగోళం సృష్టించారు. సభ వాయిదా పడింది. గంటన్నర తర్వాత ఉపసభాపతి శ్రీ నేతి విద్యాసాగర రావు అధ్వర్యంలో సభ పునఃప్రారంభమవగానే సభ్యులు గొడవ చేయడంతో 2014 జనవరి 3 వ తేదీకి సభను వాయిదా వేశారు.

17న జరిగిన మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీలు పరస్పరం విభిన్న నినాదాలు చేస్తూ పోడియం చుట్టుముట్టి గొడవ చేశారు. వాయిదాల మధ్య సభ మళ్లీ మొదలవగానే సభాపతి శ్రీ చక్రపాణి మాట్లాడుతూ 'తెలంగాణా బిల్లుతో పాటు రాష్ట్రపతి పంపిన నోట్‌ను కార్యదర్శి చదువుతారు" అని ప్రకటించారు.

వెంటనే ఛైర్మన్ ఆదేశాల ప్రకారం కార్యదర్శి శ్రీ



స్త్రీలు పత్రికా రంగంలో ముందుకు రావాలి

సమాజంలో స్త్రీ ధైర్యంగా ముందుకు నడుస్తూ వారికి ఎదురయ్యే ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ 'స్త్రీ అబల కాదు సబల' అని నిరూపించుకోవాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీమతి డి.కె. అరుణ అన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల భద్రతా పక్షోత్సవాలలో భాగంగా డిసెంబర్ 4న నిర్వహించిన ప్రసార మాధ్యమంలో మహిళా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నేటి ఆధునిక మహిళ పురుషులతో సమానంగా ఒక అడుగు ముందుకే వేసిందని, చదువుల్లో, ఉద్యోగాలలో, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య, వ్యాపార, వాణిజ్య రంగాలలో ప్రవేశించి సఫలీకృత మైందని, ప్రగతి పథంలో దూసుకుపోతూ పాలకు రాలిగా, వ్యోమగామిగా, శాస్త్ర వేత్తలుగా, పైలెట్లుగా, క్రీడాకారిణులుగా, పోలీసు అధికారులుగా ఒక్కటేమిటి, అన్నింటిలో కాలు మోపిందన్నారు.

అనేక నైపుణ్యాలను పుట్టుకతోనే పుణికి పుచ్చుకున్న మహిళలు మీడియా రంగంలో కూడా పోటీతత్వంలో పనిచేస్తున్నారని, తమ శక్తి సామర్థ్యాలతో తాము ఎందులో తక్కువ కాదని నిరూపించుకుంటున్నారని శ్రీమతి అరుణ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించాల నే ఉద్దేశంతో అక్రిడిటేషన్ కమిటీలో సభ్యులుగా, జర్నలిస్టులపై దాడుల విచారణ కమిటీలో కూడా మహిళా జర్నలిస్టులకు స్థానం కల్పించి ప్రోత్సహిస్తున్నామన్నారు. మీడియాలో మహిళలకు అనేక అవకాశాలున్నాయని, ఎలక్ట్రానిక్ మీడియా ప్రవేశం తర్వాత మహిళల భాగస్వామ్యం బాగా పెరిగిందన్నారు. మీడియాలో యాంకర్లుగా, రిపోర్టర్లుగా మహిళలు బాగా రాణిస్తున్నారన్నారు.

రాష్ట్రంలోని ప్రతి మీడియా సంస్థ 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' ని ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా స్త్రీలలో ఆత్మస్థైర్యాన్ని, పురుషుల దూకుడును నివారించగల మన్నారు. చట్టాలెన్ని వచ్చినా మహిళల భాగస్వామ్యం లేకుండా వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడం సాధ్యం కాదన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ శ్రీమతి త్రిపురాన వెంకటరత్నం, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసరెడ్డి, సెన్సార్ బోర్డు సభ్యురాలు శ్రీమతి ధనలక్ష్మి, ఎం.ఎల్.ఏ క్రిష్టినా లాజెరెస్ తదితరులు పాల్గొన్నారు.

- భూంపాగ్ జేకబ్ రాస్

ఎస్. రాజా సదారాం చదివిన రాష్ట్రపతి లేఖలోని పూర్తి పాఠమిది.....

రాష్ట్రపతి లేఖ

"కేంద్ర ప్రభుత్వం స్టేక్ హోల్డర్లందరితో అన్ని అంశాలపై విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపి, రాష్ట్ర విభజనకు సంబంధించిన అన్ని అంశాల నూ పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి కొత్తగా 'తెలంగాణ' రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడటానికి ప్రతిపాదించింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు - 2013 లో తెలంగాణా రాష్ట్ర సమాచారాన్ని అందుకు సంబంధించిన అంశాలతో వీలైనంత త్వరగా ఆచరణాత్మకంగా లోక్ సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది.

"ఈ ప్రతిపాదిత బిల్లుతో కొత్తగా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే క్రమంలో ప్రస్తుత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులు ప్రభావితం కానున్నాయి. భారత రాజ్యాంగంలోని 3వ అధికరణ ప్రకారం ఈ ప్రతిపాదిత 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు - 2013' పై రాష్ట్ర శాసన సభ 2014 జనవరి 23వ తేదీలోగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని కోరుతున్నాను" అని రాష్ట్రపతి లేఖ చదవడం పూర్తయిన వెంటనే సభ మళ్లీ నినాదాలతో దద్దరిల్లింది.

కొందరు సభ్యులు పోడియం వైపునకు దూసుకువచ్చి బిల్లుపై చర్చించేందుకు సిద్ధంగా లేమనీ, అది ఆత్మహత్యా సదృశమనీ రభస చేశారు. దానితో సభాపతి సభను వాయిదా వేసి వెళ్లిపోయారు.

నెల్సన్ మండేలాకు ఘననివాళులు

తొలిరోజు (12న) సభలో సభ్యులు ఇటీవల కన్ను మూసిన దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా మృతికి ఘననివాళులు అర్పించారు. ముందుగా సభాపతి ఆదేశానుసారం ఫ్లోర్‌లీడర్, దేవాదాయ శాఖ మంత్రి శ్రీ సి. రామచంద్రయ్య మండేలా మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి ప్రసంగిస్తూ స్వదేశంలోనే కాక విదేశాల్లోనూ మంచి పేరు తెచ్చుకున్న మండేలా ప్రపంచానికే మార్గదర్శకుడుగా నిలిచారన్నారు.

ఛైర్మన్ శ్రీ చక్రపాణి మాట్లాడుతూ, దక్షిణాఫ్రికా దేశ ప్రజల కోసం మండేలా కఠోరంగా శ్రమించారు. తన జీవితాన్ని త్యాగం చేశారు. ఆయన ఈ శతాబ్దపు యుగ పురుషుడు. మన దేశ అత్యున్నత పురస్కారమైన 'భారత రత్న' బిరుదుతో పాటు అనేక దేశాలు ప్రతిష్టాత్మకమైన అవార్డులిచ్చి ఆయనను గౌరవించాయి" అని శ్లాఘించారు.

టిడిపి నేతలు శ్రీ యనమల రామకృష్ణుడు, శ్రీమతి నన్నపనేని రాజకుమారి, వైయ్యెస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ శ్రీ జూపూడి ప్రభాకర రావు. టి.ఆర్.ఎస్. నేత శ్రీ స్వామిగౌడ్, సి.పి.ఐ. నేత శ్రీ చంద్రశేఖర రావు, ఎం.ఐ.ఎం.నేత శ్రీ సయ్యద్ అమీన్ జాఫ్రీ, కాంగ్రెస్‌కు చెందిన శ్రీ ఆర్. పద్మరాజు, శ్రీ పాలడుగు వెంకటరావు, శ్రీ మహమ్మద్ అలీషబ్బీర్, శ్రీ నాగేశ్వర్ తదితరులు మండేలాను పోరాట వీరుడని కొనియాడారు.

- రాజఫణి. వల్లమూడి

నడుస్తున్న చరిత్ర



అవార్డులు - రివార్డులు

* 2013 ఆర్థిక సంవత్సరానికి గాను భారత క్రికెట్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని ఎల్ జీ పీపుల్స్ చాయిస్ పురస్కారానికి ఎంపికయ్యారు. సచిన్ తర్వాత ఈ అవార్డును ఎంపికైన రెండో భారత్ క్రికెటర్ ధోని.
* 44వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో విజేతలు : తూర్పు తైమూర్ నిర్మించిన 'బీట్రీజ్ వార్' ఉత్తమ చిత్రానికిచ్చే బంగారు నెమలి దక్కింది. దీనికి బెటిరీస్ దర్శకత్వం వహించారు.
* వెండినెమలి కమలేశ్వర్ ముఖర్జీ దర్శకత్వం వహించిన బెంగాలి చిత్రం 'మెగే దాకా తారా'కు దక్కింది.
* ఉత్తమ దర్శకుడు : అపూర్ పాంచాలి చిత్రానికి దర్శకత్వం వహించిన కౌశిక్ గంగూలీకి ఉత్తమ దర్శకుడి పురస్కారం లభించింది.
* ఎప్రెస్ ఆన్ హెలెన్ చిత్రంలో నటనకు గాను అలోన్ మోని అబేత్ బేత్ కు ఉత్తమ నటుడి అవార్డు దక్కింది. అలాగే ఇన్‌హైడింగ్ చిత్రంలో నటనకుగాను మగ్డలెనా బోక్ జరాస్కాకు ఉత్తమ నటి అవార్డు లభించింది.
* ప్రముఖ శాస్త్రవేత్త, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డా॥ సుబ్బన్న అయ్యప్పన్ 2014 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డుకు ఎంపికయ్యారు.
* ఈ ఏడాది వ్యక్తిగా (పర్సన్ ఆఫ్ ది ఇయర్-2013) పోప్ ఫ్రాన్సిస్‌ను టైమ్ మ్యాగజైన్ ఎంపిక చేసింది.

నియామకాలు

✔ కేంద్ర ప్రధాన సమాచార కమీషనర్ (సిఐసీ)గా మాజీ ఐఏఎస్ అధికారి సుష్మాసింగ్ నియమితుల య్యారు. ఇదే స్థానంలో పనిచేస్తున్న సీఐసీ దీపక్ సంధూ పదవీకాలం ముగియడంతో, ప్రభుత్వం ఆస్థానంలో సుష్మాసింగ్‌ను నియమించింది.

✔ క్రికెట్ క్రీడాకారులకు సచిన్ టెండూల్కర్ యూనిసెఫ్ పారిశుధ్య కార్యక్రమం ప్రాంతీయ ప్రచార కార్యకర్తగా నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆయన భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యూనిసెఫ్ ప్రచార కార్యకర్తగా వ్యవహరిస్తారు.

రాష్ట్రీయం

- కృష్ణానదిపై నిర్మించిన డా॥ కె.ఎల్. రావు సాగర్ పులిచింతల ప్రాజెక్టును ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి డిసెంబర్ 7న ప్రారంభించారు. దీని వల్ల కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 13.88 లక్షల ఎకరాలకు నీరందుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జలయజ్ఞంలో భాగంగా నిర్మాణం చేపట్టిన మొట్టమొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం.
- మరమగ్గాలకు వాడుతున్న విద్యుత్‌ను 50 శాతం రాయితీ కింద ప్రభుత్వం రూ. 25.27 కోట్లు విడుదల చేసింది.
- హేతుబద్ధీకరణలో భాగంగా పలురకాల లీజు ఒప్పందాలపై స్టాంపు డ్యూటీని ప్రభుత్వం తగ్గించింది.
- ఐదుకిలోల గ్యాస్ సిలిండర్లను పెట్రోలియం కంపెనీలు హైద్రాబాద్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయి. ఇప్పటికే దేశంలోని నాలుగు ప్రధాన మెట్రో నగరాల్లో ఈ పథకం అమలు అవుతుండడంతో, ఐదో ప్రయత్నంగా ప్రభుత్వం హైదరాబాద్‌ను ఎంపిక చేసింది.
- సుప్రసిద్ధ నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం కన్నుమూశారు. 'ఆనందో బ్రహ్మ' కార్యక్రమం ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన ఆయన వందలాది సినిమాల్లో నటించి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి ఛైరన్‌గా కూడా పని చేశారు.

జనవరి నెలలో ముఖ్యమైన రోజులు

1	నూతన సంవత్సర దినోత్సవం జనరల్ ఇన్సూరెన్స్ జాతికి అంకితమైన దినం
9	ప్రవాస భారతీయ దినోత్సవం
15	ఆర్మీ దినోత్సవం
23	దేశ్ ప్రేమ్ దివస్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి
26	రిపబ్లిక్ డే ఎయిర్ సర్వీస్ ఆవిష్కరణ దినోత్సవం కేంద్రంలో హిందీ అధికార భాషగా గుర్తింపు పొందిన రోజు
30	మార్టిర్స్‌డే మహాత్మాగాంధీ వర్ధంతి అహింసా దినోత్సవం
31	నెమలిని జాతీయ పక్షిగా ప్రకటించిన దినం

జాతీయం

- ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే పృథ్వీ- 2 క్షిపణిని సైన్యానికి చెందిన వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సి) డిసెంబర్ 3న విజయవంతంగా పరీక్షించింది. ఇది 250 కి.మీ. నుంచి 350 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు.
- ప్రపంచంలో అత్యంత శక్తి వంతమైన విద్యుత్ సరఫరా లైన్‌ను మహారాష్ట్రలోని వార్ధా-ఔరంగాబాద్‌ల మధ్య నెలకొల్పనున్నారు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య 400 కె.వి. లైన్ పనిచేస్తోంది. దీనిని 1200 కి.వి.లైన్‌కు పెంచనున్నారు.
- తెలంగాణ రాష్ట్ర విభజనపై కేంద్ర మంత్రుల బృందం సమర్పించిన నివేదికను, ఆంధ్రప్రదేశ్ పునరావాస స్థీకరణ బిల్లు-2013 ను డిసెంబర్ 5న కేంద్ర కేబినెట్ ఆమోదించింది.
- సహజీవనం నేరం కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. సహజీవనం చేస్తున్న మహిళలకు, వారికి పుట్టే పిల్లలకు భద్రత, రక్షణకు చట్టాన్ని రూపొందించాలని పార్లమెంట్‌కు సూచించింది.
- స్వలింగ సంపర్కం నేరమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ నేరానికి గాను జీవిత ఖైదు వరకు శిక్షను అనుమతించే భారతీయ శిక్షా స్మృతిలోని 377 సెక్షన్ తిరిగి అమల్లోకి వచ్చినట్లయింది.

అంతర్జాతీయం

- నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా (95) జోహైన్స్‌న్ బర్గ్‌లో డిసెంబర్ 5న మరణించారు. దక్షిణాఫ్రికాలో శ్వేత జాత్యహంకార పాలనను ఆయన అంతమొందించారు. నల్లజాతి ప్రజల విముక్తి కోసం సుదీర్ఘ పోరాటం చేసి చాలా ఏళ్ళు జైలు జీవితం అనుభవించారు. ఆయన దక్షిణాఫ్రికాకు తొలి నల్లజాతి అధ్యక్షుడు.
- విద్య, నైపుణ్యాలపై భారత-ఆస్ట్రేలియా దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2022 నాటికి

భారత్ 500 మిలియన్ల మందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. అందుకు అవసరమైన నాణ్యతతో కూడిన శిక్షణ, ప్రమాణాలను ఆస్ట్రేలియా అందిస్తుంది.

- పాకిస్థాన్ సైన్యాధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ రహీల్‌షరీఫ్ (57) నియమితులయ్యారు.
- మహిళా హక్కు పరిరక్షణలపై జరిగే హింసాత్మక చర్యలను దేశాలు బహిరంగంగా ఖండించాలని, వారిని అడ్డుకునే చట్టాలను సవరించాలని, వారికి ఐక్యరాజ్య సమితి సంస్థల్లో అవకాశాలు కల్పించాలని ఐక్యరాజ్య సమితి సాధారణ సభ తీర్మానాన్ని ఆమోదించింది.
- హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియెన్సీ వైరస్ (హెచ్ఐవీ) సోకిన రోగుల శరీరంలో యాంటీ రిట్రోవైరల్ చికిత్స తర్వాత కూడా మిగిలి ఉండే వైరస్‌ను పూర్తిగా నిర్మూలించగల కొత్త చికిత్సా విధానాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. న్యూయార్క్‌లోని బ్రాంక్స్ ప్రాంతానికి చెందిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు ఈ విధానాన్ని రూపొందించారు. రేడియో ఇమ్యూనో థెరపీ పేరిట రూపొందించిన ఈ చికిత్స విధానంలో నిర్వహించిన పరీక్షలు విజయవంతమైనట్లు వారు ప్రకటించారు.
- మారిజువానా మత్తు మందు తయారీ, విక్రయాలు ఉరుగ్వేలో చట్టబద్ధమయ్యాయి. ప్రపంచంలో ఇలా ఓమత్తు మందుకు చట్టబద్ధత కల్పించిన తొలిదేశం ఉరుగ్వేనే కావడం విశేషం.

వార్తలు - విశేషాలు

- నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రి రమణ సింగ్ నాయకత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. రాజస్థాన్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చింది. ఢిల్లీలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆరు నెలల క్రితం ప్రారంభమైన ఆమ్‌ఆద్మీ పార్టీ 29 స్థానాలతో రెండో స్థానంలోనిలిచింది. మిజోరాంలో ముఖ్యమంత్రి లాల్‌థన్ హావ్లా నేతృత్వంలోని అధికార కాంగ్రెస్ 33 సీట్లు గెలుచుకుని, విజయం సాధించింది.
- ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త, భారత పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ ఐ.కె. శర్మ హైదరాబాద్‌లో నవంబర్ 28న మరణించారు.
- విప్లవ కవి మండే సత్యనారాయణ (80) హైదరాబాద్‌లో నవంబర్ 27న కన్నుమూశారు. 'ఎర్ర సైన్యం', 'చీమలదండు' సినిమాలకు పాటలు రాసిన ఆయన 100 కు పైగా విప్లవ గీతాలు రాశారు.
- వరల్డ్ ఎక్స్ పో - 2020 కు దుబాయ్ ఆతిథ్యమివ్వనుంది, ఈ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు. జరిగిన బిడ్డింగ్‌లో దూబాయ్‌కు రూ. 116 కోట్లు వచ్చాయి.
- గత ఏడాదిలో ఎయిడ్స్ సంబంధిత అనారోగ్యాలతో 2.1 లక్షల మంది బాలలు మరణించినట్లు ఐక్యరాజ్య సమితి బాలల అత్యవసర నిధి (యూనిసెఫ్) తన నివేదికలో ప్రకటించింది.
- చంద్రుడిపై పరిశోధనలకు గాను చైనా తన మొదటి రోవర్‌ను డిసెంబర్ 1వ ప్రయోగించింది. చాంగె-3 రాకెట్ ద్వారా 'జడేరాబిట్' అని పిలిచే రోవర్‌ను క్సి చాంగ్ శాటిలైట్ లాంచింగ్ కేంద్రం నుంచి పంపింది. ఇది చంద్రుడిపైకి పంపిన మూడో లూనార్ రోవర్. గతంలో అమెరికా, రష్యాలు ఇలాంటి రోవర్లు పంపడం జరిగింది.
- ప్రపంచంలోనే అత్యంత సొగసరి ఆసియన్ మహిళగా బాలీవుడ్ సుందరీ మణి కత్రినాకైఫ్ మళ్ళీ ఎంపికైంది.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంఘ్వీ డిసెంబర్ 11న పదవీ విరమణ చేశారు.



సంక్రాంతి గీతి

పిల్ల పాపలతోడ వర్థిల్లు చున్న
తెలుగు లోగిళ్ళు, పాడి పంటలను నిండ
పాయసములు, చిత్రాన్నముల్ చేయబడియె
రమ్ము, విందుభుజింప సంక్రాంతి లక్ష్మి !

- ఎం.వి.జాన్

క్రీడలు

- దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్ బర్గ్‌లో డిసెంబర్ 8న ముగిసిన కామన్‌వెల్త్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలలో మనదేశం 16 స్వర్ణపతకాలు సొంతం చేసుకుంది. అలాగే 13 రజతాలు, 11 కాంస్య పతకాలతో పాటు మొత్తం 38 పతకాలు సాధించింది.
- వెస్టిండీస్‌లో జరిగిన మూడు వన్డేల క్రికెట్ సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో విజయం సాధించింది.
- ఇరాన్‌లో జరిగిన ఫజర్ కప్ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ జూనియర్ విభాగంలో మనదేశానికి చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారి జి శ్రీజా సింగిల్స్ టైటిల్ సాధించింది.
- ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 50 సెంచరీలు సాధించిన ఎనిమిదో భారత బ్యాట్స్‌మన్‌గా ముంబై బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ రికార్డు సృష్టించారు.
- మలేషియాలోని పెనాంగ్‌లో నవంబర్ 30తో ముగిసిన కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మనదేశానికి 117 పతకాలు లభించాయి. వీటిలో 57 స్వర్ణం, 39 రజతం, 21 కాంస్య పతకాలున్నాయి.
- మకావు గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను మన దేశ క్రీడాకారిణి పి.వి. సింధు గెలుచుకుంది.
- డిసెంబర్ 1న జకార్తాలో జరిగిన ఇండోనేషియా ఓపెన్ గోల్ఫ్ టైటిల్‌ను గగన్‌జిత్ బుల్లర్ గెలుచుకున్నారు.

- దాసరి దుర్గాప్రసాద్





నవ్వు నలభై విధాల స్వీటు.....

నవ్వు నాలుగు విధాల చేటు అనేది నలుగురికి తెలిసిన నానుడి. కానీ ఆ నానుడి నవ్వే సందర్భం గురించి చెప్పిందే కానీ నవ్వుకు సంబంధించినది కాదంటున్నారు పరిశోధకులు.

'నవ్వు నాలుగు విధాల చేటు కాదు నలభై విధాల స్వీటు' అంటున్నారు వైద్యులు. ఆరోగ్యాన్ని పెంచే అద్భుతమైన టానిక్ నవ్వు. హాయిగా నవ్వగలిగే వారికి అనారోగ్యం అంత త్వరగా దరి చేరదు. నవ్వు శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను మెరుగు పరిచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.

బి.పి.వుందా? నవ్వి తీరాలి

మానసికంగా ఒత్తిడికి గురిచేసే హార్మోన్‌ల ఉత్పత్తిని తగ్గించే శక్తి నవ్వుకుంది. అంతే కాక కోపం, పోట్లాటకు దారితీసే హార్మోన్‌లను తగ్గిస్తుంది. ఫలితంగా మనసుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం కల్గుతుంది. ఈ ఒత్తిడి కల్గించే హార్మోన్‌లు నవ్వలేని వారి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పనిచేయనివ్వవు. ఫలితంగా రక్తంలోని 'ప్లేట్‌లెట్స్' సంఖ్య పెరుగుతుంది.

మన నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనలు మనకు హాస్యాన్ని కల్గిస్తాయి. మనసారా నవ్వితే దగ్గు, ఎక్కిళ్ళు వస్తాయి. వీటివల్ల శ్వాసనాళాలు శుభ్రపడతాయి. ఆ నాళాల్లో వున్న శ్లేష్మం బయటకు నెట్టబడుతుంది. శ్వాసనాళాల ద్వారా లోపలికి వచ్చే రోగకారక సూక్ష్మజీవులను సంహరించే ఉమ్మిలోని ఇమ్యునుగ్లోబిన్ 'ఎ' ని నవ్వు పెంచుతుంది.

నవ్వటమంటే శరీరంలోని ప్రతీ భాగాన్ని వ్యాయామం చేయించటమే అంటున్నారు పరిశోధకులు. ఇప్పుడు నవ్వు, నవ్వినపుడు కలిగే నాడీ సంబంధిత మార్పులు, జీవన క్రియల మార్పుల గురించి అధ్యయనం చేయటం వైద్యశాస్త్రంలో ఒక ప్రత్యేక విభాగంగా అభివృద్ధి చెందుతున్నది. దీనినే 'జెలోటాలజీ' అంటారు.

ఐరోపా, అమెరికా ఖండాలలోని పలు విశ్వవిద్యాలయ వైద్య శాస్త్ర విభాగాలు కొత్తగా ఈ నవ్వు శాస్త్రంలో అనేక పరిశోధనలు చేస్తున్నాయి. నవ్వినపుడు రక్తపోటు తగ్గుతుంది. నాళాల్లో సాఫీగా రక్త ప్రవాహం పెరుగుతుంది. ఫలితంగా గాయాలు సులభంగా మానుతాయి.

హాయిగా నవ్వడం వలన మానసిక ప్రశాంతతతో పాటు ఇతరత్రా మన శరీరంలో ఉండే రుగ్మతలు కూడా తగ్గుతాయి. నవ్వడం వలన ఉదరకండరాలు, విభాజక పటలం, శ్వాసకోశ, ముఖ, పాదాల, వీపు భాగపు కండరాలు అన్నిటికీ వ్యాయామం జరుగుతుంది.

నవ్వడం వలన అనేక మానసిక లాభాలు ఉన్నాయని పరిశోధకులు చెపుతున్నారు. చాలా మంది తమలోని కష్టాలు బయటకు చెప్పుకోరు. కోపం, బాధ, అసంతృప్తి వంటి వాటిని బలవంతంగా అదిమిపెడతారు. అది మంచిది కాదు. వాటన్నింటిని బయటకు నెట్టేసే శక్తి నవ్వుకుంది.



బాధలో ఉన్నవారు నవ్వు తెప్పించే సినిమా చూసినా, హాస్య సంఘటనలు తలచుకున్నా, నవ్వు తెప్పించే జోక్స్ విన్నా, నవ్వించే వారితో గడిపినా మనసు తేలికపడుతుంది. నాడీ సంబంధిత రోగాలకు చికిత్స చేసే వైద్యులు రోగులను హాయిగా నవ్వమని సలహా ఇస్తున్నారు. నవ్వును చికిత్సలో భాగం చేయటం అవసరమని వైద్యులు చెపుతున్నారు.

ఇంతటి విశేష శక్తి కలిగిన నవ్వు మనిషికి మాత్రమే దక్కిన వరం. ఇతర జీవులకు హాస్యం తెలుసో తెలియదో మనకు తెలీదు. కుక్క పిల్ల దగ్గర నుండి పులి పిల్ల వరకు అన్ని జీవులు కలిసి ఆడుకుంటున్నట్లు కనిపిస్తాయి. అయితే ఆ చిలిపి ఆటలతో రావల్సిన నవ్వులు ఉండవు. హాస్యానికి శరీర ధర్మంలో ఉండాల్సిన స్పందన నవ్వు. అది ఇతర జీవులకు ఎందుకు లేదు, మనిషికి మాత్రమే ఎందుకు వరించిందో మనం ఆలోచించాలి.

ఆ నవ్వుకున్న లాభాలను మనం సరిగా ఉపయోగించుకుంటున్నామా దానిలోని లాభాలను మొత్తం పొందగలుగుతున్నామా అనేది తెలుసుకోవాలి.

నవ్వు ఎలా పుట్టింది. ఏయే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనే అంశం మీద పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. నవ్వు భద్రతను తెలియచెప్పే అంశంగా మొదలైందని కొందరు, భయం ఆదుర్దాలకు విరుగుడుగా శరీరం చూపే స్పందన నవ్వుగా మారిందని మరికొందరు పరిశోధకులు అంటారు. ఏమైనా ఆదిమానవుడి జీవనం దినదినగండం. ప్రకృతిలోని ఏ అంశం తనకు ముప్పు తెస్తుందో తెలియని స్థితి. కాబట్టి ప్రమాదమని భావించగానే అందరూ ఒక చోటకి చేర్తారు. ఆపకుండా కురిసేవాన, కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు, అడవి మంటలు, ఇతర క్రూరజంతువులు వలన కలిగే ప్రమాదం, భయంతో వణికించేవి మరికొన్ని... ఇలా బిక్కు బిక్కుమంటూ కండరాలన్నీ బిగపట్టుకు కూర్చున్న వారికి ప్రమాదం తొలగిపోయిందని తెలియగానే ఒక్కసారిగా శరీరమంతా రిలాక్స్ అవుతుంది. ఆ ఆనందానికి స్పందనగా ముఖకండరాలు, పెదవులు మొత్తం కదులుతాయి. ఆ కదలికే 'నవ్వు'.

స్వచ్ఛంగా నవ్వండి: కన్నీరొస్తుంది

నవ్వులో రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో కేవలం కండరాలు కదలిక మాత్రమే ఉంటాయి. ఆ తర్వాత దశలో శబ్దంకూడా విడుదల వుతుంది. నిజానికి ఈ రెండూ విడివిడిగా కాకుండా కలిసే బయటపడతాయి. అలా బయట పడేలా మెదడు నుండి సంకేతాలు, ఒత్తిడి వస్తాయి. ఒక క్రమ పద్ధతిలో అసంకల్పిత చోదనంతో బయటకు గాలి వదలబడుతూ ధ్వని విడుదల చేసేదే నవ్వు అని నిర్వచనం చెపుతారు.

నవ్వితే ముఖంలోని పదిహేను కండరాలు మొదటగా కదులుతాయి. అదే సమయంలో పై పెదవిని పైకి ఎత్తే ముఖ్యకండరం ఉత్తేజితమవుతుంది.

ఇలా ఉండగా శ్వాస ప్రసరణ వ్యవస్థలో చిన్నమార్పు వస్తుంది. ఒక్కొక్కరి నవ్వు తీరు ఒకలా ఉంటుంది. ఆ తేడా చిరునవ్వు నుండి ఎదుటివారు భయపడేంత భీకర నవ్వు వరకు ఉంటుంది. కండరాల కదలిక, నోట్లోగాలి ప్రవాహంలో వచ్చే తేడాను బట్టి ఆ ధ్వని మారుతుంది. ఆపకుండా నవ్వినపుడు కళ్ల వెంట ధారగా నీరుకారటం మనకు అనుభవమే. పగలబడి నవ్వేటప్పుడు, గాలిలోపలికి

ప్రపంచ నవ్వుల దినం - జనవరి 10

ఓ రెండు వేల పదమూడా, వీడ్కోలు

ఇది
వీడ్కోలు పలికే సమయం
పన్నెండు మాసాలు ప్రాణమిత్రుల్లా కలిసున్నాం
మంచి చెడులను, సుఖ దు:ఖాలను పంచుకున్నాం...
కానీ,
ఇది విడిపోయే సమయం
నువ్వు నిష్క్రమించాల్సిన తరుణం....
వీడ్కోలు... ఎప్పటికీ
మళ్ళీ మనం కలవనే కలవం...
అయితే -
స్నేహంగా మెలిగిన ఆ క్షణాల్లో
గాయాలు బాధలు మరిచిపోదాం
సంతోషాలను గుర్తుంచుకుందాం
శాంతి సౌఖ్యాలను నెమరు వేసుకుందాం
ఇది
కొత్త వెలుగుకు స్వాగతం పలికే సమయం
కోటి ఆశలకు ఆహ్వానం పలికే తరుణం
వీడ్కోలు చెబుతున్నామే గానీ
నిన్నెలా మరువగలం ?
నువ్వు నేర్పిన పాఠాలు పరమసత్యాలు
నన్ను మరువనిస్తాయా....

జటిలమైన సమస్యల విషయంలో సహకరిస్తాయి.
కొత్తదనం, శక్తిమంతం, కోరికలమయం... అయిన
మరో ఏడాది అదిగో -
భవిష్యత్తులోకి నాతో అడుగులేయించడానికి
నా చేయి అందుకోవడానికి వస్తోంది.
అందుకే -
నువ్వు నా నుంచి తప్పుకో... వెనక్కి చూడకు...
నిన్ను నా జ్ఞాపకాలలో పదిలపరచుకుంటాను...
మధుర క్షణాలను మనశ్శాంతి కోసం వాడుకుంటాను
ఏమైనా -
నీ సహచర్యం ఓ గొప్ప అనుభవం
తీర్చుకోలేను నీ ఋణం
వీడ్కోలు నీకు ప్రియనేస్తమా -
నేను మాత్రం ఎన్నాళ్ళు ???
ఈ స్వాగతాలు, వీడ్కోలు పలకడాలు...
ఏది శాశ్వతం ? ఎవరు శాశ్వతం ?
తెలుసుకుని మెలగాలి ఈ వాస్తవం.
అదేకదా జీవిత పరమార్థం.




– మంత్రవాది మహేశ్వర్

తీసుకొని వదలటానికి దవడలు, పెదవులు పడే కష్టం, లోపలికి చేరే ఆక్సిజన్ తగ్గటంతో కంటనీటి గ్రంథులు, నాళాలు ఉత్తేజమై కన్నీరు కారుస్తాయి.

నవ్వులో ఉత్పత్తిఅయ్యే ధ్వనిని ఒక శాస్త్రవేత్త విశ్లేషించాడు. ప్రతి ఒక్కరి నవ్వు ఒక ప్రత్యేక పద్ధతిలో ఉంటుంది. ప్రతీ మనిషికీ గొంతు ఒక ప్రత్యేక పద్ధతిలో ఉన్నట్లే నవ్వు కూడా గుర్తు పట్టే విధంగా ఉంటుంది. ఆ విధంగా విడుదలయ్యే ధ్వని తరంగాలు ప్రతి 210 మిల్లీ సెకండుకు ఒకసారి తిరిగి తిరిగి వినిపిస్తాయి. ఆ శబ్దం ఆహా... హా.... హా... అనిగాని, ఓహో...హో.....హో.. గాని ఉంటాయి.

మనుషులను దగ్గరికి చేర్చి వారి మధ్య బంధం పెంచి పోషించే శక్తివంతమైనది నవ్వు. అది ఎవరూ నేర్పక్కర్లేదు. ఊయలలోని పసిపాప తల్లిదండ్రులను చూడగానే బోసినవ్వులు చిందించటం మనందరికి సుపరిచితమే. ఈ బోసి నవ్వు పసిపాప ఆనందం తెలియచేయటమే కాదు. వారు దగ్గరలో ఉండటం వలన ఆ పాపకు ఏర్పడిన భద్రతా భావానికి ప్రతి స్పందన. ఆఫీసులో కొలీగ్ వేసిన జోకు వినగానే మన ప్రతి స్పందన నవ్వు ద్వారా తెలియచేస్తాం.



నవ్వు ఇద్దరి మనుషుల్ని దగ్గరికి చేరుస్తుంది. చిరునవ్వుతో మీరు ఇతరులను పలకరించినపుడు ఇతరులు చక్కగా ప్రతిస్పందిస్తారు. నవ్వు ఎప్పుడెప్పుడు వస్తుందో వివరించేందుకు మూడు రకాల సిద్ధాంతాలు. సాధారణ ప్రవర్తన కన్నా భిన్నమైన ప్రవర్తన చూసినపుడు వెంటనే నవ్వు వస్తుంది. సినిమాల్లో హాస్య నటుల మాటలు, హావభావాలు, ప్రవర్తన చూసినపుడు వెంటనే నవ్వు వస్తుంది. సర్కస్‌లో బఫూన్లు చేసే పనులు, కార్టూన్స్, ఈ తరహాకి చెందినవి. భర్త భార్యను కొట్టడాన్ని కార్టూన్‌గా గీస్తే ఎవరూ నవ్వరు. అదే భార్య అప్పడాల కర్ర పట్టి భర్త నెత్తిన మొడితే పగలబడి నవ్వుతాం.

ఒక్కొక్కసారి ఇతరుల ఇబ్బందిని చూసినపుడు కూడా నవ్వు వస్తుందనేది మరో ఆలోచన. ఎదుటి వారు జారి పడినప్పుడు, అవతలి వారికి తేలుకుట్టి గంతులేస్తుంటే నవ్వే నవ్వు మనకు పరిచయమే కదా! అలాంటి పరిస్థితి మనకు ఎదురవుతుందేమోనన్న భయం ఆ సమయంలో కలగదు.


ఒత్తిడి వదిలిపోవడంతో నవ్వు వస్తుంది అనేది మరొక సిద్ధాంతం. మనం భయపడినప్పుడు కండరాలు బిగపట్టి వణికి పోతాం. కానీ అది భయపడాల్సిన విషయం కాదని తెల్సినపుడు ఒత్తిడి నుండి రిలాక్స్ అయి నవ్వుకుంటాం.

– పల్లూరి వెంకటరమణ

చలిమంట

శీతాకాలం తెల్లారికట్ట
తెల్లటి మంచుపరదాలను
చీల్చుకుంటూ కన్పించే
ఎర్రని ఉషోదయం
చలిమంట....!
వణుకు, గొణుకు దేహాలకి
వెన్నెల రాగమై
నులివెచ్చని కౌగిలితో
సైతిగా సందడిచేస్తుంది.
చుట్టూపరుచుకున్న తనువులు
అగ్గికాక సెగకి వెచ్చగా కాగుతూ
హాయిని జోగుతాయి.
వెచ్చని వాయువులనద్ది
చుంబించే అరచేతుల
స్పర్శామాధుర్యంతో ముఖాలు పులకించిపోతాయి
ఇంటిదొడ్డి మేటుల్లో వట్టిగడ్డి పరకలు
చలిమంటలై చీకటిపొద్దులో
వెలుగుపూల వనంలా కాంతులు పూస్తాయి.
మంచాలమీద ముడిసి పెట్టుకున్న మనుషులు
ఒక్కొక్కరిగా వచ్చి
మంటచుట్టూ మడికట్టి
గోరువెచ్చని గాలికోసం శరీరాలు పరుచుకుంటాయి
వేడిశ్వాసను నింపుకొని తేలికై వెళ్తుంటాయి.
చలిమంటలు....
శీతలకోతలకి ఉపశమనం కలిగించే
ఉష్ణొద్గారాలు మాత్రమే కాదు,
చుట్టలు ముట్టించే అగ్గిబుగ్గలు
పొయ్యిలురాజేసే నిప్పుకణికలు
చన్నీళ్లను వేడిచేసే పొయ్యిలు
చివరికి మంటబూడిద కూడా....
వంటగిన్నెలకి తళుకులు తెప్పించే మెరికే.
గడ్డి పీలిక గొట్టాల్ని బీడీలుచేసి కాలుస్తూ
నోటితో పొగలు గుప్పిస్తూ
మొనగాళ్లా ఫోజులివ్వడం
పెద్దాళ్లు సద్దుకున్నాక, పిల్లలు చేసే నిర్వాకం.
బహుశా! మా తాత చుట్టకాల్పుకి శ్రీకారంచుట్టింది
వీధి మంటల దగ్గర యీ గడ్డిచుట్టల్తోనే అనుకుంటా?
శీతలమంతా సాగిపోయే యీ కాకమంటలు
చివరికి భోగిమంటల్లోకి చేరిపోయి
మకరసంక్రమణంతో మాయమైపోతూ...
చలినికూడా వెంటబెట్టుకుంటాయి.
గడ్డకట్టే చలిలో గడ్డిమంట ఇచ్చే అనుభూతి
అనుభవించి చూడాలేతప్ప
మాటల్తో చెప్పనలవి కానిది.
నెలపొడుపు పొడుగునా వాకిట ముగ్గులు
హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు నృత్యాల సంబరాలల్లే
చలిమంటలిచ్చిన హారతులహాయి
నా హృదయంలో కదుల్తానే వుంటుంది.

– చిలుకూరి శ్రీనివాసరావు





మంచి మిత్రుడు

నా పేరు చిన్నా, మూడో క్లాసు చదువుతున్నాను. మా స్కూలు చాలా దూరం. అందుకని స్కూలు బస్సులో వెళ్తాను. లంచ్ అవర్‌లో అక్కడే అన్నం తింటాను. మా అమ్మ రోజూ లంచ్ బాక్స్‌లో అన్నంతోపాటు రొట్టెలు, ఇడ్లీలు అవీ చేసి ఇస్తుంది. లంచ్ అవర్‌లో అవన్నీ తినేయాలి! తినకపోతే, సాయంత్రం ఇంటికి రాగానే లంచ్ బాక్స్ తీసి చూస్తుంది. ఏదయినా పారేస్తే తిడుతుంది.



రోజూ అమ్మతో తిట్లు తినలేక మా స్కూల్లోనే ఓ ఫ్రెండ్‌ని సంపాదించాను. వాడి పేరు స్వీటీ. వాడికా పేరు నేనే పెట్టాను. స్వీటీ అంటే... నాలాగ పిల్లాడు కాదు. కుక్కపిల్ల. నల్లగా ఉంటుంది కానీ, చాలా బాగుంటుంది. మా స్కూలులోనే అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. దానికి అమ్మా నాన్న ఎవరూ లేరు అనుకుంటాను. పాపం!

నేను లంచ్ చేసే సమయంలో స్వీటీ ఎక్కడున్నా నా దగ్గరకు వచ్చేస్తుంది. నాకు ఎక్కువ అనిపించిన అన్నమో, టిఫినో, రొట్టెలో... అమ్మ బాక్స్‌లో పెట్టినవి... ఏవో ఒకటి రోజూ పెడుతూ ఉంటాను. ఈ సంగతి మా అమ్మకి మాత్రం తెలీదు! రోజూ సాయంత్రం నేను ఇంటికి రాగానే లంచ్ బాక్స్ తీసి... అది ఖాళీగా ఉండటం చూసేది. 'గుడ్ బాయ్! మా చిన్నా బంగారం!' అని నన్ను మెచ్చుకుంటూ ఉండేది.

స్కూల్లో మా స్వీటీ రోజు రోజుకూ మంచి ఫ్రెండ్ అయిపోయింది. చివరకు నేను అన్నం పెట్టకపోతే ఆ రోజు పస్తు ఉండేది కానీ... వేరే వాళ్లు ఏం పెట్టినా తినేది కాదు.

ఒకరోజు చాలా పెద్ద గొడవ జరిగింది. నేను అందరితోపాటు లంచ్ అవర్‌లో బయటకు వచ్చాను! ఎవరో ఒక రౌడీ వెధవ గభాలున నన్ను పట్టుకొని... అరవకుండా నా నోరు నొక్కిపెట్టి నన్ను ఎత్తుకు పోతున్నాడు! నాకు చాలా భయంవేసింది. నోరు లేదుగా... కాళ్లూ చేతులు కొడుతున్నా... లంచ్ అవర్ కదా... పిల్లల కేకలు, అరుపులలో ఎవరూ చూట్టం లేదు! కానీ... స్వీటీ ఎలా వచ్చిందో కానీ... హీరో లాగా వచ్చి... పెద్దగా అరుస్తూ... ఆ రౌడీ మీదపడి... గట్టిగా వాడి కాలు కరిచేసింది!

రౌడీ... నన్ను కిందపడేసి పారిపోబోయాడు!... నేను గట్టి... గట్టిగా అరిచాను. అందరూ చూసేశారు. మా స్కూలు వాచ్‌మన్ వాణ్ని చూసి పట్టేసుకున్నాడు. అంతలో మిగతా వాళ్లు కూడా వచ్చేసి, వాణ్ని పట్టుకొని వీరబాదుడు బాదేశారు. ఓ పక్కన స్వీటీ కరిచింది! ఇంకోపక్కన జనాలు కొట్టేశారు! ఆ రౌడీగాడు లొంగిపోయాడు. ఓ అరగంటలో పోలీసులు, మా అమ్మా, నాన్న, మా స్కూలు ప్రిన్సిపల్ మేడం అందరూ వచ్చేశారు.

ఇంతకీ జరిగిందేమిటో తెలుసా? ఆ రౌడీ ఒక్కడు కాదు! నలుగురో... అయిదుగురో ముఠా! పిల్లల్ని ఎత్తుకుపోయి అమ్మేస్తారట! లేదా, డబ్బులు ఇవ్వమని గోల చేస్తారట. నిజం చెప్పాలంటే... స్వీటీ వచ్చి అడ్డుపడి... ఆ రౌడీ వెధవ కాలు కరవకపోతే నన్ను ఆ రౌడీగాడు ఎత్తుకు పోయేవాడే! నా ఫ్రెండ్ స్వీటీ నన్ను రక్షించింది! అది తెలిసి అందరూ దాన్ని మెచ్చుకుంటూ ఉంటే, మా అమ్మకి లంచ్ బాక్స్ కథ చెప్పేశా!

అప్పుడు మా బామ్మ చెప్పింది- "చిన్నా! నువ్వు నీ బాక్స్‌లో మిగిలిన పిడికెడు మెతుకులు స్వీటీకి పెట్టావు కాబట్టే... నువ్వు క్షేమంగా బయట పడ్డావు! మీ నాన్నకి లక్షల రూపాయలు ఖర్చు తప్పింది! అందుకే, పెంపుడు జంతువులకు హాని చెయ్యకూడదు" అని.

ఆ తర్వాత - మా అమ్మ స్వీటీ కోసం... లంచ్ బాక్స్‌లో రొట్టె, బిస్కెట్లు ఎక్కువ ఎక్కువగా పెడుతూ ఉండేది.

అప్పుడు స్వీటీ నాకేకాదు... మా స్కూల్లో చాలా మందికి మంచి ఫ్రెండ్ అయిపోయింది!... మా వాచ్‌మన్... రాత్రిపూట దానినే కాపలా పెట్టి, హాయిగా నిద్రపోతున్నాడట!... నిజం!!

- గీతా సుబ్బారావు

నా తెలుగు పాట

అమ్మ నోట లాలిపాట, తేట తెలుగు జోలపాట
ఇది వినిపించిన ప్రతి చోట సిరిమల్లెల పూదోట
ఆ లాలిపాట రాగాలే, సరిగమలై, పదనిసలై
తెలుగు వాణి రవళించగా, తెలుగు నేల పులకించగా

అక్షరాల విరితోటలో వెన్నెలమ్మ పూదోటలో
అమ్మ తీపి జ్ఞాపకాలు అల్లుకున్న పందిళ్ళలో
మా పల్లెల లోగిళ్ళలో, గోధూళి వాకిళ్ళలో
పసిప్రాయపు సయ్యాటలో మురిసిన నా తొలిపాట

చందమామ చిన్ని కథల తీయదనము అందించగ
కాకతీయ రుద్రమాంబ ధీరచరిత వినిపించగ
పల్నాటి పౌరుషాన్ని పదునుపెట్టి వర్ణించగ
త్యాగధనుల కీర్తి చాట తెలుగు భాష మురిపించగ

శేషాచల అన్నమయ్య సంకీర్తనల జోరు
శ్రీశైల జాగీరుల శివతత్వాల హోరు
భద్రాద్రి రామదాసు కీర్తనలా తేనెలూరు
గోదారి కృష్ణమ్మల కెరటాల సెలయేఱు

వర్ణమాల బిందువులే సప్తవర్ణ సింధువులై
కవితా సాగర అలలై వినువీధిలో విహరింపగ,
తెలుగు పదమె జ్ఞానపథమై తెలుగు జాతి పరుగులిడగ
నా పాటకు సరిఏది, నా భాషకు ఎదురేది !

- కంచర్ల శైలజ

అభినయ పరిణామం

వాణిశ్రీ

సినిమా పాత్రపరంగా ఒక నాయిక ధరించిన చీరలు, గాజులు వంటి అలంకారాలు ఆ సినిమా బ్రాండ్ పేరుతో మార్కెట్ గావటం మోచేయి దాటే జాకెట్లు, సిగముడుల సౌందర్యాలు, పాత్రపరంగా ధైర్యంగా, ఆత్మవిశ్వాసం పుట్టిపడేలా మాట్లాడం - ఇవన్నీ తనను అభిమానించిన వేలాదిమంది మహిళా ప్రేక్షకులపై ఒక పుష్కర కాలం ప్రభావం చూపిన ఏకైక నటి వాణిశ్రీ.

మహిళను ఉన్నత స్థానంలో నిలబెట్టి ఆత్మాభిమానం, సంస్కారం, పరిస్థితులతో రాజీ పడకుండా పట్టుదలతో లక్ష్యాన్ని సాధించటం ఈ తరహా లక్షణాలున్న భూమికలు ఒక దశాబ్ద కాలం (1970–80)లో ఆమెను వరించటంతో పాత్ర పాత్రకు మధ్య అభినయంలో వైవిధ్యం చూపటంతో తిరుగులేని మహిళానటిగా రాణించారు. నవలా నాయికగా నీరాజనాలందుకొన్నారు.

ఇందుకు ప్రేమనగర్, సెక్రటరీ, జీవనజ్యోతి, జీవన తరంగాలు, కృష్ణవేణి, గోరంత దీపం చిత్రాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే!

అగస్టు నెలలో పుట్టిన వారు ఉత్తమ శ్రేణి కళాకారులౌతారనటానికి మరో ఉదాహరణ వాణిశ్రీ. 1951 ఆగస్టు 3న నెల్లూరులో జన్మించిన వాణిశ్రీ అసలు పేరు రత్నకుమారి. మద్రాసు చేరి డాక్టర్ గరికపాటి రాజారావు గారి నాటకాల్లో నటించి, సినీరంగ పెద్దల ప్రశంసలందుకొని, 'భీష్మ' చిత్రంలో ఓ సహాయపాత్ర ద్వారా తెరంగేట్రం చేశారు.

తొలిదశలో శ్రీకృష్ణతులాభారం, మంగమ్మ శపథం, కంచుకోట, పిడుగు రాముడు వంటి చిత్రాల్లో సహాయపాత్రలు, హాస్యపాత్రలు పోషిస్తూ వచ్చినా, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. ఈ పరం పరలో పద్మనాభంతో కలసి 'నిండు అమాస నిశి రేతిరికాడ' (పిడుగు రాముడు) 'పో పో ... పొట్టి ప్లీడరు గారు' (పొట్టి ప్లీడరు) అంటూ ఆటపట్టించినా, 'సోగ్గాడే చిన్నినాయనా' (ఆస్తిపరులు) అంటూ అయిటం సాంగ్‌లో జగ్గయ్యను గగ్గోలు పెట్టినా అన్నిటా అభినయంలో స్పష్టమైన తన ముద్ర వేశారు.



